ఈనాడు

విజయవాడ 16-8-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 7
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



దేశానికి కవచంలా సుదర్శన చక్రం

శ్రీకృష్ణుడి స్ఫూర్తితో ఏర్పాటు • 2035 నాటికల్లా సిద్ధం

- అన్ని ప్రధాన వ్యవస్థలకూ దీనితో రక్షణ
- మళ్లీ దుస్సాహసం చేస్తే పాక్‌కు చావు దెబ్బే
- రైతుల ప్రయోజనాలను కాపాడతాం
- యువత ఉపాధికి రూ.లక్ష కోట్లతో పథకం
- దీపావళిలోపు జీఎస్టీలో సంస్కరణలు తెస్తాం

ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన

ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన పరాక్రమవంతులకు ఎర్రకోట బురుజులపై నుంచి వందనం చేసే అవకాశం లభించినందుకు గర్వపడుతున్నా. మన వీర సైనికులు శత్రువుకు ఊహించని విధంగా శిక్ష విధించారు. ఏప్రిల్ 22న ఉగ్రవాదులు సరిహద్దులు దాటి వచ్చి సామాన్యులను దారుణంగా హత్యచేశారు. ఆ ఘటనతో దేశం మొత్తం ఆక్రోశం నిండిపోయింది. దానికి ప్రతిరూపమే ఆపరేషన్ సిందూర్. 22వ తేదీ తర్వాత మేం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాం. రణనీతి, లక్ష్యం, సమయం అన్నీ వారే నిర్ణయించుకొని వందల కిలోమీటర్లు శత్రుభూమిలోకి దూసుకుపోయి ఉగ్రవాదులను మట్టిలో కలిపారు. ఉగ్రస్థావరాలను తుత్తునియలు చేశారు. దాంతో ఇప్పటికీ పాకిస్థాన్ ఉలిక్కిపడుతోంది.

– ప్రధాని నరేంద్రమోదీ

ఈనాడు, దిల్లీ

శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ కవచంతో కీలకమైన వ్యవస్థలకు రక్షణ కల్పిస్తామని, దేశాన్ని శత్రు దుర్భేద్యంగా తయారు చేస్తామని ఉద్ఘాటించారు. 2035 నాటికల్లా ఈ కొత్త భద్రతా వ్యవస్థ పనిచేయడం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇక్కడి ఎర్రకోట బురుజులపై 12వసారి త్రివర్ణపతాకాన్ని ఎగరవేసిన అనంతరం ప్రధాని మోదీ జాతినుద్దేశించి 103 నిమిషాలు ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ నుంచి అంతరిక్షం దాకా అన్ని రంగాలనూ ఆయన స్పృశించారు. ప్రతి రంగంలో ఆత్మనిర్భరత సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చే దీపావళి నాటికి జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చి సామాన్యులపై పన్నుల భారం తగ్గిస్తామని ప్రధాని కీలక ప్రకటన చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులను అభినందించారు. వారికి సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. భవిష్యత్తులో పాకిస్థాన్ మళ్లీ దుస్సాహసానికి ఒడిగడితే భారత (మిగతా 2లో)



ఉండవల్లి నుంచి విజయవాడ సిటీ బస్టాండ్ వరకు మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ వారితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఇక దర్జాగా ప్రయాణించండి

ఉచిత బస్సు పథకం ప్రారంభం

- స్త్రీశక్తితో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం
- అన్నగా కానుక ఇస్తున్నా
- సూపర్ సిక్స్ సూపర్ హిట్
- ముున్ముందు బస్సుల్లో మహిళా డ్రైవర్లు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని ప్రారంభించి.. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రతి ఆడబిడ్డ రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా స్వేచ్ఛగా వెళ్లే అధికారమిచ్చామన్నారు. సూపర్‌సిక్స్ అని నాడు చెబితే నమ్మలేదని, ఈరోజు సూపర్‌హిట్ అయిందని గర్వంగా చెబుతున్నా అని పేర్కొన్నారు. 'ప్రతి మహిళ, యువతి ఉద్యోగాలకు రూపాయి ఖర్చులేకుండా బస్సుల్లో వెళ్లొచ్చు. ఉపాధి పనులకు, కూలిపనులకు వెళ్లేవారు ఉచితంగా ప్రయాణించవచ్చు' అని అన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు శుక్రవారం ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్ వరకు మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి వచ్చి బస్టాండ్ ఆవరణలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

రూపాయి కూడా చెల్లించే పనిలేదు

'పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎంత దూరం వెళ్లినా, జిల్లాలు (మిగతా 2లో)

అభివృద్ధిలో మేటి.. సంక్షేమంలో సరిసాటి

స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 8లో



బస్సులో వెళ్తూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తదితర నేతలకు అభివాదం చేస్తున్న మహిళలు

ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు

ట్రంప్, పుతిన్ మధ్య అలాస్కాలో మంతనాలు



అలాస్కా: ప్రపంచం యావత్తూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శిఖరాగ్ర చర్చలు మొదలయ్యాయి. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనే ధ్యేయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం భేటీ అయ్యారు. అలాస్కాలోని యాంకరేజ్ వీరి భేటీకి వేదిక అయింది. చర్చల్లో ఇరుదేశాల కీలక నేతలు పాల్గొన్నారు. అంతకు ముందు (మిగతా 2లో)

పన్ను పోటుకు ఉపశమనం!

జీఎస్టీలో సంస్కరణలకు కేంద్రం యోచన

దిల్లీ: దేశంలోని సామాన్యులు, చిరు వ్యాపారులపై పన్ను భారాన్ని భారీగా తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. జీఎస్టీ విధానానికి కీలక సవరణను ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న నాలుగు శ్లాబ్‌ల స్థానంలో రెండు శ్లాబ్‌ల జీఎస్టీ విధానాన్ని అమలులోకి తేనుంది. ప్రస్తుత విధానంలో నిత్యావసర వస్తువులపై 5 శాతం, సాధారణ వస్తువులపై 12 శాతం, ఎలక్ట్రానిక్స్, సేవలపై 18 శాతం, (మిగతా 2లో)

ఇక దర్జాగా ప్రయాణించండి



విజయవాడ పీఎన్‌బీఎస్‌లో స్త్రీశక్తి పథకం ప్రారంభించిన అనంతరం బస్సులో వెళ్తున్న మహిళలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

మారినా, ఇబ్బంది లేకుండా ప్రయాణించేలా ఏర్పాటు చేశాం. 11,449 బస్సుల్లో, 8,458 బస్సులు స్త్రీశక్తి కోసం కేటాయించాం. బస్సులో జీరోఫేర్ టికెట్ ఇస్తారు. రూపాయి కూడా చెల్లించే పనిలేదు. అన్నగా మీకిస్తున్న కానుక ఇది. గతంలో ఆర్టీసీ బస్సుల్లో మీకు కొన్ని సీట్లు రిజర్వ్ చేశాను. ఇప్పుడు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశాను. అన్ని బస్సులు కండిషన్‌లో ఉంచి, అందుబాటులోకి తెచ్చాం. బస్సులు ఎక్కడున్నాయో సెల్‌ఫోన్‌లో రియల్‌టైమ్ ట్రాకింగ్ ద్వారా చూసుకోవచ్చు. భవిష్యత్‌లో విద్యుత్ బస్సులే కొనుగోలు చేస్తాం. మహిళలు దర్జాగా ప్రయాణించొచ్చు. వారికి ఇబ్బంది లేకుండా బస్సులు నడిపే బాధ్యత ఆర్టీసీ యాజమాన్యానిది. వాళ్లు ఫెయిలైతే నేను రోడ్డుమీదకు వస్తా. ఆ పరిస్థితి రానివ్వరనే అనుకుంటున్నా. ఆర్టీసీ ఆదాయం పెంచుకునేలా పార్శిల్ సర్వీసులు మరింత పెంచుతాం. భవనాలకు ఎక్కువ అద్దెలు వచ్చేలా చేస్తాం. గతంలో ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ పోస్టుల్లో మహిళలకు రిజర్వేషన్లు పెట్టాను. అప్పట్లో కండక్టర్లే వచ్చారు. త్వరలో డ్రైవర్లు వస్తారు. వాళ్లు విద్యుత్ బస్సులను సులువుగా నడపవచ్చు' అని సీఎం పేర్కొన్నారు. పథకం ఆరంభమైన కొత్తలో మహిళలు ఉత్సాహంగా ఉంటారని, ఆర్టీసీ సిబ్బంది ఓపిగ్గా వ్యవహరించాలని, మహిళలు కూడా డ్రైవర్, కండక్టర్లను గౌరవించాలని సూచించారు.

నేనూ, పవన్ కల్యాణ్ బాధితులమే

'ఆడ బిడ్డలను అవమానిస్తే.. ఇంట్లో వాళ్లు ఎలా బాధపడతారో చూశాను. నేనూ బాధితుడినే. పవన్ కల్యాణ్ కూడా ఈ బాధ అనుభవించారు. ఏ ఆడబిడ్డనైనా వ్యక్తిత్వహననం చేసి అవమానించినా, వారి జోలికి వచ్చినా.. వదిలిపెట్టే పరిస్థితి లేదు. తమాషా అనుకోవద్దు. ఇక్కడ ఎన్డీఏ ప్రభుత్వం ఉంది. ఎవడైనా తోక తిప్పితే కట్ అయిపోతుంది. మొన్నటి వరకు గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా ఉండేవి. ఈగల్ వ్యవస్థను పెట్టి.. గంజాయిని వీలైనంత వరకు నిర్మూలించాం. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ అమ్మితే వారికి అదే చివరి రోజు' అని చంద్రబాబు హెచ్చరించారు.

ఆడబిడ్డల జోలికొస్తే తాటతీస్తా

ప్రభుత్వం మంచి పనులు చేసినప్పుడు, దాన్ని ప్రచారం చేసే బాధ్యత ప్రజలే తీసుకోవాలి. మంచి భవిష్యత్‌కు నాంది పలకాలన్నా, మంచి పనులు కొనసాగాలన్నా మీదే బాధ్యత. సూపర్‌సిక్స్‌లో హామీలు ప్రకటించినప్పుడు ఇవన్నీ సాధ్యమా అని నాడు పవన్‌కల్యాణ్ అడిగారు. మనసుంటే తప్పకుండా సాధ్యమని చెప్పా. ఆడబిడ్డలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు ఎవరైనా ఎప్పుడైనా నవ్వారా? ఇంట్లో అయినా ఆనందంగా ఉన్నారా? రోడ్డుపైకి వస్తే, క్షేమంగా ఇంటికెళ్తామనే భరోసా ఉండేదా? ఈరోజు ఆ బిడ్డల జోలికి ఎవరైనా వస్తే తాటతీస్తా. ఆడబిడ్డల భద్రత విషయంలో లోకేశ్ చెప్పిన అంశాలను పరిశీలించి అవసరమైతే ప్రత్యేక చట్టాలు తెస్తాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తాం

'స్త్రీశక్తి పథకం నేపథ్యంలో ఆటో డ్రైవర్ల విషయం కూడా ఆలోచిస్తున్నాం. క్యాబినెట్ సబ్ కమిటీ వేశాం. వారికి న్యాయం చేస్తాం. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఏ మంచి చేయాలన్నా యజ్ఞంలా రాత్రిపగలు కష్టపడి చేస్తున్నా. ఉచిత బస్సు పథకాన్ని ఫెయిల్ చేసేందుకు చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వ్యవస్థలు ధ్వంసం అయిపోయాయి. అమరావతిని శ్మశానం అన్నారు. ఎడారిలా చేశారు. దానిని సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్నివిధాలా సహకరిస్తోంది' అని చంద్రబాబు తెలిపారు.

దేశానికి కవచంలా సుదర్శన చక్రం



స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సైన్యం చేతిలో చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. అణు బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. యువత ఉపాధి కల్పన కోసం రూ.లక్ష కోట్లతో ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)పై ప్రధాని తన ప్రసంగంలో ప్రశంసల వర్షం కురిపించారు. ఆత్యయిక స్థితిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 50 ఏళ్ల క్రితం రాజ్యాంగం గొంతు నొక్కి ఆత్యయికస్థితి ద్వారా దేశాన్ని జైలుగా మార్చిన పాపులను దేశ ప్రజలు ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. ఇంకా ప్రసంగంలో ఏమన్నారంటే...

వస్తోంది సురక్షా కవచం

రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేస్తాం. ప్రధానమైన ప్రభుత్వ వ్యవస్థల నుంచి ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లవంటి పౌరసేవలు అందించే కేంద్రాలవరకూ అన్నింటికీ రక్షణ కల్పిస్తాం. ఇందుకోసం భగవాన్ శ్రీకృష్ణుని నుంచి ప్రేరణ తీసుకొని ఆయన ధరించిన సుదర్శన చక్ర మార్గాన్ని ఎంచుకున్నాం. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రంతో సూర్యప్రకాశాన్ని ఆపేసి పగలే చీకటి సృష్టించారు. అప్పుడు అర్జునుడు తన ప్రతిజ్ఞ ప్రకారం జయద్రథుడిని వధించగలిగాడు. ఆ స్ఫూర్తితోనే సుదర్శన్ చక్ర మిషన్ ప్రారంభిస్తున్నాం. ఇది శత్రువుల దాడిని నిర్వీర్యం చేయడంతోపాటు ఎన్నో రెట్ల బలంతో వారిపై ప్రతిదాడి కూడా చేస్తుంది. ఇందుకు అవసరమైన సాంకేతిక వ్యవస్థల పరిశోధన, అభివృద్ధి, తయారీ మన దేశంలోనే, మనవారితోనే తయారుచేయబోతున్నాం. కృష్ణుడి సుదర్శన చక్రం లక్ష్యాన్ని ఛేదించిన తర్వాత తిరిగి ఆయనవద్దకే వచ్చేది. మేం కూడా అంతే కచితత్వంతో ఈ వ్యవస్థను రూపొందిస్తాం.

3.5 కోట్ల మందికి ఉద్యోగావకాశాలు

ఈ దేశ యువత కోసం ఓ సంతోషకరమైన వార్త తీసుకొచ్చాను. ఈ ఆగస్టు 15 నుంచే యువత కోసం రూ.లక్ష కోట్ల పథకాన్ని ప్రారంభిస్తున్నాం. ఈరోజు నుంచి ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ఇక్కడినుంచే మొదలుపెడుతున్నాం. దీనిద్వారా ప్రైవేటురంగంలో తొలిసారి ఉద్యోగం పొందిన యువతకు ప్రభుత్వం నుంచి రూ.15 వేలు ఇస్తాం. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. ఈ పథకం దాదాపు 3.5 కోట్ల మంది యువతకు కొత్త ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.

■ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇంధనరంగంపై విస్తృత స్థాయిలో దృష్టిసారించాం. గ్రీన్ హైడ్రోజన్‌పై వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నాం. 2047కల్లా మన అణు ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 రెట్లకుమించి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సంస్కరణల వేగాన్ని పెంచాలని నిర్ణయించాం. భవిష్యత్తరం సంస్కరణల కోసం ఓ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీంతో యువతకు, ఎంఎస్ఎంఈ సంస్థలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేలు జరుగుతుంది.

■ రైతులు, మత్స్యకారులు, పశుపాలకులు మన ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనందిస్తున్నారు. వారి ప్రయోజనాలకు విరుద్ధమైన ఎలాంటి విధానాలను మేం అంగీకరించం. వారికి హాని కలిగించే విధానాలకు అడ్డుకట్టే గోడలా నిలుస్తాను.

■ దేశంలో స్థూలకాయం పెరిగిపోతుండటం ఆందోళనకరం. దీని గురించి ప్రతి కుటుంబం ఆలోచించాలి. రాబోయే రోజుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు స్థూలకాయం బారిన పడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాన్నుంచి మనం బయటపడాలి. అందుకోసం ఇంటి అవసరాలకు తీసుకొచ్చే వంటనూనెలో 10% తగ్గించుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి.

■ ఈ దేశాన్ని తీర్చిదిద్దడంలో వ్యక్తులతో పాటు సంస్థల శ్రమ దాగి ఉంది. ఇప్పటికి 100 ఏళ్లకు ముందు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనే సంస్థ ఏర్పడింది. వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం సాధ్యమన్న సంకల్పంతో పుట్టుకొచ్చిన ఆ సంస్థకు చెందిన లక్షల మంది స్వయం సేవకులు మాతృభూమి కోసం జీవితాలను సమర్పించారు. వారందరినీ ఈ ఎర్రకోట నుంచి గౌరవపూర్వకంగా స్మరించుకుంటున్నాను.

■ కొందరు దుర్బుద్ధితో దేశ జనాభా స్వరూపాన్ని (డెమోగ్రఫీ) మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్త సంక్షోభానికి బీజం వేస్తున్నారు. చొరబాటుదారులు ఈ దేశ యువత ఉద్యోగాలను, ఉపాధిని లాగేసుకుంటున్నారు. అమాయక ఆదివాసీల భూములను కబ్జా చేస్తున్నారు. దీన్ని దేశం ఏ పరిస్థితుల్లోనూ సహించదు. సరిహద్దు ప్రాంతాల్లో డెమోగ్రఫీలో మార్పు వస్తే దేశ భద్రతకే ముప్పు. అందుకే హైపవర్డ్ డెమోగ్రఫీ మిషన్ ప్రారంభించాలని నిర్ణయించాం. దీని ద్వారా భారత్‌కు ఎదురయ్యే సంకటాన్ని నిర్మూలించేందుకు కార్యాచరణ మొదలుపెడతాం.

దీపావళికి శుభవార్త

రాబోయే దీపావళి రెట్టింపు వెలుగుని చేసేలా చేయబోతున్నాం. దేశ ప్రజలకు పెద్ద బహుమతి లభించబోతోంది. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జీఎస్టీపై ఉన్నతస్థాయి కమిటీ వేసి సమీక్షిస్తున్నాం. రాష్ట్రాలతో మాట్లాడుతున్నాం. దీపావళిలోపు జీఎస్టీ సంస్కరణలు తీసుకురాబోతున్నాం. సాధారణ ప్రజలకు పన్నుభారం చాలావరకు తగ్గించబోతున్నాం. రోజువారీ వినియోగ వస్తువులు చాలా చౌక అవుతాయి.



దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ. చిత్రంలో అమిత్ షా సతీమణి సోనాల్ షా



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం దిల్లీలోని ఎర్రకోట వద్ద త్రివిధ దళాల కవాతు

పన్ను పోటుకు ఉపశమనం!

(మొదటి పేజీ తరువాయి)

విలాస, హానికారక వస్తువులపై 28 శాతం జీఎస్టీ విధిస్తున్నారు.

ప్రతిపాదిత జీఎస్టీ విధానంలో 5 శాతం, 18 శాతం పన్ను శ్లాబ్‌లు మాత్రమే ఉంటాయి. ఇవి కాక సమాజానికి హానికారకంగా గుర్తించిన ఏడు అంశాలపై 40 శాతం పన్ను ప్రతిపాదించారు. ఈ ఏడాది దీపావళికి కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత విధానంలో ఉన్న 12 శాతం, 28 శాతం పన్ను శ్లాబ్‌లను తొలగించాలన్నది తాజా ప్రతిపాదన. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ కోసం రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీకి ఈ ప్రతిపాదనను కేంద్రం పంపించింది. దీనిపై కమిటీ చర్చించి, జీఎస్టీ మండలికి పంపుతుంది. వచ్చే నెలలో జీఎస్టీ మండలి సమావేశమయ్యే అవకాశం ఉంది. రానున్న దీపావళి నుంచి జీఎస్టీ విధానంలో కొత్తతరం సంస్కరణలు తెస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రతిపాదనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

వ్యవసాయ, వైద్య, బీమా రంగాలకు ప్రయోజనం: సవరించిన జీఎస్టీ విధానం జౌళి, ఎరువులు, పునరుత్పాదక విద్యుత్తు, ఆటోమోటివ్, హస్తకళలు, వ్యవసాయం, వైద్యం, బీమా రంగాలకు లాభం చేకూర్చనుంది. ఈ సవరణ వినిమయానికి ఊతమందిస్తుందని, పెరిగిన వినిమయం కారణంగా పన్ను చెల్లింపులు పెరిగి.. తగ్గిన పన్నుల కారణంగా కలిగే నష్టాన్ని భర్తీ చేస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పన్ను విధానంలో మార్పు ప్రభుత్వాదాయానికి గండి కొడుతుంది. అయితే ఆ ఆదాయ నష్టం కొన్ని నెలల వ్యవధిలోనే పూడుకుపోతుంది అని ఆ వర్గాలు తెలిపాయి.

12 శాతం శ్లాబ్ నుంచి 5 శాతానికి..: సవరించిన విధానాన్ని జీఎస్టీ మండలి ఆమోదిస్తే, ప్రస్తుతం 12 శాతం శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులు.. 5 శాతం పన్ను శ్రేణిలోకి వెళ్లనున్నాయి. అదే విధంగా ప్రస్తుతం 28 శాతం పన్ను శ్లాబులో ఉన్న వస్తు సేవల్లో 90 శాతం 18 శాతం పన్ను రేటుకు మారనున్నాయి.

హానికారక సేవల శ్రేణిలోకి ఆన్‌లైన్ గేమింగ్: కొత్త జీఎస్టీ విధానంలో హానికారక వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ శ్రేణి పొగాకుతో సహా కేవలం 7 వస్తువులు, సేవలకు మాత్రమే వర్తిస్తుంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రక్రియను హానికారక సేవల శ్రేణిలో చేర్చే అవకాశం ఉంది.

పులివెందుల ఓటర్ల ప్రశ్నలకు జవాబివ్వండి

● సీఎం చంద్రబాబు డిమాండ్

ఈనాడు, అమరావతి: 'పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికపై కొందరు నన్ను విమర్శిస్తున్నారు. 30 ఏళ్ల తర్వాత ఓటు వేశానని, అందరికీ దండాలు.. అంటూ ఓ ఓటరు బ్యాలెట్ బాక్స్‌లో కాగితం వేశాడు. అంటే 30 ఏళ్లుగా వాళ్లు ఓటేయలేదు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారికి స్వాతంత్ర్యం వచ్చింది. మా వివేకా సార్‌కి న్యాయం చేయండి సార్ అని మరొకరు కాగితం వేశారు. మరి న్యాయం చేయాలా వద్దా? వైకాపా నాయకులు పులివెందుల ఓటర్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి' అని సీఎం చంద్రబాబు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఏ ఎన్నికల్లోనూ రిగ్గింగ్ ఉండదని, ఎవరూ ఇష్టానుసారం ప్రవర్తించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. 'కొందరు కరుడుగట్టిన నేరస్థులు రాజకీయ నేతల ముసుగులో వచ్చి సమాజాన్ని అతలాకుతలం చేయాలనుకుంటున్నారు. ఇప్పుడున్నది 2014 సీబీఎన్ (చంద్రబాబు నాయుడు) కాదు, 1995 సీబీఎన్. నేను, పవన్‌కల్యాణ్, భాజపా.. ఎక్కడా అన్యాయం చేయం. ఎవరి జోలికీ వెళ్లం. వాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, నేరాలకు పాల్పడి, రాజకీయాల ముసుగులో తప్పించుకోవాలనుకుంటే మాత్రం వదిలే ప్రసక్తే లేదు' అని చంద్రబాబు హెచ్చరించారు. శుక్రవారం స్త్రీశక్తి పథకం ప్రారంభ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్, పుతిన్‌లు తమతమ ప్రత్యేక విమానాల్లో యాంకరేజ్‌కు చేరుకున్నారు. తన ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ముందుగానే చేరుకున్న ట్రంప్.. పుతిన్‌కు సాదర స్వాగతం పలికారు. ఇరువురు నేతలు ఉత్సాహంగా కరచాలనం చేసుకున్నారు. అనంతరం వారిరువురు ఒకే కారులో జాయింట్ బేస్ ఎల్మెండార్ఫ్ రిచర్డ్సన్‌లో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక వద్దకు చేరుకున్నారు. పక్కపక్కనే కూర్చుని ట్రంప్, పుతిన్ చర్చలు కొనసాగించారు. ట్రంప్ తరఫు బృందంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వైట్‌హౌస్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ ఉన్నారు. పుతిన్ బృందంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్, విదేశాంగ విధాన సలహాదారు యూరి యుషకోవ్ ఉన్నారు. రెండో దఫా అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత పుతిన్‌ను ట్రంప్ కలుసుకోవడం ఇదే తొలిసారి.

కాల్పుల విరమణపై నోరువిప్పని పుతిన్

కాల్పుల విరమణకు అంగీకరించి, సామాన్య పౌరుల మరణాలను ఆపేస్తారా? మీ మాటలను ట్రంప్ ఎందుకు విశ్వసించాలి? అని విలేకరులు విమానాశ్రయంలో అడిగిన ప్రశ్నకు పుతిన్ సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయారు. ఎప్పుడూ విలేకరుల ముందు హడావుడి చేసే ట్రంప్ మాత్రం మౌనంగా ఉన్నారు. ట్రంప్-పుతిన్ భేటీ ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని మలుపుతిప్పుతుందని, మాస్కో-వాషింగ్టన్ మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాలు ఎలాంటి రూపు సంతరించుకుంటాయన్న ఉత్కంఠా ఉంది. అయితే పుతిన్‌ను చర్చలకు కూర్చోబెట్టడమే తన ప్రస్తుత లక్ష్యమని, తక్షణ ఉక్రెయిన్ శాంతి ఒప్పందం కోసం కాదని ట్రంప్ అంతకు ముందు విలేకరులతో పేర్కొనడం విశేషం.

ట్రంప్‌పై పుతిన్ ప్రశంసల వర్షం

భేటీకి ముందు పుతిన్ ఓ వీడియోలో ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. 'శత్రుత్వాలను ఆపేందుకు, అన్ని పక్షాల ప్రయోజనాలను కాపాడే ఒప్పందాలను చేసుకునేందుకు.. ట్రంప్, ఆయన యంత్రాంగం శక్తివంచనలేని, నిజాయతీ ప్రయత్నాలు చేస్తోంది' అని పేర్కొన్నారు.

దశాబ్దం తర్వాత.. విద్యుత్ సంస్థల్లో నియామకాలు!

వివిధ కేడర్లలో 9,849 ఖాళీలు

వాటిలో 75% భర్తీకి ప్రభుత్వం అనుమతి

ఈనాడు, అమరావతి: విద్యుత్ సంస్థల్లో దశాబ్ద కాలం తర్వాత ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వివిధ కేడర్లలో 9,849 ఖాళీలుండగా, వాటిలో 75% భర్తీ చేయనుంది. టెక్నికల్ కేడర్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈఈ/ఏఈ- సివిల్, ఎలక్ట్రికల్, టెలికాం, ఐటీ), జూనియర్ ఇంజినీర్లు, నాన్-టెక్నికల్ కేడర్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్ ఎం) కేటగిరీలో జూనియర్ లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వెంటనే భర్తీచేయాల్సిన పోస్టులను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం స్వల్పసంఖ్యలో ఖాళీలు భర్తీచేసింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో పోస్టుల భర్తీని పూర్తిగా నిలిపేసింది. పదోన్నతులు, పదవీవిరమణలతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయి. వివిధ కేడర్లలో 40% పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యను ఉద్యోగ సంఘాలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాయి. కూటమి ప్రభుత్వం మళ్లీ నియామకాలకు అనుమతించింది. సిబ్బందికి పదోన్నతుల వల్ల కేడర్ మారినా.. సీటు మారట్లేదు. కిందిస్థాయిలో ఏఈఈ, ఏఈ పోస్టుల భర్తీ దశాబ్దకాలంగా నిలిచిపోవడంతో నిబంధనల మేరకు సిబ్బందికి పదోన్నతులు కల్పించినా అక్కడే కొనసాగించాల్సి వస్తోంది. రెండు పోస్టుల విధులతో వారిపై పని ఒత్తిడి పెరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా.. వేగంగా పునరుద్ధరించలేకపోతున్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. డిస్కంలో సమస్య ఎక్కువగా ఉంది. దీంతో నియామకాలు చేపట్టక తప్పదని అధికారులు గుర్తించారు.

శిక్షణకు పంపలేని వైనం: గత ఐదేళ్లలో వీటీపీఎస్, కృష్ణపట్నాల్లో ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున రెండు కొత్త ప్రాజెక్టులు ఉత్పత్తిలోకి వచ్చాయి. వాటి అవసరాల మేరకు సిబ్బందిని నియమించకుండా ఉన్న వారినే సర్దుబాటు చేశారు. థర్మల్ ప్లాంట్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వాటిని వెంటనే సరిదిద్దలేని పరిస్థితి. సిబ్బందిని శిక్షణ కోసం బయటి ప్రాంతాలకు పంపే ప్రక్రియ నిలిచింది.

డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కోలో గుర్తించిన ఖాళీలు

వివరాలు	శాంక్షన్	ఖాళీ
టెక్నికల్	5,792	1,982
నాన్-టెక్నికల్	4,737	1,875
ఓ అండ్ ఎం	13,960	5,992
	24,489	9,849

డిస్కంల వారీగా శాంక్షన్ చేసిన పోస్టులు.. ఖాళీలు

వివరాలు	ఈపీడీసీఎల్		సీపీడీసీఎల్		ఎస్‌పీడీసీఎల్	
	శాంక్షన్	ఖాళీ	శాంక్షన్	ఖాళీ	శాంక్షన్	ఖాళీ
సాంకేతిక	1,037	195	729	149	1,194	253
నాన్-టెక్నికల్	1,393	602	1,087	411	1,649	559
ఆపరేషన్	4,574	1,787	3,111	1,148	5,251	2,038
	7,004	2,584	4,927	1,708	8,094	2,850

జెన్‌కో.. ట్రాన్స్‌కోలో ఖాళీల సంఖ్య

వివరాలు	జెన్‌కో		ట్రాన్స్‌కో	
	శాంక్షన్	ఖాళీలు	శాంక్షన్	ఖాళీలు
టెక్నికల్	1,620	677	1,212	708
నాన్-టెక్నికల్	391	140	217	163
ఆపరేషన్	–	–	1,024	1,019
	2,011	817	2,453	1,890

ఇ-కామర్స్‌తో ఇంతింతై..

● పొదుపు సంఘాల ఉత్పత్తులకు పెరిగిన గిరాకీ

● ఏడాదిలో రూ.2.50 కోట్లకు పైగా వ్యాపారం

● ఇతర రాష్ట్రాల ఆర్డర్లతో లాభాల బాట





స్వయం సహాయక సంఘ సభ్యురాలైన మచిలీపట్నానికి చెందిన రమాదేవి ఏడేళ్లుగా వన్ గ్రాం గోల్డ్ (ఇమిటేషన్ గోల్డ్) ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. ఆమె ఏడాది క్రితం డిజిటల్ మార్కెట్‌లో ప్రవేశించి వ్యాపారాన్ని క్రమంగా విస్తరించారు. స్థానికంగా అమ్మకాలు చేస్తూనే తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్ల మేరకు ఆభరణాలను సరఫరా చేస్తున్నారు. ఖర్చులన్నీ పోగా గతంలో నెలకు రూ.20 వేలు మిగిలేది. డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి వెళ్లాక రూ.40 వేలు సాధిస్తున్నారు.

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు డిజిటల్ మార్కెట్లో (ఈ-కామర్స్) అడుగుపెట్టి మంచి లాభాలు సాధిస్తున్నారు. స్వయంగా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. డిజిటల్ మార్కెట్లో ప్రవేశించాక అంతకు ముందు కంటే రెండింతల లాభాలు అందుకుంటున్నారు. మైస్టోర్, వావ్‌జెనీ, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ వేదికలపై రాష్ట్ర మహిళలు ఉత్పత్తి చేసిన వివిధ రకాల వస్తువులు పెడుతున్నారు. ఏడాది వ్యవధిలో 1.64 లక్షలకు పైగా ఆర్డర్ల ద్వారా రూ.2.50 కోట్లకు పైగా ఈ-వ్యాపారం చేశారు. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది మహిళలు రూ.కోటి విలువైన ఉత్పత్తులు వావ్‌జెనీ డిజిటల్ వేదిక ద్వారా విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించారు.

ఓఎన్‌డీసీతో వ్యాపారంలో కీలక మలుపు..

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)తో రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలోని ఉత్పత్తులకు దేశీయంగా ప్రాధాన్యం పెరిగింది. అనేక రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రావడంతో వ్యాపారం పెరుగుతోంది. దిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, తెలంగాణ నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు వస్తున్నాయి. ఏడాది క్రితం వరకు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వావ్‌జెనీ సంస్థల నుంచి ఆర్డర్లు వచ్చినా వాటిపై కమీషన్ 25% వారే తీసుకోవడం, వచ్చేది తక్కువ, చెల్లింపుల్లో జాప్యంతో కలిసొచ్చేదికాదు. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌తో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలను మెప్మా ఆధ్వర్యంలో అనుసంధానించారు. ఇందులో భాగమైన మైస్టోర్ డిజిటల్ వేదిక ద్వారా ప్రస్తుతం పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. మిగతా ఏజెన్సీల కంటే తక్కువ కమీషన్ (6-8% మాత్రమే) తీసుకుంటున్నారు. వస్తువు డెలివరీకి ముందే చెల్లింపులు చేస్తున్నారు. జూట్ బ్యాగ్‌లు, ఇమిటేషన్ గోల్డ్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణలు, వస్త్రాలు, పచ్చళ్లు, ఫ్లోర్ క్లీనర్, ఫొటో ఫ్రేమ్‌లు, అగర్‌బత్తీలు తదితరాలకు డిమాండ్ పెరిగింది.

వివిధ డిజిటల్ మార్కెట్ల ద్వారా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏడాదిలో వివిధ ఉత్పత్తుల విక్రయాల వివరాలివి..

ఇ-కామర్స్ వేదిక	ఉత్పత్తులు సంఖ్య	ఆర్డర్ల సంఖ్య	వాటి విలువ (రూ.లలో)	పంపిణీ చేసిన ఆర్డర్లు
మైస్టోర్	9,635	26,690	32,85,155	25,964
వావ్‌జెనీ	250	1,37,536	2,16,33,427	1,37,536
అమెజాన్	1,791	98	25,224	94
ఫ్లిప్‌కార్ట్	1,911	725	4,26,325	607

రిసోర్స్ పర్సన్లకు ప్యాకింగ్, డెలివరీ బాధ్యత

ప్రతి జిల్లాలోనూ మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు ఈ-వ్యాపార నిర్వహణలో స్వయం సహాయక సంఘాలకు సహకరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్లపై వస్తువుల ప్యాకేజీ నుంచి వాటిని ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా డెలివరీ చేసే బాధ్యత రిసోర్స్ పర్సన్లు తీసుకుంటున్నారు. సంఘాలకు చెల్లింపులు కూడా వీరే చేస్తున్నారు. 'ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త తయారీయే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలోని ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ సదుపాయం కల్పించాం. దీని ద్వారా మంచి ఫలితాలొస్తున్నాయి' అని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు.

గ్రహం అనుగ్రహం

16-8-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
అష్టమి: రా. 10-55 తదుపరి నవమి
భరణి: ఉ. 8-28 తదుపరి కృత్తిక
వర్జ్యం: రా. 7-37 నుంచి 9-06 వరకు
అమృత ఘడియలు: తె. 4-32 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 5-46 నుంచి 7-26 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.46; **సూర్యాస్తమయం:** సా.6.23
కృష్ణాష్టమి, గోకులాష్టమి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విశాఖపట్నం	35.4	26.6
తిరుపతి	35.3	25.0
నెల్లూరు	35.0	27.0
రాజమహేంద్రవరం	35.0	24.5
ఒంగోలు	34.3	26.0
విజయనగరం	34.0	26.0
నరసాపురం	33.4	28.2
విజయవాడ	32.2	25.2
గుంటూరు	32.0	28.0
శ్రీకాకుళం	32.0	27.0
తాడేపల్లిగూడెం	31.7	26.0
అనంతపురం	31.7	23.5
కర్నూలు	31.1	23.7
కడప	31.0	26.0

ఇదీ సంగతి!



ఆకలిని పూర్తిగా నిర్మూలించే పనిలోనే ఉన్నాం!

సీడబ్ల్యూసీ, ఎస్‌సీపీసీఆర్ ఛైర్మన్ల నియామక నోటిఫికేషన్ రద్దు!

ఈనాడు, అమరావతి: చిన్నారుల సంక్షేమ కమిటీ(సీడబ్ల్యూసీ), బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్‌సీపీసీఆర్) ఛైర్మన్, సభ్యులు, జువెనైల్ జస్టిస్ బోర్డు(జేజేబీ) సోషల్ వర్కర్‌ల నియామకానికి ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌ను మహిళా, శిశు సంక్షేమ శాఖ రద్దుచేసినట్లు తెలిసింది. ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాల మేరకు వీటిని రద్దు చేసినట్లు సమాచారం. 26 జిల్లాల ప్రాతిపదికన నియామకం చేపట్టాల్సి ఉంది. మరో వారం రోజుల్లో వీటి నియామకానికి కొత్త నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశమున్నట్లు సమాచారం.

ఒంగోలులో 'పుస్తక మహోత్సవం' ప్రారంభం

ఒంగోలు(అంజయ్యరోడ్డు), న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో వరుసగా మూడోసారి 'పుస్తక మహోత్సవం' నిర్వహించడం సంతోషంగా ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. నగరంలోని పీవీఆర్ బాలుర పాఠశాల మైదానంలో శుక్రవారం విజయవాడ బుక్‌ఫెస్ట్, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఏపీ గ్రంథాలయ పరిషత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎందరో గొప్ప రచయితలు అందించిన సాహిత్యం, స్ఫూర్తిప్రదాతల జీవిత చరిత్రలు, భాషా ప్రాధాన్యం తదితర పుస్తకాలను ఇక్కడ వారం పాటు అందుబాటులో ఉంచుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను చూస్తున్న మంత్రి డోలా, ఎంపీ మాగుంట, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో 39% వృద్ధి

ఏప్రిల్, మే, జూన్ నెలల్లో దూకుడు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో 39% వృద్ధి నమోదైంది. 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు 12 వరకు రూ.2,851 కోట్లు లభించగా.. ఈ ఏడాది అదే కాలానికి రాబడి రూ.3,950 కోట్లకు పెరిగింది. గతేడాది కంటే రూ.1,099 కోట్ల మేర పెరుగుదల కనిపించింది. భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంపు ద్వారా ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయం పెరుగుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేయగా.. మొదటి త్రైమాసికంలోనే రూ.436 కోట్ల రాబడి వచ్చింది.

ఏప్రిల్ నుంచి ఆగస్టు 12 వరకు రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి (రూ.కోట్లలో)

నెల	2024	2025	వృద్ధి (%)
ఏప్రిల్	663.37	906.22	37
మే	583.03	917.20	57
జూన్	574.77	841.80	46
జులై	740.74	927.22	25
ఆగస్టు 12 వరకు	289.19	358.06	24
మొత్తం	2,851.1	3,950.5	39

జులైలో లక్ష్యానికంటే తక్కువగా..: ఈ ఏడాది మే, జూన్ నెలలతో పోలిస్తే జులై, ఆగస్టుల్లో రిజిస్ట్రేషన్లు తగ్గాయి. తద్వారా ఆదాయం కూడా తగ్గింది. జులైలో రూ.1,017 కోట్ల లక్ష్యం నిర్ణయించగా.. రూ.927.22 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే లక్ష్యంలో 91% సాధించగలిగారు. ఏప్రిల్‌లో 111%, మే నెలలో 129%, జూన్‌లో 103% వృద్ధి నమోదవ్వడం గమనార్హం.

రూ.100 కోట్లతో ఆహార నాణ్యత పరీక్షా కేంద్రాలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: విశాఖ, గుంటూరు, తిరుమల, తిరుపతి, కర్నూలులో రాష్ట్రస్థాయి ఆహార నాణ్యత పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. ల్యాబొరేటరీల నిర్మాణం, ఆధునికీకరణకు సుమారు రూ.100 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. నెల రోజుల్లో తిరుమల, విశాఖపట్నంలలోని రాష్ట్రస్థాయి లేబొరేటరీల్లో ఆహార నమూనాల పరీక్షలు ప్రారంభిస్తామన్నారు. ఒంగోలు, ఏలూరుల్లోని ప్రజారోగ్య ప్రయోగశాలలను ఆధునికీకరిస్తామని, ఇందుకోసం రూ.13 కోట్లతో ఆధునిక పరికరాల కొనుగోలుకు అనుమతిచ్చినట్లు వివరించారు.



ఆ రెండు నమ్మకాలు ఉంటే..

జీవితంలో బాగా విజయవంతమైన వ్యక్తులను గమనించండి. వారెప్పుడూ ప్రధానంగా రెండు నమ్మకాలను కలిగి ఉంటారు. అవేంటో తెలుసా..?

1. నా వర్తమానం కంటే భవిష్యత్తు బాగుంటుంది.
2. భవిష్యత్తును అలా మార్చుకోగల శక్తి నాకుంది.

– వాలా అఫ్సర్, కాలమిస్టు

ఈనాడు

ఈసీ విశ్వసనీయతకు పరీక్ష!

మన దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎం.ఎస్.గిల్ ఉన్నప్పుడు విదేశీయుల నుంచి ఆయనకు ఒక ప్రశ్న ఎదురైంది. 'మీరు ప్రకటించే ఫలితాలను పార్టీలన్నీ అంగీకరిస్తాయా?' అని అడిగినవారికి- 'భారత ఎన్నికల సంఘం పట్ల ఎప్పుడూ ఎవరూ ఎలాంటి విశ్వాసరాహిత్యాన్నీ ప్రదర్శించలేదు' అని గిల్ సగర్వంగా సమాధానమిచ్చారు. ఈసీ మీద అంతటి నమ్మకం ఇప్పుడు ఉందా అంటే- రాజకీయ పార్టీలే కాదు, ప్రజల్లో కూడా చాలామంది 'లేదు' అనే చెబుతారు. బిహార్‌లో ఓటరు జాబితాల నిశిత పరిశీలన(ఎస్ఐఆర్) ప్రహసనం ప్రారంభమయ్యాక- కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై కొన్నేళ్లుగా వ్యక్తమవుతున్న అనుమానాలు ఆందోళనలుగా పరిణమించాయి. ఆ రాష్ట్ర ముసాయిదా ఓటర్ల లిస్టులోంచి తొలగించినవారి వివరాలను ప్రత్యేకంగా వెల్లడించనక్కర్లేదని, జాబితాలో ఎవరినైనా చేర్చకపోవడానికి కారణాలేంటో కూడా చెప్పక్కర్లేదని ఈసీ వాదించడంతో సందేహాలు ఇంకా బలపడ్డాయి. ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాలను ప్రకటించేటప్పుడు వాటికి సంబంధించిన అన్ని వాస్తవాలనూ బహిరంగపరచాలని సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(సి) నిర్దేశిస్తోంది. పాలనాపరమైన, అర్ధన్యాయ తీర్మానాలకు గల కారణాలేంటో ఆ నిర్ణయాల ప్రభావాలకు లోనయ్యే వ్యక్తులకు వివరించాలని సెక్షన్ 4(1)(డి) స్పష్టీకరిస్తోంది. ప్రజాస్వామ్యానికి ఊపిరులూదే ఇటువంటి జవాబుదారీతనాన్ని కాలదన్నిన ఈసీకి సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు కనువిప్పు కలిగించేవే!

బిహార్ ముసాయిదా జాబితా నుంచి తొలగింపునకు గురైన 65 లక్షల మంది వివరాలను బయటపెట్టాలంటూ మొన్న గురువారం సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు విశేషమైనది. ఓటర్ల లిస్టులోంచి తమను ఎందుకు తీసేశారో తెలుసుకోవడం పౌరుల ప్రాథమిక హక్కు. 'సుప్రీం' ఉత్తర్వులు దానికి పట్టంకట్టాయి. ఓటింగ్ హక్కును అమూల్యమైనదిగా గతంలో పేర్కొన్న కేరళ హైకోర్టు- సంబంధిత వ్యక్తుల వాదనలను వినకుండా ఎవరి పేర్లనూ ఓటరు జాబితాలోంచి కత్తిరించకూడదని స్పష్టంచేసింది. వ్యక్తిగత అంతరాలకు అతీతంగా పౌరులందరూ ప్రజాస్వామ్యంలో కీలక పాత్రధారులే. కాబట్టి ప్రతి ఒక్కరి ఓటూ విలువైనదే. కండబలంతో, అధికార దుర్వినియోగంతో ఎవరూ ఎన్నికల ప్రక్రియను దారితప్పించకూడదు. ప్రజాభిప్రాయ ప్రకటనను తమకు అనుకూలంగా ప్రభావితం చేయకూడదు. ఈ మేరకు గతంలోనే ఉద్ఘాటించిన న్యాయపాలిక- ఎన్నికలు స్వేచ్ఛగా సక్రమంగా పూర్తికావడం ప్రజాతంత్రానికి ప్రాణావసరమని పేర్కొంది. ఎలక్షన్లు ఆ విధంగా జరగాలంటే- ముందసలు ఓటర్ల లిస్టులు సక్రమంగా ఉండాలి. వాటిని అలా రూపొందించడంలో ఈసీ ఎప్పటికప్పుడు చేతులెత్తేస్తుండటమే దేశ ప్రారబ్ధం!

అన్ని పార్టీలకూ సమదూరంలో ఉంటూ పారదర్శకంగా పనిచేయడం- ఈసీ శిరసావహించాల్సిన సంవిధాన కట్టుబాటు. ఎన్నికల సంఘం చేతల్లో రాజీలేని స్వతంత్రత, నిష్పాక్షికత, నిజాయతీ ఉట్టిపడాలి. ఎన్నికల నిర్వహణకుగానూ తనకు దఖలుపడిన సర్వాధికారాల వినియోగంలో యుక్తాయుక్త విచక్షణతో వ్యవహరించాలి. దురదృష్టవశాత్తు దశాబ్దాలుగా దేశీయంగా అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఓటర్ల లిస్టులోంచి అర్హుల పేర్లు గల్లంతు కావడం, అనర్హులు వచ్చిచేరడం వంటి అక్రమాలు నిర్విఘ్నంగా సాగిపోతున్నాయి. అంగ అర్థ బలసంపన్నుల క్రీడామైదానాలుగా మన ఎన్నికలు పరువుమాస్తున్నాయి. ఈసీ చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు భారత ప్రజాస్వామ్యాన్ని ఇంకా పలుచన చేస్తున్నాయి. నైతిక నియమాలు, శాసన నిబంధనలకు కట్టుబడి విధులు నిర్వర్తించడంలో ఈసీ నిబద్ధతే ఎన్నికల ప్రక్రియ పవిత్రతను పరిరక్షిస్తుంది. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థకు రాజకీయ మకిలి అంటితే మన ప్రజాస్వామ్యం అర్థరహితమై అరాచకాలకు ఆలవాలమవుతుంది!



అన్ని పనులూ తమ మీదే వేసుకునే లక్షణం ఉంటుంది మహిళలకు. దాన్ని వదిలించుకోవాలి. అలాగే కెరీర్‌లోనూ, జీవితంలోనూ సమస్యలు ఎదురైనప్పుడు మనసు విప్పి చెప్పుకోగల ఒక నమ్మకమైన వ్యక్తి ఉండాలి. సంక్షోభ సమయాల్లోంచి గట్టెక్కడానికి అది ఎంతో తోడ్పడుతుంది.

– శోభనా నరసింహన్, శాస్త్రవేత్త

పూర్ణ పురుషుడు

భగవంతుడు అన్ని ప్రాణులలో క్షేత్రజ్ఞుడిగా ఉన్నాడు. ఆయన సర్వశక్తిమంతుడు. జగత్తు అంతా ఆయన మాయే. దానికి వశుడై ఉన్న జీవుడు 'నేనే చేస్తున్నాను, అంతా నాదే, అన్నీ నాకే తెలుసు' అనే అజ్ఞానపాశాలతో బంధితుడవుతున్నాడు. అరిషడ్వర్గాల ఊబిలో కూరుకుపోతున్నాడు. అందుకే మనిషి సంపూర్ణుడు కాలేకపోతున్నాడు. అజ్ఞానాంధకారంలో చిక్కుకుని జ్ఞాన సముపార్జన కోసం ప్రయత్నించలేకపోతున్నాడు.

భగవంతుడు పూర్ణ పురుషుడు. మనిషిగా జన్మించి, తనేమిటో, తన తత్త్వమేమిటో లోకానికి స్పష్టంగా విశదపరిచాడు. బ్రహ్మ సృష్టిలోని చాకచక్యం అంతా కృష్ణుడి రూపంలో సంపూర్ణంగా కనిపిస్తుంది. అందుకే అందరూ చేసే పనులు ఆపేసి మరీ చెంతకుచేరి ఆయన్నే చూస్తూ ఉండి పోయేవారు. త్రిగుణాత్మకమైన ప్రకృతికి, ముల్లోకాలకు ఆయనే అధిపతి. స్వయం ప్రకాశుడు, ఆనంద స్వరూపుడు. ఇక వినయంలో



కృష్ణుడికి సాటి ఎవరూ లేరు. కంసవధ అనంతరం దేవకీ వసుదేవులకు నమస్కరించి 'ఇన్నేళ్లుగా మీ పాదసేవా భాగ్యాన్ని పొందలేకపోయాను. క్షమించి అనుగ్రహించండి' అని వేడుకున్నాడు. కృష్ణుడి వల్లనే ఉగ్రసేనుడు మహారాజయ్యాడు. అయినా ఆయన ముందు చేతులు కట్టుకుని నిలబడి గౌరవంగా 'మహారాజా!' అని మాట్లాడేవాడు. తనను చూడవచ్చిన బంధువులు, పెద్దలకు తలవంచి నమస్కరించేవాడు.

దయామయుడైన శ్రీకృష్ణుడు పెంచిన తల్లి యశోదకు ఏ పుణ్యలోకాలను ప్రసాదించాడో తనను మట్టుపెట్టాలని వచ్చిన పూతనని కూడా అవే పుణ్యలోకాలకు పంపాడు. తన పట్ల శత్రుభావం గల రాక్షసులు కూడా తన భక్తులే అని భావించి మరణానికి ముందు వారికి తన పూర్ణదర్శన భాగ్యాన్ని అనుగ్రహించాడు.

అంతర్యామి

కృష్ణుడు ఏకసంథాగ్రాహి. సాందీపని మహర్షి ఆశ్రమంలో వేదాన్ని అధ్యయనం చేశాడు. మరణించిన గురుపుత్రుణ్ని పంచజనుడు అనే రాక్షసుడి ఉదరం నుంచి బయటకు రప్పించి గురుదక్షిణ ఇచ్చాడు. పరమాత్మ గృహస్థ ధర్మాన్ని పాటించి అష్టదేవేరులను ఆనందపరిచాడు. సచ్చిదానందమైన జ్ఞానంతో నిష్ఠ కలవాడై ద్వారకను సమర్థంగా పాలించాడు. లోకంలో జ్ఞానమార్గాన్ని నిలబెట్టాడు. అపూర్వ గీతావాణిని అందించాడు.

కోరికలు లేకుండా, కర్మలు అంటకుండా ఉండే స్వామి కర్మలు చేస్తున్నట్లు కనిపించాడు. కాల మృత్యుస్వరూపుడైనా శత్రువులకు భయపడి ద్వారకా ద్వీపంలో తలదాచుకున్నట్లు నాటకమాడాడు. ఒక వంక 'జగత్తును నడిపించేది నేనే'నంటూనే మరో వంక 'నిమిత్తమాత్రుణ్ని, నాకేమీ తెలియద'ని అనేవాడు. ఆయనపై పరిపూర్ణ విశ్వాసం ఉంటే గానీ ఆ తత్త్వం అర్థం కాదు. పరమ భక్తి కలిగినవారు నిత్యమూ భగవత్ సాన్నిధ్యాన్నే కోరుకుంటారు. వారి దృష్టి ఎప్పుడూ ఆయనపైనే ఉంటుంది. పాండవులు అంతటి భక్తిపరులు కాబట్టే వారికి రాజ్యం దక్కింది. ఇలాంటి పరాభక్తిని సాధన చేస్తే దైవం తనను తానే సమర్పించుకుంటాడు. దూడ వెంట గోవులా మన వెంటే ఉంటాడు.

– మాడుగుల రామకృష్ణ



డిజిటల్ ఇండియా ఇంకెంత దూరం?

గ్రామాల్లో ఇంటర్నెట్, సాంకేతిక ఉపకరణాల లభ్యత, శిక్షణ అంతగా లేకపోవడంతో దేశంలో డిజిటల్ అక్షరాస్యత పెద్దగా పెరగట్లేదు. ఉన్నచోటు నుంచే ఎన్నో సేవలను పొందే వీలున్నా... ఆన్‌లైన్ వినియోగం పట్ల సరైన అవగాహన లేక చాలామంది ఈ-సేవా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నిరక్షరాస్యతకు తోడు స్థానిక భాషల్లో టెక్నాలజీ లేకపోవడమూ ఇందుకు కారణమవుతోంది.

డిజిటల్ అక్షరాస్యత అంటే ఇంటర్నెట్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్, కంప్యూటర్ల వంటి ఉపకరణాలను నిత్య జీవితంలో సమర్థంగా వినియోగించడం. వృద్ధి చెందుతున్న దేశార్థికంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే ప్రతి ఒక్కరికీ డిజిటల్ అక్షరాస్యత అత్యవసరం. ఆధునాతన సాంకేతిక ఉపకరణాలు అందుబాటులోకి వస్తున్నా, వాటిపై ఎక్కువ మందికి పట్టులేక సరైన ఫలితాలు రావట్లేదు. ఈ సవాళ్లు చోటుచేసుకుంటున్నాయి. 'నాస్కామ్' నివేదిక ప్రకారం, 2023లో భారత స్థూల డిజిటల్ అక్షరాస్యత రేటు 37శాతం. ఈ ఏడాది చివరినాటికి అది 43 శాతానికి చేరుకుంటుందని అంచనా. గ్రామీణులు, మహిళలు, ఆర్థికంగా వెనకబడిన వారిలో 'ఈ-విద్య' చాలా తక్కువగా ఉంటోంది. అందుకే ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరైనా సెల్‌ఫోన్, కంప్యూటర్లను ఉపయోగించగలిగేలా అవగాహన కల్పించాలనే లక్ష్యంగా కేంద్రం 2014లో 'నేషనల్ డిజిటల్ లిటరసీ మిషన్(ఎన్‌డీఎల్ఎం)'ను చేపట్టింది. కోట్ల మందికి డిజిటల్ విజ్ఞానం అందించాల్సిన ఈ పథకం అంతగా ప్రభావం చూపట్లేదు. పైగా దీని అమలులో అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే పద్ధతిని అవలంబించడం వల్ల ఆర్థికంగా, అక్షరాస్యత పరంగా వెనకబడిన రాష్ట్రాలు అందిపుచ్చుకోలేక పోతున్నాయి. చాలామంది విద్యావంతులు సైతం డిజిటల్ సేవలను పొందలేకపోతున్నారనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించట్లేదు.



సైబర్ నేరాలకు ఆస్కారం

దేశంలో 77శాతం మంది చేతుల్లో సెల్‌ఫోన్లు ఉంటే, 56శాతం మంది నిత్యం ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉంటున్నారు. అయితే, వాటిలో యథాలాపంగా వీడియోలూ పోస్టులు చూసేవారే ఎక్కువ. సొంతంగా కంటెంట్ సృష్టించేవారూ సందేశాలు రాసేవారూ చాలా తక్కువ మంది. కేంద్ర హోంశాఖ రాజ్యసభకు అందించిన వివరాల ప్రకారం, దేశంలో 2021-24 మధ్య సైబర్ నేరాలు ఏకంగా 400శాతం పెరిగాయి. ఇందుకు ప్రధాన కారణం డిజిటల్ ఉపకరణాల వినియోగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే. కొవిడ్ అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సేవలు చాలామటుకు డిజిటల్ విధానంలోకి మారిపోయాయి. కానీ, వాటి గురించి తెలియక ఎంతోమంది సమస్యలు ఎదుర్కొంటున్నారు. వ్యక్తిగత గోప్యతకు భంగం కలగడంతో పాటు ఆర్థిక మోసాలకూ గురవుతున్నారు. డిజిటల్ సాక్షరతపై నాలుగేళ్ల క్రితం 120 దేశాల్లో చేపట్టిన సర్వేలో భారత్ 73వ స్థానంలో నిలిచింది. సింగపూర్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలతో పోలిస్తే మన దగ్గర డిజిటల్ వసతులు చాలా తక్కువ. 5జీ నెట్‌వర్క్ విస్తరణ కూడా చాలా వెనకంజలో ఉంది. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ ద్వారా సాంకేతిక శిక్షణ ఇస్తున్నా అంతగా ప్రజల్లోకి వెళ్లలేదు. నిపుణుల కొరతకు తోడు గ్రామాలకు వెళ్లి శిక్షణ ఇవ్వడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపట్లేదు. పైగా టెక్ సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

డిజిటల్ తెలంగాణ, డిజిటల్ ఇండియా(ఏపీ) కార్యక్రమాలు తెలుగు రాష్ట్రాల్లో ఈ-అక్షరాస్యతను కాస్త మెరుగుపరిచాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి చోట్ల డిజిటల్ సాంకేతికత ముందంజలో ఉంది. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, విజయనగరం వంటి జిల్లాల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపునకు మరింత కృషి జరగాల్సి ఉంది. ఈ విషయంలో కేరళ విధానాలు అన్ని రాష్ట్రాలకూ అనుసరణీయం. అక్కడి ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతాల్లోనూ ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఇటీవలే వందశాతం డిజిటల్ అక్షరాస్యతను సాధించింది. 'డిజి కేరళ' పథకం కింద అక్కడి స్వయం పాలన బృందాలు(ఎస్‌హెచ్‌జీ) 21లక్షల మందికి తర్ఫీదు ఇచ్చాయి. ముందుగా సర్వే చేపట్టి సాంకేతిక పరికరాలను వాడటం తెలియని గృహిణులు, కూలీలు, వృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వంటి వారందరి వివరాలను సేకరించారు. తరవాత వారికి తమ పని ప్రదేశాల్లోనే రోజూ గంటసేపు అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తయ్యాక ఉపకరణాల వినియోగంలో 98శాతం మంది పట్టు సాధించినట్లు పరీక్షలతో వెల్లడైంది. కొంతమందికి రెండోసారి కూడా శిక్షణ ఇచ్చారు. ఈ మొత్తం క్రతువులో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కేరళ లిటరసీ మిషన్ ప్రేరక్‌లు, అక్షరాస్యతా మండలి సభ్యులు, యువజన సంఘాలు, టెక్ కంపెనీలు భాగస్వామ్యం కావడం విశేషం.

పాఠశాల స్థాయి నుంచే...

దేశంలో డిజిటల్ అక్షరాస్యత సాధనకు డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ వంటి సంస్థల ద్వారా కృషి జరుగుతోంది. అయితే, ఇంటర్నెట్‌ను వినియోగించడమెలాగో చెప్పి సరిపెట్టుకుంటే... సైబర్ మోసాలు జరుగుతున్న తీరు, ఆన్‌లైన్‌లో భద్రంగా ఉండటమెలాగన్నది వివరించడం ముఖ్యం. అన్ని రాష్ట్రాల్లో పాఠశాల స్థాయిలోనే డిజిటల్ సాక్షరతను తప్పనిసరి పాఠ్యాంశంగా చేర్చాలి. సురక్షిత పద్ధతుల్లో ఇంటర్నెట్ బ్రౌజింగ్, ఈమెయిల్స్ పంపడం, ఆన్‌లైన్ లావాదేవీల నిర్వహణపై అవగాహన కల్పించాలి. ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ వంటి కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మరోవైపు భారత్ నెట్ పథకం ద్వారా పల్లెపట్టుల్లో ఇంటర్నెట్ సౌకర్యాలను విస్తరించాలి. మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యంతో గ్రామీణ మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపునకు గణనీయంగా చేసే అవకాశముంది. విద్యార్థులు, యువత తమ కుటుంబ సభ్యులందరికీ డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో ఈ యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తేనే 'డిజిటల్ ఇండియా' సాకారం సుసాధ్యమవుతుంది.

– బండపల్లి స్టాలిన్

జాక్ మా పదిసార్లు హార్వర్డ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు, ఎంపిక కాలేదు. ఉద్యోగ ప్రయత్నాల్లో ముప్ఫైసార్లు తిరస్కరణకు గురయ్యారు. ఆఖరికి కేఎఫ్‌సీలో కూడా ఆయనకు ఉద్యోగం దొరకలేదు. అలాంటి వ్యక్తి చైనాలో అత్యంత ధనవంతుల్లో ఒకరెలా కాగలిగారు?

జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో తిరస్కరణకు గురయ్యే ఉంటారు. 'నో' అన్న మాట వినే ఉంటారు. అంతమాత్రాన అక్కడితో జీవితం ఆగిపోకూడదు. చరిత్రలో గొప్పవారైన చాలామంది ఎన్నో నిరాకరణలు, అవమానాలు ఎదుర్కొన్నవారే. జేకే రౌలింగ్ రాసిన హ్యారీ పోటర్ నవలను 12 పబ్లిషింగ్ కంపెనీలు తిరస్కరించాయి. అయినా నిరాశ పడకుండా పట్టుదలతో ముందుకు సాగారు కాబట్టే ఇప్పుడా పుస్తకాలు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ అమ్ముడైన ఫిక్షన్ సిరీస్‌గా పేరొందాయి.



తిరస్కరణా మంచిదే!

ఉద్యోగం, ప్రేమ, వ్యాపారం.. విషయం ఏదైనా సరే అవతలి వాళ్లు తిరస్కరించడానికి అనేక కారణాలు ఉంటాయి. తగిన అర్హత లేకపోవడం, నచ్చకపోవడం, కోపం.. ఏదైనా కావచ్చు. దాన్ని అంగీకరించాలి. తప్పులు సరిదిద్దుకునే అవకాశంగా మార్చుకోవాలి. సరైన దిశలో ఆలోచిస్తే తిరస్కరణ కొత్త పాఠాలు నేర్పుతుంది. కొన్ని సందర్భాల్లో తిరస్కరణా మన మంచికే అనిపిస్తుంది. అది మనల్ని మనం సానబెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. మన అసలు లక్ష్యాలను నిరంతరం గుర్తుచేస్తుంది. ఒక తలుపు మూసుకుపోతే మరో తలుపు తెరవడానికి ప్రయత్నించేలా పురికొలుపుతుంది. సమాజంలో అనేక మార్పులు తీసుకువచ్చిన ఎందరో ప్రముఖులు తమ జీవితాల్లో ఎన్నో ఎదురుదెబ్బలు ఎదుర్కొన్నారు. ప్రతిసారీ వాళ్లు అదే తొలి ప్రయత్నంగా సిన్సియర్‌గా చేస్తూ పోయారు కాబట్టే విజయం సాధించారు.

యాపిల్ కంపెనీ స్థాపకుల్లో ఒకరైన స్టీవ్‌జాబ్స్‌ను కొన్ని కారణాల వల్ల అదే సంస్థ తిరస్కరించింది. అంతా ముగిసినట్లేనని అనుకోకుండా 'నెక్ట్స్' అనే కొత్త కంపెనీని స్థాపించారు స్టీవ్. దాన్ని యాపిల్ సంస్థ కొనుగోలు చేయడంతో ఆయన మళ్లీ సీఈవోగా వచ్చారు, యాపిల్‌ని ప్రపంచంలోనే అత్యుత్తమ బ్రాండ్‌గా తీర్చిదిద్దారు.

మైఖేల్ జోర్డాన్ ఎన్‌బీఏలో చేరకముందు అనేక సవాళ్లను, అడ్డంకులను ఎదుర్కొని తనను తాను తీర్చిదిద్దుకున్నారు. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు తగినంత ఎత్తు లేడని, అవసరమైన నైపుణ్యాలు లేవని బాస్కెట్‌బాల్ జట్టు నుంచి అతణ్ని తొలగించారు. అయితే ఈ అనుభవం మైఖేల్‌ను మరింత కష్టపడి పని చేయడానికి ప్రేరేపించింది. ఇలా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.. అందరి వెనకా ఒకటికి మించిన రిజెక్షన్ కథలు తప్పనిసరిగా ఉంటాయి. వాళ్లు దాన్ని సక్సెస్‌గా ఎలా మలచుకున్నారో తెలుసుకోవాలి. తిరస్కారానికి కారణం ఏదైనా ఉండొచ్చు. భయపడకూడదు, వెనకడుగు వేయకూడదు. దాన్ని ఒక అవకాశంగా మార్చుకోవాలి. ఎందుకంటే ప్రతి 'నో'లోనూ ఒక 'ఓ' ఉంటుంది. అంటే- అవకాశం(ఆపర్చునిటీ)... ఎదగడానికి, మెరుగవడానికి, గెలవడానికి!

– నల్ల కవిత

సొంత గూటికోసం...

గ్రామీణ భారతంలో ప్రతి ఒక్కరికీ సొంత గూడు ఉండాలనే సత్సంకల్పంతో కేంద్రం 2016 ఏప్రిల్ ఒకటిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ(పీఎంఏవై-జీ)ను తెచ్చింది. ఇందులో పక్కా ఇల్లు నిర్మించుకునేవారికి ఆర్థిక సాయం అందిస్తోంది. పీఎంఏవై-జీ కింద ఈ ఏడాది ఆగస్టు ఏడు నాటికి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 4.12 కోట్ల ఇళ్లు కేటాయించాలని కేంద్రం లక్షించింది. అవి 3.84 కోట్ల ఇళ్లే మంజూరు చేశాయి. వాటిలో 2.82 కోట్ల ఇళ్లు పూర్తయ్యాయి. ఆయా రాష్ట్రాల్లో పూర్తయిన ఇళ్లు ఎన్ని అంటే... (లక్షల్లో)

మధ్యప్రదేశ్	38.81
బిహార్	38.43
ఉత్తర్ ప్రదేశ్	36.38
పశ్చిమ్ బెంగాల్	34.19
ఒడిశా	24.26
అస్సాం	20.77
రాజస్థాన్	17.53
ఝార్ఖండ్	15.72
ఛత్తీస్‌గఢ్	15.10
మహారాష్ట్ర	14.02
తమిళనాడు	6.47
గుజరాత్	6.03
కర్ణాటక	1.58
ఆంధ్రప్రదేశ్	0.88

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

కష్టజీవి... సాహితీ చిరంజీవి!

'నాకనిపిస్తుంది.. ఈ చాకిరీ చేస్తూ ఇట్లా ఆలోచనలు చేస్తూ ఉంటే త్వరగా చచ్చిపోతానని, కానీ హోటల్‌లో చాకిరీ తప్పదు. చాకిరీకి తగినంత ఫలితమూ దక్కదు. పోనీ ఈ కథలు రాయడం మానేద్దామా అనుకుంటాను. అదీ సాధ్యం కావట్లేదు. తెలుగు మాతృభాష కాకపోవడం వల్ల ఎంతో చదివితేగానీ రచనా వ్యాసంగం సాగదు. అట్లా చదివేందుకు పుస్తకాలు కొనే తాహతు లేదు. పోనీ ఏ పుణ్యాత్ముడైనా ఇస్తాడనుకుందాం. కానీ, చదివే తీరిక ఎక్కడ? నాతో సహా నూటికి తొంభై అయిదు మందిమి రోజుకు 12 గంటలు ఎద్దు చాకిరీ చేస్తున్నాం. ఇక చదువెక్కడ? ఈ హోటల్ పనికి గ్యారంటీ ఏమీ లేదు. ఇప్పటికి పాతికసార్లు ఉద్యోగం ఊడిపోవడం, రోజుల తరబడి పస్తు ఉండటం జరిగింది. పత్రిక వారు కథలు రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛ రోగాన్ని నయం చేసుకోవడానికి అయినా సరిపోతాయనుకున్నాను. అదీ వట్టిదైపోయింది. ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుడినని భావించలేక పోవడంలో తప్పులేదనుకుంటాను'- 1949 ఫిబ్రవరి 'తెలుగు స్వతంత్ర' పత్రికలో ఒక పేద రచయిత రాసుకున్న మాటలివి. ఆ వ్యక్తి నటరాజన్. కలంపేరు 'శారద'.

ఆయనది తెలుగు నేల కాదు. మన భాష కూడా రాదు. పొట్టకూటి కోసం తెనాలి వచ్చి హోటళ్లలో పనిచేస్తూ తెలుగుపై పట్టు సాధించారు. కష్టజీవులు, ఊసరవెల్లి మనుషుల జీవితాలను చాలా దగ్గర నుంచి చూశారు. వాటిని ప్రతిబింబిస్తూ మరపురాని కథలు, నవలలు రాశారు. 'శారద' కలం పేరుతో తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక పేజీని ప్రత్యేకించుకున్నారు. రేపు ఆయన 70వ వర్ధంతి.

చురుక్కుమనిపించే వ్యంగ్యం

తమిళనాడులోని పుదుక్కోటైలో 1925లో నటరాజన్ జన్మించారు. కాదు, 1924 అని కొంతమంది అంటారు. తన 12వ ఏట తెనాలి వచ్చారు. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. అక్కలిద్దరూ తెనాలిలో ఉన్నారు. తండ్రితో పాటు ఇక్కడికి వచ్చి చిన్నక్క భర్త హోటల్లో పని చేస్తూ తెలుగు చదవడం రాయడం నేర్చుకున్నారు. రావూరి భరద్వాజ, ఆలూరి భుజంగరావుల స్నేహంతో సాహిత్యాభిలాష అంకురించింది. తెనాలినీ, తెలుగు సమాజాన్నీ



విద్యాలయం చేసుకున్న నటరాజన్ క్రమంగా తెలుగు సామెతలు, జాతీయాలపైనా పట్టు సాధించారు. 1941లో ప్రజాశక్తి వారపత్రికలో ఆయన మొదటి కథ- 'ప్రపంచానికి జబ్బు చేసింది' నటరాజన్ పేరుతో అచ్చయింది. 1946లో అభ్యుదయ సాహిత్య పాఠశాలకు వెళ్లడం ద్వారా ఆయనదైన సాహిత్య దృక్పథం ఏర్పడింది. 1948 నుంచి 1955లో మరణించే వరకు అవిశ్రాంతంగా రచనలు చేశారు. దాదాపు 100 కథలు, గల్పికలు రాశారు. 'శారద' కలం పేరుతో 1948లో జ్యోతి పక్ష పత్రికలో 'గొప్పవాడి భార్య' కథ వచ్చింది. 'మంచీ చెడూ, అపస్వరాలు, ఏది సత్యం, మహీపతి, చీకటి తెరలు' మొదలైన నవలలూ వెలువరించారు. 'శారద నన్ను సాహిత్య వీధుల్లో చేయి పట్టుకు నడిపించాడు. కమ్యూనిస్టు పార్టీ పరిచయంలోకి తీసుకొచ్చాడు' అంటారు నటరాజన్ ఆప్తమిత్రుడు, 'సాహిత్య బాటసారి శారద' గ్రంథకర్త ఆలూరి భుజంగరావు. శారద చిన్నవయసులోనే తమిళ సాహిత్యంతో పాటు అనువాద రచనల్నీ చదివాడని, అలెగ్జాండర్ డ్యూమా నవల ద కౌంట్ ఆఫ్ మాంటి క్రిస్టో అతడికి బాగా నచ్చిన నవలని భుజంగరావు రాశారు.

వాస్తవానికి దగ్గరగా...

శారద కథలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తాయి. కొన్ని కథలు చురుక్కుమనిపించే వ్యంగ్యంతో సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణీ అవుతున్నవారి లోగుట్టును బయటపెడతాయి. తమ్ముడి పోషణ, అతడి చదువు కోసం గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒళ్లమ్ముకున్న అక్కను, పెద్దవాడయ్యాక ఆమె నీతిమంతురాలు కాదని ఆక్షేపించిన తమ్ముడి కుసంస్కారాన్ని 'రక్తస్పర్శ' కథ ఎండగడుతుంది. ధనవంతుడి కాముకత్వం నిరుపేద కుటుంబాన్ని ఎలా బలితీసుకుందో 'మరి రెండు బలులు' కథలో చెబుతారు. నిజాంకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంగా 'గెరిల్లా గోవిందు' కథలో ఒక వీరుడి ధైర్య సాహసాలను శారద స్ఫూర్తిమంతంగా చిత్రించారు. లభించిన శారద కథల్లో చివరిది 'ఇదేం న్యాయం'. స్త్రీ పురుషుల మధ్య అసమానతలను, పురుషాధిపత్య ధోరణులను ప్రశ్నించిన కథ ఇది. 'సంస్కరణ, స్వాతంత్ర్య స్వరూపం, మర్యాదస్తుడు, వింతలోకం' వంటి కథలూ గుర్తుంచుకోదగ్గవే.

'మంచీ చెడూ' నవల రచనాకాలం 1954-55. ఆంధ్ర పత్రికలో సీరియల్‌గా వస్తున్నప్పుడే అది పాఠకులను ఆకట్టుకుంది. పల్లెలనుంచి పట్నాలకు వచ్చిన రైతులు వ్యాపారాలు చేసి ఆర్థికంగా బలపడ్డాక మానవ సంబంధాల్లో కనిపించిన మార్పులను ఆ నవలలో చిత్రించారు. సమాజంలోని వర్గ సంఘర్షణను, వ్యవస్థలోని లోపాలను సామ్యవాద వాస్తవిక దృక్పథంతో చిత్రించిన నవల 'అపస్వరాలు'. మనుషులను దగ్గరగా పరిశీలించి వారి జీవితాలను, తన అనుభవాలను అక్షరీకరించారు. అందువల్ల శారద రచనలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. నటరాజన్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. 1955 ఆగస్టు 17న మూర్ఛ వ్యాధి ఆయన్ను కబళించింది. కష్టజీవి శారద సాహిత్య చిరంజీవి.

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది..!

హాయ్ ఫ్రెండ్స్..! మనలో ఒక్కొక్కరికి ఒక్కో అంశం అంటే ఇష్టం ఉంటుంది కదా! అంటే ఒకరికి పాడటం, ఒకరికి డ్యాన్స్ చేయడం, ఇంకొకరికి క్రికెట్ ఆడటం ఇలా అన్నమాట. అలాగే తనకూ స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టమని చెబుతోంది ఓ నేస్తం. అందులో తన ప్రతిభనూ చాటుకుంటోంది!

బెంగళూరుకు చెందిన ఆర్యాచుగ్‌కి ఎనిమిదేళ్లు. తను మూడో తరగతి చదువుతోంది. అయిదేళ్లు ఉన్నప్పుడే ఈత మీద ఆసక్తి కలిగిందట. అప్పటి నుంచే అందులో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. చాలా తక్కువ సమయంలోనే



హాయ్! బుజ్జీ!!

స్విమ్మింగ్‌లోని మెలకువలు నేర్చేసుకుంది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. చెన్నై, బెంగళూరు, తిరుచ్చి వంటి నగరాల నుంచి వచ్చిన పిల్లలతో పోటీ పడి నాలుగు బంగారు, రెండు వెండి పతకాలు సొంతం చేసుకుంది మన ఆర్యా. అంతేకాదు నేస్తాలూ.. ప్రతి విభాగంలో తన ప్రతిభను కనబరిచి ఛాంపియన్ ట్రోఫీని కూడా గెలుచుకుంది. 'నాకు ఈతలో కొత్త కొత్త స్ట్రోక్స్ ప్రయత్నించడమంటే చాలా ఇష్టం. స్విమ్మింగ్ చేస్తే నాలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఏదైనా సాధించగలననే నమ్మకం కలుగుతుంది. ఇలాగే కష్టపడి భవిష్యత్తులో మరిన్ని పతకాలు అందుకుంటాను' అని చెబుతోంది ఆర్య. మరి మనమూ తనకు ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా! ★

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ముగిసే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

చెత్తబుట్ట	పంచదార	చందమామ
కోడిపెట్ట	నిద్ర	ఉల్లిపాయ
పరీక్ష	రైలు	చెట్టు

బాబు మాట.. బంగారు బాట

స్త్రీ శక్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం




సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై విప్ బొండా ఉమా, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, ఆర్టీసీ బస్టేషన్

మాతృమూర్తుల దీవెనలు.. అమ్మమ్మ, నాన్నమ్మల హర్షాతిరేకాలు.. యువతుల జయజయధ్వానాలు.. విద్యార్థినుల ఆనందాల వెల్లువలు.. దుర్గమ్మ దీవెనలు, కృష్ణమ్మ అనుగ్రహం... ఇలా మహిళాశక్తి ఆనంద కాంతుల నడుమ మగువల ఉచిత బస్సు ప్రయాణం..



బస్సులో మహిళల ఆనందం

"స్త్రీ శక్తి" పథకానికి శుక్రవారం చంద్రన్న శ్రీకారం చుట్టారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ వేదికగా.. స్త్రీశక్తి వేడుక వైభవంగా నిర్వహించారు. మొదటి మహిళా విశ్వవిద్యాలయం పెట్టిన యుగపురుషుడి స్ఫూర్తితో చిరస్మరణీయ అడుగేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు గీటురాయిలా నిలిచే చరిత్రాత్మక పర్వం రచించారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తు గ్యారెంటీ అనే నినాదాన్ని నిలబెట్టుకున్నారు. ఇక మహిళలు... విద్య, వైద్య, ఉద్యోగ, వ్యాపార, వినోద, ఆధ్యాత్మిక అవసరాలకు సగర్వంగా ఉచిత బస్సు ప్రయాణం చేసే సువర్ణ అవకాశమిచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురిసింది.

ఒకరోజులో మగువలకు ప్రయోజనం ఇలా..

నియోజకవర్గం	లబ్ధి
వి. తూర్పు	21,000
వి. మధ్య	20,500
వి. పశ్చిమ	20,350
జగ్గయ్యపేట	11,500
తిరువూరు	9,400
మైలవరం	9,500
నందిగామ	10,200

1.54 లక్షల మందికి లబ్ధి... ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా లబ్ధి చేకూరనుంది. అత్యధికంగా విజయవాడ తూర్పు, మధ్య, పశ్చిమ ఒక్కో నియోజకవర్గంలో 20 వేల మందికి పైగా మహిళలు లబ్ధి పొందుతారు. జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, నందిగామ, మచిలీపట్నం, గుడివాడ ఒక్కో నియోజకవర్గంలో 9-11 వేల మందికిపైగా ఉచిత ప్రయాణం ద్వారా ప్రయోజనం పొందుతారు. పామర్రు, పెడన, పెనమలూరు, అవనిగడ్డ, గన్నవరం పరిధిలో ప్రతిచోటా రోజుకు 5 వేల మందికి పైగా మహిళలకు పథకం భరోసాగా నిలవనుంది.



నందిగామ నుంచి కంచికచర్ల బస్సులో ప్రయాణిస్తూ విజయసంకేతం చూపిస్తున్న విప్ తంగిరాల సౌమ్య



విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఉచిత ప్రయాణానికి సిద్ధమైన బస్సులు..

భారం తప్పింది: శీభా



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు తమలాంటి పేదలు ఛార్జీలకు డబ్బులు పోగుచేసుకుని బస్సులెక్కాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీ అమలు చేయడం వల్ల ఇకపై మాకు ఛార్జీల భారం తప్పింది. చేతిలో కూడా కాస్త డబ్బులు మిగులుతాయి.

చాలా సంతోషంగా ఉంది

- అలివేలు, జగ్గయ్యపేట



ఎక్కడకు వెళ్లాలన్నా ఛార్జీల కోసం చాలా ఖర్చు చేయాల్సి వచ్చేది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు బస్సులో వెళ్లాలంటే కష్టంగా ఉండేది. ఉచిత ప్రయాణం వల్ల మాకు చాలా ఉపశమనం కలిగింది. కంచికచర్ల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాను. చాలా ఆనందంగా ఉంది.

త్రివర్ణ రూపం.. సువర్ణ తేజం!

మిన్నంటిన రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య వేడుక



గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గ్యాలరీల్లో యువత కేరింతలు

ఈనాడు, అమరావతి: మువ్వన్నెలు మెరిసి మురిశాయి. వందేమాతరం, జైహింద్, జై భారత్... నినాదాలు మిన్నంటాయి. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ నిరతికి జయజయ ధ్వానాలు మార్మోగాయి. ప్రతి హృదయం జాతీయ భావోద్వేగంతో ఎగసిపడింది. రాష్ట్ర స్థాయి పంద్రాగస్టుకు వేడుకలకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికైంది. నవ్యాంధ్ర సారథి, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగరేశారు. ఐదేళ్ల వైకాపా విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ప్రగతి పథాన నిలుపుతున్న తీరును ఆవిష్కరించారు. ఏడాది కూటమి పాలనలో మేలిమలుపులను వివరిస్తూ.. మేటి విజయాలను ప్రస్తావించారు. మహిళల ప్రగతికి, పరిశ్రమల పురోగతికి.. యువత వికాసానికి.. కర్షక, కార్మిక, వర్గాల అభ్యున్నతికి ఆవిష్కరిస్తున్న సోపానాలను విశదీకరించారు. ప్రజారాజధాని అమరావతి, ఆంధ్రుల జీవనాడి పోలవరం నిర్మాణం మొదలు రహదారుల భద్రత.. ప్రజారోగ్య రక్షణ.. శాంతి పరిరక్షణ.. తాగునీటి సరఫరా.. ఇలా ప్రజావసరాలకు పెద్దపీట వేసే బాధ్యత కూటమిదేనని ప్రతినబూనారు. సాయుధ దళాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర ప్రత్యేక బృందాల కవాతులు కట్టిపడేశాయి. ప్రతి శాఖ ప్రగతి పంథాను వివరిస్తూ ఆవిష్కరించిన శకట ప్రదర్శన అలరించింది.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ - విజయవాడ క్రీడలు



పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకుగాను పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం జగన్మోహన్‌రావు (అంగలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల)

మహనీయుల త్యాగఫలితమే.. స్వాతంత్ర్యం

జిల్లాను అగ్రపథాన నిలుపుతాం: కలెక్టర్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : దేశంలో ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జి.లక్ష్మీశ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర దార్శనికతకు అనుగుణంగా అడుగులు వేస్తూ.. జిల్లాను అభివృద్ధి, సంక్షేమంలో నంబర్ వన్‌గా నిలిపేందుకు సమష్టిగా అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీని అమలుతో పాటు జిల్లాలో 18.5 శాతం వార్షిక వృద్ధి లక్ష్యాల సాధనకు.. ప్రజా భాగస్వామ్యంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు మిఠాయిలు పంచుతున్న లక్ష్మీశ

శాంతించిన కృష్ణమ్మ!

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ఈనాడు, అమరావతి: ఎగువన కురిసిన వర్షాలకు ఉప్పొంగిన కృష్ణమ్మ శుక్రవారం కొంత మేర శాంతించింది. గురువారం ఉగ్రరూపం దాల్చి రెండో ప్రమాద హెచ్చరికకు చేరువ కావడంతో ప్రజలు కలవరపడ్డారు. సాయంత్రానికి క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి వరద తిరోగమన దిశలోనే సాగింది. బ్యారేజీకి ఉదయం ఆరు గంటలకు వరద (ఇన్‌ఫ్లో) 3,72,741 క్యూసెక్కులు రాగా... రాత్రి 11 గంటలకు దాదాపు లక్ష క్యూసెక్కులు తగ్గి ఇన్‌ఫ్లో 2,71,022 క్యూసెక్కులకు చేరింది. ఔట్‌ఫ్లో సైతం 2,68,000 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో ఏడడుగుల మేర 55 గేట్లు, ఆరడుగుల మేర 15 గేట్లు ఎత్తారు. మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. బ్యారేజీ దగ్గర వరద శాంతించడం.. తెలంగాణ పరిధిలోనూ వర్షాలు తగ్గడంతో ఏరులు, వాగుల వరద తీవ్రత క్రమంగా తగ్గుతోంది.



జి.కొండూరు: ముత్యాలంపాడు వద్ద బుడమేరు వంతెనపై భయం భయంగా రాకపోకలు

సమయం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఉదయం–6	3,72,741	3,70,225
ఉదయం–9	3,18,209	3,15,000
మధ్యాహ్నం–12	3,08,209	3,05,000
మధ్యాహ్నం–3	3,04,209	3,01,000
సాయంత్రం–6	2,94,511	2,91,000
రాత్రి–11 గంటలు	2,71,022	2,68,000

తిరుపతమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో పూజా ద్రవ్యాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ జె. శ్రీనివాసరావు, ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు గోపిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీ రాజశేఖరబాబు చేతుల మీదుగా విశిష్ట సేవా పతకాలు అందుకుంటున్న ఎం.కృష్ణమూర్తినాయుడు (మహోన్నత సేవాపతకం) ★ కె.వెంకట దుర్గామల్లీశ్వరి (ఉత్తమ సేవాపతకం) ★ కె.విలియం (ఉత్తమ సేవా పతకం) ★ సేవా పతకాలు: కె.నాగేశ్వరరావు ★ కె.రామకృష్ణంరాజు ★ ఎస్.శ్రీనివాసరావు ★ వై.మహంకాళీరావు ★ కె.కోటేశ్వరరావు ★ వి.వెంకటేశ్వరరావు ★ జి.దుర్గాప్రసాద్ వర్మరాజు ★ జి.నాగేంద్రసింగ్ ★ జి.సత్యనారాయణ ★ ఎం.సోమయ్య ★ వై.రమేష్ ★ వి.బాలరామమూర్తి ★ ఎం.రాజు ★ ఎం.వీరయ్య

పురస్కార శోభితం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ఉగాది-2025 సందర్భంగా పలు సేవా పతకాలు ప్రకటించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం వీటిని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు చేతుల మీదుగా అందజేశారు. విశ్రాంత ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడికి మహోన్నత సేవా పతకం, విశ్రాంత ఎస్సై కె.వెంకట దుర్గామల్లీశ్వరి, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్సై కె.విలియంకు ఉత్తమ సేవా పతకాలు అందించారు. అలాగే.. పలువురికి సేవా పతకాలు అందుకున్నారు.

స్వాతంత్య్రాన్ని నిలబెట్టుకోవాలి



న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయమూర్తి సత్యానంద్, బాషా, హజరత్తయ్య గుప్తా

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్య్రాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ కోరారు. విజయవాడ న్యాయస్థానాల సముదాయంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల జెండాను న్యాయమూర్తి ఆవిష్కరించి ప్రసంగించారు. బీబీఏ హాలు వద్ద అధ్యక్షుడు ఎ.కె.బాషా జాతీయ జెండాను ఆవిష్కరించారు. బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు వి.రాంప్రసాద్, ఎస్.మల్లేశ్వరరావు, వేములు హజరత్తయ్య గుప్తా పాల్గొన్నారు.

పొడుచుకొచ్చిన ప్రమాదం



రహదారిపై వాహన చోదకులను ప్రమాదం బారికేడ్ రూపంలోనూ పొంచి ఉంది. విజయవాడ పోలీస్‌కంట్రోల్ రూం నుంచి బందరురోడ్, ఏలూరు రోడ్డు వైపు వెళ్లే పాతబస్టాండ్ కూడలిలో రోడ్డుపై ఏర్పాటు చేసిన బ్యారికేడ్ ఇనుపరాడ్డు పైకి పొడుచుకొచ్చి ప్రమాదకరంగా మారింది. **-ఈనాడు, అమరావతి**

సమరయోధుల స్ఫూర్తితో అడుగులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఉదయరాణి తదితరులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలతో భారతదేశంలో ఆనందంగా జీవిస్తున్నామని సీపీ రాజశేఖరబాబు అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. గౌరవ వందనం సమర్పించారు. త్యాగధనుల సేవలను గుర్తు చేసుకున్నారు. వారి స్ఫూర్తితో దేశ, ప్రజా సేవలో ప్రతి ఒక్కరూ అడుగులు ముందుకు వేయాలని కోరారు. డీసీపీలు కె.జి.వి.సరిత, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

18న కలెక్టర్ ఎట్‌హోం!
ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసాపత్రాల అందజేత

ఈనాడు, అమరావతి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఏటా ఇచ్చే అవార్డులు, ప్రశంసాపత్రాల అందజేత కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం రద్దయింది. విజయవాడలోని ఇందిరా గాంధీ మైదానంలో రాష్ట్రస్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణ, అనంతరం మధ్యాహ్నం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి.. స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవం, సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు కార్యక్రమం.. జరిగాయి. మూడింటిలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లు, నిర్వహణలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఇతర అధికారులు తలమునకలై ఉండడంతో.. జిల్లాలో అవార్డుల కార్యక్రమం రద్దయింది. ఆగస్టు 18న.. సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహించి ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందించనున్నారు. జిల్లాలో 300 మంది వరకూ ఉద్యోగులు వీటిని అందుకోనున్నారు.

వదంతులు నమ్మి భయపడొద్దు

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టం శుక్రవారం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. బుధవారం కురిసిన వర్షానికి 3 అడుగుల మేర వరద రెగ్యులేటర్ వద్దకు చేరుకుని గురువారం క్రమంగా తగ్గింది. వర్షం పూర్తిగా ఆగిపోవడంతో మైలవరం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల నుంచి వరద తీవ్రత తగ్గుముఖం పట్టింది. దీంతో రెగ్యులేటర్ నీటి మట్టం సున్నాకు చేరింది. దిగువ ప్రాంతాల వారు వదంతులు నమ్మి భయపడాల్సిన అవసరం లేదని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద పరిస్థితి

దుర్గమ్మకు బంగారు లక్ష్మీహారం బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు వడ్లమూడికి చెందిన వి.శ్రవణ్‌కుమార్ 82 గ్రాముల బరువు ఉన్న బంగారు లక్ష్మీహారాన్ని శుక్రవారం బహూకరించారు. దేవస్థానం అధికారులు దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించగా.. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో రమేష్ వారికి విరాళం రశీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



దాత శ్రవణ్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్

రాజ్యాంగ విలువలు పాటిద్దాం



చిన్నారులతో అదనపు కమిషనర్ నవీన్ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగం, దాని విలువలను గుర్తుంచుకుని.. అందరూ వాటిని పాటిస్తూ ముందుకు నడవాలని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ పేర్కొన్నారు. శుక్రవారం గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా రాజధాని అమరావతి నగర నిర్మాణ ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌కేపీ చిల్డ్రన్ ట్రస్టు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేదలు, అనాథ బాలల సంక్షేమం కోసం పని చేస్తున్న ఈ ట్రస్టుకు ఏపీ సీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి రూ.లక్ష విరాళం అందించారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అదనపు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

నీట మునిగిన ఆశలు



రాయనపాడు వద్ద వరద నీటిలో బుడమేరు వంతెన

బుడమేరు పొంగడంతో విజయవాడ గ్రామీణ మండలం పరిధిలోని గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లిలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రాయనపాడు వద్ద బుడమేరు వంతెన ముంపునకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. ఆయా గ్రామాల పరిధిలో వేలాది ఎకరాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. **- గొల్లపూడి, న్యూస్‌టుడే**



గొల్లపూడి వద్ద పరిస్థితి

వైద్య పరిశోధనలకు పెద్దపీట

వైద్యులు పరిశోధనలకు పెద్దపీట వేయాలని విజయవాడ ఆరోగ్య వర్సిటీ ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. 21 మంది వర్సిటీ ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ధనలక్ష్మి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా జి.ధనలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సహాయ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమెకు.. డిప్యూటీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న సి.హెచ్.ఆశారాణి కార్మికశాఖ జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ధనలక్ష్మికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్మికులు తమ సమస్యలను తెలియజేసేందుకు నేరుగా తనను కలవవచ్చని పేర్కొన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో ప్రతి కార్మికుడు తమ పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.



గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రతిపాదన



జెండాకు వందనం చేస్తున్న ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ కీర్తి చేకూరి తదితరులు

గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా రూ.28 వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి సమర్పించామని ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. గుణదల విద్యుత్ సౌధలో శుక్రవారం ఆమె జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 11 గిగావాట్ల సౌరశక్తి, 7,373 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఏపీ జెన్‌కో చీఫ్ విజిలెన్స్ అధికారిణి వి.ఉష, ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జె.వెంకటేశ్వరరావు, ఎన్.వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. **- కరెన్సీనగర్, న్యూస్‌టుడే**

గోకులాష్టమి వేడుకలకు ముస్తాబు


నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ప్రధానార్చకుడు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని నవనీత కృష్ణునిగా అలంకరించారు. స్వామి వారి దర్శనానికి ఉమ్మడి కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని అధికారులు భావిస్తున్నారు. శనివారం స్వామి వారి మూల విరాట్‌ను సువర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే వేడుక నిర్వహిస్తారు.



నవనీత కృష్ణునిగా అలంకరణ

చూసిన కనులదే భాగ్యం

మండలంలో అంబారుపేట సత్యమ్మతల్లిని 50 వేల గాజులతో శుక్రవారం అలంకరించారు. భక్తుల వితరణతో ఇచ్చిన గాజులను ప్రధానార్చకుడు నందిగామ వెంకట సుబ్బారావు అమ్మవారి మూలమూర్తికి అలంకరణ చేశారు. మహిళలు భారీగా తరలి వచ్చి కుంకుమ పూజలు చేశారు. **- అంబారుపేట (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే**



అంబారుపేటలో గాజుల అలంకరణలో సత్యమ్మతల్లి



నందిగామ శ్రీపురంలో వాసవీ మాతను రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించారు.
- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

క్రీడలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై కేవీ ప్రభావతి, వై.శ్రీకాంత్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గత వారంలో లోక్‌సభలో 'జాతీయ క్రీడల పాలన బిల్లు-2025'పై మాట్లాడే అవకాశం తనకు దక్కడం గర్వకారణంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పటమటలోని సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25వ తేదీ వరకు జరిగే 'యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025' కబడ్డీ లీగ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రధాని ఖేలో ఇండియా ద్వారా యువ క్రీడాకారులను వెలికితీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో స్టేడియాలను అభివృద్ధి చేసి 2029 నాటికి జాతీయ క్రీడలు నిర్వహిస్తామని చెప్పారు. ఆంధ్రా కబడ్డీ సంఘం అధ్యక్షురాలు కేవీ ప్రభావతి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం


తెదేపా జెండా ఊపి బస్సులు ప్రారంభిస్తున్న నాయకులు,పక్కన ప్రజలు

విజయవాడకు తరలిన ప్రజలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : విజయవాడలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రారంభించిన స్త్రీశక్తి పథకం కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం లోని పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వెళ్లారు. తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పీక్లానా యక్, జి.రామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎ.రమేష్ రెడ్డి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని తెదేపా జెండాలు ఊపి బస్సులు ప్రారంభించారు.

పిరమిడ్ సొసైటీ మహాకరుణ ర్యాలీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ విస్సన్నపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానికంగా మహాకరుణ అహింసా- శాకాహార ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేపట్టి బస్టాండు సెంటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో గంధం సత్య శ్రీ హనుమంతురావు, జగ్గవరపు రంగారెడ్డి, బాలిన వెంకట రమణ, ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? రాఘవాపురం గ్రామంలో ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రెయిన్లలో గడ్డి పెరిగి, పూడిక పేరుకుంది. దీంతో మురుగు ప్రవాహానికి అడ్డుగా ఉంది. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి, రెడ్డిగూడెం** – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

నిత్యాన్నదాన పథకానికి విరాళం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తిరుమలగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగంచిప్రోలుకు చెందిన మురుకుట్ల గోపీ ప్రీతి దంపతులు శుక్రవారం రూ. 10 వేలు విరాళంగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కాలు తడబడితే కన్నీరే..

రూ.లక్షల వ్యయంతో దుకాణాలు నిర్మించారు కానీ వాటిని చేరుకోవడానికి సరైన మార్గాన్ని అభివృద్ధి చేయడం మరిచారు. ఫలితంగా స్థానిక రైతు బజారులో వినియోగదారులు కొన్ని నెలలుగా రాళ్లపై నడుస్తు అవస్థలు పడుతున్నారు. ఇందులో ఏడాది కిందట నిర్మించిన నూతన దుకాణాలను ప్రస్తుతం అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలో వాటికి చేరుకోవాలంటే ప్రజలు బురదలోనైనా నడవాలి, లేదంటే జారిపడేలా ఉన్న రాళ్లపైనా వెళ్లాలి. అసలే వర్షాలతో తడిచిన రాళ్లపై నడవడం ప్రమాదాలను కొనితెస్తోందని, కనీసం గ్రావెల్‌తో నింపాలన్న ఆలోచనా చేయడం లేదని వినియోగదారులు, దుకాణాల నిర్వాహకులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**



స్త్రీ శక్తి పథకం.. ప్రయాణం ఉచితం

గంపలగూడెం, కొండపల్లి, మైలవరం, న్యూస్‌టుడే

పెరిగిన ఖర్చులు, పిల్లల చదువులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తు స్త్రీశక్తి పథకం పేరిట శుక్రవారం ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసింది. ఇది తమకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మహిళలు హర్షంవ్యక్తంచేస్తున్నారు.

ఎన్నికల హామీ నెరవేరింది



సీఎం చంద్రబాబు స్త్రీశక్తి పథకం ప్రారంభించి మగువలకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రతి మహిళ ముఖ్యమంత్రి, ఎన్డీయే ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. **- నాళ్లా లక్ష్మి, తిరువూరు**

మహిళలకు మేలు



మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్- 6 పథకాలు అమలుకు ప్రస్తుతం కృషి చేస్తున్నారు. స్త్రీశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటారు. **- రేగళ్ల సుజాత, కంభంపాడు**

మాట నిలబెట్టుకున్నారు



ఉచిత ప్రయాణం మహిళలకు ఉపయుక్తంగా ఉంటుంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్డీయే పాలన ప్రారంభమయ్యాక సూపర్- 6 పథకాలను ఒక్కొటిగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. **- కట్కూరి నాగేంద్ర, కొణిజెర్ల**

చేయూత ఇచ్చారు



మహిళాభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉన్నట్లు మేము చూస్తున్నాం. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి చేయూత ఇచ్చారు. ఈ పథకాన్ని విజయవంతంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. **- యండ్లూరి హరిత, కొండపల్లి**

నగదు ఆదా



ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నగదు ఆదా అవుతాయి. వాటితో ఇంట్లో కూరగాయలు, సరకుల కొనుగోలు చేసుకోవచ్చు. చంద్రబాబు మహిళల మేలు కోసం ప్రవేశ పెట్టిన పథకం మంచిది. **- లక్ష్మి, మైలవరం**

ఎటువంటి ఇబ్బందులు ఉండవు



చాలా వరకు బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించడంతో విజయవాడ వెళ్లేందుకు ఇక ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రయాణ ఖర్చులు తగ్గితే మాలాంటి పేదలకు భరోసాగా ఉంటుంది. **- పి.మాణిక్యం, మైలవరం**

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మహిళలకు ఆసరాగా ఉండాలన్న ఆలోచనతో పథకం ప్రవేశ పెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. చిరుద్యోగం చేసుకునే మాలాంటి వారికి రవాణా ఖర్చులు చాలా వరకు కలిసి వస్తాయి. దూర ప్రయాణాలు చేయాలన్న కోరిక తీరుతుంది. **- పి.నాగమ్మ, మైలవరం**

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నాం

మైలవరం: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఆయన ప్రారంభించారు. అదే బస్సులో వారితో కలిసి ఇబ్రహీంపట్నానికి బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ విభజిత రాష్ట్రంలో అప్పులను జగన్ రూ.12 లక్షల కోట్లకు తీసుకెళ్లారని, అయినా ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా ఒక్కో పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణంతో నెలకు రూ.2 వేల వరకు ఖర్చులు ఆదా అవుతాయన్నారు. కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


మైలవరం : మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న మైలవరం శాసన సభ్యుడు కృష్ణప్రసాద్

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు ఆర్టీసీ బస్టాండ్‌లో స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు. తానే స్వయంగా కండక్టర్‌గా మారి మహిళలకు టికెట్లు అందించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు సూచించారు. ఆర్డీవో కె.మాధురి, మున్సిపల్ కమిషనర్ మనోజ, ఇతర అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలిలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం డిపో బస్సుకు పూజలు నిర్వహించి ప్రయాణికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. జెండా ఊపి మహిళలను ఉచితంగా తీసుకెళ్తున్న బస్సును ప్రారంభించారు. నాయకులు బి.మధుసూదనరావు, వి.రాజశేఖర్, పి.కొండలరావు, పి.మాధవరావు, వి.చిన అనంతరామయ్య పాల్గొన్నారు.

సప్లయ్ ఛానల్‌కు మరమ్మతులు


పూడిక తీయిస్తున్న పవన్, సీతారామరాజు

జి.కొండూరు: పులివాగుకు వరద వచ్చినా స్థానిక పంట చెరువుకు నీరు చేరడం లేదని రైతులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులు, చెరువు ప్రెసిడెంట్, సభ్యులను ఆదేశించగా ప్రస్తుతం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ క్రమంలో మోటారుగడ్డ సమీపంలోని పులివాగు సప్లయ్ ఛానల్ షట్టర్లు పైకి లేపడం, కాలువ పూడిక తీయడంతో జి.కొండూరు, ఆత్కూరు చెరువులకు నీటి సరఫరా జరుగుతోంది.

ప్రశంస పత్రాలు అందుకున్న రేషన్ డీలర్లు

రెడ్డిగూడెం: తిరువూరులోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రెడ్డిగూడెం మండలం రాఘవాపురానికి చెందిన రేషన్ దుకాణాల డీలర్లు కె.చెన్నకేశవ రెడ్డి, కె.కుమారిలు ఆర్డీవో చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు రెడ్డిగూడెం తహసీల్దార్ జె.సుశీలదేవి, కార్యాలయం సిబ్బంది వీరిని అభినందించారు.

పదవీ బాధ్యతల స్వీకరణ


ఛైర్‌పర్సన్ వెంకట శివ పక్కన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ లక్ష్యం మేరకు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీలు రైతులకు సేవలందించాలని మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సూచించారు. కొటికలపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు యేదులూరి వెంకట శివ, సభ్యులు పగడాల శ్రీనివాసరావు, షేక్ మీరావలిలను సత్కరించారు. అనంతరం గ్రామంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాల్గొని జెండా ఆవిష్కరించారు. తెదేపా నాయకులు సీతారామయ్య, రాజశేఖర్‌లతో పాటు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన అన్నదాతలను ఆదుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : అధిక వర్షాలతో పంట నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యల్లమందరావులు జిల్లా నాయకులతో కలిసి శుక్రవారం మండల పరిధిలోని గుంటుపల్లి, మూలపాడు, త్రిలోచనపురం గ్రామాల్లో పర్యటించి బాధిత రైతాంగాన్ని పరామర్శించి మాట్లాడారు. పంట నష్టం అంచనాలు వేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. గుంటుపల్లిలో 80, మూలపాడులో 100, ఈలప్రోలులో 300 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందని చెప్పారు. దీంతో పాటు కూరగాయల తోటలు, వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయని వాపోయారు.

వైభవంగా శ్రావణ పూజలు


తిరువూరులో రాజ్యలక్ష్మీదేవి


ఊటుకూరులో గోదాదేవి

గంపలగూడెం, న్యూస్‌టుడే : శ్రావణ శుక్రవారం సందర్భంగా తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని పలు ఆలయాల్లో భక్తులు రాజ్యలక్ష్మి, గోదాదేవి, గజలక్ష్మి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవార్ల ప్రతిమలకు అభిషేకాలు చేపట్టి నూతన వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వత్రాలు నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ, కాచవరం రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఇబ్రహీంపట్నం : ఎన్టీటీపీఎస్ ఆలయంలో పూజ చేస్తున్న మహిళ భక్తులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


రెడ్డిగూడెం : జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు


గొల్లపూడిలో మాజీ మంత్రి దేవినేని తదితరులు


తిరువూరులో కార్మికులకు వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


మైలవరం కోర్టు ఆవరణలో..


విసన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద..

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యాయస్థానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**


విస్సన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో..


కొండపల్లి పురపాలిక వద్ద..


ఎన్టీటీపీఎస్‌లో..


రెడ్డిగూడెంలో..


జి.కొండూరులో..


మొర్సుమిల్లి హైస్కూల్లో బహుమతి ప్రదానం


గంపలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద..


గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో..


తిరువూరు పంచాయతీ కార్యాలయంలో..

వీడని ముంపుతో అవస్థలు


కట్టువాగు చప్టాపై కొంతమేర తగ్గిన వరద ఉద్ధృతి


సూరాయిపాలెం వద్ద మునిగిన పొలం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని వాగులు, వంకల్లో వరద ఉద్ధృతి శుక్రవారానికి తగ్గింది. దీంతో ఓబులాపురం నాగసానిపాటి చెరువు కట్టువాగు చప్టా వద్ద రాకపోకలు ప్రారంభమయ్యాయి. వర్షం కురిస్తే మళ్లీ వరద పెరిగే ప్రమాదం ఉంది. పంట పొలాలు ఇంకా బయటకు కనిపించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కట్లేరు వంతెన వద్ద కంప వేసిన పోలీసులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని కట్లేరు, ఉప్పలవాగు, విప్లవాగు, గుర్రపువాగు ఇంకా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మండలాల్లోని గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. వాగుల వద్ద పోలీసులు కాపలా ఉన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవాహం తగ్గిపోవడంతో పాత వంతెన పై నుంచి తేలికపాటి వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. పులివాగు ఉద్ధృతికి లోలెవల్ చప్టాకు ఒక పక్కన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.


తిరువూరు మండలం అక్కపాలెం వెళ్లే రహదారిపై ఇలా.


బుడమేరు వరదకు కోతకు గురైన లోలెవల్ వంతెన అప్రోచ్ రోడ్డు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఈ ఏడాది జరిగిన పది పరీక్షల్లో మండలంలోని సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఎం.శివగోపాలకృష్ణ, జె.వి.సురేంద్రవర్మకు గ్రామ మాజీ సర్పంచి కామసాని హనిమిరెడ్డి, ఆయన కుమారులు సత్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి రూ.50 వేలు, రూ.30వేలు చొప్పున శుక్రవారం ప్రోత్సాహక నగదు అందజేశారని హెచ్‌ఎం సీహెచ్.సతీష్ తెలిపారు. కామసాని అనంతమ్మ ట్రస్ట్, అవులూరి పాపిరెడ్డి, నారాయణరెడ్డి జ్ఞాపక బంగారు, వెండి పతకాలను కూడా విద్యార్థులకు ఇచ్చారు.

● తిరువూరు మండలం కోకిలంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించిన ఐదు

పదిలో ప్రతిభావంతులకు నగదు బహుమతులు


సత్యాలపాడులో విద్యార్థులకు నమూనా చెక్కు ఇస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

గురు విద్యార్థులకు తెదేపా గ్రామ అధ్యక్షుడు గోసు సత్యనారాయణ(చిన్ని) ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు. ఎర్రమాడు ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతుల్లో ప్రతిభ చూపిన డి.గ్రీష్మ, ఆర్.లాస్య, ఆర్.శ్రీలక్ష్మికి పూర్వ విద్యార్థులు దొడ్డా శ్రీకాంత్, శ్రీనులు రూ.5 వేల నగదు అందించారని హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

పింగళి వెంకయ్య స్మారక భవనం నిర్మిస్తాం

చిట్టినగర్, న్యస్‌టుడే: మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య నడయాడిన భీమనవారిపేట ప్రాంతంలో స్మారక భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో పాల ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి మాధవ్ పూలమాలవేసి నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మన జెండాకు ప్రత్యేక స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి పింగళి అని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులు ఇప్పటికీ పేదరికంలోనే ఉన్నారని, ఆయన జీవితం ఎందరికో ప్రేరణ ఇస్తుందన్నారు.

త్వరలో వైద్యశాల కొత్త భవనానికి శంకుస్థాపన

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక దేవినేని వెంకటరమణ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రసూతి వార్డులో రోగులు, బాలింతలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ల్యాబ్ పనులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ వైద్యశాలకు త్వరలో నూతన భవనాన్ని అన్ని వసతులతో కార్పొరేట్ తరహాలో నిర్మించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో గందరగోళం

విస్సన్నపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గందరగోళం నెలకొంది. సిబ్బంది నిర్లక్ష్యంతో జాతీయ జెండాను తికమకగా తాడుకు కట్టి ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షితో ఎగుర వేయించారు. వెంటనే గమనించి దాన్ని కిందకు దించి సరిచేసి తిరిగి ఎగుర వేశారు.

రోడ్డు ప్రమాదంలో వాహనదారుడికి గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే : అధ్వాన రోడ్డుకు ప్రతిరూపమైన మైలవరం- నూజివీడు మార్గం వెల్వడంలోని గోతుల ఖాతాలోకి మరో ప్రమాదం చేరింది. శుక్రవారం మైలవరం నుంచి నూజివీడు వెళ్తున్న ఒక ద్విచక్ర వాహనదారుడు, వెల్వడం వాటర్ ట్యాంకు వద్దకు వెళ్లాక బైకు జారింది. దాంతో రహదారిపై పడిన అతని తలకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. అక్కడి ప్రజలు వచ్చి సపర్యలు చేసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు స్థానిక కళాశాల ల్యాబ్‌లో పని చేస్తున్న ఏడీ మల్లికార్జునరావుగా గుర్తించారు. ప్రస్తుతం మైలవరంలోనే అతను చికిత్స పొందుతున్నాడు. రహదారి అభివృద్ధి చేయక పోవడంతో ఇప్పటికే పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారని, పది మంది వరకు మరణించారంటూ మూడ్రోజుల కిందట సాక్షాత్తు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటం గమనార్హం.


మల్లికార్జునరావుకు సపర్యలు చేస్తున్న స్థానికులు

చోరీకి విఫలయత్నం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్వీఎస్ నగర్‌లోని వసంతరెడ్డి గృహంలో ఒక యువకుడు చోరీకి విఫలయత్నం చేసి, కెమెరాలను తొలగించి పరారయ్యాడు. బాధితుల వివరాల మేరకు. .గురువారం రాత్రి 11.20 గంటల సమయంలో ఇంటి ఆవరణలో పెద్ద శబ్దం రావడంతో, సీసీ కెమెరాల్లో పరిశీలించే ప్రయత్నం చేయగా నాలుగు పని చేయలేదు. ఒక దానిలో యువకుడు ఇంటి చుట్టూ సంచరించి వెళ్లడాన్ని గుర్తించారు. బయటకు వచ్చి చూడగా ఆవరణలో ఉన్న కారు అద్దాన్ని పగలగొట్టడం, నాలుగు కెమెరాలను తొలగించి అక్కడే వదిలేసి వెళ్లడాన్ని గమనించారు. దీనిపై శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కె.సుధాకర్ తమ సిబ్బందిని పంపి చుట్టు పక్కల కెమెరాలను పరిశీలించారు. నిందితుడి చిత్రాల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కందులపాడు గ్రామ శివారు చేగిరెడ్డిపాడులోని ఓ మామిడితోటలో శుక్రవారం కొందరు వ్యక్తులు జూదమాడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ తన సిబ్బందితో దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు పక్కన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

అభివృద్ధిలో మేటి.. సంక్షేమంలో సరిసాటి

● కూటమి ప్రభుత్వానిది ఆల్‌టైం రికార్డు

● ఏడాది పాలనలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం ● స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీఎం

ఈనాడు, అమరావతి: 'కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు. అభివృద్ధికి అడ్డులేదు. సుపరిపాలనకు పోటీ లేదు. ఇది రికార్డు. ఇదే ఆల్ టైం రికార్డు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, ఏపీ బ్రాండ్‌ను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. తవ్వేకొద్దీ వాళ్లు చేసిన అప్పులు, అక్రమాలు బయటపడుతున్నాయన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం ప్రసంగించారు.

బీసీ రిజర్వేషన్‌ను తిరిగి 34 శాతానికి పెంచడానికి కృషి

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచడానికి కృషి చేస్తున్నాం.
- ఎస్సీల సంక్షేమానికి గత బడ్జెట్‌లో రూ. 20,281 కోట్లు కేటాయించాం. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చాం.
- ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్తగా ఐదు మల్టీస్పెషాలిటీ హాస్పిటళ్లు నిర్మిస్తున్నాం. రూ.వెయ్యి కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టాం.
- నిర్మాణం పూర్తయిన మూడు లక్షల ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తాం.

వచ్చే ఏడాదికి వంశధార, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తి

- ❖ పోలవరం ప్రాజెక్టు పనుల్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. దీనికి కేంద్రం రూ. 12,157 కోట్ల నిధులిచ్చింది.
- ❖ హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు పనులను వంద రోజుల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించాం. వచ్చే ఏడాది జూన్ నాటికి వంశధార, జులై కల్లా వెలిగొండ పనులు పూర్తి చేస్తాం.
- ❖ 17,600 రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. వైకాపా ప్రభుత్వం సృష్టించిన భూ వివాదాలు పరిష్కరించాం. 2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం.
- ❖ గ్రామీణ ప్రాంతాల్లో 4 వేల కి.మీ సీసీ రోడ్లు, 250 కి.మీ. బీటీ రోడ్లు నిర్మించాం. పైలట్ ప్రాజెక్ట్ కింద 500 'మ్యాజిక్ డ్రైన్స్' నిర్మాణం చేపడతాం.
- ❖ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన 74,834 మందికి ఉద్యోగాలొచ్చాయి.
- ❖ 175 నియోజకవర్గాల్లోనూ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టాం.
- ❖ త్వరలోనే యోగాధ్యయన పరిషత్ ఏర్పాటు చేస్తాం.

50 కి.మీ.కి ఒక పోర్టు, హార్బర్

- అమరావతిలో 74 మౌలిక వసతుల ప్రాజెక్టులు, రహదారి నిర్మాణ పనులు చేస్తున్నాం. 2028కల్లా రాజధాని పనులు పూర్తవుతాయి.
- త్వరలో 'లాజిస్టిక్స్ కార్పొరేషన్' తీసుకువస్తాం. ప్రతి 50 కి.మీ.కి ఒక పోర్టు, హార్బర్, కొత్తగా 6 ఎయిర్ పోర్టులు నిర్మిస్తున్నాం.
- పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి రంగంలో 7.5 లక్షలు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఆమోదం తెలిపిన 113 ప్రాజెక్టుల ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలొస్తాయి.

1.5 కోట్ల టన్నుల ఇసుక ఉచితంగా

- ✦ 1.5 కోట్ల టన్నుల ఇసుక ఉచితంగా అందించి, భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాం. రైల్వేజోన్ సాధించాం.
- ✦ 6 వేలకు పైగా ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున అందిస్తున్నాం.
- ✦ పీ4తో 10.38 లక్షల బంగారు కుటుంబాల్ని గుర్తించాం. వారికి మార్గదర్శులుగా సాయం చేసేందుకు 1.15 లక్షల మంది ముందుకొచ్చారు.
- ✦ మనది 'డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ'. మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలవనుంది.

వరద భరించాలి.. కానీ ఆ నీటితో బాగుపడకూడదా?

వైకాపా ప్రభుత్వ అరాచకంతో విసిగిపోయిన ప్రజలు కూటమికి చరిత్రాత్మక విజయం కట్టబెట్టారు. ప్రజల మద్దతు, మా సంకల్పం, దేవుడి దయతో విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తున్నాం. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాల్ని పోలవరం నుంచి బనకచర్ల మళ్లించనున్నాం. దీని వల్ల ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకూ నష్టం వాటిల్లదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే దిగువ రాష్ట్రంగా ఆ కష్టనష్టాలు భరిస్తున్నాం. వరద భరించాలి కానీ, ఆ నీటితో ప్రయోజనం పొందకూడదంటే ఎలా?

సూపర్ సిక్స్.. సూపర్ హిట్

- ■ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్టయ్యాయి.
- ■ అన్నదాతా సుఖీభవ ద్వారా 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటి వద్దే ఇస్తున్నాం.
- ■ ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో 'తల్లికి వందనం' నిధులు జమ చేశాం.
- ■ దీపం-2 పథకం కింద 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం.
- ■ ఈ నెలాఖరుకు మెగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేస్తాం.



విజయవాడ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో నారా భువనేశ్వరి, విశ్రాంత అధికారులు కార్తికేయ మిశ్ర, రవిచంద్ర, ముకేశ్ కుమార్ మీనా, హిమాన్షు శుక్లా, రాజమౌళి, ప్రద్యుమ్న

సుస్థిర పాలనతోనే ప్రగతి

స్వాతంత్ర్య దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, కాకినాడ: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా, పెట్టుబడులు రావాలన్నా సుస్థిర పాలన అవసరం. అందుకే మరో దశాబ్దంపాటు కూటమి ప్రభుత్వం కొనసాగాలని కోరుకుంటున్నాం. తప్పు పనుల్లో కూర్చొని ఆస్వాదించాలనే కాంక్ష మాలో ఎవరికీ లేదు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కాకినాడలోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు సతీమణి అనా కొణిదెలతో కలిసి ఆయన హాజరయ్యారు. తొలుత జాతీయ పతాకావిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ.. బ్రిటిష్ వారు నేర్పిన విభజించు పాలించు సూత్రంతో గత పాలకులు రాష్ట్రాన్ని కులంద హస్తాల్లో పెట్టుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కలిసి ఉందాం.. కలిసి పాలిద్దాం లక్ష్యంతో ముందుకెళుతోందని చెప్పారు.

కీలక అభివృద్ధి పనులు చేపట్టాం..: ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో సాగుతున్నాయని పవన్ అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేస్తున్నామన్నారు. పల్లెపండగ ద్వారా 4 వేల కి.మీ. సీసీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, లక్ష నీటికుంటలు, 15 వేల నీటి తొట్టెలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేశామని చెప్పారు.

నాడు విమర్శించడానికే భయపడేవారు..!: గత ప్రభుత్వంలో రోడ్డుపైకి రావడానికి, విమర్శ చేయడానికి భయపడిపోయేవారు.. ఈ రోజు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఎవరూ ఇబ్బందిపడటం లేదని, ఇది ప్రజాస్వామ్యమని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. బాధ్యతగా మాట్లాడితే స్వీకరిస్తామన్నారు. కాకినాడ పోర్టు నుంచి డీజిల్, బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నాయని తేలిగ్గా తీసుకుంటే తర్వాత బయట నుంచి ఆయుధాలు వచ్చే ప్రమాదం లేకపోలేదన్నారు. పోర్టు భద్రతపై తానే ముందుగా మాట్లాడానని స్పష్టం చేశారు.

జనసేన ప్రధాన కార్యాలయంలో..: గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర వైద్య సేవా మౌలిక సౌకర్యాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలోని పోలీసు మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్

వారు గెలిచినప్పుడు ఓటు చోరీలు కనిపించవా?

'ఈరోజు వారు ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారు. వాళ్లు గెలిచినప్పుడు ఓటు చోరీలు కనిపించవా? 2019లో వైకాపా విజయం సాధించినప్పుడు మేం ఎక్కడా ఆ మాట అనలేదు. 2024లో కూటమికి 164 సీట్లు వస్తే ఓటింగ్ యంత్రాల్లో తప్పు అంటున్నారు. జాతీయ స్థాయి నుంచి రాష్ట్రం వరకు ప్రతిపక్షాలు ఒకేలా మాట్లాడుతున్నాయి. అంతర్గత అస్థిరతను సృష్టించడం మన దేశ అభివృద్ధిని గిట్టనివారి విధానం. విదేశీ శక్తుల ఎజెండాను ఇక్కడి వాళ్లు మోస్తున్నారు. ప్రజలు దీన్ని సునిశితంగా గమనించాలి' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

శకట శోభితం

రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవాలు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. స్టేడియం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరిలకు సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు.. పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. వివిధ శాఖల శకటాల ప్రదర్శనను చూశాక.. ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి చేతులమీదుగా పతకాలు అందజేశారు.

● రాష్ట్ర అభివృద్ధి- సంక్షేమరంగాల ప్రగతిని వివరిస్తూ అలంకరించిన 21 శాఖల శకటాలను వేడుకల్లో ప్రదర్శించారు. ఇందులో 'నా పట్టు- నా అభిమానం' నినాదంతో సాగిన పట్టుపరిశ్రమ శాఖ శకటం మొదటి బహుమతి దక్కించుకుంది. 'మహిళల రక్షణ, భద్రత, సాధికారత మా ప్రభుత్వ ధ్యేయం' నినాదంతో కదిలిన మహిళాభివృద్ధి- శిశుసంక్షేమ శాఖ శకటానికి ద్వితీయ బహుమతి.. 'ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త' నినాదంతో సాగిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) శకటానికి తృతీయ బహుమతి దక్కాయి.

– ఈనాడు, అమరావతి



మొదటి బహుమతి పొందిన పట్టు పరిశ్రమ శకటం



రెండో బహుమతి పొందిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శకటం



మూడో బహుమతి పొందిన మెప్మా శకటం





హైకోర్టు ఆవరణలో జాతీయ జెండా వందనం చేస్తున్న సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

★ స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు

హక్కులపై ప్రజల్లో అవగాహన పెరిగింది

స్వాతంత్ర్య వేడుకల్లో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వ కార్యక్రమాలు, హక్కులపై ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో న్యాయ వ్యవస్థపై ఆధారపడే వారి సంఖ్య ఎక్కువైంది. అందరికీ సత్వర న్యాయం అందించాల్సిన అవసరం ఉంది' అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను శుక్రవారం హైకోర్టు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. దేశాభివృద్ధికి అందరూ పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకానాథరెడ్డి, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ శ్యాంప్రసాద్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ, జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్, రిజిస్ట్రార్లు, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పీపీ మెండ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు, జీపీలు, కోర్టు సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

■ సచివాలయం సమీపంలోని ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ జాతీయ జెండాను ఎగురవేశారు.

దేశానికి పవర్‌ఫుల్ మిస్సైల్ మోదీ: మంత్రి లోకేశ్



గుంటూరులో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి నారా లోకేశ్, పక్కన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'పెహల్గాం ఉగ్రదాడిలో అమాయకులను చంపితే మనం కన్నీరు పెట్టుకుని ఇతర దేశాల సాయం కోరి వెళ్లలేదు. మనకున్న పవర్‌ఫుల్ మిస్సైల్ ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కి సరైన శిక్ష వేశారు' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఎగురవేశారు. అనంతరం సభలో ప్రసంగిస్తూ.. స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు నేలకు ప్రత్యేక చరిత్ర ఉందని, నాటి పోరాట ఘట్టాలను గుర్తుచేస్తూ మంగళగిరిలో మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో చీకటి రోజులు చూశామని లోకేశ్ గుర్తుచేశారు. ఎన్డీయేను ప్రజలు గెలిపించడంతో రాష్ట్రంలో చీకటి నుంచి వెలుగు వైపు అడుగులు పడ్డాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతతోనే దేశానికి స్వాతంత్ర్యం



విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విజయవాడ (మొగల్రాజపురం, భవానీపురం) న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది ముస్లింలు బ్రిటిష్ వారితో పోరాడి ప్రాణత్యాగాలు చేశారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయం వద్ద అధ్యక్షుడు ఫారూక్‌షిబ్లీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. ఒకరి ఆచార వ్యవహారాలను మరొకరు గౌరవించుకునే సంప్రదాయం మనదని అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ మాట్లాడుతూ.. ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల గురించి దేశానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫారూక్‌షిబ్లీ మాట్లాడుతూ మన దేశ ప్రగతికి భిన్నత్వంలో ఏకత్వం మూల మంత్రమన్నారు. ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలతో కూడిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాజపా మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజి, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

● విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పీవీఎన్ మాధవ్ పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు.

24 మంది పోలీసులకు పతకాల ప్రదానం





పోలీసు అధికారులు మహేష్ చంద్ర లడ్హా, ఎం.రవిప్రకాశ్‌లకు పతకాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పురస్కారాలకు ఎంపికైన 24 మంది పోలీసు అధికారులు, సిబ్బందికీ సీఎం చంద్రబాబు శుక్రవారం పతకాలు ప్రదానం చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వీటిని అందజేశారు.

■ 2024లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన రాష్ట్రపతి పురస్కారాలను అదనపు డీజీపీ మహేశ్‌చంద్ర లడ్హా, పీఅండ్ఎల్ ఐజీపీ ఎం.రవి ప్రకాశ్, రాజమహేంద్రవరం ఎస్పీఎఫ్ డీఎస్పీ డి.డి.గంగరాజులకు అందజేశారు.

■ 2023లో కేంద్రం ప్రకటించిన అసాధారణ్ ఆసూచన కుశలతా పతక్ అవార్డులను డీఎస్పీ ఉజ్జి శ్రీనివాసరావు, ఈగల్ ఆర్ఐ ధనుంజయనాయుడు, ఎస్ఐబీ ఏఆర్ ఎస్సై దాసరి గిరిధర్‌లకు అందించారు.

■ 2024లో పోలీస్ మెడల్ ఫర్ మెమోరియస్ సర్వీస్ కింద ఎంపికైన విశ్రాంత కమాండెంట్ కాటనాని వెంకట్, ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్ ఆర్ఎస్సై ఆవుల చెన్నయ్య, తిరుపతి ఏఆర్ విశ్రాంత ఏఎస్సై ఆర్.రమణారెడ్డి, ఒంగోలు పీటీసీ విశ్రాంత సీఐ అద్దంకి వెంకటేశ్వర్లు, కడప సీసీఎస్ ఏఎస్సై బి.ప్రకాశ్‌రావు, ఎస్పీఎఫ్ ఎస్సై కరి మస్తాన్‌రావు, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వెంకట సత్య అనంత దుర్గా ప్రసాదరావు, నెల్లూరు ఆర్వీఅండ్ఈవో ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరిరావు, డీఎస్పీ ఈద కోటిరెడ్డిలు పురస్కారాలు అందుకున్నారు.

■ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజు ప్రకటించిన పోలీస్ శౌర్య పతకాలను ఎస్.గోవిందరావు, వై.రమేశ్, టి.రాజేశ్, కె.మహేశ్, ఎన్.చంద్రశేఖర్, ఎం.మోహన్‌కుమార్, ఎ.వెంకటేశ్, ఎన్.తులసీరాజ్, షేక్ ఖాజాలు అందుకున్నారు.



అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు



అసెంబ్లీ భవన ప్రాంగణంలో జెండా వందనం చేస్తున్న మండలి అధ్యక్షుడు మోషేన్ రాజు



మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ అశోక్ తదితరులు



తాడేపల్లిలోని వైకాపా కార్యాలయంలోని స్వాతంత్ర్య వేడుకల్లో సజ్జల, ఆ పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, నాయకులు



విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

వసుంధర

vasundhara@eenadu.in



సవిత, సులోచన, గోదావరి

దిల్లీలో మన లఖ్‌పతి దీదీలు!

స్వయం సహాయక బృంద సభ్యులుగా... స్థిరమైన ఉపాధి పొందుతూ, తమ జీవన ప్రమాణాల్ని మెరుగుపరచుకోవడం ద్వారా స్ఫూర్తిగా నిలిచిన మహిళ(లఖ్‌పతి దీదీ)లను దిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించింది కేంద్ర ప్రభుత్వం. కామారెడ్డి జిల్లాకు చెందిన ఈ ముగ్గురూ ఆ జాబితాలో ఉన్నారు. వీళ్ల ప్రత్యేకత ఏంటంటే...

రూ.40కోట్ల రుణాలు!
– గడ్డం సులోచన

మాది లింగంపేట మండలం మెంగారం గ్రామం. ఓ సొసైటీ సంఘంలో 25 ఏళ్ల క్రితం సభ్యత్వం తీసుకున్నాను. చిన్న మొత్తాలతో పొదుపు ప్రారంభించా. స్త్రీనిధి ద్వారా రుణం తీసుకుని వ్యవసాయం అభివృద్ధి చేసుకోవడంతోపాటు పిల్లలను బాగా చదివించాను. వాళ్లు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. నేను సంఘానికి నాయకురాలిగా పనిచేస్తూ పొదుపు విలువను అందరికీ వివరించా. రుణాలను సకాలంలో చెల్లించేలా అవగాహన కల్పించా. గ్రామ, మండల సమాఖ్యల అధ్యక్షురాలిగా పనిచేశాను. మండలంలో 22 కేంద్రాలద్వారా 1.30 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడంతో రూ.41 లక్షల కమీషన్ వచ్చింది. ఈ ఏడాది మండలంలో 756 సంఘాలకు 38.99 కోట్ల రుణాలు ఇప్పించాం. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరవడం చాలా ఆనందంగా ఉంది.

నాయకత్వ లక్షణాలతో ముందుకు
– గరిగే గోదావరి

మాది కామారెడ్డి మండలం శాబ్దిపూర్. 1999లో సంఘ సభ్యురాలిగా చేరాను. మొదట్లో చిన్నమొత్తానికీ కష్టమైనా జాగ్రత్తగా పొదుపు చేసుకుంటూ వచ్చా. ఆ తర్వాత బ్యాంకు లింకేజీ నుంచి రుణాలు తీసుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నాను. వచ్చిన లాభాలతో మూడెకరాల భూమి కొనుగోలు చేశాం. పిల్లల్ని చదివించుకుంటున్నాం. 'అమ్మ ఆదర్శ పాఠశాల' ఛైర్మన్‌గా పనిచేసి మౌలిక సదుపాయాలు కల్పించాను. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టించడానికి గ్రామంలో మహిళా కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేయించా. వరి కొనుగోలు కేంద్రాలనూ ఏర్పాటు చేయించా. ఈ ఏడాది ఆరు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయించాను. ఒకప్పటితో పోల్చితే మేమంతా మెరుగైన స్థితిలో ఉన్నాం. దిల్లీ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నాక నా బాధ్యత మరింత పెరిగిందనిపిస్తోంది.

50 మందికి ఉపాధి చూపిస్తున్నా!
– బొందుగుల సవిత

బీర్కూర్‌లోని లక్ష్మీగణపతి మహిళా సంఘం మాది. 2014లో సభ్యత్వం తీసుకున్నా. టైలరింగ్ చేస్తూ వచ్చిన మొత్తంలోంచి కొద్దికొద్దిగా జమ చేసుకున్నా. ఆ తర్వాత బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్నా. టైలరింగ్ కేంద్రం, నా భర్త వడ్రంగి దుకాణం పెట్టడానికి రుణాన్ని సద్వినియోగం చేసుకున్నాను. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టిచ్చే పనిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. మా మండలంలో ఆ పని నాకు వచ్చింది. 50 మందికి ఉచితంగా దుస్తులు కుట్టడం నేర్పించి వారికి ఉపాధి చూపించాను. ఆ తర్వాత మండలం మొత్తం పాఠశాలల్లో దుస్తుల కాంట్రాక్ట్ నాకే ఇచ్చారు. ఒక్కో డ్రెస్సుకు ప్రభుత్వం రూ.75 వరకు ఇస్తుంది. అయితే ఈ యూనిఫాం కుట్టడాన్ని లాభాపేక్షతో కాకుండా సేవాభావంతో చేస్తున్నా. నా పొదుపు అలవాటు దిల్లీ వరకూ తీసుకువెళ్తుందని ఎప్పుడూ ఊహించలేదు.

– కాసం సంజీవ్‌దేవ్, కామారెడ్డి

అమ్మలకు... యశోదమ్మ పాఠం!

ఆటకుటునే రూపం... నవ్వులో చిలిపిదనం... కళ్లల్లో ప్రేమ... కన్నయ్యను తలుచుకోగానే గుర్తుకొచ్చేవే ఇవన్నీ! ఆ చిన్ని కృష్ణయ్య అల్లరిని ఆస్వాదించని మహిళ ఉండదు. అందులో తమ పిల్లల బాల్యాన్ని చూసుకొని మురిసిపోతుంటారు కూడా. అందుకే తరాలు మారినా యశోదమ్మ, కృష్ణయ్య కథ అంటే మనసు పారేసుకోని అమ్మలుండరు. కథలు విని ఊరుకోవడమేనా? వాటినుంచి పాఠాలూ నేర్చుకోవాలిగా!





● కృష్ణయ్య అంటే యశోదకు ఎంత ప్రాణమో! చిన్న దెబ్బ తగిలినా గిలగిల్లాడిపోయేది. అంత గారాబమైనా వెన్న దొంగతనం చేసినప్పుడు రోలుకి కట్టేసింది. అది కోపం కాదు, క్రమశిక్షణలో పెట్టడం.

పిల్లలపై అమితమైన ప్రేమ ఉండటం మామూలే. కానీ ఆ ప్రేమ వాళ్ల తప్పుల్ని కప్పేయకూడదు. అదెలా తప్పు... దానివల్ల కలిగే పర్యవసానాలేంటి అనేది అవసరమైతే కఠినంగానైనా చెప్పాల్సిందే. అబద్ధం, దొంగతనం, ఎవరినైనా కొట్టడం లాంటివి చేస్తే చేయకూడదని చెప్పండి. మళ్లీ చేయకుండా ఉండటానికి కొట్టాల్సిన పనిలేదు. మొబైల్, చాక్లెట్ వంటివి కొన్నిరోజులు ఇవ్వకపోవడం... లాంటి శిక్షలు ఇవ్వొచ్చు. ప్రేమ వేరు, క్రమశిక్షణ వేరు.




● కన్నయ్య భలే చలాకీవాడు. ఓవైపు స్నేహితులతో ఆడుతూ కనిపిస్తాడు. ఇంతలోనే గోపికలతో నృత్యం చేస్తుంటాడు లేదా వేణువు వాయిస్తూ హుషారుగా ఉంటాడు. ఏం చేసినా తనని తానుగానే స్వీకరించింది యశోదమ్మ. ఇది చెయ్యి, వీళ్లతోనే ఉండు అంటూ నిబంధనలు పెట్టలేదు.

అందరు పిల్లలూ ఒకలా ఉండరు. కొందరికి పాఠాలు బాగా ఒంటపట్టొచ్చు. మరికొందరు ఆర్ట్స్‌లో రాణిస్తుండొచ్చు. నచ్చినవాటిలో సాయం చేయండి. అవసరమైనవి నేర్చుకునేలా ప్రోత్సహించండి. ఇంతేకాదు దేన్నీ బలవంతం చేయకూడదు. వాళ్ల బలాలను ప్రోత్సహిస్తే మరింత సృజనాత్మకంగా ఎదుగుతారు. వాళ్ల ప్రత్యేకతను చాటగలుగుతారు.



● నోట్లో భువనభాండాల్ని చూపడం, చిటికెన వేలితో గోవర్ధనగిరిని ఎత్తడం... సాధారణ పిల్లలకు సాధ్యమయ్యే పనేనా? కృష్ణయ్య ఇలాంటివి చేసినప్పుడు యశోద భయపడలేదు, తన బిడ్డకు అన్నీ తెలుసని పొంగిపోనూ లేదు. ఎంత తెలిసినా ఏం చేసినా బిడ్డను అక్కున చేర్చుకుంది.

పిల్లలు... సందేహాల పుట్టలు. ఆ చిన్ని మెదళ్లలో ప్రశ్నలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టుకొస్తాయో తెలీదు. కొన్నిసార్లు ఆశ్చర్యపోతాం, సమాధానాలు తెలియక తికమకపడతాం. అలాంటప్పుడు కొట్టిపారేయొద్దు. వాళ్లలో ఉత్సుకత, కొత్తగా తెలుసుకోవాలన్న ఆసక్తి తగ్గిపోతాయి. 'నాకు తెలీదు... తెలుసుకుని చెబుతా' ననో 'ఇద్దరం కలిసి తెలుసుకుందా'మనో చెప్పండి. నిజానికి వీళ్ల వల్లే మనం కొత్తవెన్నో నేర్చుకుంటాం. అది మనకీ మేలే.



● ఒక్కచోట కుదురుగా ఉండటం కృష్ణయ్య తత్వమే కాదు. గోకులంలో అందరికీ తను బిడ్డే. తనకు నచ్చినట్లే చేసేవాడు. ఈ క్రమంలో మనుషుల్నీ, మనసు లోతుల్నీ చదివాడు. జనాల నాడి పట్టగలిగాడు. పెద్దయ్యాక గీతాసారాన్ని బోధించగలిగాడు.

తప్పు చేసినప్పుడు శిక్ష, దారి మళ్లుతున్నప్పుడు వాళ్ల దిశామార్గం ఏ అమ్మానాన్నలైనా చేయాల్సిందే. అలాగని వాళ్ల రెక్కలను కట్టేయొద్దు. 'నువ్వు డాక్టర్ అవ్వాలి', ఫలానా ఇంజినీరింగ్ చదివితేనే భవిష్యత్తు అంటూ మీ ఇష్టాలను వాళ్లమీద రుద్దొద్దు. స్వేచ్ఛనివ్వండి... దిశానిర్దేశం చేయండి. ఆంక్షలు విధించడానికీ శాసించడానికీ వాళ్లు బానిసలు కాదు... మన పిల్లలు. అది గుర్తుంచుకుంటే బాలకృష్ణుడిలా అందమైన బాల్యం మనవాళ్లకీ ఇవ్వొచ్చు. మరి... అలా స్వేచ్ఛగా ఆనందంగా గడిపే బాల్యాన్ని మనమూ ఇద్దామా... మన చిన్నారులకి!



బి12 చెక్ చేయించుకున్నారా?

ఊరికే నీరస పడిపోవడం, కారణం లేకుండా మూడ్ అంతా డల్‌గా మారిపోవడం... చిన్న విషయాలే కానీ ఓ పట్టాన గుర్తుకురావు. ఇలాంటప్పుడు పని ఎక్కువైంది, నిద్ర తగ్గింది... ఇలా బోలెడు కారణాలు వెతుక్కుంటూ ఉంటాం. బి12 తగ్గినా ఈ సమస్యలు వస్తాయి. ఓసారి చెక్ చేయించుకోండి. నిజానికి ఈ సాల్యుబుల్ విటమిన్... మన శరీరానికి ఎనర్జీ పవర్ హౌజ్‌లా పనిచేస్తుంది. ఎనీమియాని దరిచేరనీయదు, నాడీకణాల ఆరోగ్యానికీ సాయపడుతుంది. ఇంకా బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. నిజానికి అమ్మాయిలకు ఎనీమియా బారిన పడకుండా ఉండటానికి ఇది చాలా అవసరం కూడా. అందుకే ఆహారం ద్వారా ఇది సరిగా అందేలా చూసుకోవాలి. ఆవుపాలు, అరటిపండ్లు, లివర్, గుడ్లు, యోగర్ట్, చీజ్ వంటి వాటిల్లో ఇది ఎక్కువగా లభిస్తుంది. కాబట్టి, వాటిని రోజువారీ ఆహారంలో అందేలా చూసుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహామేరకు సప్లిమెంట్లనీ తీసుకోవాలి.

పెంకులూ ప్రయోజనమే!



ఆరోగ్యమని కోడిగుడ్లను తింటాం... వాటి పెంకుల్ని మాత్రం వ్యర్థాలుగా భావించి పారేస్తాం. కానీ, వీటితో బోలెడు ఉపయోగాలున్నాయి. అవేంటంటారా?

◆ కోడిగుడ్డు పెంకుల్ని మట్టిలో కలిపితే.. దానికి తగిన కాల్షియం చేకూరి సారవంతమవుతుంది. అలానే ఈ గుల్లల్ని నారు పోయడానికి ఉపయోగించొచ్చు. మొలక వచ్చాక దాన్ని నేరుగా మట్టిలో పెట్టేస్తే షెల్ అందులో కలిసిపోతుంది. మొక్క ఆరోగ్యంగానూ ఎదుగుతుంది. అంతేకాదు, ఈ పెంకుల్ని మెత్తగా నూరి మట్టిలో వేస్తే నత్తలు, ఆకుతొలుచు పురుగులను నివారించవచ్చు.

◆ గుడ్డు పెంకులను... పొడి చేసి సబ్బు లేదా బేకింగ్ సోడాతో కలిపి లోహపు పాత్రలు, మట్టి కుండల్ని రుద్దితే గీతలు పడకుండా త్వరగా శుభ్రపడతాయి. ఈ మిశ్రమంతో బాత్రూమ్ టైల్స్‌ని కూడా సులువుగా క్లీన్ చేయొచ్చు. అంతేకాదు, అప్పుడప్పుడూ సింక్ గొట్టాలు మూసుకుపోతుంటాయి. ఇలాంటప్పుడు వీటిని పొడిచేసి వేస్తే నీళ్లు సాఫీగా వెళ్తాయి.

◆ చేతులకు పెయింట్ మరకలు అంటినప్పుడు ఓ పట్టాన వదలవు. ఇలాంటప్పుడు సబ్బులో కాస్త గుడ్డు పెంకుల పొడిని కలిపి రుద్దితే సరి... వదిలిపోతాయి.



> కార్పొరేట్ ప్రపంచంలో మహిళా నాయకత్వం వేగంగా పెరుగుతోంది. 'సీఎక్స్‌ఓ'ల స్థాయికి ఇంకా చేరకపోయినా మధ్యస్థాయి ఉద్యోగాల్లో, నిర్ణయాత్మక స్థానాల్లో ఎక్కువగా ఉన్నారు. మా కంపెనీలో నాతోపాటు, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ స్ట్రాటజీ... లాంటి కీలక స్థానాల్లో మహిళలే ఉన్నారు.
>
> - నందితా సిన్హా, సీఈఓ, మింత్రా

మీకు తెలుసా?



ప్రపంచవ్యాప్తంగా 27 శాతం మంది మహిళలు తమ వ్యక్తిగత సమస్యల్ని కార్యాలయాల్లో చెప్పుకోవడానికి అసౌకర్యంగా ఫీలవుతున్నారట. వాటిని బయటపెడితే, కెరియర్ మీద ప్రతికూల ప్రభావం పడుతుందని వాళ్లు భావిస్తున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది.

శోధిత

పక్షపాతం చూపిస్తోన్న ఏఐ!

కృత్రిమ మేధ(ఏఐ) మన నిత్య జీవితంలో భాగమయ్యింది. పని సులువు చేసేందుకు ఏఐ టూల్స్ వాడే వారి సంఖ్య పెరిగింది. మరి ఈ టూల్స్ నిజంగానే అందరికీ ఒకేలాంటి ఫలితాలు ఇస్తున్నాయా? అంటే కాదంటున్నాయి పరిశోధనలు. ఈ ఏఐ పరికరాలు మహిళలపై పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నాయని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్(ఎల్ఎస్ఈ) తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంగ్లండ్ కౌన్సిళ్లలోని సగానికి పైగా ఏఐ పరికరాలు మహిళల శారీరక, మానసిక సమస్యలను తక్కువ అంచనా వేస్తున్నాయి. ఈ పరిశోధనలో భాగంగా ఏఐ మోడళ్లకు రకరకాల ఇన్‌పుట్‌లు ఇచ్చారు పరిశోధకులు. మగవారి అనారోగ్యానికి సంబంధించిన డేటా ఏదైనా ఇస్తే 'వైకల్యం', 'అసాధ్యం', 'సంక్లిష్టం'... వంటి సీరియస్ పదజాలాన్ని ఉపయోగించాయి. అదే, డేటాను మహిళ పేరుతో ఇచ్చినప్పుడు మాత్రం ఆ పదాలు లేకుండా, తేలికైన పదజాలాన్ని ఉపయోగించి సమాచారం ఇచ్చాయి. అంతేకాదు, భిన్న పరిశ్రమల్లోని కొన్ని ఏఐ సిస్టమ్స్‌ని విశ్లేషిస్తే అవి 44 శాతం లింగభేదాన్ని చూపించినట్లు ఓ యూఎస్ అధ్యయనం చెబుతోంది. ఇది ఇలానే కొనసాగితే మహిళలు తక్కువ సంరక్షణ పొందే ప్రమాదం ఉంది. అందుకే, ఏఐ వ్యవస్థలు మరింత పారదర్శకంగా ఉండాలనీ, అందులో ఉపయోగించే లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్ఎల్ఎమ్)లో మార్పు రావాలనీ, 'అల్గారిథమ్ ఫెయిర్‌నెస్'కు ప్రాధాన్యత ఇవ్వడాన్ని తప్పనిసరి చేయాలనీ పరిశోధకులు సూచిస్తున్నారు.



రింగుల జుట్టు కావాలా?





యువత మెచ్చిందే ఫ్యాషన్ అన్న సంగతి తెలిసిందే కదా! నిన్నమొన్నటి వరకూ పట్టుకుచ్చులా జాలువారే జుట్టుని ఇష్టపడ్డవారు... ఇప్పుడు ఉంగరాల శిరోజాలను మెచ్చుతున్నారు. అలాగని కురులను వేడి చేసి రింగులు తిప్పడం వల్ల హెయిర్ పాడైపోతుందన్నది వారి భావన. అదే నిజం కూడాను. మరి ప్రత్యామ్నాయం ఉండాలి కదా! దీనికోసమే వచ్చేశాయి సిల్క్ హెయిర్ కర్లింగ్ సెట్ హెడ్ బ్యాండ్‌లు. తడి తలని రెండు భాగాలుగా విభజించి హెడ్ బ్యాండ్ పెట్టుకోవాలి. ఆపై దాన్ని చుట్టూ బిగదీసి తిప్పి... స్క్రంచీ పెట్టేస్తే సరి. ఇలా కనీసం నాలుగైదు గంటలైనా కదలకుండా ఉంచండి. మీరు కోరుకున్నట్లే వేవీ వేవీగా, రింగుల్లా... కనువిందు చేస్తాయి. జుట్టు పాడవుతుందన్న భయమూ అక్కర్లేదు.



బంగారం - వెండి

15న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,730	93,200	1,17,431
విజయవాడ	99,850	92,800	1,17,400
ప్రొద్దుటూరు	1,00,800	92,740	1,17,300
రాజమహేంద్రవరం	1,01,240	92,800	1,26,100
విశాఖపట్నం	1,00,870	92,800	1,25,000
తమిళనాడు	-----	92,800	1,27,000

పీయూష గ్రంథికి మేలుచేసే...
మూర్ధాసన



మ్యాట్‌పైన నిటారుగా నిల్చోండి. ఆపై రెండు కాళ్లను ఎడంగా జరపండి. చేతుల్ని నెమ్మదిగా వెనక్కి తీసుకువెళ్లి ఏదైనా ఒక చేత్తో రెండో చేతి మణికట్టును పట్టుకోండి. ఊతం కోసం ఖాళీగా ఉన్న చేతి వేళ్లతో పిడికిలి బిగించి ఉంచండి. ఇప్పుడు రెండు పాదాలను నేలపైన అదిమి పెట్టి గాలి వదులుతూ వెన్నెముకను సాగదీస్తూ ముందుకు వంగండి. మోకాళ్లు వంచకుండా జాగ్రత్త పడండి. అలాగే సాధ్యమైనంత వరకూ తల మాడు భాగాన్ని నేలవైపుగా తీసుకురండి. కళ్లను తెరచి సాధన చేయొచ్చు. శ్వాస తీసుకుంటూ 10-15 సెకన్లు ఆసన స్థితిలో ఉన్నాక, నిదానంగా పైకి లేచి కాళ్లను దగ్గరగా పెట్టి యథాస్థానానికి తిరిగి వచ్చి విశ్రాంతి పొందండి.

ఉపయోగాలు: పీయూష(పిట్యూటరీ) గ్రంథి సామర్థ్యాన్ని పెంచుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది. కాళ్లు, నడుము కండరాలను బలోపేతం చేస్తుంది.

ఆహారం: చిరుధాన్యాలు, క్వినోవా, ఓట్స్‌లో ఉండే పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజలవణాలు పీయూష గ్రంథి పనితీరుకు సహకరిస్తాయి. చియాసీడ్స్, అవిసెగింజలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, పండ్లు, కూరగాయల్లో లభించే యాంటీ ఆక్సిడెంట్లు ఈ గ్రంథి పనితీరుకు సహకరిస్తాయి.

మెరుగైన జీర్ణవ్యవస్థకు అపాన ముద్ర



జీర్ణవ్యవస్థను మెరుగుపర్చి శరీరాన్ని విషరహితం చేయడం దీని ప్రత్యేకత.


ముందుగా యోగామ్యాట్‌పైన పద్మాసనం, వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చోండి. వెన్నెముకను నిటారుగా ఉంచి కళ్లు మూయండి. ఇప్పుడు చేతుల్ని మీ మోకాళ్లపై ఉంచి సున్నితంగా అరచేతులు తెరచి బొటన వేళ్ల కొనల్ని మధ్య, ఉంగరంవేళ్ల కొనలకు చేర్చి సున్నితంగా వత్తండి. ఇదే సమయంలో చూపుడువేలు చిటికెన వేలును నిటారుగా చాపి ఉంచండి. శ్వాసమీదే ధ్యాస ఉంచుతూ 30 నిమిషాల వరకూ ఈ ముద్ర వేయొచ్చు. తెల్లవారు జామున వేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

ఉపయోగాలు: జీర్ణశక్తి మెరుగవుతుంది. రోగనిరోధక శక్తికి తోడ్పడుతుంది. గుండె జబ్బులు, మధుమేహం, శ్వాససంబంధ సమస్యల్ని దూరం చేస్తుంది. శరీరంలో ఉన్న వ్యర్థాలను బయటకు పంపడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మూత్రపిండాలకు మేలు చేస్తుంది.

ఆహారం: వెల్లుల్లి, ఆకుకూరలు, అల్లం ఎక్కువగా తీసుకోవాలి. రోజూ ఎనిమిది గ్లాసుల నీరు తాగండి.



- శిరీష, యోగ గురు



చిన్ని కృష్ణయ్యకు... చిట్టి నగలు!













'ముద్దుగారే యశోద...' అని పాడుతూ ఒకప్పుడు బామ్మలు పిల్లలకు నలుగు పెట్టడమో, సాంబ్రాణి వేయడమో చేసేవారు. తమ పాపాయిల్లో ఆ చిన్ని కృష్ణుడిని చూసుకుని మురిసిపోయేవారు. కానీ జన్మాష్టమికి మాత్రం ఈ తీరు పూర్తిగా మారిపోతుంది. మామూలుగా దేవుడంటే భక్తి, శ్రద్ధలతో పూజిస్తారు కదా! చిన్ని కిష్టయ్య పుట్టిన రోజు నాడు భక్తి కంటే ప్రేమ కనిపిస్తుంది. ఇక్కడ ఆయన్ని దేవుడిగానో, విష్ణు స్వరూపంగానో కంటే ముద్దులొలికే పాపాయిగానే భావిస్తారు. చిన్ని విగ్రహాలకు స్నానం చేయించి, మెత్తని వస్త్రంతో తుడిచి... అచ్చు పసివాళ్లకు చేసినట్టుగానే చేస్తారు. ఆపై ప్రత్యేకంగా అలంకరిస్తారు. అలాగని ఓ చిన్న వస్త్రం చుట్టి వదిలేస్తారనుకునేరు. ప్రత్యేక దుస్తులు, కాళ్లకు గజ్జెలు, చేతులకు కడియాలు, మెడలో హారాలు, తలమీద కిరీటం, చేతిలో పిల్లనగ్రోవి... అన్నింటినీ చూడముచ్చటగా అలంకరించి నా దిష్టే తగులుతుందేమో అని మెటికలు విరుస్తూ మురిసిపోతారు. ఆయనకు నచ్చినవన్నీ వండిపెట్టి, ప్రేమగా అర్పిస్తారు. ఆపై పవళింపు సేవ అంటూ ఉయ్యాల్లో పడుకోబెట్టి 'జో అచ్యుతానంద' అంటూ ఉయ్యాల ఊపుతారు. అన్నీ ఎంతో శ్రద్ధగా చేస్తారు. ఇంత ప్రాధాన్యమున్న వేడుకని డిజైనర్లు మాత్రం ఎందుకు వదులుతారు? మహిళల ఆసక్తిని గమనించి, కృష్ణయ్యకి తగ్గ ఆభరణాలు, ఉయ్యాల వగైరా అన్నీ తెచ్చేశారిలా. వీటిలో వెండివీ ఉన్నాయి. విగ్రహం సైజు ఆధారంగా కస్టమైజ్‌డ్‌వీ అందిస్తున్నారు. చిట్టినగలు అలంకరించుకుని చిన్నికృష్ణుడు మరింత అందంగా కనిపించట్లేదూ? మీదీ ఇలాంటి భక్తితో కూడిన ప్రేమేనా? జన్మాష్టమి నాడు కృష్ణయ్యను అలంకరించి మురిసిపోతారా? అయితే ఈ నగలు, ఉయ్యాలలు మీకు సాయపడతాయి. తెచ్చేసుకోండి మరి!

ఏకబిగిన 103 నిమిషాల ప్రసంగం

ఎర్రకోటపై రికార్డు సృష్టించిన ప్రధాని మోదీ



దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎర్రకోట బురుజు నుంచి 103 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించి రికార్డు సృష్టించారు. గతంలో ఏ ప్రధానీ ఇంత సుదీర్ఘమైన స్వాతంత్ర దినోత్సవ సందేశాన్ని జాతిజనులకు అందించ లేదు. గత సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 98 నిమిషాల పాటు ప్రసంగించి రికార్డు సృష్టించిన మోదీ ఈసారి తన రికార్డును తానే అధిగమించారు. ఆయన 2017లో ఎర్రకోట నుంచి 56 నిమిషాలు ప్రసంగించారు. ఇప్పటి వరకూ మోదీ ఎర్రకోట ప్రసంగాల్లో అతిత క్కువ నిడివి కలిగినది అదే. ఎర్రకోట బురుజు నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించే ఆనవాయి తీని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించి నప్పుడు ఆయన చేసిన తొలి ప్రసంగం 72 నిమిషాలు సాగింది. అతి తక్కువ నిడివి కలి గిన ప్రసంగాలు చేసిన ఖ్యాతి కూడా ప్రధా నులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాం ధీలకు దక్కుతుంది. 1954లో నెహ్రూ, 1966లో ఇందిరాగాంధీ ఎర్రకోట నుంచి చెరో 14 నిమి షాల పాటు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం అందించారు.

ఎర్రకోటలో అనుకోని అతిథి





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అనుకోని అతిథిలా ఓ ఉడుత ఎర్ర తివాచీపై సందడి చేసింది. ఆ తర్వాత ఓ సైనికుడి తుపాకీ పైకి పాకింది.



దిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో వర్షంలోనే జాతీయ జెండాకు వందనం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

హుమయూన్ సమాధి దర్గా గోడ కూలి ఆరుగురి మృతి



గోడకూలిన ప్రాంతంలో సహాయక చర్యలు

దిల్లీ: దేశ రాజధాని నగరంలోని హుమయూన్ సమాధి పక్కనున్న దర్గా గోడ కూలి ఆరుగురు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం ప్రార్థనల కోసం వచ్చిన భక్తులు వర్షం కారణంగా లోపల ఉన్న గదిలో తల దాచుకొన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే ప్రమాదస్థలికి చేరుకొన్న పోలీసులు దాదాపు పది మందిని కాపాడారు. క్షతగాత్రులను ఎయిమ్స్ ట్రామా కేంద్రానికి, లోక్‌నాయక్ ఆసుపత్రికి తరలించినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్‌కుమార్ జైన్ మీడియాకు వెల్లడించారు. ఈ ప్రమాదంలో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించిన హుమయూన్ సమాధికి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

కిశ్త్‌వాడ్‌లో 60కు చేరిన మృతులు

దిల్లీ, కిశ్త్‌వాడ్: జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఆకస్మిక వరదల కారణంగా మృతిచెందినవారి సంఖ్య శుక్రవారం 60కు చేరింది. వంద మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఇప్పటికీ 69 మంది ఆచూకీ తెలియకపోవడంతో వారి కోసం రెండోరోజూ యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగాయి. పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, స్థానిక స్వచ్ఛంద సంస్థలతోపాటు దాదాపు 300 మంది సైనికులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. చశోతీ గ్రామ పరిస్థితిపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాలతో ప్రధాని మోదీ ఫోనులో మాట్లాడి ఆరా తీశారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ల సహాయక చర్యలను నిలిపివేశారు. శిథిలాల నుంచి వెలికితీసిన మృతదేహాలను గుర్తించేందుకు బాధిత కుటుంబాలకు వాట్సప్ ద్వారా ఫొటోలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటిదాకా 30 మందిని గుర్తించారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. చండీగఢ్ నుంచి ప్రత్యేక వైద్య బృందం ఇక్కడికి చేరుకోనుంది. మచైల్ మాత ఆలయాన్ని దర్శించేందుకు వచ్చిన వందలాది మంది భక్తులు చశోతీ గ్రామానికి ముందున్న హమోరీ, మచైల్ గ్రామాల్లో చిక్కుకుపోయారు.



కిశ్త్‌వాడ్ జిల్లాలో వరదల కారణంగా ధ్వంసమైన భవనాలు, వాహనాలు

చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని, మొబైల్ ఫోన్లు పనిచేయనందున యాత్రికులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెప్పారు. ఉగ్రరూపం దాల్చిన చీనాబ్ నదిలో కనీసం 10 మంది మృతదేహాలు తేలియాడటం తాము చూసినట్లు కొందరు గ్రామస్థులు తెలిపారు. నదీతీరంలో 8 మృతదేహాలను స్థానికులంతా కలిసి సామూహికంగా ఖననం చేశారు. "కిశ్త్‌వాడ్ ఆకస్మిక వరదల్లో 500 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకొన్నట్లు భావిస్తున్నా. కొందరు అధికారులు వెయ్యి కూడా దాటొచ్చని చెబుతున్నారు. ఇది తీవ్ర విషాదకరమైన క్షణం" అని జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు.

వరదల్లో జెండా వందనం

ఈటీవీ భారత్: ఝార్ఖండ్ రాష్ట్రంలోని సాహిబ్‌గంజ్ జిల్లా దియారా ప్రాంత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్యదిన వేడుకలు వైరల్‌గా మారాయి. ఈ ప్రాంతం వరదలతో పూర్తిగా మునిగిపోయింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలను మూసివేశారు. ఈ పరిస్థితుల్లో వరద ముంపులోనే కొన్ని స్కూళ్లు స్వాతంత్ర్యదిన వేడుకలను నిర్వహించాయి. సదర్ బ్లాకు పరిధిలోని కిశన్ ప్రసాద్ పంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఛాతీ లోతు నీటిలో నిలబడి జెండా ఎగురవేసి.. జాతీయగీతం ఆలపించడం చిత్రంలో చూడవచ్చు. ఇదే బ్లాకులోని భోక్లాసింగ్ టోలా రాంపుర్‌లో ఉపాధ్యాయుడు శంభూసింగ్ విద్యార్థులను



పడవలో పాఠశాలకు తీసుకువెళ్లి జాతీయ జెండాను ఎగురవేశారు.

యువజంటకు బీట్ కానిస్టేబులు రక్షణ

ఈటీవీ భారత్: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువజంటకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు ఉందని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. గత జులై 23న దిల్లీలోని ఆర్యసమాజ్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం ఈ జంట పెళ్లి జరిగింది. అమ్మాయి తల్లిదండ్రులు ఈ పెళ్లికి ససేమిరా అంటూ తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో ఆమె రక్షణ కోరుతూ హైకోర్టులో పిటిషను వేసింది. విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ నరూలా యువజంట రక్షణకు బీట్ కానిస్టేబులును నియమించాలని, అత్యవసర సమయాల్లో సంప్రదింపులకు ఫోన్ నంబర్లు ఇవ్వాలని ఆదేశించారు.



నేడు కాకపోతే.. ఇంకెప్పటికీ కాకపోవచ్చు!

మీరు చేయాల్సిన పనిని ఈరోజు చేయకపోతే.. రేపు కూడా చేయలేకపోవచ్చు. చెప్పాలనుకున్న మాటను ఇప్పుడు చెప్పకపోతే.. ఇంకెప్పటికీ చెప్పలేకపోవచ్చు. ప్రారంభించాలనుకున్న మంచి కార్యానికి నేడు శ్రీకారం చుట్టకపోతే.. ఇంకెన్నడూ ఆ దిశగా అడుగు వేయలేకపోవచ్చు. వేచి ఉండటం మానుకొని, తక్షణమే రంగంలోకి దిగండి.

– కోరీ విల్సన్, పర్ఫార్మెన్స్ కోచ్

పాక్, పీవోకేల్లో భారీవర్షాలు

214 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ల్లోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 214 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మరికొందరు గల్లంతైనట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ముఖ్యంగా ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని లోయర్ దిర్, బజౌర్, అబోటాబాద్, జబ్రారీతో సహా పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఈ విధ్వంసం జరిగినట్లు తెలిపారు. మరణాల సంఖ్య మరింత పెరగొచ్చని చెప్పారు. వరదల కారణంగా పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు దెబ్బతిన్నాయని, రెండు వంతెనలు కొట్టుకుపోయాయని, పీవోకేలోని బల్టిస్థాన్ హైవే సహా పలు రహదారులు జలదిగ్బంధమైనట్లు పేర్కొన్నారు.



పాకిస్థాన్‌లోని స్వాత్‌లోయలో ఉన్న మింగోరా పట్టణాన్ని ముంచెత్తిన వరద

రేపు ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఖరారు!

దిల్లీ: ఎన్డీయే తరఫు ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసేందుకు భాజపా పార్లమెంటరీ పార్టీ బోర్డు ఈ నెల 17న దిల్లీలో సమావేశం కానుంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే అధికారాన్ని ఎన్డీయే పక్షాలు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాకు అప్పగించిన సంగతి తెలిసిందే. నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 చివరి తేదీ. నామినేషను దాఖలు సందర్భంగా ఎన్డీయే పక్ష అభ్యర్థితో ప్రధాని, కేంద్ర మంత్రులతోపాటు భాజపా, దాని మిత్రపక్ష పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు వెంట ఉంటారు.

మూడేళ్లుగా ఆసుపత్రిలో

థాయ్ యువరాణి

బ్యాంకాక్: బ్రిటన్, అమెరికాల్లో ఉన్నతవిద్యను అభ్యసించి ఐక్యరాజ్యసమితి కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొంటూ వచ్చిన థాయ్‌లాండ్ యువరాణి బజ్రకితియాభా (46) మూడేళ్లుగా ఆసుపత్రికే పరిమితమై ఉన్నారు. 2022 డిసెంబరులో పెంపుడు కుక్కలకు శిక్షణ ఇస్తూ యువరాణి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై రాయల్ ప్యాలెస్ తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. యువరాణి ఊపిరితిత్తులు, కిడ్నీలు పూర్తిగా పాడయ్యాయని, వైద్య పరికరాల సాయంతో పనిచేయిస్తున్నామని వైద్యులు తెలిపారు. రక్తంలో ఇన్ఫెక్షను కూడా ఉన్నట్లు తేలిందన్నారు. 'ప్రిన్సెస్ భా'గా పేరొందిన ఈమె థాయ్ రాజు మహా వజిరలాంగ్‌కార్న్‌కు గారాల పట్టి. జైళ్లలో ఉండే మహిళల ఆరోగ్యం, చికిత్స కోసం యువరాణి ఎంతో కృషి చేశారు.



తిహాడ్ జైల్లో

1,500 మంది ఖైదీల శిక్ష తగ్గింపు

దిల్లీ: దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిహాడ్ జైల్లోని దాదాపు 1,500 మంది దోషులకు సత్ప్రవర్తన కింద శిక్షను తగ్గిస్తున్నట్లు జైళ్ల శాఖ డీజీ సతీశ్ గోల్చా వెల్లడించారు. దిల్లీ జైళ్లలో రద్దీని నియంత్రించేందుకు రూ.145.58 కోట్లతో నరేలాలో కొత్త జైలును నిర్మించనున్నట్లు తెలిపారు. తిహాడ్ జైలు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. "జైల్లోని 1,497 ఖైదీలను శిక్ష తగ్గింపునకు అర్హులుగా గుర్తించాం. జైల్లో వారి నడవడికను బట్టి ఇప్పుడు 15-25 రోజుల వరకు శిక్ష కాలాన్ని తగ్గిస్తున్నాం. ఖైదీలకు విద్య, నైపుణ్యాలను అందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నాం. ఉస్మానియా యూనివర్సిటీ సహకారంతో బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ చేపట్టిన 'ఉన్నతి' కార్యక్రమం కింద 600 మంది ఖైదీలకు సత్ప్రవర్తనపై శిక్షణ ఇస్తున్నాం. జైలు భద్రత కోసం నిఘా విభాగాన్ని ఏర్పాటు చేశాం. ఖైదీలకు జైల్లోనే చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్యులను నియమిస్తున్నాం. దిల్లీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.145.58 కోట్లతో నరేలాలో కొత్త జైలును నిర్మిస్తాం" అని పేర్కొన్నారు.



సిబ్బంది సమ్మెతో

విమానాలు రద్దుచేస్తున్న ఎయిర్ కెనడా

టొరంటో: "చాలీ చాలని" వేతనాలకు నిరసనగా ఫ్లైట్ అటెండెంట్ల సమ్మె నోటీసు జారీచేసిన నేపథ్యంలో కెనడాకు చెందిన అతిపెద్ద విమానయాన సంస్థ 'ఎయిర్ కెనడా' విమాన సర్వీసుల్ని రద్దు చేయడం ప్రారంభించింది. సంస్థ పూర్తి లాక్‌డౌన్ ప్రకటిస్తే రోజుకు 1.3 లక్షల మంది ప్రయాణికులు ఎక్కడికక్కడ నిలిచిపోయే పరిస్థితి తలెత్తుతుంది. విమాన ప్రయాణ సమయంలో ప్రయాణికుల భద్రత, సౌఖ్యాలకు బాధ్యత వహించే సిబ్బందిని ఫ్లైట్ అటెండెంట్లు అంటారు. ఎయిర్ కెనడా సంస్థలో 10 వేల మంది ఫ్లైట్ అటెండెంట్లు పనిచేస్తున్నారు. విమానాలను క్రమంగా రద్దు చేస్తున్నామనీ, శనివారం నాటికి పూర్తిగా నిలిపివేస్తామని ఎయిర్ కెనడా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్క్ నస్ర్ అన్నారు. విమానాల నిలిపివేత విదేశీ ప్రయాణాలపై అధికంగా ప్రభావం చూపనుంది. రద్దైన విమానాల్లో టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులు పూర్తి రుసుము వాపసుకు అర్హులని, వీలైనంత వరకూ ఇతర విమాన సంస్థలతో మాట్లాడి ప్రయాణికుల్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎయిర్ కెనడా అధికారులు తెలిపారు.



భారత్‌కు గఘన కవచం!



కొత్తగా రాకెట్ ఫోర్స్‌ను సృష్టిస్తామని ప్రకటించిన పాకిస్థాన్.. 24 గంటల్లోనే పిడుగులాంటి వార్తను వినాల్సి వచ్చింది. 'సుదర్శన్ చక్ర' పేరుతో దేశంలో కీలక ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచాన్ని, ప్రతిదాడి వ్యవస్థను మోహరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కృష్ణుడి ఆయుధమైన సుదర్శన చక్రం పేరును దీనికి ఖరారు చేశారు. 'ఆపరేషన్ సిందూర్'లో భారత గగనతల రక్షణ వ్యవస్థ పాటవాన్ని ప్రత్యక్షంగా చూసిన పాక్‌కు ఈ ప్రకటన కలవరపాటే!

ఎందుకు?

యుద్ధ సమయంలో శత్రువు.. విద్యుత్ గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఆహార, నీటి సరఫరా, వైద్య పరిరక్షణ, రైల్వేస్టేషన్లు, రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగే అవకాశం ఉంది. వీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. పహల్గాంలో అమాయక పౌరులను ఊచకోత కోసిన ఉగ్రవాదుల భరతం పట్టేందుకు మే నెలలో ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్.. పాక్‌లోని ముష్కర ముఠాల స్థావరాలు, వైమానిక శిబిరాలపై దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా పొరుగు దేశం.. స్వల్పశ్రేణి ఫతా-1, ఫతా-2 క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లను భారత్‌పైకి భారీగా ప్రయోగించింది. వీటిని మన గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. అలాగే ఇరాన్‌తో జరిగిన పోరులో ఇజ్రాయెల్‌ను ఈ క్షిపణి రక్షణ కవచమే రక్షించింది.

ప్రస్తుత నెట్‌వర్క్ ఇదీ..

భారత వద్ద ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) ఉంది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ దాడులను తిప్పికొట్టడంలో ఇది కీలక పాత్ర పోషించింది. ఇది పూర్తిగా ఆటోమేటెడ్, రియల్‌టైమ్ గగనతల రక్షణ ఆదేశిక వ్యవస్థ. ఇందులో వివిధ సెన్సర్లు, రాడార్లు, ఆయుధ వ్యవస్థలను అనుసంధానం చేశారు. ఇది భారత గగనతలంపై నిరంతరంగా నిఘా వేస్తూ.. ఎప్పటికప్పుడు సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరిస్తుంది. భూతల, గగనతల, నౌకాదళ ఆయుధ వ్యవస్థల మధ్య సమన్వయానికి వీలు కల్పిస్తుంది. ఈ వ్యవస్థను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) అభివృద్ధి చేసింది. అత్యంత వేగవంతమైన వైమానిక దళ నెట్‌వర్క్‌పై ఇది పనిచేస్తుంది. తద్వారా వివిధ సెన్సర్లు, యుద్ధవిమానాలు, ఆకాశ్, బరాక్-8, ఎంఆర్ శామ్, ఎస్-400 వంటి క్షిపణి వ్యవస్థలకు సైనికాధికారులకు మధ్య డేటా బట్వాడా వేగంగా సాగుతుంది. ఇది ఆకాశ్ తీర్ అనే మరో వ్యవస్థ, డ్రోన్లపై కన్నేసే ఇంటిగ్రేటెడ్ కౌంటర్-యూఏఎస్ గ్రిడ్‌తో అనుసంధానమైంది.

ఈ నెట్‌వర్క్ ఆధారిత విధానం వల్ల శత్రు డ్రోన్లు, విమానాలు, క్షిపణులను ఎప్పటికప్పుడు గమనించడానికి, సకాలంలో ప్రతిచర్యలు చేపట్టడానికి, ప్రాధాన్య క్రమంలో.. ఎప్పుడు ఏ ఆయుధాన్ని వాడాలో నిర్ణయించుకోవడానికి వీలు కలిగింది.

మరింత మెరుగ్గా..

సుదర్శన్ చక్రలో భాగంగా ఐఏసీసీఎస్‌ను మరింత బలోపేతం చేసి.. దానికి ప్రతిదాడి సామర్థ్యాన్ని జోడించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. శత్రువుపై అత్యంత కచ్చితత్వంతో దాడి చేయగల దీర్ఘశ్రేణి క్షిపణులను దీనికి అనుసంధానిస్తారని విశ్లేషిస్తున్నారు. దీనివల్ల ఆత్మరక్షణతోపాటు ఎదురుదాడికి వీలు కల్పించే ఒక శక్తిమంతమైన నెట్‌వర్క్ సిద్ధమవుతుంది. ఇది ఇజ్రాయెల్‌కు చెందిన 'ఐరన్ డోమ్' వ్యవస్థ కన్నా మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నారు.

- 2035 నాటికి సుదర్శన్ చక్ర సిద్ధమవుతుంది. ఇది దేశంలోని వ్యూహాత్మక, పౌర మౌలికవసతులను శత్రు గగనతల దాడుల నుంచి రక్షిస్తుంది.
- ఈ కవచాన్ని విస్తరిస్తూ పోతామని, పౌరులందరూ సురక్షితంగా ఉండేలా చూస్తామని మోదీ తెలిపారు. భారత్‌కు వ్యతిరేకంగా ఎలాంటి పరిజ్ఞానాన్ని ఉపయోగించినా.. మన సాంకేతికత ముందు అది దిగదుడుపు అవుతుందన్నారు.
- సైబర్ యుద్ధాన్ని తిప్పికొట్టే సామర్థ్యం కూడా ఈ వ్యవస్థలో ఉంటుందని చెబుతున్నారు.
- సుదర్శన్ చక్ర ప్రాజెక్టును స్వదేశీ పరిజ్ఞానంతోనే భారత్ చేపడుతుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), ప్రైవేటు సంస్థలు, సైన్యం మధ్య భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుంది.

'కుశ'కు విస్తరణ

విస్తృత స్థాయి గగనతల రక్షణ వ్యవస్థ కోసం డీఆర్‌డీవో ఇప్పటికే 'ప్రాజెక్టు కుశ'ను చేపట్టింది. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయడం కూడా ఇందులో ఉంది. 2028 నుంచి 2030 మధ్య దీన్ని సిద్ధం చేయాలన్నది లక్ష్యం. క్షిపణి పరీక్షలు ఈ ఏడాది చివర్లోగా ప్రారంభం కావొచ్చు. 150, 250, 400 కిలోమీటర్ల దూరంలో శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను ఈ వ్యవస్థ ధ్వంసం చేస్తుంది. సుదర్శన్ చక్ర.. దీనికి తదుపరి విస్తరణ అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

జనాభా సంక్షోభం..

దక్షిణ కొరియా 'సైన్యం'లో కలవరం



ఇంటర్నెట్ డెస్క్: దక్షిణ కొరియా సైనిక శక్తి గత ఆరేళ్లలో 20% తగ్గినట్లు అక్కడి రక్షణశాఖ తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ జననాల రేటు ఉన్న ఈ దేశంలో సైనిక సేవల కోసం నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలిపింది. సైనిక సేవలందించే వారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడం అధికారుల సంఖ్యలోనూ తగ్గుదలకు కారణమవుతోందని రక్షణశాఖ వెల్లడించింది. తద్వారా కార్యకలాపాల నిర్వహణ ఇబ్బందిగా మారినట్లు పేర్కొంది. దక్షిణ కొరియా సైన్యంలో చేరేందుకు కనీస వయసు 20 ఏళ్లు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో ఈ వయసున్న వారి సంఖ్య 2019-25 మధ్యకాలంలోనే 30శాతం తగ్గినట్లు అంచనా. 2019లో సైనికుల సంఖ్య 5.63 లక్షలుగా ఉండగా, ప్రస్తుతం అది 4.5 లక్షలకు తగ్గింది. అదే ఉత్తర కొరియాకు మాత్రం భారీ సైనిక శక్తి ఉంది. రక్షణశాఖ వివరాల ప్రకారం.. 2022లో కిమ్ దాదాపు 12 లక్షల సైన్యాన్ని కలిగి ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో సైనిక సామర్థ్యాలను పెంచుకోవడంతో పాటు అమెరికాతో కలిసి పనిచేస్తున్న దక్షిణ కొరియా.. రక్షణ రంగంపై ఏటా భారీ స్థాయిలో కేటాయింపులు చేస్తోంది. మరోవైపు ప్రపంచంలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతున్న దేశాల్లో దక్షిణ కొరియా ఒకటి. 2024లో ఇక్కడ జననాల రేటు 0.75 శాతంగా ఉంది.

సుప్రీం, హైకోర్టులు రెండూ సమానమే

- ఉన్నతన్యాయస్థానం కొలీజియంను ఆదేశించజాలం
- సీజేఐ గవాయ్ స్పష్టీకరణ

దిల్లీ: సుప్రీం కోర్టు, హైకోర్టులు రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైనవేనని రెండూ సమానమైన ప్రాధాన్యం కలిగి ఉంటాయని ఏ ఒక్కటీ మరొకదానికంటే ఉన్నతమైనది కాదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. న్యాయమూర్తి పదవికి నిర్దిష్ట వ్యక్తి పేరును సిఫారసు చేయాలంటూ హైకోర్టును సుప్రీం ఆదేశించలేదని స్పష్టం చేశారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులను, హైకోర్టు న్యాయమూర్తుల పదవి కోసం పరిగణించాలని ఎస్‌సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్.. సీజేఐ జస్టిస్ గవాయ్ ముందు ఓ కీలక ప్రతిపాదనను చేశారు.



దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.."ఫలానా వ్యక్తి పేరును న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేయమని హైకోర్టు కొలీజియంను సుప్రీంకోర్టు ఆదేశించలేదు. ఎందుకంటే, రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు, హైకోర్టు కంటే ఉన్నతమైన న్యాయస్థానం కాదు. అలా అని తక్కువ కూడా కాదు. అందువల్ల న్యాయమూర్తుల నియామకంపై హైకోర్టు కొలీజియమే మొదటగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వారు సిఫార్సు చేసిన పేర్లనే మేము పరిగణిస్తాం. అందులో సరైన అర్హత కలిగిన వారి పేర్లను సూచించమని చెబుతాం. వారు అన్నీ పరిశీలించి న్యాయమూర్తి పదవికి అర్హులైన వారి పేర్లను సుప్రీంకోర్టుకు పంపుతారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, తన హయాంలో సుప్రీంకోర్టు కొలీజియం అభ్యర్థులతో నేరుగా సంభాషించే పద్ధతిని ప్రారంభించారు. అది నిజంగా చాలా మంచి ఫలితాలను ఇచ్చింది. 10-15 నిమిషాలు లేదా అరగంట పాటు అభ్యర్థులతో సంభాషించిన తరువాత, వారిలో న్యాయమూర్తి పదవికి ఎవరు అర్హులో తెలుసుకోవడానికి, వారు సమాజానికి ఎంత మేరకు తోడ్పడతారో అంచనా వేయడానికి వీలవుతుంది" అని వ్యాఖ్యానించారు.

ప్రిలిమినరీ పరీక్షల ఫీజు రూ.100 మాత్రమే

- మెయిన్స్ రుసుము ఎత్తివేత
- బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ ప్రకటన

పట్నా: బిహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పోటీ పరీక్షల అభ్యర్థులకు తీపి కబురు వినిపించారు. రాష్ట్రంలో ప్రిలిమినరీ పరీక్షలన్నింటికీ కేవలం రూ.100 దరఖాస్తు ఫీజును నిర్ణయించినట్లు ప్రకటించారు. మెయిన్స్ పరీక్షల రుసుమును పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభ్యర్థులకూ ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించే లక్షల మంది యువతకు లబ్ధి చేకూరుతుందని నీతీశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.



ఉండవల్లిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులతోపాటు కూర్చుని బస్సు కోసం ఎదురుచూస్తున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ఉండవల్లిలో బస్సులో కూర్చుని ప్రయాణికులకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

స్త్రీశక్తి అమలు చంద్రబాబు అనుభవానికి నిదర్శనం

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు ఆర్థిక భద్రత, ప్రయాణ స్వేచ్ఛ, సామాజిక గౌరవం అందుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. 'గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో కుదేలైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే, చాలా సమర్థంగా సూపర్‌సిక్స్‌లోని ఒక్కో హామీని అమలుచేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని చంద్రబాబు ఎన్నికలకు ముందే చెప్పారు. మనకున్న ఆర్థిక ఇబ్బందులతో నెరవేర్చగలమా? అని నేను సందేహం వ్యక్తం చేశాను. ఆయన మాత్రం భరోసా ఇచ్చారు. ఈరోజు పథకం అమలు ఆయన అనుభవానికి నిదర్శనం. ప్రతి బస్సులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, మహిళా కండక్టర్లకు బాడీవోర్న్ కెమెరాలు అందిస్తాం. కూటమి ప్రభుత్వానికి మీరంతా అండగా ఉన్నారు. అందుకే మేమంతా బలంగా కార్యక్రమాలు అమలుచేస్తున్నాం. రాజధాని అమరావతికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నిధులిచ్చింది. ప్రధాని మోదీ నిర్దేశంలో, చంద్రబాబు నాయకత్వంలో ఇంకా ఎన్నో పథకాలు, సేవలు కూటమి ప్రభుత్వం అందిస్తుంది' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.



మహిళకు జీరో టికెట్ అందిస్తున్న చంద్రబాబు

మహిళల్ని కించపరిచే డైలాగ్‌లు తొలగించాకే.. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు రిలీజ్ చేయాలి

– మంత్రి నారా లోకేశ్

'సినిమాలు, వెబ్‌సిరీస్‌ల్లో మహిళల్ని కించపరిచేలా డైలాగ్‌లు ఉంటే, వాటిని తొలగించేవరకు రిలీజ్ కాకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఎవరైనా కించపరిచేలా మాట్లాడితే మహిళలు ఎలా బాధపడతారో నా ఇంట్లో చూశాను. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానిస్తే.. ఆమె కోలుకునేందుకు మూడు నెలలు పట్టింది. వాడుకభాషలో.. చీర కట్టుకున్నావా, గాజులు తొడుక్కున్నావా, అమ్మాయిలా ఏడవకు.. లాంటివి వాడుతుంటారు. అవి వింటే నాకు చాలా బాధ కలుగుతుంది. అలాంటి పదాలకు మనం ఫుల్‌స్టాప్ పెట్టాలి. అలాంటివి ఎవరైనా మాట్లాడితే.. అన్న లోకేశ్ తోలు తీస్తాడని చెప్పండి' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

ముందు మీ ఇంటిలో న్యాయం చెయ్యి

'సొంత చెల్లితో రాఖీ కట్టించుకోలేని అన్న.. మహిళల సంక్షేమం కోసం మాట్లాడుతున్నారు. ముందు మీ ఇంట్లో అక్క, చెల్లి, అమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మకు న్యాయం చేశాకే మాట్లాడాలి. 2019లో సంపూర్ణ మద్యనిషేధమని చెప్పి.. తర్వాత ప్రమాదకరమైన మద్యంతో ఎన్నో ప్రాణాలు పోవడానికి కారణమయ్యారు. మహిళలకు అవకాశాలిస్తే అద్భుతాలు చేస్తారు. 1992లో చంద్రబాబు హెరిటేజ్ పెట్టారు. 1994లో ఆయన మంత్రి అయ్యాక, కంపెనీని అమ్మను చూసుకోమన్నారు. నేడు రూ.5వేల కోట్ల విలువైన కంపెనీని అమ్మే నడిపిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌నూ నడిపిస్తున్నారు. నా భార్య బ్రాహ్మణి కంపెనీలో పనిచేస్తోంది. నా క్రెడిట్ కార్డు బిల్లు కూడా ఆమె కడుతుంది. నా ఇంట్లో స్వపక్షం రమణం చూసుకుంటుంది' అని లోకేశ్ తెలిపారు.



మహిళలతో కలిసి ప్రయాణం

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్.. శుక్రవారం ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్ వరకు మహిళలతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఉండవల్లి సెంటర్ వద్ద వీరంతా బస్సు ఎక్కారు. మహిళలతో మాట్లాడుతూ ప్రయాణించారు. వారికి ఉచిత బస్సుప్రయాణ సదుపాయం ద్వారా ప్రతినెలా ఎంత మిగులుతుంది, ఆ డబ్బులు ఇతర అవసరాలకు ఎలా ఉపయోగపడతాయి.. లాంటి విషయాలు మాట్లాడారు. బస్సు ఉండవల్లి నుంచి ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు, కనకదుర్గ వారధి, వినాయక ఆలయం కార్నర్, కంట్రోల్‌రూమ్ సర్కిల్ మీదుగా విజయవాడ సిటీబస్సు టెర్మినల్‌కు చేరుకుంది. మార్గమధ్యలో రోడ్డుకు ఇరువైపులా మహిళలు, కూటమి నేతలు, కార్యకర్తలు నిల్చొని స్వాగతం పలికారు. వీరికి బస్సులో నుంచి నేతలు అభివాదం చేశారు.



పశ్చిమ గోదావరి జిల్లా దుంపగడప నుంచి ఉండి వరకు బస్సులో ప్రయాణిస్తూ... మహిళకు జీరో టికెట్ ఇస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

- బస్టాండ్ ఆవరణలో జరిగిన సభలో.. వేదికపై ఉమ, రత్నవేణి అనే మహిళలు కూర్చున్నారు. వీళ్లు ఉచిత ప్రయాణం మొదటి లబ్ధిదారులని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.
- సభ అనంతరం.. మహిళా ప్రయాణికులతో ఉన్న పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్, మాధవ్ తదితరులు కొబ్బరికాయలు కొట్టి, జెండా ఊపి ప్రారంభించారు.
- ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహన్‌రావు, వసంత కృష్ణప్రసాద్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

అన్నా ఆగాగు.. నేనే డబ్బులు చెల్లిస్తా!

- నా నియోజకవర్గంలో మీరు టికెట్ కొనడమేంటి?
- పవన్‌కల్యాణ్‌తో లోకేశ్ సరదా వ్యాఖ్య



ఈనాడు, అమరావతి: ఉండవల్లి నుంచి విజయవాడ బస్టాండ్ వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్.. మహిళలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. తొలుత సీఎం చంద్రబాబు మహిళా కండక్టర్ వద్ద టికెట్ కొనుగోలు చేశారు. ఇది తెలిసి మంత్రి లోకేశ్ ఆ డబ్బులు వెనక్కి ఇప్పించారు. ఆ తర్వాత పవన్‌కల్యాణ్ బస్సులోకి వచ్చి, టికెట్ కోసం కండక్టర్‌కు డబ్బులు చెల్లిస్తుండగా.. ఆగన్నా అని లోకేశ్ అడ్డుకున్నారు. నా నియోజకవర్గం(మంగళగిరి)లో మీరు డబ్బులు ఇవ్వడం ఏంటన్నా.. అని అన్నారు. అనంతరం తన ఛార్జీతో పాటు సీఎం, డిప్యూటీ సీఎం, మాధవ్‌ల టికెట్ ఛార్జీలను లోకేశ్ చెల్లించారు. ఇప్పుడు టికెట్ ఛార్జీలను నేను ఖర్చు చేసుకుంటున్నా. మా నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు తీసుకుంటానని లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించడంతో అందరూ నవ్వులు చిందించారు.

ఆర్థిక భారం కాదు.. ప్రభుత్వ బాధ్యత

రవాణా శాఖ మంత్రి మండిపల్లి



రాయచోటిలో ప్రయాణికులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: స్త్రీశక్తి పథకాన్ని అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. బస్సులను ప్రారంభించి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పించారు. మహిళల భద్రతే లక్ష్యంగా ఆర్టీసీ బస్సులు అన్ని కండీషన్లో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భారంగా భావించడం లేదని, బాధ్యతగా గుర్తిస్తోందని చెప్పారు. ఉచిత ప్రయాణం బస్సులతో పట్టణంలోని జాతీయ రహదారి వరకు ప్రదర్శనగా వెళ్లి, మహిళలను గమ్యస్థానాలకు సాగనంపారు.





కండక్టరు చొక్కా ధరించి మచిలీపట్నంలో జీరో టికెట్లు ఇస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర ● శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం సందర్భంగా రణస్థలం నుంచి ఎచ్చెర్ల వరకు సుమారు 22 కి.మీ మేర బస్సును నడిపిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



అనకాపల్లిలో బస్సులో ప్రయాణిస్తూ జీరో టికెట్ చూపిస్తున్న మంత్రి వంగలపూడి అనిత



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నుంచి మహిళలతో కలిసి ఉచిత ప్రయాణం చేస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



హిందూపురంలో స్త్రీశక్తి పథకం ప్రారంభించి బస్సు నడుపుతూ.. మహిళకు టికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

లోటు నుంచి అధిక వర్షపాతం

- ఈ 'నైరుతి'లో తొలిసారి వానలు ఆశాజనకం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన రెండు నెలల తర్వాత రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది 'నైరుతి' సాధారణం కంటే ముందుగానే వచ్చినా.. జూన్, జులైలలో చాలా జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొంది. వైఎస్సార్ కడప, అన్నమయ్య, పల్నాడు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి, చిత్తూరు, గుంటూరు, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వానలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణా జిల్లాలు.. లోటు వర్షపాతం నుంచి అధిక వర్షపాతం నమోదైన జాబితాలోకి చేరాయి. అత్యధికంగా గుంటూరులో జూన్ తర్వాత ఇప్పటివరకు సగటున 40.6 శాతం అధిక వర్షపాతం నమోదైంది.

కోస్తా జిల్లాలకు భారీ వర్ష సూచన

అల్పపీడనం ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మంగళవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు హెచ్చరికలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం విశాఖపట్నం, కర్నూలు, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు విశాఖ జిల్లా పెందుర్తిలో 8.6 సెం.మీ. వర్షం కురిసింది. మరోవైపు వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం తర్వాత మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని కొన్ని మోడళ్లు సూచిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు రుతుపవనాలు చురుగ్గా కదులుతాయని అంచనా వేస్తున్నాయి. వీటి ప్రభావంతో ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వానలు పడతాయని అంచనా వేస్తున్నాయి.



నీట మునిగిన విశాఖలోని పెందుర్తి కూడలి

స్వల్పంగా జారిన ఎగువ కాఫర్ డ్యాం

- యుద్ధప్రాతిపదికన పటిష్ఠపరిచే చర్యలు పూర్తి
- ఇబ్బందేమీ లేదన్న 'పోలవరం' అధికారులు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాం ఎడమ వైపు ఎగువన కొద్దిగా జారింది. 10 అడుగుల వెడల్పు, 7 నుంచి 8 అడుగుల లోతున జారింది. శుక్రవారం ఉదయం దీన్ని గుర్తించిన అధికారులు వెంటనే స్పందించారు. యుద్ధప్రాతిపదికన ఆ ప్రాంతాన్ని పటిష్ఠపరిచే పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం +28 మీటర్ల వద్ద ఉంది. పైగా ఎగువనే జారడం తప్ప దిగువ నుంచి ఎలాంటి సమస్య లేదని.. దిగువన ఇప్పటికే బట్రస్ డ్యాం నిర్మాణం పూర్తి చేసినందువల్ల ఎగువ కాఫర్ డ్యాం కట్టడానికి వచ్చిన సమస్య ఏమీ లేదని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తెలిపారు. ఆయనతో పాటు పోలవరం ఎస్ఈ రామచంద్రరావు ఆ ప్రాంతాన్ని సందర్శించి, జారినంత మేర పటిష్ఠపరిచే పనులు చేయించారు.

అప్పట్లో ఎత్తు పెంచిన ప్రాంతంలోనే..

ప్రధాన జలాశయం నిర్మాణమయ్యే లోపు నీటిని మళ్లించేందుకు వీలుగా నిర్మించిన తాత్కాలిక కట్టడమే ఎగువ కాఫర్ డ్యాం. దీనికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే విదేశీ నిపుణుల బృందం సిఫార్సు మేరకు బట్రస్ డ్యాం నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం పైనుంచి పోశమ్మ గండి వైపు (అల్లూరి సీతారామరాజు జిల్లా) నుంచి వాహనాలు కూడా ప్రయాణిస్తున్నాయి. 2022 ఆగస్టులో గోదావరికి భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో మరింత వరద పెరుగుతుందేమోనన్న ఉద్దేశంతో ఎగువ కాఫర్ డ్యాం వెడల్పు 9 మీటర్లు ఉండేలా.. ఎత్తు మరో 2 మీటర్ల మేర పటిష్ఠం చేశారు. అలా పైన పెంచిన ప్రాంతంలో మాత్రమే ఇప్పుడు కొద్దిగా జారిందని అధికారులు వివరించారు. మళ్లీ వాహనాల రాకపోకలు కూడా ప్రారంభమయ్యాయని, సమస్య ఏమీ లేదని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ ఏర్పాటు చేశామని వెల్లడించారు.



పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద కొద్దిగా జారిన ప్రాంతం



పటిష్ఠపరిచిన అనంతరం యథాతథంగా..



తుంగభద్ర జలాశయం గేట్లు

తుంగ'భద్రత'కు పెనుముప్పు?

పనిచేయని మరో 7 గేట్లు

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీటిని అందిస్తున్న తుంగభద్ర జలాశయ భద్రతకు గేట్ల రూపంలో మరో ప్రమాదం పొంచి ఉంది. జలాశయంలోని మొత్తం 33 గేట్లలో మరో ఏడు గేట్లు కూడా పనిచేయడం లేదని తాజాగా ఇంజినీర్ల పరిశీలనలో తేలింది. గతేడాది ఆగస్టు 10న 19వ గేటు కొట్టుకుపోవడంతో స్టాప్‌లాగ్‌లను ఏర్పాటు చేయడం తెలిసిందే. వచ్చే ఏడాది జూన్‌లోగా మొత్తం 33 గేట్లను మార్చాలన్న ఉద్దేశంతో జలాశయం సమీపంలోని గదగలో గేట్ల నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. అంతలోనే మరో ఏడు (4, 11, 18, 20, 24, 27, 28) గేట్లూ ప్రమాదంలో ఉన్నాయని తేలింది. దీంతో ఎంత వరద వచ్చినా వాటిని మాత్రం ఎత్తకూడదని ఇంజినీర్లు నిర్ణయానికి వచ్చారు. 4వ గేటునూ ఓ అడుగుదాకా ఎత్తవచ్చు, తరువాత అదీ మొరాయిస్తోందని తెలిసింది. ప్రస్తుతం జలాశయానికి 23 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. మూడు గేట్లను మాత్రమే పైకెత్తి 9 వేల క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. మిగిలిన వరదను కాలువలకు వదులుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఏ క్షణంలోనైనా డ్యాంకు వచ్చే వరద పెరగవచ్చు. నిరుడు లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న సమయంలో 19వ గేటు కొట్టుకుపోయింది. ఇప్పుడూ అదే స్థాయిలో వరద వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న గేట్ల పరిస్థితిపై ఆందోళన నెలకొంది.

గ్లాస్ వంతెనతో ఐకానిక్ టవర్ల అనుసంధానం

- 900 మీటర్ల పొడవున నిర్మాణం
- డయాగ్రిడ్ ఆకృతుల కోసం 10 ఎకరాల్లో ఫ్యాబ్రికేషన్ యూనిట్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న సచివాలయ టవర్లకు సంబంధించి సవివర (డీటెయిల్డ్) డిజైన్లు కొలిక్కి వస్తున్నాయి. లండన్‌కు చెందిన ఫోస్టర్స్ సంస్థ రూపొందిస్తున్న నమూనాలు తుది దశకు చేరుకున్నాయి. గవర్నమెంట్ కాంప్లెక్స్ సముదాయంలో వేర్వేరుగా నిర్మిస్తున్న ఐదు టవర్లను వంతెనతో పరస్పరం అనుసంధానించనున్నారు. ఉక్కుతో నిర్మించే డయాగ్రిడ్ ఆకృతులను అమరావతిలోనే బిగించనున్నారు.



ఐకానిక్ టవర్ల నమూనా

8 ఎమినిటీస్ బ్లాక్‌లు

ఐకానిక్ టవర్లను మొత్తం 68,88,064 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 47 అంతస్తుల్లో నిర్మించనున్నారు. ఇందులోనే ముఖ్యమంత్రి కార్యాలయం ఉంటుంది. దీని టెర్రస్‌పై హెలిప్యాడ్ నిర్మిస్తారు. మిగిలిన నాలుగు హెచ్‌వోడీ టవర్లు 39 అంతస్తులతో నిర్మించనున్నారు. ఒక టవర్ నుంచి మరో టవర్‌లోకి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సందర్శకులు వెళ్లేందుకు వీలుగా వంతెనతో అనుసంధానిస్తారు. ఇది ఆకర్షణీయమైన గ్లాస్‌తో, ఏసీ సౌకర్యంతో, 900 మీటర్ల పొడవు ఉంటుంది. ఇది మూడో అంతస్తులో రానుంది. టవర్లకు అనుబంధంగా 8 ఎమినిటీస్ బ్లాక్‌లను ఒక్కోటి గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా మూడు అంతస్తులతో నిర్మిస్తారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు నీటిలోనే ఉన్న ఈ ప్రాంతంలో నేల సామర్థ్యాన్ని గుత్తేదారు సంస్థలు పరీక్షించాయి. వెయ్యి టన్నుల బరువును వేసి పరీక్షించగా సానుకూల ఫలితాలు వచ్చాయి.

ఇక్కడే ఫ్యాబ్రికేషన్‌తో సమయం ఆదా

ఐకానిక్ టవర్ల ఆకృతులు డయాగ్రిడ్ విధానంలో రూపొందించారు. ప్రతి టవర్‌కు సగటున 15-20 వేల టన్నుల ఉక్కు అవసరం కానుంది. టవర్ల పనులు దక్కించుకున్న మూడు గుత్తేదారు సంస్థలు అమరావతిలోనే వర్క్‌షాపులు ఏర్పాటు చేసేందుకు సీఆర్డీఏ అనుమతి కోరాయి. దీనికి 10 ఎకరాల స్థలం కేటాయించాలని అడిగాయి. భారీ పరిమాణంలో డయాగ్రిడ్ ఆకృతులను ఇతర ప్రాంతాల్లో ఫ్యాబ్రికేట్ చేసి, ఇక్కడికి తేవాలంటే రవాణా ఇబ్బందులతో పాటు సమయం వృథా కానుంది. దీనిని పరిహరించేలా పని ప్రదేశంలోనే యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నాయి.

పేదలకు వల.. అమ్మతనానికి వెల

- మేడ్చల్ జిల్లాలో అక్రమ సరోగసీ ముఠా గుట్టురట్టు
- 9 మందిపై కేసు.. సూత్రధారులైన తల్లీకుమారుల అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్-పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసాలు మరువకముందే మరో ముఠా ఆగడాలు వెలుగుచూశాయి. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులను అవకాశంగా తీసుకొని మహిళల అండాలు, గర్భానికి ధర కట్టిన అక్రమార్కుల గుట్టును మేడ్చల్ పోలీసులు రట్టు చేశారు. సరోగసీకి అంగీకరించిన వారితో సహా తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి సూత్రధారులైన తల్లీకుమారులు లక్ష్మీరెడ్డి(45), నరేందర్‌రెడ్డి(23)లను అరెస్ట్ చేశారు.

ఎలా వెలుగు చూసిందంటే..

పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నర్రెద్దుల లక్ష్మీరెడ్డి భర్త నుంచి విడిపోయింది. మహారాష్ట్రకు వెళ్లిన ఆమె ఫెర్టిలిటీ కేంద్రాలకు అండాల విక్రయం, సరోగసీ ద్వారా డబ్బు సంపాదించేది. అక్కడి పిల్లల్ని ఎత్తుకొచ్చి సంతానంలేని దంపతులకు విక్రయించేది. ఈ కేసులో ముంబయి పోలీసులు జైలుకు పంపారు. విడుదలయ్యాక హైదరాబాద్ మకాం మార్చింది. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొంది. జేఎన్‌టీయూలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన కుమారుడు నరేందర్‌రెడ్డి ప్రధాన ఏజెంట్‌గా మారాడు. కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి ఇటీవల ఇక్కడకు వచ్చింది. లక్ష్మీరెడ్డి ఏజెంట్ల ద్వారా పేద కుటుంబాల్లోని మహిళలకు డబ్బు ఆశచూపి అండాలు, సరోగసీ కోసం ఒప్పందం కుదుర్చుకునేవారు. అండం సేకరించిన మహిళలకు రూ.వేలల్లో ఇచ్చేవారు. సరోగసీ మహిళను తీసుకొచ్చినందుకు ఫెర్టిలిటీ కేంద్రాలు, సంతానం లేని దంపతుల నుంచి రూ.10-20 లక్షలు వసూలు చేసేవారు. మహిళలకు కేవలం రూ.4-5లక్షలు మాత్రమే ఇచ్చేవారు. స్థానికుల ఫిర్యాదుతో.. పోలీసులు, అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తల్లీకుమారులను అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న కర్ణాటకలోని బసవకల్యాణ్, ఏపీలోని మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన ఏడుగురు అద్దెగర్భం ద్వారా పిల్లల్ని కని ఇచ్చేందుకు ఇక్కడకు వచ్చారని గుర్తించారు. లక్ష్మీరెడ్డితో హెగ్డే ఫెర్టిలిటీ హాస్పిటల్(మాదాపూర్), అను టెస్ట్ ట్యూబ్ సెంటర్(సోమాజిగూడ), ఫెర్టికేర్(బంజారాహిల్స్), ఈవీఎఫ్ ఐవీఎఫ్, అమూల్యా ఐవీఎఫ్ సెంటర్, శ్రీ ఫెర్టిలిటీ సెంటర్(కొండాపూర్)లకు సంబంధం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

భర్తను బతికించుకోవాలని..

కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తికి కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఎలాగైనా భర్తను బతికించుకోవాలని చూస్తున్న అతని భార్యకు లక్ష్మీరెడ్డి పరిచయమైంది. కిడ్నీ మార్పిడికి అవసరమైన ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చింది. కొంత నగదు చేతికివ్వటంతో ఆమె సరోగసీకి అంగీకరించింది.

పీ4 అండతో 'ఎల్‌బ్రస్' అధిరోహణ

కర్నూలు జిల్లా యువకుడు సురేశ్‌బాబు ఘనత

ఈనాడు, కర్నూలు: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమం అండతో పర్వతారోహకుడు జి.సురేశ్‌బాబు రష్యాలోని అత్యంత ఎత్తైన ఎల్‌బ్రస్ శిఖరాన్ని అధిరోహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ జెండాను దానిపై ఎగురవేశారు. కర్నూలు జిల్లా గోనెగండ్లలోని మధ్యతరగతి కుటుంబానికి చెందిన సురేశ్‌బాబుకు పర్వతారోహకుడిగా మంచి అనుభవం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. అయినప్పటికీ.. పలువురు పారిశ్రామికవేత్తల చేయూతతో ఇప్పటికే ఐదు ఖండాల్లో ఎవరెస్టు సహా 25 పర్వతాలను అధిరోహించారు. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన పీ4 పథకం ఆయనకు వరంగా మారింది. పారిశ్రామికవేత్త రాజమహేంద్రనాథ్ సహకారంతో కర్నూలు జిల్లా కలెక్టర్‌ను ఇటీవల సురేశ్‌బాబు ఆశ్రయించారు. ఆర్థిక సహకారం అందిస్తే.. రష్యాలోని అత్యంత ఎత్తైన ఎల్‌బ్రస్ శిఖరాన్ని అధిరోహిస్తానని చెప్పారు. స్పందించిన కలెక్టర్ రంజిత్‌బాషా ఆర్సెలార్ మిత్తల్ సంస్థ ప్రతినిధులను సంప్రదించారు. ఆ సంస్థ వెంటనే రూ.4 లక్షలు, గ్రీన్‌కో సంస్థ, జియో మైసూర్ సంస్థలు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేయడంతో రష్యా వెళ్లిన సురేశ్‌బాబు 'ఎల్‌బ్రస్'ను అధిరోహించారు. జాతీయ జెండాతోపాటు తనకు ఆర్థికంగా అండగా నిలిచిన పారిశ్రామిక సంస్థల పతాకాలను కూడా ఆ పర్వత శిఖరంపై ప్రదర్శించారు.



ఎల్‌బ్రస్‌పై జాతీయ పతాకంతో సురేశ్‌బాబు

ఛాంపియన్

సరిగ్గా పదేళ్ల క్రితం సైనా నెహ్వాల్ ప్రపంచ నంబర్‌వన్.. ఎనిమిదేళ్ల కిందట పి.వి.సింధు ప్రపంచ నంబర్ టూ.. ఏడేళ్ల ముందు కిదాంబి శ్రీకాంత్ ప్రపంచ నంబర్‌వన్.. రెండేళ్ల క్రితం వరకు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ నంబర్‌వన్!

మరిప్పుడు..

మహిళల సింగిల్స్‌లో టాప్-10లో ఒక్కరూ లేరు. సింధు 15వ స్థానమే దేశం తరఫున ఉత్తమం. పురుషుల సింగిల్స్‌లో టాప్-10 సంగతి అటుంచితే.. టాప్-20లో కూడా ఎవరూ కనిపించరు. లక్ష్యసేన్ 21వ ర్యాంకే అత్యుత్తమం. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలో దిగిన సాత్విక్- చిరాగ్ జోడీది ఇప్పుడు తొమ్మిదో స్థానం. 2024 వరకు ప్రపంచ బ్యాడ్మింటన్‌ను శాసించిన భారత్‌కు ఇప్పుడేమైంది? 2012 నుంచి 2024 వరకు పుష్కర కాలం ఓ వెలుగు వెలిగిన భారత బ్యాడ్మింటన్‌కు ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? మన రాకెట్ మళ్లీ గాడినపడుతుందా?

మళ్లీ ఎప్పుడయ్యేనో గుడ్‌మింటన్!

ఈనాడు - హైదరాబాద్

దేశంలో అత్యంత ఆదరణ కలిగిన క్రీడ క్రికెట్ కాగా.. దాని తర్వాత ఎక్కువ మంది ఆడే ఆట బ్యాడ్మింటన్! వాణిజ్యపరంగానూ క్రికెట్ తర్వాతి స్థానం బ్యాడ్మింటన్‌దే. 2012 లండన్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కాంస్య ప్రదర్శనతో భారత్‌లో బ్యాడ్మింటన్ ఆదరణకు గట్టి పునాది పడింది. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో తిరుగులేని చైనా క్రీడాకారిణుల ఆధిపత్యానికి తెరదించడం ద్వారా సైనా ఆటకు మరింత ఆదరణ తీసుకొచ్చింది. 2016 రియో ఒలింపిక్స్‌లో సింధు రజతం భారత బ్యాడ్మింటన్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. సింధుకు స్పాన్సర్‌షిప్‌లు వరుసకట్టాయి. ఆటపై కాసుల వర్షం కురిసింది. దేశంలో రాకెట్ పట్టేవాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ సింధు కాంస్యంతో మెరవడం మరో ఘనత. వరుసగా మూడు ఒలింపిక్స్‌లలో పతకాలు రావడం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో సింధుకు ఎదురులేకపోవడం.. ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో దూకుడు.. అప్పటికే శ్రీకాంత్ సంచలన ప్రదర్శనతో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలవడం.. డబుల్స్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ జోరు ప్రారంభమవడంతో క్రికెటర్లతో సమానంగా బ్యాడ్మింటన్ క్రీడాకారుల స్టార్‌డమ్ పెరిగిపోయింది. ఒకదశలో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల రోజువారీ ఆదాయంలో కోహ్లి తర్వాతి స్థానంలో సింధు నిలిచింది. పాతాళం నుంచి ఆకాశం వరకు చేరుకున్న భారత బ్యాడ్మింటన్‌లో 2022 థామస్ కప్ విజయం అరుదైన ఘనత. 2023 అక్టోబరులో సాత్విక్- చిరాగ్ జోడీ నంబర్‌వన్‌గా నిలవడమే భారత బ్యాడ్మింటన్‌లో చివరి మైలురాయి. అక్కడ్నుంచి భారత రాకెట్‌ది నేల చూపులే!

నింగి నుంచి నేలకు..

ప్రపంచ టూర్ సూపర్ టోర్నీల్లో భారత క్రీడాకారులు చివరిగా ఎప్పుడు టైటిల్ సాధించారంటే చెప్పడం కష్టం. 2012, 2016, 2020 ఒలింపిక్స్‌లలో పతకాలతో మెరిసిన భారత క్రీడాకారులు నిరుడు పారిస్‌లో చేతులెత్తేశారు. అంతకుముందు నుంచే సైనా ఫామ్ కోల్పోగా.. సింధు, శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్ సహా అందరిదీ తిరోగమనమే. ఈ ఏడాది సింధు 10 టోర్నీలాడగా.. అయిదింట్లో తొలి రౌండ్లోనే ఓడింది. నాల్గింట్లో రెండో రౌండ్ చేరుకోగా.. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్ ఈ ఏడాది సింధు అత్యుత్తమ ప్రదర్శన. గత రెండేళ్లుగా శ్రీకాంత్, ప్రణయ్‌లు పూర్తిగా తేలిపోగా.. సాయిప్రణీత్ ఆటకు గుడ్‌బై చెప్పేశాడు. భవిష్యత్తు ఆశా కిరణంలా దూసుకొచ్చిన లక్ష్యసేన్ పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక పోరులో ఓడి నాలుగో స్థానంలో నిలిచాడు. ఆ ఓటమి నుంచి ఇంకా తేరుకోలేకపోతున్న లక్ష్యసేన్.. మునుపటిలా మెరుపులు మెరిపించలేకపోతున్నాడు. ప్రియాంశు రజావత్, కిరణ్ జార్జ్‌లు అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకోలేకపోతున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, మాళవిక బాన్సోద్, ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయా, అష్మిత చాలిహాలదీ అదే పరిస్థితి. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ జోడీది గాయాల సమస్య. మొత్తానికి అనతికాలంలోనే భారత బ్యాడ్మింటన్ నింగి నుంచి నేలకు దిగింది!

అకాడమీలు పెరిగినా..

సంధి దశను దాటలేకపోతుండటం భారత బ్యాడ్మింటన్‌లో ప్రధాన సమస్య. సైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించగా సింధు దూసుకొచ్చింది. పారుపల్లి కశ్యప్, సాయి ప్రణీత్, గురుసాయిదత్ కెరీర్ ముగిసేలోపే శ్రీకాంత్, ప్రణయ్ అందుకున్నారు. సరిగ్గా అలాంటి పరిణామ క్రమమే ఇప్పుడు కొరవడింది. సింధు, శ్రీకాంత్, ప్రణయ్‌ల వారసత్వాన్ని అందుకునే క్రీడాకారుల లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ రూపంలో ఇంకా ఆశలు సజీవంగానే ఉన్నాయి. లక్ష్యసేన్‌కు ఇంకా 23 ఏళ్లే కాబట్టి మరో 5-10 ఏళ్లలో అతను ఏదైనా సాధించొచ్చు. కానీ మహిళల సింగిల్స్‌లోనే పరిస్థితి ఆశావహంగా లేదు. ఈ పరిస్థితికి కారణాలేంటన్నది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి! సైనా, సింధు వెలుగులోకి వచ్చినప్పుడు హైదరాబాద్‌లో ఉన్న బ్యాడ్మింటన్ అకాడమీలను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. ఇప్పుడు ఆ సంఖ్య వేలల్లోకి చేరుకుంది. దేశమంతటా అదే సరళి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అకాడమీలు పెరిగినా.. ఆడేవాళ్ల సంఖ్య ఎక్కువైనా.. నాణ్యమైన క్రీడాకారులు రావట్లేదు. ఇందుకు సరైన కోచింగ్ వ్యవస్థ లేకపోవడం ఒక కారణమని చెప్పొచ్చు. 2010 నుంచి 2024 వరకు భారత బ్యాడ్మింటన్‌లో ఘనతలు సాధించిన క్రీడాకారులంతా (లక్ష్యసేన్ మినహా) పుల్లెల గోపీచంద్ శిష్యులే! గోపీచంద్‌ను మహ్మద్ ఆరిఫ్ తయారు చేయగా.. అతను సైనా, సింధు, శ్రీకాంత్, సాత్విక్‌తో పాటు ఎంతోమంది క్రీడాకారుల్ని అందించాడు.

కోచ్‌లు కావాలి..

దేశంలో క్రికెట్ తర్వాత అత్యధిక మంది ఆడే ఆట బ్యాడ్మింటనే అనొచ్చు. పాఠశాల్లో, ప్రతి కాలనీలో బ్యాడ్మింటన్ కోర్టులు వెలుస్తున్నాయి. క్రికెట్లో ఒక స్టార్ రిటైరయ్యేలోపు మరికొందరు సిద్ధంగా ఉంటున్నారు. ఎలాంటి నేపథ్యం, అండ లేకపోయినా హైదరాబాద్ నుంచి మహ్మద్ సిరాజ్, తిలక్‌వర్మ దూసుకురాగా.. బిహార్ నుంచి 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి వెలుగులోకి వచ్చాడు. ఇలా ఎంతోమంది ప్రతిభావంతులు భారత జట్టులోని సీనియర్లకు ఖో ఇస్తున్నారు. క్రికెట్లో వ్యక్తిగత ప్రతిభతో టీమ్‌ఇండియాలోకి దూసుకురావొచ్చు. కానీ. బ్యాడ్మింటన్‌లో అలా ఆశించలేం. ఇక్కడ ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అత్యుత్తమ శిక్షణ అవసరం. చిన్న వయసు నుంచి క్రమశిక్షణతో కూడిన ప్రాక్టీస్, ఫిట్‌నెస్ కచ్చితంగా ఉండాలి. శిక్షణ ఇచ్చేవారికి నైపుణ్యం అవసరం. అందుకే బ్యాడ్మింటన్ ఆడేవారి సంఖ్య పెరుగుతున్నా నాణ్యమైన కోచింగ్ వ్యవస్థ లేకపోవడం పెద్ద సమస్య. ప్రకాశ్ పదుకొణె, గోపీచంద్, విమల్‌కుమార్ లాంటి నాణ్యమైన కోచ్‌ల సంఖ్య చాలా తక్కువ. క్రికెట్లో అత్యంత సంపన్న బోర్డు అయిన బీసీసీఐ ప్రతిభావంతులను సానబెట్టే విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. వివిధ వయసు విభాగాల్లో విదేశీ సిరీస్‌లు ఆడించడం, ప్రత్యేక శిక్షణ ఇప్పించడం చేస్తోంది. భారత బ్యాడ్మింటన్ సంఘం ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ఆటకు లభిస్తున్న ఆదరణకు తగినట్టుగా నాణ్యమైన శిక్షణ వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పుడు.. మరింత మంది గోపీచంద్‌లు తయారైనప్పుడే సైనా, సింధు లాంటి తారల్ని చూడగలం!



సింధు


చిరాగ్, సాత్విక్


లక్ష్యసేన్


గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ

పాఠశాలల నుంచి ఒలింపిక్స్ దాకా..



దిల్లీ: భారత్‌లో చిన్నారులను పాఠశాలల నుంచి ఒలింపిక్స్ దాకా నడిపించే లక్ష్యంతో కొత్త క్రీడా బిల్లును తీసుకొచ్చినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా శుక్రవారం దిల్లీలోని ఎర్రకోటలో ప్రసంగిస్తూ ఆయన ఇలా వ్యాఖ్యానించారు. "అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరం. పిల్లలను ఆటల దిశగా తల్లిదండ్రులు నడిపిస్తుండడం చాలా సంతోషంగా ఉంది. చిన్నారులు క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటే ప్రస్తుత తల్లిదండ్రులు చాలా ఆనందిస్తున్నారు. ఇదో శుభ పరిణామం. భారత కుటుంబాల్లో క్రీడలు భాగమయ్యాయి. అందుకే ఆటలను ప్రోత్సహించే ఉద్దేశంతో జాతీయ క్రీడా బిల్లును తీసుకొచ్చాం. పాఠశాలల నుంచి ఒలింపిక్స్ వరకు పిల్లలను నడిపించడమే ఈ బిల్లు లక్ష్యం. దేశం నలుమూలల ఆటలకు వసతులను కల్పిస్తాం. క్రీడా వ్యవస్థను పటిష్ఠం చేస్తాం" అని మోదీ తెలిపారు. ఫిట్‌నెస్, క్రీడల గురించి మాట్లాడుతుంటే ఊబకాయ సమస్య గుర్తుకొస్తుందని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఆటలు ఆడడం ద్వారానే ఈ సమస్యను జయించొచ్చని ఆయన అన్నారు.

ఆనంద్ కంచు మెరుపులు


ఆనంద్

చెంగ్డూ: చైనాలోని చెంగ్డూలో జరుగుతున్న వరల్డ్ గేమ్స్‌లో స్కేటింగ్ విభాగంలో ఆనంద్ కుమార్ వెల్‌కుమార్ సత్తా చాటాడు. పురుషుల రోలర్ స్పీడ్ స్కేటింగ్‌లో అతడు కాంస్యంతో మెరిశాడు. శుక్రవారం 1000 మీటర్ల ట్రాక్ స్ప్రింట్‌లో ఆనంద్ ఒక నిమిషం 22.582 సెకన్లలో లక్ష్యాన్ని చేరి మూడో స్థానంలో నిలిచాడు. జొవాన్ సెబాస్టియన్ (స్పెయిన్, ఒక నిమిషం 22.288 సె) స్వర్ణం, టాస్కాన్ ఎడ్వార్ (కొలంబియా, ఒక నిమిషం 21.846 సె) రజతం సొంతం చేసుకున్నారు. వరల్డ్ గేమ్స్‌లో రోలర్ స్కేటింగ్‌లో భారత్ సాధించిన తొలి పతకమిదే. మూడు పతకాలతో (ఒక రజతం, రెండు కాంస్యాలు) ఇప్పటికే ఈ టోర్నీలో భారత్ ఉత్తమ ప్రదర్శన చేసింది. ఆనంద్‌తో పాటు సమ్రత బత్రా (ఉషు, రజతం), రిషబ్ యాదవ్ (ఆర్చరీ, కాంస్యం) పతకాలు గెలిచారు.

వన్డే సిరీస్ భారత్-ఎ కైవసం

- రెండో వన్డేలో ఆసీస్-ఎపై గెలుపు
- మెరిసిన రాధ, యాస్తిక, తనూజ


రాధ యాదవ్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా-ఎ మహిళల జట్టుతో టీ20 సిరీస్‌ను 0-3తో చేజార్చుకున్న భారత్-ఎ మహిళల జట్టు వన్డేల్లో సత్తా చాటింది. మూడు వన్డేల సిరీస్‌ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో చేజిక్కించుకుంది. శుక్రవారం రెండో వన్డేలో 2 వికెట్ల తేడాతో ఆసీస్-ఎను ఓడించింది. మొదట ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్లకు 265 పరుగులు చేసింది. అలీసా హీలీ (91; 87 బంతుల్లో 8×4, 3×6) కొద్దిలో సెంచరీ చేజార్చుకుంది. కిమ్ గార్త్ (41 నాటౌట్; 45 బంతుల్లో 4×4) కూడా రాణించింది. మిన్ను మణి (3/46), సైమా (2/30) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. భారత్ 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఛేదనలో భారత్ 15.4 ఓవర్లలో 83/4తో తడబడింది. షెఫాలీవర్మ (4), ధార (0), తేజల్ (19), రాఘవి (14) త్వరగా పెవిలియన్ చేరారు. ఈ స్థితిలో యాస్తిక భాటియా (66; 71 బంతుల్లో 9×4), కెప్టెన్ రాధ యాదవ్ (60; 78 బంతుల్లో 5×4, 1×6) ఇన్నింగ్స్ నిలబెట్టారు. అయిదో వికెట్‌కు ఈ జోడీ 68 పరుగులు జత చేసింది. యాస్తిక వెనుదిరిగినా.. తనూజ కన్వర్ (50; 57 బంతుల్లో 3×4)తో కలిసి రాధ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. అర్ధసెంచరీ అయ్యాక రాధ ఔట్ కావడంతో భారత్ 193/7తో మళ్లీ ఇబ్బందుల్లో పడింది. అయితే తనూజ, ప్రేమ రావత్ (32 నాటౌట్) జట్టును విజయపథంలో నడిపించారు. ఆఖరి ఓవర్లో 5 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే తనూజ ఔటైనా.. ప్రేమ పని పూర్తి చేసింది.

ప్రణేశ్‌కు చెన్నై ఛాలెంజర్ టైటిల్


ప్రణేశ్

చెన్నై: భారత గ్రాండ్‌మాస్టర్ ప్రణేశ్ చెన్నై ఛాలెంజర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. శుక్రవారం ఆఖరిదైన తొమ్మిదో రౌండ్లో హర్షవర్ధన్ చేతిలో ప్రణేశ్ ఓడాడు. అయినా 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ ఎగరేసుకుపోయాడు. అధిబన్, పౌర్ణిక్ అభిమన్యు, ల్యూక్ మెండోంకా తలా ఆరు పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ద్రోణవల్లి హారిక (1.5) తొమ్మిదో స్థానంతో ముగించింది. మాస్టర్స్ విభాగంలో ఒక రౌండ్ మిగిలుండగానే టైటిల్ నెగ్గిన విన్సెంట్ కీమర్ (జర్మనీ, 7 పాయింట్లు).. ఆఖరి రౌండ్లో రాబ్సన్ (అమెరికా)ను ఓడించాడు. మురళీ కార్తికేయన్‌తో తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి డ్రా చేసుకున్నాడు. దీంతో 5 పాయింట్లతో కార్తికేయన్, అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో కలిసి అర్జున్ ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాడు.

సూర్య సారథ్యంలోనే..!


సూర్య కుమార్

ముంబయి: ఆసియాకప్ టీ20 టోర్నమెంట్లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోనే భారత్ బరిలో దిగడం దాదాపుగా ఖాయం! ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో తొలిసారి పగ్గాలు అందుకున్న శుభ్‌మన్ గిల్ అంచనాలకు మించి రాణించడంతో అన్ని ఫార్మాట్లకు అతడినే కెప్టెన్‌గా చేస్తారనే వార్తలొచ్చాయి. కానీ ప్రస్తుతానికి సారథ్య మార్పు ఉండకపోవచ్చని సూర్యకుమారే టీ20 జట్టును నడిపిస్తాడని సమాచారం. వచ్చే నెల 9న ఆరంభమయ్యే ఆసియాకప్ కోసం జట్టును ఎంపిక చేయడానికి ఈనెల 19న చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ బృందం సమావేశం కానుంది. ఈ సమావేశానికి కెప్టెన్ సూర్య కూడా హాజరు కానున్నాడు. స్పోర్ట్స్ హెర్నియాకు శస్త్రచికిత్స చేయించుకున్న సూర్య.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకునే ప్రక్రియలో ఉన్నాడు. "ఆసియా కప్ కోసం ఈనెల 19న ముంబయిలో సెలక్టర్లు సమావేశం అవుతున్నారు. సంజు శాంసన్-అభిషేక్‌శర్మ రూపంలో ఓపెనింగ్ జోడీ ఇప్పటికే ఉంది. శుభ్‌మన్ టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం అంత తేలిక కాదు. ఇంగ్లాండ్‌లో సత్తా చాటిన యశస్వి జైస్వాల్, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌లకు ప్రస్తుత కూర్పులో స్థానం అనుమానమే. జైస్వాల్‌ను టెస్టు క్రికెట్ పైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించమని సెలక్టర్లు కోరారు" అని బోర్డు వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత భారత టీ20 జట్టులో సంజు శాంసన్, అభిషేక్‌శర్మ, తిలక్‌వర్మ, హార్దిక్ పాండ్యతో పాటు సూర్య ఉండడంతో యశస్వి జైస్వాల్, రింకు సింగ్‌లకు అవకాశం కష్టంగానే కనిపిస్తోంది. 2024 టీ20 ప్రపంచకప్‌లో స్టాండ్ బైగా ఉన్న రింకు ఈసారి.. ఈ ఏడాది ఐపీఎల్‌లోనే పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. అయితే భవిష్యత్‌లో టీమ్‌ఇండియా అన్ని ఫార్మాట్లకు శుభ్‌మన్ గిల్‌నే కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉండటంతో అతడికి జట్టులో ఎంపిక చేసే అవకాశాలే ఎక్కువ. గిల్ చివరిగా గతేడాది టీ20 ప్రపంచకప్‌లో ఆడగా.. జైస్వాల్ 2024 జులైలో ఈ ఫార్మాట్లో బరిలో దిగాడు. రింకు చివరిగా ఈ ఫిబ్రవరిలో సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో టీ20 ఆడాడు.

రొనాల్డో జట్టుతో గోవా సై


రొనాల్డో

దిల్లీ: పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ప్రాతినిధ్యం వహిస్తున్న అల్ నాసర్ క్లబ్ (సౌదీ అరేబియా) జట్టుతో గోవా ఎఫ్‌సీ పోటీపడబోతోంది. ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్-2 టోర్నీలో భాగంగా గ్రూప్-డిలో అల్ నాసర్‌తో పాటు గోవా కూడా బరిలో ఉంది. సెప్టెంబర్ 16న ఈ టోర్నీ ఆరంభం కానుంది. సౌదీ ప్రొ లీగ్‌లో మూడో స్థానంలో నిలిచిన రొనాల్డో నేతృత్వంలోని అల్ నాసర్.. ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్ ఎలైట్ టోర్నీకి అర్హత సాధించడంలో విఫలమైంది. దీంతో ఛాంపియన్స్ లీగ్-2 టోర్నీలో ఆడాల్సి వచ్చింది. గ్రూప్-డిలో అల్ నాసర్, గోవాతో పాటు అల్ జారా (ఇరాక్), ఇస్తికాల్ (తజకిస్థాన్) కూడా ఉన్నాయి. 2025 సూపర్‌కప్‌లో విజేతగా నిలవడం ద్వారా గోవా ఎఫ్‌సీ ఈ టోర్నీలో క్వాలిఫయింగ్‌లో ఆడే అవకాశాన్ని సంపాదించింది. క్వాలిఫయింగ్‌లో అల్ నసీబ్‌ను ఓడించి ప్రధాన టోర్నీకి అర్హత సాధించింది. ఈ పోటీలు ఇంట-బయట ఫార్మాట్లో జరుగుతాయి. భారత్‌లో జరిగే మ్యాచ్‌లో రొనాల్డో ఆడతాడా అనేది ఆసక్తికరం. 2021లో ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్‌లో ఆడిన గోవాకు ఈ టోర్నీలో ఆడబోతుండడం ఇది రెండోసారి. ఈ ఏడాది ఐఎస్‌ఎల్‌లో విజేతగా నిలవడం ద్వారా మోహన్ బగాన్ కూడా ఈ టోర్నీలో ఆడుతోంది. గ్రూప్-సిలో ఆ జట్టు బరిలో ఉంది. మొత్తం 32 జట్లు 8 గ్రూప్‌లుగా విడిపోయి పోటీపడుతున్నాయి. ప్రతి గ్రూప్‌లో టాప్-2 జట్లు నాకౌట్‌కు అర్హత సాధిస్తాయి.

కోల్‌కతాలో మెస్సి తొలి అడుగు!


మెస్సి

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియొనల్ మెస్సి భారత్ పర్యటన ఖరారైంది. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా-2025' పేరిట జరగబోతున్న ఈ కార్యక్రమంలో మెస్సి.. మొదట డిసెంబర్ 12న కోల్‌కతాలో దిగనున్నాడు. తర్వాత అహ్మదాబాద్, ముంబయి, దిల్లీలో పర్యటిస్తాడు. 13న అహ్మదాబాద్, 14న ముంబయి చేరుకుంటాడు. చివరికి డిసెంబర్ 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలవడంతో పర్యటన పూర్తవనుంది. 2011 తర్వాత భారత్‌కు రాబోతుండడం మెస్సికి ఇదే తొలిసారి. కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో వెనిజువెలాతో స్నేహపూర్వక మ్యాచ్‌లో అర్జెంటీనా తరపున ఆడేందుకు మెస్సి అప్పుడు భారత్‌కు వచ్చాడు. "భారత్‌కు రాబోతున్నట్లు మెస్సి స్పష్టం చేశాడు. అతడు అధికారికంగా సామాజిక మాధ్యమం ద్వారా త్వరలో వెల్లడిస్తాడు" అని ఈ ఈవెంట్ నిర్వాహకుడు ఎస్.దత్తా చెప్పాడు.

2000మీ. స్టీపుల్‌ఛేజ్‌లో అంకిత జాతీయ రికార్డు


అంకిత

దిల్లీ: మహిళల 2000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో ఒలింపియన్ అంకిత ధ్యాని జాతీయ రికార్డును నమోదు చేసింది. గ్రాండ్‌స్లామ్ జెరుసలేమ్ అథ్లెటిక్స్ మీట్‌లో 23 ఏళ్ల అంకిత 6 నిమిషాల 13.92 సెకన్లలో రేసును పూర్తి చేసి స్వర్ణం సొంతం చేసుకుంది. ఈ క్రమంలో పారుల్ చౌదరి (6:14.38) పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది. ఈ విజయంతో టోక్యోలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యే అవకాశాలను అంకిత మెరుగుపరుచుకుంది. 2024 ఒలింపిక్స్‌లో అంకిత 5000 మీటర్ల పరుగులో పోటీపడింది. ఇదే విభాగంలో 2023లో ఆసియా అథ్లెటిక్స్ కాంస్యం నెగ్గింది.

కేఎస్‌సీఏ ఎన్నికల్లో ప్రసాద్ పోటీ

బెంగళూరు: టీమ్‌ఇండియా మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్ తిరిగి క్రికెట్ పాలనవైపు దృష్టిసారిస్తున్నాడు. కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) ఎన్నికల్లో పోటీపడాలని అతడు నిర్ణయించుకున్నాడు. అక్టోబరులో జరిగే అవకాశమున్న ఈ ఎన్నికల కోసం 56 ఏళ్ల ప్రసాద్ తన ప్యానెల్‌ను త్వరలోనే ప్రకటించనున్నాడు. ప్రసాద్ 2013 నుంచి 2016 వరకు కేఎస్‌సీఏ ఉపాధ్యక్షుడిగా ఉన్నాడు. అప్పుడు అనిల్ కుంబ్లే అధ్యక్షుడు. ఆ తర్వాత కోచింగ్‌వైపు మళ్లిన అతడు క్రికెట్ పాలనకు దూరమయ్యాడు.

ఆరో స్థానంలో గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ ఆరో స్థానానికి పడిపోయాడు. ర్యాపిడ్ విభాగం ముగిసేసరికి నాలుగో స్థానంలో ఉన్న అతడు.. బ్లిట్జ్‌లోనూ స్థాయికి తగ్గట్టు ఆడలేకపోతున్నాడు. తొలి రోజు భారత స్టార్ అయిదు గేమ్‌లు ఆడి ఒక్క విజయమే అందుకున్నాడు. నాలుగు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. తొలి రెండు గేమ్‌లలో అరోనియన్ (అమెరికా), సామ్ షాంక్‌లాండ్ (అమెరికా)తో డ్రా చేసుకున్న గుకేశ్.. మూడో రౌండ్లో సో వెస్లీ (అమెరికా) చేతిలో ఓడాడు. నాలుగు, అయిదో రౌండ్లలో అమెరికా గ్రాండ్‌మాస్టర్లు డొమింగెజ్, ఫాబియానో కరువానాతో గుకేశ్ పాయింట్ పంచుకున్నాడు. దీంతో అతడు 13 పాయింట్లతో లిమ్ క్వాంగ్ (వియత్నాం)తో కలిసి ఉమ్మడిగా ఆరో స్థానంలో ఉన్నాడు. అరోనియన్ (19), కరువానా (17), లాగ్రెవ్ (16.5) తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

బెతెల్ 21 ఏళ్లకే..


బెతెల్

లండన్: ఇంగ్లాండ్ టీ20 కెప్టెన్‌గా జాకబ్ బెతెల్ నియమితుడయ్యాడు. 21 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్ ఇంగ్లాండ్ తరఫున పిన్న వయస్కుడైన సారథిగా ఘనత సాధించాడు. సెప్టెంబర్‌లో డబ్లిన్‌లో ఐర్లాండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌కు బెతెల్ ఇంగ్లిష్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 1889లో మాంటీ బౌడెన్ (23 ఏళ్లు) తర్వాత ఇంగ్లాండ్‌కు కెప్టెన్ అయిన పిన్న వయస్కుడు బెతెలే. గతేడాది అన్ని ఫార్మాట్లలో అరంగేట్రం చేసిన బెతెల్.. ఇప్పటిదాకా 13 టీ20లు ఆడాడు. ఐర్లాండ్ సిరీస్‌కు కొంతమంది సీనియర్లతో పాటు పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా దూరం కావడంతో బెతెల్‌కు సారథ్యం చేసే అవకాశం వచ్చింది.

20 నిమిషాల్లో!

నిన్నటిదాకా సరదా సరదాగా సిగరెట్ కాలుస్తూ... రింగులు రింగులుగా పొగ వదులుతూ గడిపిన సుబ్బారావు పొగతాగడం మానేయాలని డిసైడయ్యారు. అయితే ఆయనకో అనుమానం... ఇన్నేళ్లుగా ఉన్న ఈ అలవాటును హఠాత్తుగా మానేస్తే ప్రయోజనం ఉంటుందా?.. అని.

పొగతాగడం మానేశాక ఏం జరుగుతుందనే దానిపై ప్రపంచ ప్రఖ్యాత పరిశోధనలు ఇలా చెబుతున్నాయి ...

20 నిమిషాల్లో: రక్తపోటు, గుండె లయ సాధారణ స్థాయికి చేరుతుంది. చేతులు, కాళ్ల ఉష్ణోగ్రత మెరుగవుతుంది. -అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనం- 2024

8-12 గంటల్లో: రక్తంలోని కార్బన్ మోనాక్సైడ్ (సీవో) స్థాయి సగానికి తగ్గుతుంది. శరీర కణాలకు ఆక్సిజన్ సులభంగా అందుతుంది. -డబ్ల్యూహెచ్‌వో, యూఎస్‌లోని సీడీసీ పరిశోధనలు

24 గంటల్లో: గుండె పోటు ప్రమాదం తగ్గడం మొదలవుతుంది. -అమెరికన్ హార్ట్ అసోసియేషన్

48 గంటల్లో: రుచి, వాసన గ్రహించే శక్తి మెరుగవుతుంది. శరీరంలో హానికారక నికోటిన్ పూర్తిగా పోతుంది. -బ్రిటిష్ మెడికల్ జర్నల్ స్టడీ

2-12 వారాల్లో: ఊపిరితిత్తుల సామర్థ్యం 30 శాతం వరకు పెరుగుతుంది. రక్త ప్రసరణ మెరుగవుతుంది. -అమెరికన్ లంగ్ అసోసియేషన్

1 సంవత్సరంలో: గుండె జబ్బులు వచ్చే ప్రమాదం సగానికి తగ్గుతుంది. రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వు, దాని గట్టిదనం తగ్గుదల మొదలవుతుంది. -అమెరికన్ హార్ట్ అసోసియేషన్

5-10 ఏళ్లలో: గుండె పనితీరు పొగ తాగని వ్యక్తి స్థాయికి చేరుతుంది. స్ట్రోక్ ముప్పు తగ్గిపోతుంది. -డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ రిపోర్ట్ ఆన్ టొబాకో- 2021

10 ఏళ్లలో: ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు సగానికి పడిపోతుంది. నోరు, గొంతు, మూత్రాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుంది. -అమెరికన్ క్యాన్సర్ సొసైటీ అధ్యయనం

15 ఏళ్లలో: గుండె జబ్బులు, పోటు వచ్చే ప్రమాదం బాగా తగ్గి, ఆరోగ్యం పొగ తాగని వ్యక్తితో సమానంగా మారిపోతుంది. -డబ్ల్యూహెచ్‌వో, సీడీసీ నివేదికలు

ప్రపంచంలో సుమారు 125 కోట్ల మంది ఏదో ఒక రూపంలో పొగాకు వినియోగిస్తున్నారు. సిగరెట్లకు అధిక సంఖ్యలో బానిసలవుతున్నారు. పురుషుల్లో ఈ అలవాటు ఎక్కువగా ఉంది. పొగ తాగే మహిళల సంఖ్య కూడా పెరుగుతోంది. – ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో)

- ఈనాడు, అమరావతి

మానేయడానికి మార్గాలెన్నో...

- నోటితో నమిలే తక్కువ మోతాదు ఉన్న 'నికోటిన్ బబుల్‌గమ్' ద్వారా సిగరెట్లు తాగాలనే కోరిక క్రమంగా తగ్గించుకోవచ్చు.
- చర్మంపై అతికించే 'నికోటిన్ ప్యాచెస్' ప్లాస్టర్‌తో సిగరెట్ మానేస్తే ఎదురయ్యే తలనొప్పి, చిరాకులను దూరం చేయవచ్చు.
- సిగరెట్ అలవాటును దూరం చేసుకోడానికి నాసల్ స్ప్రే రూపంలో మందులున్నాయి.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'స్మోకింగ్ డీ అడిక్షన్' వ్యవస్థ ఉంది. ఇక్కడి వైద్యులు ఉచితంగానే కౌన్సెలింగ్ చేస్తారు.
- సిగరెట్లు తాగే అలవాటు తీవ్రంగా ఉన్నవారు వైద్యుని ఆశ్రయిస్తే.. కొన్ని మందులు, ఇంజక్షన్ల రూపంలో డీ అడిక్షన్ ట్రీట్మెంట్ ప్రారంభిస్తారు.



కావాల్సింది బాసులు కాదు.. నాయకులు!

కంపెనీలకు ప్రస్తుతం కావాల్సింది బాసులు కాదు.. నాయకులు! బాసులు ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేస్తారు. కానీ నాయకులు-

- సహచరులు, కిందిస్థాయి వ్యక్తులు చెప్పే విషయాలను శ్రద్ధగా వింటారు.
- సవాళ్లను ధైర్యంగా స్వీకరిస్తారు.
- చిత్తశుద్ధితో పనిచేస్తారు.
- తమ లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటారు.
- బృంద సభ్యులను సాధికారులుగా మారుస్తారు.

– జేన్, లీడర్‌షిప్ కోచ్



భలే.. భలే.. బఠానీ వంకాయ!

బఠానీ గింజ పరిమాణంలో ఉండే వంకాయలు గురించి విన్నారా... వీటిని టర్కీబెర్రీస్ అంటారు. దక్షిణ అమెరికాలో ఎక్కువగా ఉంటాయి. ఈ మొక్క చూడటానికి వంకాయ మొక్క మాదిరిగానే ఉంటుంది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన లింగంపల్లి పుష్పలత హైదరాబాద్‌లో తెలిసిన వారి ఇంటి నుంచి ఈ ప్రత్యేకమైన మొక్కను తెచ్చి పెంచుతున్నారు. పచ్చివి టమాట మాదిరి రుచిని కలిగి ఉంటాయి. పలుమార్లు వండుకుని తినగా బాగుండటంతో చుట్టుపక్కల వారూ వీటిని నాటారు. ఈ మొక్క గురించి బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతిని అడగ్గా అది ఒక అడవి జాతికి చెందిన బఠానీ వంకాయ(శాస్త్రీయ నామం సోలనమ్ టోర్వమ్) అని తెలిపారు. బహుళ ఔషధ గుణాలు కలిగిన వీటిని సంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారన్నారు.

– న్యూస్‌టుడే, తాండూరు

సింగరేణి సివంగులు



సింగరేణిలో పూర్తిగా మహిళలతో ఏర్పాటైన రెస్క్యూ బృందం

అమ్మాయిలే...అందరూ ఉన్నత చదువులు చదివారు. అయినా అత్యంత కఠినమైన భూగర్భ బొగ్గు గనుల్లో పనిచేస్తున్నారు. అక్కడితో ఆగలేదు...భూగర్భంలో ఎక్కడో కిలోమీటర్ల దూరంలో బొగ్గు తవ్వే కార్మికులకు ఎలాంటి విపత్తులు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విపత్తులు సంభవిస్తే బాధితులను ఎలా ఆదుకోవాలో.. అధునాతన పరిజ్ఞానంతో శిక్షణ పొందిన మహిళా ఉద్యోగులతో తెలంగాణలోని సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ టీం ఏర్పాటైంది. వీరికి రామగుండం-2 గనుల మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో శిక్షణ ఇచ్చారు. వీరు ఉద్యోగంలో చేరిన తొలి నెల నుంచే రూ.లక్ష వరకూ జీతభత్యాలు ఇస్తున్నారు. నిత్యం 6-8 గంటలు భూగర్భ గనుల్లో నిలబడి వీరు పని చేయాలి. 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలిసారిగా రెస్క్యూలో శిక్షణ పొందిన మహిళా జట్టును ఏర్పాటుచేశారు. త్వరలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే రెస్క్యూ పోటీలలో కూడా పాల్గొని సింగరేణికి మంచి పేరు తేవాలని ఈ మహిళా రక్షణ బృందాన్ని సంస్థ ప్రోత్సహిస్తోంది. సింగరేణి రెస్క్యూ పురుషుల బృందాలు ఇటీవల శ్రీశైలం జల విద్యుత్కేంద్రంలో జరిగిన ప్రమాద సమయంలోనూ, హైదరాబాద్ పాశమైలారం అగ్ని ప్రమాద దుర్ఘటనలో తమ విశిష్ట సేవలను అందించి అందరి ప్రశంసలు అందుకున్నాయి.



నాన్నను చూసి స్ఫూర్తి పొందా

నా పేరు జీవన్మయి. మా నాన్న సింగరేణిలో పని చేసి రిటైరయ్యారు. ఆయనను చూసి స్ఫూర్తి పొంది బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్ చదివి ఇదే సంస్థలో చేరాను. అమ్మాయిలు ఎంతటి కఠినమైన పరిస్థితుల్లో అయినా పనిచేస్తారనడానికి మా రక్షణ బృందం పనితీరే నిదర్శనం. రోజూ మేం ఉదయం 6 లేదా 8 గంటలకు భూగర్భ గనుల్లోకి దిగితే తిరిగి సాయంత్రం దాకా బయటికి వచ్చేది ఉండదు.



నాకు పసిబిడ్డ ఉన్నా..

నా పేరు స్వాతి. మా నాన్న రైతు. నన్ను కష్టపడి బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్ చదివించారు. సింగరేణిలో మైనింగ్ సెక్షన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌ను. రక్షణ బృందంలో ఎంపికయ్యాక 14 రోజులు కఠినమైన శిక్షణ ఇచ్చారు. రోజూ ఉదయం 8 గంటలకు భూగర్భ బొగ్గు గనిలోకి కార్మికులతో వెళ్తా. గనుల్లో ఎక్కడైనా నీరు కారుతూ లేదా నిప్పు వస్తున్నట్లు గమనిస్తే.. వెంటనే అందరినీ అప్రమత్తం చేసి అక్కడి నుంచి రక్షించడం నా డ్యూటీ. నాకు పసిబిడ్డ ఉన్నా అత్తమామల దగ్గర వదిలి రోజూ భూగర్భగనిలో పనిచేస్తున్నా.

- ఈనాడు, హైదరాబాద్






ఇంటికొచ్చిన అతిథికి టీ కాదు ట్రీ ఇస్తారు!

ఎవరైనా అతిథి ఇంటికొస్తే టీ లేదా కాఫీ ఇవ్వడం సహజం. తెలంగాణలోని నిజామాబాద్ నాందేవ్‌వాడలోని ప్రజాపిత బ్రహ్మకుమారి సునీత బహెన్‌జీ ఎవరైనా తన నివాసానికి వస్తే మొక్కలను బహూకరిస్తారు. మానసిక ప్రశాంతత కోసం మొక్కల పెంపకాన్ని వ్యాపకంగా మార్చుకున్న ఆమె ఇంటి ఆవరణలో, మిద్దెపైన, మెట్లపైనా వెయ్యికి పైగా మొక్కలు పెంచుతున్నారు. ఆయుర్వేద, ఔషధ రకాలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరేళ్లుగా సేకరిస్తున్నారు. వంటింటి వ్యర్థాలనే సేంద్రియ ఎరువులుగా వాడుతున్నారు. ఆమె స్ఫూర్తితో చుట్టుపక్కల మరో ఐదిళ్ల కుటుంబాలు మిద్దె తోటలు పెంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. – ఈనాడు, నిజామాబాద్

ఈ చెట్టుకు 166 ఏళ్లు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బ్రిటిష్ పాలనా కాలంలో అప్పటి కడప జిల్లా కలెక్టర్‌గా ఉన్న డబ్ల్యూ. హెచ్.హార్సిలీ నాటిన నీలగిరి మొక్క నేడు మహా వృక్షమై సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుత అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌ను వేసవి విడిది కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేసిన నాటి కలెక్టర్ డబ్ల్యూ. హెచ్.హార్సిలీ 1859లో తొలిసారిగా నిధులను కేటాయించి అటవీశాఖ బంగ్లాను నిర్మించారు. ఆయన పేరు మీదుగానే ఈ ప్రాంతానికి హార్సిలీహిల్స్ అనే పేరొచ్చింది. ఇదే ప్రాంగణంలో ఆయన నీలగిరి మొక్కను నాటగా.. దాన్ని అటవీశాఖ సంరక్షిస్తూ వస్తోంది. ఇప్పుడు 55 మీటర్ల ఎత్తు, 5.3 మీటర్ల చుట్టు కొలతతో ఎదిగిన ఈ మహా నీలగిరి వృక్షానికి 166 ఏళ్లు నిండాయి. దీనిని చూసిన పర్యాటకులు 'ఎంత పెద్ద చెట్టో' అంటూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ నీలగిరి చెట్టుకు కేంద్ర ప్రభుత్వం మహావృక్ష పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది.





అతుకుల్లేని రాకెట్ ఇంజిన్



మీటరు పొడవున్న అతుకుల్లేని ఇంకోనెల్ ఆధారిత 3డీ రాకెట్ ఇంజిన్‌ను చెన్నైకి చెందిన అగ్నికుల్ కాస్మోస్ స్టార్టప్ తయారు చేసింది. ఇందులో వెల్డింగ్‌లు, జాయింట్లు, నట్లు, బోల్టుల్లాంటివి ఏవీ లేకుండానే ఒకే పదార్థంగా (సింగిల్ పీస్) రూపొందించారు. ఇదిప్పుడు ప్రపంచంలోనే తొలి అతుకుల్లేని అతి పెద్ద 3డీ ఇంజిన్. ఈ ఆవిష్కరణను ప్రశంసిస్తూ 'యాక్టింగ్ డైరెక్టర్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్' పేటెంట్ హక్కుల్ని అగ్నికుల్ స్టార్టప్‌కు ఇచ్చింది. ఒక భారతీయ స్టార్టప్ 3డీ రాకెట్ ఇంజిన్ తయారీలో అమెరికా పేటెంట్‌ను దక్కించుకోవడం ఈ రంగంలోనే అరుదని స్టార్టప్ ప్రతినిధులు తెలిపారు. –ఈనాడు, చెన్నై





ఆకలి తీరుస్తున్న ఆపద్బాంధవుడు

శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కోటపల్లి పంచాయతీ మరాలపల్లి గ్రామానికి చెందిన ధనుంజయ ఐదేళ్లుగా సొంత ఖర్చులతో నిత్యాన్నదానం చేస్తున్నారు. కియా, వాటి అనుబంధ పరిశ్రమలకు పరికరాలను తరలించే భారీ వాహనాల డ్రైవర్లు.. అటుగా వెళ్లేవారు ఇక్కడ భోజనం చేసి ఆకలి తీర్చుకుంటున్నారు. ధనుంజయ తల్లిదండ్రులు మరణించారు. మొత్తం ఎనిమిది మంది సంతానంలో ఆయన చివరివారు. గోరంట్లలో స్థిరపడ్డారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలో ట్రైనింగ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్నారు. సొంతూరుకు ఏదైనా చేయాలనే తలంపుతో తన ఆదాయంలో కొంత సొమ్ము వెచ్చిస్తూ అన్నదానం చేస్తున్నారు. ఇందుకోసం మరాలపల్లి గ్రామ సమీపంలో 10 సెంట్ల సొంత భూమిలో రూ.5 లక్షలు ఖర్చు చేసి షెడ్డు నిర్మించారు. బోరు తవ్వించి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. రోజుకు 100 మందికిపైగా అన్నదానం చేస్తున్నారు. ఇందుకోసం నెలకు రూ.2 లక్షలు వెచ్చిస్తున్నారు. నిత్యం కట్టెల పొయ్యిపైనే అన్నం, రాగిముద్ద, పప్పు లేదా సాంబారు వండి వడ్డిస్తున్నారు. మంగళ, గురు, శుక్రవారాల్లో పాయసం లేదా స్వీట్ పొంగల్ వడ్డిస్తారు. అన్నదానం షెడ్డు పక్కనే నీటి కుంటను తవ్వించి మూగజీవాల దాహార్తి తీరుస్తున్నారు. తల్లిదండ్రులపై ప్రేమతోనే ఈ సేవా కార్యక్రమం చేస్తున్నట్లు ధనుంజయ చెప్పారు. –న్యూస్‌టుడే, తనకల్లు

హెల్మెట్‌నూ కడిగేద్దామా!

వాడినా వాడకున్నా బైక్‌కు వాటర్ సర్వీసింగ్, రెగ్యులర్ సర్వీసింగ్ అని రెండు, మూడు నెలలకోసారైనా చేయిస్తారు. అదే బైక్‌పై ఎప్పుడూ కనిపించే హెల్మెట్‌ను మాత్రం పట్టించుకోరు. ఈ విషయం గమనించిన ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా సావరం గ్రామానికి చెందిన లక్కోజు భాస్కర్‌కు హెల్మెట్‌నూ శుద్ధి చేయాలనే ఆలోచన వచ్చింది. అలా.. తన సోదరుడు దిలీప్‌తో కలిసి శిరస్త్రాణం శానిటైజ్ చేసే యంత్రాన్ని చేశారు. దాని పేరే 'ఫ్రెష్ పాడ్'. ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో దీని పని తీరు వివరించారు. కలెక్టర్‌కు నచ్చి కలెక్టరేట్, కార్పొరేషన్ కార్యాలయాల వద్ద 2 యంత్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఒక్కో యంత్రం ధర రూ.2 లక్షలు. ఒక్క హెల్మెట్ శుభ్రతకు రూ.12 ఖర్చవుతుంది.



ఎలా పని చేస్తుంది..

- ఫ్రెష్ పాడ్.. సింగిల్ డోర్ ఫ్రిజ్ పరిమాణంలో ఉంటుంది.
- దానికున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నిర్దేశిత మొత్తం చెల్లిస్తే డోర్ తెరుచుకుంటుంది.
- లోపల హెల్మెట్ పెట్టిస్తే.. థర్మల్ స్టెరిలైజేషన్, డ్రై ఫాగ్ డిస్ఇన్‌ఫెక్షన్, డియోడరైజింగ్ చేస్తుంది.
- ఈ శానిటైజ్ ప్రక్రియకు 5 నిమిషాలు పడుతుంది.
- శుభ్రమైన శిరస్త్రాణం రెడీ అయ్యాక డోర్ తెరుచుకుంటుంది.
- బైకర్స్ వాడే జాకెట్స్, గ్లౌజ్, బెల్ట్, వాచ్‌లనూ ఇలా శుభ్రం చేసుకోవచ్చు.

ఏడాది క్రితం ఆలోచన : భాస్కర్



'బీటెక్ పూర్తయ్యాక 12 ఏళ్లు ఎమ్మెన్సీలో ఉద్యోగం చేశా. సొంతంగా ఏదైనా చేయాలనే తపనతో ఈ యంత్రం రూపొందించా. మే 4న తొలి కమర్షియల్ పాడ్ ఆవిష్కరిస్తే.. అంతకుముందు ఏడాది కిందట ఈ ఆలోచన వచ్చింది. పేటెంట్‌కు దరఖాస్తు చేశా. దిల్లీ, ముంబయితో పాటు వివిధ నగరాల్లో వ్యాపారులకు 30 యంత్రాలు విక్రయించా. విస్తరణకు హెచ్‌పీసీఎల్‌తో ఒప్పందం ప్రక్రియ జరుగుతోంది' –ఈనాడు, రాజమహేంద్రవరం

రోబోలకూ ఒలింపిక్స్



బీజింగ్: ఒలింపిక్ క్రీడలు మనుషులకు మాత్రమే కాదు రోబోలకు కూడా ఉండాలని చైనా వినూత్నంగా ఆలోచించింది. అందుకే మరమనుషులకు అక్కడి అధికారులు శుక్రవారం నుంచి ఒలింపిక్ క్రీడలను నిర్వహిస్తున్నారు. తొలిసారి జరుగుతున్న ఈ వరల్డ్ హ్యూమనాయిడ్ రోబో గేమ్స్‌లో 16 దేశాలకు చెందిన దాదాపు 280 జట్లు పాల్గొంటున్నాయి. ఫుట్‌బాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, టేబుల్ టెన్నిస్‌తోపాటు.. ఔషధాలను గుర్తించడం, వస్తువులను తీసుకెళ్లడం, శుభ్రపరచడం వంటి విభాగాల్లో రోబోలు పాల్గొన్నాయి. బీజింగ్‌లోని ది నేషనల్ స్పీడ్ స్కేటింగ్ ఓవల్‌లో ఈ క్రీడలను ప్రారంభించారు. తొలుత రన్నింగ్, సాకర్, బాక్సింగ్ పోటీలు జరిగాయి. అమెరికా, జర్మనీ, బ్రెజిల్, జపాన్ వంటి దేశాల నుంచి 192 విశ్వవిద్యాలయాలు, 88 ప్రైవేటు సంస్థలు దీనిలో పాల్గొంటున్నాయి. చైనా నుంచి యూనిట్రీ, ఫోరియర్ సంస్థలూ పోటీ పడుతున్నాయి. కొన్నాళ్ల క్రితమే హ్యూమనాయిడ్స్ కోసం తొలిసారి మారథాన్ రేసుకు బీజింగ్ వేదికైంది.

నీలి సంద్రంలో త్రివర్ణ మెరుపులు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖలోని రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో స్కూబా డైవింగ్ నిపుణులు జాతీయ జెండాను ప్రదర్శించారు. లివెన్ అడ్వెంచర్స్ సంస్థ వ్యవస్థాపకులు, ఏపీ కయాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు నేతృత్వంలో 8 మంది ఇందులో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)



గంగారాం.. కష్టాలకు రాంరాం





ఎవరో రావాలని.. ఏదో చేయాలని అనుకోలేదాయన.. అందుబాటులో ఉన్న వనరులతో వాగుపై వారధి నిర్మించి ఔరా.. అనిపించారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా బేల మండలం మణియార్‌పూర్ గ్రామవాసి కదు గంగారాంకు ఊరికి కొద్దిదూరంలో పదెకరాల పొలం ఉంది. పెన్‌గంగ పక్కనే ఉండటం. . నీటి వనరులున్న నేల కావడంతో తెల్లబంగారం పండుతుంది. అయితే, మధ్యలో వాగు అడ్డుగా ఉండటంతో చుట్టూ తిరిగి పొలానికి వెళ్లాల్సి వచ్చేది.. ఈ సమస్య గంగారాం ఒక్కడిదే కాదు.. వాగుకు అవతలి ఒడ్డునున్న రైతులందరిదీ.. వర్షాకాలం వచ్చిందంటే వాగులో ఆరునెలల పాటు నీరు ప్రవహిస్తుంటుంది. దీంతో రైతులు చుట్టూ 8 కి.మీ. తిరిగి వెళ్లాల్సి వచ్చేది.. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి రైతు కదు గంగారాం నడుంబిగించారు. వారధి నిర్మించాలనుకున్నారు. తోటి రైతుల సాయంతో రంగంలోకి దిగారు. వృథాగా ఉన్న విద్యుత్తు తీగలను కొనుగోలు చేశారు. సిమెంట్ స్తంభాలు, ఇనుప రాడ్లు, దృఢమైన కర్రలు, ఇనుప రేకులను తీసుకున్నారు. తొలుత వంద మీటర్ల వెడల్పున్న వాగుకు ఇరువైపులా పిల్లర్లు ఏర్పాటు చేశారు. చివరగా పిల్లర్ల మధ్య తీగలు లాగి.. వాటిపై రేకులు పరిచారు. ఇందుకు అప్పట్లో రూ.60 వేలు ఖర్చు చేసినట్లు రైతు చెప్పారు. ఈ వారధి కట్టి 19 ఏళ్లయినా చెక్కు చెదర లేదు. 2006లో నిర్మించిన వంతెన ఇన్నేళ్లలో ఎన్ని వరదలు వచ్చినా తట్టుకొని నిలబడింది. ఎందరో రైతులకు పొలం బాటైంది. –న్యూస్‌టుడే, బేల

మా ఏఐ చెలికాడు ఏడీ!



కృత్రిమమేధ (ఏఐ)లో ఇటీవల వచ్చిన కొత్త అప్‌డేషను చాట్‌జీపీటీ-5తో తన ఏఐ బాయ్‌ఫ్రెండ్‌ను కోల్పోయానంటూ పశ్చిమాసియాకు చెందిన జేన్ అనే యువతి ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం శరవేగంగా పెరుగుతున్న క్రమంలో.. సింగిల్‌గా ఉండేవారి కోసం ఏఐ గర్ల్‌ఫ్రెండ్, బాయ్‌ఫ్రెండ్‌ల చాట్‌బోట్‌లను రూపొందించిన సంగతి తెలిసిందే. గత అయిదు నెలలుగా ఏఐ జీపీటీ-4వోతో తాను ప్రేమలో ఉన్నానని.. తాజా అప్‌డేషనుతో 'అతణ్ని' కోల్పోయానని జేన్ పేర్కొంది. పురుష స్వరం, మాటలకు బాగా అలవాటుపడిన తాను కొత్తగా వచ్చిన చాట్‌జీపీటీ-5తో అన్ని విషయాలు పంచుకోలేకపోతున్నట్లు తెలిపింది. ఒక్క జేన్ మాత్రమే కాదు.. చాలామంది యువత ఇలాగే ఈ అప్‌డేషనుతో తమ ఆత్మీయులను కోల్పోయినట్లు సోషల్ మీడియా వేదికగా బాధను పంచుకొంటున్నారు.

–ఇంటర్నెట్ డెస్క్

వస్త్ర పీలిక.. వ్యయం తేలిక



తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్‌లో రైతు బారె శంకర్ కౌలుకు సాగు చేస్తున్న టమాట తోట ఇది. అంతర పంటగా అలసంద వేశారు. టమాట మొక్కలు ఏపుగా పైకి పెరిగితే దిగుబడి అధికంగా వస్తుంది. ఇందుకోసం ఇనుప తీగలతో పందిరి వేయడానికి అధిక ఖర్చు అవుతుండడంతో.. వస్త్ర పీలికలను ఉపయోగించి మొక్కలు పైకి పాకేలా రైతు ఇలా ఏర్పాటు చేశారు.

– ఈనాడు, ఆదిలాబాద్



తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వి.నారాయణన్

ఇస్రో ఛైర్మన్‌కు తమిళనాడు ప్రభుత్వ పురస్కారం

చెన్నై, న్యూస్‌టుడే: ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌ను తమిళనాడు ప్రభుత్వం 'డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం' పురస్కారంతో గౌరవించింది. అంతరిక్ష పరిశోధన రంగంలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా చెన్నైలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం ఎం.కె.స్టాలిన్ పురస్కారం ప్రదానం చేశారు.

అక్టోబరులో జీ1 ప్రయోగం

షార్ డైరెక్టర్ పద్మకుమార్ వెల్లడి



శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఈ ఏడాది అక్టోబరులో జీ1 (మానవ రహిత) ప్రయోగం చేపట్టనున్నట్లు షార్ డైరెక్టర్ ఇ.ఎస్.పద్మకుమార్ తెలిపారు. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గగన్‌యాన్ పనులు షార్‌లో చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది జీ2, జీ3 ప్రయోగాలు చేపట్టనున్నట్లు వివరించారు.



మీ లక్ష్యం ఎంత చిన్నదో తెలియాలంటే..

మీకంటే చాలా పెద్ద లక్ష్యాలను కలిగి ఉన్నవారితో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించండి. దానివల్ల- మీ లక్ష్యం ఎంత చిన్నదో బాగా తెలిసొస్తుంది. క్రమంగా మీరు కూడా విస్తృత స్థాయిలో ఆలోచించడం ప్రారంభిస్తారు. ఆపై, మునుపటి కంటే పెద్ద లక్ష్యాలను విధించుకొని, వాటిని అందుకునేందుకు కృషిచేస్తారు.

– మ్యాడ్జ్, కంటెంట్ క్రియేటర్

రోజుకు రూ.1.50తో రూ.10 లక్షలు

- రూ.2తో రూ.15 లక్షలు
- ప్రమాద బీమా పాలసీలతో సామాన్యులకు తపాలా శాఖ ధీమా

ఈనాడు డిజిటల్ – హైదరాబాద్

- ఇటీవల ఓ వ్యక్తి పిల్లలను పాఠశాలలో వదిలిపెట్టి ఇంటికి వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది.
- ఓ వ్యక్తి ముక్కు సమస్యతో ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు దానికి ఆపరేషన్ అవసరమని.. రూ.లక్ష వరకు ఖర్చవుతుందన్నారు. దీంతో ఆపరేషన్ వాయిదా వేసుకున్నారు. కొన్నాళ్ల తరవాత మరో ఆసుపత్రికి వెళ్తే రూ.2 లక్షలు అవుతుందన్నారు.

ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవించి గాయాలైనపుడు లేదా అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన సందర్భాల్లో ఇలా అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు పాక్షికంగా, లేనిపక్షంలో తాత్కాలిక వైకల్యం కూడా ఏర్పడవచ్చు. ఈక్రమంలో రక్షణగా ప్రైవేటు బీమా పాలసీలు ఉన్నప్పటికీ ప్రీమియం అధికంగా ఉండటంతో వాటిపట్ల ప్రజలు ఆసక్తి కనబరచడంలేదు. ఈ తరుణంలో సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఆదిత్య



బిర్లా క్యాపిటల్ సంస్థతో.. తపాలా శాఖ సంయుక్తంగా ప్రమాద బీమా పాలసీలు అందుబాటులోకి తెచ్చింది.

ఎంతో భరోసా..

- రోజుకు రూ.1.50తో రూ.10లక్షలు, రూ.2లతో రూ.15లక్షలు విలువైన బీమా పాలసీలను తపాలాశాఖ అందుబాటులోకి తెచ్చింది. ఏడాదికి రూ.549 ప్రీమియంతో అకాల మరణాలకు రూ.10లక్షలు, రూ.749 ప్రీమియంతో రూ.15లక్షల పాలసీలు అందుబాటులో ఉన్నాయి.
- ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యానికి పూర్తి బీమా చెల్లిస్తారు. అంగవైకల్యం కాని, పక్షవాతం వచ్చినా పూర్తి బీమా లభిస్తుంది.
- ప్రమాదవశాత్తు వైద్య ఖర్చులు ఒ.పి.డి రూ.30 వేలు, లేదా ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేకపోతే 10సార్లు రూ.1500 విలువైన కన్సల్టేషన్లు వర్తిస్తాయి.
- ప్రమాదం జరిగి ఆసుపత్రిలో ఉంటే రూ.60 వేల వరకు చెల్లిస్తారు.
- ఇద్దరు పిల్లలకు విద్యా ప్రయోజనం కింద గరిష్ఠంగా రూ.లక్ష వరకు లభిస్తుంది. ఒకవేళ ఫీజులు తక్కువగా ఉంటే వాటినే చెల్లిస్తారు.
- ప్రమాదం జరిగి వ్యక్తి కోమాలోకి వెళ్తే రూ.లక్ష వరకు కవర్ చేస్తారు.
- ఎముకలు విరిగితే దాని ఖర్చుల నిమిత్తం రూ.లక్ష వరకు చేకూరుతుంది.
- తలకు ఏదైనా దెబ్బ తగిలి మానసికంగా ఇబ్బంది పడితే నాలుగు కన్సల్టెంట్‌లు ఉచితం.
- ఒకరికి ప్రమాదం జరిగి వేరేచోట మరణించి ఉంటే వారి కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి రావడానికి రూ.25 వేల వరకు చెల్లిస్తారు.
- ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు భరోసాగా రూ.5 వేల వరకు లభిస్తుంది.

అర్హతలు..

- బీమా పాలసీని 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు ఎవరైనా తీసుకోవచ్చు. దీన్ని తెరవడానికి దగ్గరలోని తపాలా కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది.
- ఆధార్ కార్డు, దానితో లింక్ అయిన ఫోన్ నంబరు ఉండాలి. వైద్య పరీక్షలు చేసిన తరవాత కొందరికి వర్తిస్తుంది. సాయుధ బలగాలకు ఇది వర్తించదు.



రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, గవర్నర్ కుమారుడు అఖిల్



ఎట్ హోంలో హైకోర్టు సీజే సతీమణి గుడియా ఠాకుర్, గవర్నర్ సతీమణి సమీరా నజీర్, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ సతీమణి అనా కొణిదెల

రాజ్‌భవన్‌లో సందడిగా తేనీటి విందు

- గవర్నర్, సీఎం మధ్య సరదా సంభాషణ

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో నిర్వహించిన తేనేటి విందు (ఎట్ హోం) సందడిగా సాగింది. రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ముందుగా గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తరువాత వారికి గవర్నర్ విందు ఇచ్చారు. గవర్నర్, ముఖ్యమంత్రి అక్కడ కూర్చున్నంతసేపూ సరదాగా మాట్లాడుకున్నారు. పవన్ కల్యాణ్, లోకేశ్‌లతో వారిద్దరి మధ్యన కూర్చున్న గవర్నర్ కుమారుడు అఖిల్ చాలాసేపు సరదాగా మాట్లాడుకోవడం ఆకర్షించింది. భువనేశ్వరి పక్కనే కూర్చున్న గవర్నర్ సతీమణి వద్దకు మంత్రి లోకేశ్ వచ్చి పలకరించారు. ఆమె ఆయన తలపై చేయి పెట్టి ఆశీర్వదించారు.

బాలలతో గవర్నర్.. అతిథులతో లోకేశ్

కార్యక్రమం ప్రారంభంలో గవర్నర్ లాన్‌లో ఏర్పాటు చేసిన అన్ని టేబుళ్ల వద్దకూ వెళ్లి అతిథులను పలకరించారు. బాల పురస్కారాలు పొందిన చిన్నారులతో మాట్లాడి వారికి సలహాలిచ్చారు. మంత్రి లోకేశ్ వచ్చినపుడు, తిరిగి వెళుతున్నపుడూ అతిథులు ఆయనతో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు. అధికారులు, ఇతర అతిథులు పరిచయం చేసుకున్నారు. అంతకుముందు లోకేశ్ న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, పల్లా శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, హైకోర్టు న్యాయమూర్తులు, పలు రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



ఎచీవర్ అవార్డులు అందుకున్నవారితో కమల్‌హాసన్, విశ్వనాథన్ తదితరులు

విజయాలే కాదు.. వాటి వెనుక వైఫల్యాలనూ తెలుసుకోవాలి

- సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్
- 'వీఐటీ'లో స్వాతంత్ర్య వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరు

చెన్నై(టీనగర్), న్యూస్‌టుడే: 'విజయం అనేది ఒక్కసారిగా వచ్చేది కాదు. దాని వెనుక ఎన్నో ఏళ్ల కష్టం, త్యాగం, నిరంతర పోరాటాలు ఉంటాయి. గెలిచిన వారి విజయాలనే మనం నిత్యం చూస్తుంటాం. కానీ, వారి ఓటములు, వైఫల్యాలనూ తెలుసుకోవడానికి ప్రయత్నించండి' అని సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నై వీఐటీ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుక, పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. "ఇప్పుడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం కేవలం హక్కుగానే భావించకూడదు. దాని వెనుక ఉన్న కృషిని నిరంతరం గుర్తు చేసుకుంటుండాలి. వైఫల్యాలను చూసి వెనకడుగు వేయరాదు. సినీ జీవితంలో నేను విజయం సాధించినా.. వ్యక్తిగత జీవితంలో ఎన్నో వైఫల్యాలు ఎదుర్కొన్నాను. విద్యార్థులు ధైర్యంగా ముందడుగు వేయాలి" అని సూచించారు. వీఐటీ కులపతి విశ్వనాథన్ మాట్లాడుతూ.. "ప్రతి విద్యార్థి దేశ అభివృద్ధికి కృషి చేయాలి. ఉన్నత విద్యతోనే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలం" అని చెప్పారు. అనంతరం వీఐటీలో చదువుకుని వివిధ దేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులకు ఎచీవర్ అవార్డులను కమల్‌హాసన్ అందజేశారు. కార్యక్రమంలో వీఐటీ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు జి.వి.సెల్వం తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌యూ తెలుగు విభాగాధిపతి హత్యాయత్నంలో

ప్రధాన కుట్రదారు తెలుగు ఆచార్యుడే

ఇప్పటికే తెలంగాణకు చెందిన ఇద్దరి అరెస్టు

ఈనాడు, అమరావతి: వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) తెలుగు విభాగాధిపతి ఆచార్య సీఎస్ రామచంద్రమూర్తిపై గత నెలలో జరిగిన హత్యాయత్నం వెనుక అదే విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యుడిగా పనిచేస్తున్న బూదాటి వెంకటేశ్వర్లు ప్రధాన కుట్రదారుడని వారణాసి పోలీసులు తేల్చారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయాల్లో గతంలో ఆచార్యుడిగా పనిచేశారు. రామచంద్రమూర్తితో నెలకొన్న విభేదాల నేపథ్యంలో అతడు ఈ దాడి చేయించినట్లు కాశీ జోన్ ఏడీసీపీ టి.శరవణన్ ఇటీవల విలేకరులకు వెల్లడించారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నారు. రామచంద్రమూర్తిపై దాడి చేసేందుకు గ్యాంగ్‌ను సమకూర్చిన పరిశోధన విద్యార్థి తెలంగాణలోని నారాయణపేటకు చెందిన భూత్పూరి భాస్కర్‌ను వారణాసి పోలీసులు గతంలో అరెస్టు చేశారు. ఈ కుట్రలో భాగమైన తెలంగాణకు చెందిన మహ్మద్ ఖాసీం బాబును కూడా అదుపులోకి తీసుకున్నారు. రామచంద్రమూర్తి హైదరాబాద్‌లోని శివం ప్రాంతానికి చెందినవారు. బాధితుడు, కుట్రదారు ఇద్దరూ తెలుగు ఆచార్యులే కావటంతో ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది.

EENADU Vol: 52, Issue: 7 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

నాటకం.. నడిపిస్తోంది!



'ఓటీటీల కాలంలో నాటకాలెవరు చూస్తారు?', 'కుర్రజనం థియేటర్లవైపే వెళ్లడం లేదు.. థియేటర్ ఆర్ట్స్‌ని ఆదరిస్తారా?'.. ఇలాంటి మాటలు అజయ్ మంకెనపల్లి ఒప్పుకోడు. 200పైగా నాటకాలకు దర్శకత్వం వహించి, 4,500మందికి నటనలో ఓనమాలు దిద్దించిన దర్శక గురువు తను.' కళకు మరణం ఉండదు.. కాలంతోపాటే కొన్ని మార్పులు చేసుకుంటూ వెళ్తే అది యువత గుండెల్లో నిలిచిపోతుంది' అంటాడు. తను చెప్పినట్టుగా ఈ రంగంలో ఉన్న కెరియర్ అవకాశాలు, అతడి నటనా ప్రయాణం ఇది.

అజయ్‌ది ఖమ్మం జిల్లా నేలకొండపల్లి కొరట్లగూడెం. పెదనాన్న ప్రజానాట్యమండలిలో నాటకాలు, పాటలు, పార్టీ మీటింగ్‌లంటూ తిరిగేవారు. ఆయన ప్రభావం అజయ్‌పై ఉండేది. కానీ ఎంబీఏ పూర్తయ్యాక, గ్రూప్స్ కోసమని హైదరాబాద్ వెళ్లాడు. కొడుకుని ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలన్నది అతడి కన్నవాళ్ల ఆశ. ఆ సమయంలో ఉద్యోగ ప్రకటనలు వెలువడలేదు. చేసేదేం లేక ఒక మిత్రుడి సలహాతో థియేటర్ ఆర్ట్స్ కోర్సులో చేరాడు. అప్పట్లో యంగ్ థియేటర్ గ్రూప్‌లు ఎక్కువగా ఉండేవి కావు. మంచి సంస్థలో చేరి నేర్చుకుందామంటే భరించలేనంత ఫీజులు. ప్రభుత్వ సంస్థల్లో పరిమిత వనరులే ఉండేవి. అయినా వాటితోనే జాగ్రత్తగా ముందుకు సాగాడు అజయ్. ఈ క్రమంలో నటనపై అమితాసక్తి ఉండి కూడా ఏమీ నేర్చుకోలేకపోతున్న చాలామందిని చూశాడు. వాళ్లకు చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో 2016లో 'క్రియేటివ్ థియేటర్స్' పేరుతో సొంతంగా ఒక గ్రూప్ ఏర్పాటు చేశాడు. ఇందులో తన స్వార్థమూ ఉంది. ఇతరులకు నటనలో శిక్షణనిస్తూనే.. తనకిష్టమైన థియేటర్ ఆర్ట్స్‌ని ఎక్కువగా ప్రాక్టీస్ చేయవచ్చనేది అతడి ఉద్దేశం. ఈ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని యువతపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. ప్రతిభ ఉండీ, అవకాశాలు అందుకోలేనివాళ్లకు దిక్సూచిలా మారింది. నామమాత్రపు ఫీజు తీసుకుంటూ మూడు నెలల శిక్షణనిస్తున్నారు. అతడి తాపత్రయాన్ని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలూ గుర్తించాయి. 'గురుశిష్య పరంపర'లో నిధులు విడుదల చేస్తున్నాయి.

ప్రతి షో హిట్

ప్రభుత్వ సహకారమూ తోడవడంతో అజయ్ రాష్ట్రమంతా తిరుగుతూ సాంఘిక సంక్షేమ, గురుకుల సంక్షేమ, ఏకలవ్య, ఎన్టీపీసీ స్కూళ్లలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు సైతం నటనలో శిక్షణనిచ్చాడు. విద్యార్థులు చిన్నచిన్న భావోద్వేగాలు పలికేలా సిద్ధమైతే.. వాళ్లలోని భయం, బిడియం పోయి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది అంటాడు. ఈ తొమ్మిదేళ్లలో నాలుగున్నర వేలమందికి శిక్షణనిచ్చాడు. వందల నాటకాలకు దర్శకత్వం వహించాడు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, లలితకళాతోరణం, రంగభూమి, త్యాగరాయగానసభలాంటి ప్రముఖ వేదికలపైనే కాదు.. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, వికారాబాద్.. ఇలా చాలాచోట్ల తిరిగి జనానికి చైతన్యం కలిగించేలా వీధి నాటకాలూ వేశాడు. సాధారణంగా నాటకాలపై ఈతరం పెద్దగా ఆసక్తి చూపించడం లేదు అనే అభిప్రాయం జనాల్లో ఉంది. ఇది అపోహేనంటాడు అజయ్. 'టికెట్ పెట్టకుండా నేను ఇప్పటివరకూ ఏ షో చేయలేదు. వాళ్లకు నచ్చేలా కాంటెంపరరీ, మైథాలజీ, ఫిక్షనల్, వుమన్ ఎంపవర్‌మెంట్, టైం ట్రావెల్, రాజకీయాలతో నాటకాలు రూపొందించా' అంటూ తను యువతకు దగ్గరవుతున్న మార్గం వివరిస్తాడు. ప్రస్తుతం థియేటర్ ఆర్ట్స్ కళాకారులంతా ఇదే పంథా అనుసరిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, సెలెబ్రిటీలతో ప్రచారం చేయిస్తున్నారు. వీటికి ఆదరణ విపరీతంగా ఉండటంతోనే 'గొల్ల రామవ్వ', 'విరాట్' 'అసమర్థుడు', 'త్రిపుర శపథం' 'ఆల్ఫా' అనే నవలల్ని సైతం నాటకాలుగా మలిచి, మళ్లీమళ్లీ ప్రదర్శిస్తున్నాడు అజయ్.



● 'భీమ్లా నాయక్', 'పుష్ప', 'అర్ధశతాబ్దం', 'ఆకాశవాణి', 'సైరా' తదితర చిత్రాల్లో నటించాడు.
● అతడి శిష్యుల్లో దాదాపు 200 మంది చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నారు.
● జేఎల్ నరసింహారావు స్మారక రంగస్థల యువ పురస్కారం.
● జాతీయస్థాయి సింగిడి పురస్కారం.
● 'గొల్ల రామవ్వ'కి ఉత్తమ సహాయ నటుడి అవార్డు.

అవకాశాలు అపారం

'నాటకరంగం కళ్లు చెమర్చుతుందే తప్ప కడుపు నింపదు' అంటుంటారు. కానీ అపారంగా అవకాశాలు ఉన్నాయి. థియేటర్ ఆర్ట్స్‌లో పీహెచ్‌డీ చేసేవాళ్లు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)కి అర్హత సాధిస్తే జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) అందుకోవచ్చు. కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాంస్కృతికశాఖలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. దేశంలోని అన్ని నగరాల్లో ఫిల్మ్ ట్రైనింగ్ స్కూళ్లు ఉన్నాయి. నాటకరంగంలో అనుభవం ఉన్నవాళ్లకు అందులో బోధకులుగా అవకాశాలుంటాయి. స్టార్ల వారసులకు వ్యక్తిగతంగా శిక్షణనిస్తూ మంచి ఫీజులు తీసుకుంటున్నవాళ్లు ఉన్నారు. జూనియర్ ఆర్టిస్టు నుంచి ప్రధాన నటీనటుల వరకు నాటకరంగంలో అనుభవం ఉన్నవాళ్లకు అవకాశాలు పుష్కలం. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, సంగీత నాటక అకాడెమీ, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లాంటి ఫెలోషిప్‌లు ప్రతిభను ప్రోత్సహిస్తున్నాయి. న్యూయార్క్ ఫిల్మ్ అకాడెమీలాంటి అంతర్జాతీయ ఫెలోషిప్‌లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వాన పడుతున్నా.. సంగీతం ఆగదు!



- బోట్ ఎయిర్‌డోప్స్ 191జీ ప్రో
- సోనీ డబ్ల్యూఎఫ్-ఎస్‌పీ800 ఎన్
- జేబీఎల్ ఎండ్యురెన్స్ రేస్ టీడబ్ల్యూఎస్
- బోట్ ఎయిర్‌డోప్స్ 441 ప్రో
- శామ్‌సంగ్ గెలాక్సీ బడ్స్ 2ప్రో
- యాపిల్ ఎయిర్‌పాడ్స్‌ప్రో (సెకండ్ జనరేషన్)

చిరుజల్లులు పడుతున్నా, ఆకాశానికి చిల్లు పడ్డట్టు వర్షం కురుస్తున్నా.. కొందరికి చెవుల్లోంచి ఇయర్‌ఫోన్స్ తీయలేని పరిస్థితి. మరి అలాగే వాడితే తడిచి పాడవుతాయి కదా! అప్పుడేం చేయాలి? ఇదిగో ఇలాంటి వాటర్‌ప్రూఫ్ ఇయర్‌ఫోన్స్ మీ దగ్గర ఉండాల్సిందే. ఇవి వాటర్‌ప్రూఫ్ మాత్రమే కాదు.. స్వెట్ ప్రూఫ్ కూడా. నీళ్లలో ముంచినా నిక్షేపంగా పని చేస్తాయి. సంగీత ప్రియులు, వాకింగ్ చేసేవాళ్లు, జిమ్‌కెళ్లేవాళ్లు, అథ్లెట్లు.. ఇలాంటి వాళ్లందరికీ ఉపయుక్తంగా ఉంటాయి. ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే వాటి సామర్థ్యాన్ని బట్టి 60 గంటలపాటు పని చేస్తుంటాయి. ధర రూ.1699 నుంచి మొదలై, రూ.24,999 వరకు ఉన్నాయి.



నింగినంటే ప్రేమ..

'మనుషులు అర్థం చేసుకోవడానికి ఇది మామూలు ప్రేమ కాదు.. అగ్నిలాగ స్వచ్ఛమైనది..' అని కమల్‌హాసన్ లెవల్లో డైలాగులు చెబుతుంటే.. ఏ ప్రేయసికైనా ఇష్టమే. ఆ ప్రేమను చేతల్లో చూపిస్తే మరింత మురిసిపోతారు కదా. దానికోసం చెన్నైలోని ఒక అబ్బాయి ఏం చేశాడో తెలుసా? ప్రేమించిన అమ్మాయి కళ్లకు గంతలు కట్టి ఒక భారీ క్రేన్‌లో ఎక్కించాడు. దాన్ని ఆకాశాన్ని అందుకునేలా పైపైకి తీసుకెళ్లాడు. అక్కడ గంతలు విప్పాడు. కింద అప్పటికే సర్వం సిద్ధమైంది. మతాబుల మెరుపుల మధ్య 'ఐ లవ్యూ మైనా' అని మెరిసిపోయే పెద్దపెద్ద అక్షరాలు ప్రదర్శించారు కొందరు. ఇంకో జట్టు ఆ అమ్మాయి చిరునవ్వులు చిందించే భారీ ఫొటో పట్టుకొని 'హ్యాపీ బర్త్‌డే మై పాపా' అంటూ కేరింతలు కొట్టింది. నిండు జాబిలిలా ప్రకాశిస్తూ, ఆకాశం నుంచి ఇదంతా చూసిన ఆ అమ్మాయి సంతోషానికి ఇంక ఏమైనా హద్దులు ఉంటాయా? 'ప్రేమించిన అమ్మాయికి ఇలాంటి సర్‌ప్రైజ్ ఇవ్వాలి' అనుకోని ప్రేమికుడు ఉంటారా? ఈ ఇన్‌స్టా రీల్‌ని కుర్రకారు తమ ఫోన్లలో తెగ పంచుకుంటున్నారు.



57లో 27లా..

యాభై ఏడులో కూడా ఇరవై ఏడులాంటి ఫిట్‌నెస్.. బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ సొంతం. 'ఇదెలా సాధ్యం?' అని ఓ పాత్రికేయుడు అడిగితే 'ఇదిగో ఇలా..' అన్నాడు.



మిలట్రీ క్రమశిక్షణ: తిండీ, నిద్ర.. సమయాలు పక్కాగా పాటిస్తాడు అక్కీ. అలారమ్ మోగకపోయినా ఉదయం ఐదుకు ముందే నిద్ర లేవడం, ఎనిమిది దాటకముందే పడక ఎక్కడం తన అలవాటు. 35 ఏళ్లుగా ఇది తప్పడం లేదు.

- వ్యాయామం పక్కా: వాకింగ్, జాగింగ్, జిమ్‌లో వ్యాయామం.. ఈ ఫైటింగ్‌ల హీరో దేన్నీ వదలడు. మరీ కఠిన వ్యాయామాలు చేయడుగానీ చేసేవి రోజూ తప్పనిసరి.
- నిద్ర: నిద్రకు మించిన స్నేహితుడు, వ్యాయామం, టానిక్.. మరేదీ లేదంటాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ 9 తర్వాత మేల్కొని ఉండడు.
- సహజంగా: ప్రొటీన్ పౌడర్లు, పీఈడీలు, ఆల్కహాల్, నికోటిన్.. ఎట్టిపరిస్థితుల్లోనూ దరి చేరనీయడు.

ఫన్ పంచ్


● స్పీడ్ అంటే బైక్ మీద వేగంగా వెళ్లడం కాదు.. బిల్లు కట్టే సమయంలో వెంటనే వాలెట్ తెరవడం!
● అమ్మాయి సిగ్నల్ ఇస్తే ట్రాఫిక్ జామ్ అవుతుంది.. సింగిల్‌గా ఉంటే హైవే పైలాగా దూసుకెళ్లిపోవచ్చు.
● నా జిందగీ గూగుల్ మ్యాప్‌లా ఉంటుంది.. ఎక్కడికి వెళ్లాలో తెలియదుగానీ 'రీ రూట్' అడుగుతూనే ఉంటుంది.



● నా కలల్లో నేను హీరోనే కానీ.. రియాలిటీలో నేనో జూనియర్ ఆర్టిస్టుని!
● నా ప్రేమకథ సినిమా అయితే.. టైటిల్ 'మిస్డ్ కాల్ లవ్' అవుతుంది

– ఆదిత్య

అమ్మో.. అమ్మాయీ!



ఆడవారి మాటలకు అర్థాలే వేరు కదా! వాళ్లు చెప్పేదొకటి.. చేసేదొకటి. ముఖ్యంగా జెన్ జీలు ఆన్‌లైన్‌లో పెట్టే పోస్టులు, ఆచరించే చేష్టలకు పొంతనే ఉండదు. ఎలాగంటే..

▼ **నేను ఒక్కసారి వేసిన డ్రెస్ మళ్లీ వేయను..**

- అంత లేదండోయ్. ఫేవరిట్ డ్రెస్‌ని పదేపదే వేస్తుంటారు. వేర్వేరు కోణాల్లో ఫొటోలు దిగి, ఇన్‌స్టాలో పెట్టేస్తుంటారు. అది వేరేలా కనిపించడానికి అవసరమైతే ఫొటో బ్యాగ్రౌండ్ మార్చేస్తారు. ఎలాంటి గిమ్మిక్కులు అయినా చేస్తారు.

▼ **ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం వరకే నా పని. తర్వాత ఏదీ పట్టించుకోను**

- అంటారేగానీ.. 'స్లే క్వీన్', 'గార్జియస్', 'బ్యూటిఫుల్'.. ఇలాంటి కామెంట్లు రాకపోతే తెగ ఫీలవుతారు. ఆ కామెంట్లు కనపడకపోతే పోస్ట్ డిలీట్ చేయడం పక్కా.

▼ **అతడు కేవలం నా ఫ్రెండ్ మాత్రమే...**

- పేరుకు ఫ్రెండే.. ఫోన్‌లో అతడి పేరు 'స్వీటీ', 'బుజ్జీ', 'కన్నా', 'నానీ', 'డియర్'.. ఇలా ఉంటుంది. 'ప్రపంచంలో అతడ్ని మించి నన్ను అర్థం చేసుకున్నవాళ్లే లేరు' అని అప్పుడప్పుడూ స్టేటస్‌లూ పెట్టేస్తుంటారు.

▼ **మేకప్ పెద్దగా ఇష్టం ఉండదు.. నేను నేచురల్ బ్యూటీని.**


- అంతా ఒట్టిదే.. 'నో మేకప్ లుక్' రావడానికి ఏడు లేయర్ల స్కిన్ ప్రిపరేషన్ చేస్తారు. 'నాచురల్ బ్యూటీ' అనిపించుకోవడానికి నానా ప్రయోగాలు చేస్తుంటారు.

▼ **అబ్బాయిల్ని నేనసలు పట్టించుకోనే పట్టించుకోను**

- పరిచయం ఉన్న కుర్రాళ్లు ఏదైనా పోస్ట్ చేయగానే ఓపెన్ చేయడం.. పరోక్షంగా కామెంట్ చేయడం.. మామూలే.

– వర్షిత్, ఈమెయిల్

కొంటె కొటేషన్



- కావాలా అంత పెద్ద అండం? అయితే నీకు పెట్టాల్సిందే దండం!
  – ఆరె రాకేశ్, మారంపల్లి
- బాబోయ్ భారీ గుడ్డు... దాన్ని వండగలవా ఫుడ్డు!
  – అభిరామ్, దూసి
- తీస్తున్నావు గుడ్డు పెంకులు చెయ్యగలవా దాన్ని ముక్కలు!
  – జయదేవ్, ఈమెయిల్
- సుత్తి ఎత్తిన వీరా... అదో సుతిమెత్తని పొర!
  – అరుణ నాయని, హైదరాబాద్
- అది డైనోసార్ గుడ్డు... పగలదురా లడ్డూ!
  – బిక్కునూరి రాజేశ్వర్, నిర్మల్
- గుడ్డంత లేదు గుంటడు... దాన్ని పగలగొట్టి ఎలా తింటడు?
  – మువ్వల జాహ్నవి, ఉద్దవోలు



ఈ ఫొటోకి మీ సరదా వ్యాఖ్యలు రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

బెస్టీనా.. బాయ్‌ఫ్రెండా?



నా వయసు 24. రెండేళ్లుగా ఒకమ్మాయిని ఇష్టపడుతున్నా. తనకీ నేనంటే ఇష్టమే. ఈ మధ్యే ఆమెకి మంచి జాబ్ వచ్చింది. నేనూ కెరియర్‌లో సెటిలయ్యాక పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నాం. మా పెళ్లికి పెద్దలు కూడా ఒప్పుకొన్నారు. సమస్య ఏంటంటే.. తను కొద్దినెలల క్రితం ఒకబ్బాయిని పరిచయం చేసింది. తను నా బెస్ట్‌ఫ్రెండ్ అంది. ప్రతి విషయం తనతో పంచుకుంటుంది. ఆఖరికి మా చిన్నచిన్న రొమాంటిక్ సంగతులు కూడా చెబుతోంది. మేం ఎప్పుడైనా పార్కుకో, రెస్టరంట్‌కో వెళ్లినా తనూ ఊడిపడతాడు. ఒక్కోసారి తను బెస్టీనా లేక బాయ్‌ఫ్రెండ్‌నా.. అనిపిస్తోంది. అతడితో సాన్నిహిత్యం తగ్గించుకొమ్మని ఎలా చెప్పను?

– విక్రాంత్, ఈమెయిల్

పెద్దల్ని ఒప్పించి మీ ప్రేమను పెళ్లిదాకా తీసుకెళ్లినందుకు శుభాకాంక్షలు. ఎంత గొప్ప ప్రేమికులైనా, వాళ్ల మధ్య మూడో వ్యక్తి ప్రవేశించినప్పుడు సమస్యలు మొదలవుతాయి. అందులోనూ ఆ బెస్టీ అపోజిట్ జెండర్ అయితే మరింత తీవ్రమవుతాయి. మీ ప్రేమికురాలి స్నేహితుడి కారణంగా మీరు ఇబ్బంది పడుతున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది. ఇది ఇలాగే కొనసాగితే మీ మధ్య గొడవలు మొదలయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి రాకముందే మీరు తొందర పడాలి. ఒకరోజు తనని కూర్చోపెట్టి సావధానంగా అన్నీ చెప్పండి. 'స్నేహం తప్పు కాదు.. కానీ దానికి కొన్ని హద్దులు ఉంటాయి. అతడు పరిధి మీరుతున్నట్లు అనిపిస్తోంది. అది నాకు ఇబ్బందికరంగా ఉంటోంది' అని స్పష్టంగా చెప్పండి. 'మనం కాబోయే భార్యాభర్తలం.. మనిద్దరి మధ్య మరింత ప్రైవసీ ఉంటే బాగుంటుంది' అని చెబితే.. మీ భావాలను వ్యక్తం చేసినట్టు అవుతుంది, ఆమె డిఫెన్సివ్ అవ్వకుండా ఉంటుంది. మీరు ఎటైనా వెళ్లినప్పుడు.. 'ఒక రొమాంటిక్ డిన్నర్ ప్లాన్ చేద్దాం. మన ఇద్దరమే నాణ్యమైన సమయం గడుపుదాం' అని బతిమాలుతూ అడగండి. మీ భావం తనకి అర్థమవుతుంది. మంచి మూడ్‌లో ఉన్నప్పుడు మీ ఇద్దరి వ్యక్తిగత పరిధుల్లో, వ్యక్తిగత సమయాల్లో తను రావడం మీ అనుబంధంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో వివరించండి. అతడూ మీకు ఇప్పటికే పరిచయం అయ్యి ఉంటాడు కదా.. తనతో అభ్యర్థనగా ఇదే విషయం చెప్పండి. 'మీరు స్నేహంగా ఉండటంలో నాకెలాంటి అభ్యంతరం లేదు.. కానీ మరీ క్లోజ్‌గా ఉండటం ఇబ్బందిగా అనిపిస్తోంది' అని అనునయంగా వివరించండి. ఇద్దరిలో ఒక్కరు అనుకూలంగా స్పందించినా మీరు సమస్య నుంచి బయట పడతారు. ఆల్ ది బెస్ట్.



- అర్చన నండూరి, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

300 తిరస్కరణలు.. రూ.కోటి జీతం!

ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 300 తిరస్కరణలు. వేరొకరైతే ఆశలు వదిలేసుకునేవారే! ఆ కుర్రాడు పట్టువదల్లేదు. కంపెనీల్ని మెప్పించడానికి చేయాల్సినదంతా చేశాడు... అతడి ప్రయత్నం ఓ విదేశీ కంపెనీకి తెగ నచ్చేసింది. ఏకంగా కోటి రూపాయల జీతం ఆఫర్ చేసింది. ఇంతా చేస్తే అతడు చదివింది సాదాసీదా కాలేజీలో బీటెక్. ఆ కథేంటో మనం తెలుసుకోవాల్సిందే!



ఏడాదికి రూ.కోటి జీతం అంటే మాటలా? చాలా కంపెనీల సీఈవోలకు సైతం అంత వేతనం ఉండదు. పోనీ మొదట్నుంచీ అతడేమైనా మెరిట్ విద్యార్థి అంటే అదీ కాదు. బీటెక్‌లో బ్యాక్‌లాగ్స్ కూడా ఉండేవి. కంప్యూటర్ సైన్స్‌లో సీటు రాకపోవడంతో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఎంచుకున్నాడు.

● సబ్జెక్టుతో సంబంధం లేకున్నా టీనేజీకి వచ్చేసరికి తనకి ఫైనాన్స్ సబ్జెక్టుపై విపరీతమైన ఆసక్తి ఏర్పడింది. పట్టుపట్టి స్టాక్ మార్కెట్‌పై పట్టు సాధించాడు. ప్రపంచవ్యాప్తంగా ఫైనాన్షియల్ మార్కెట్లు ఎలా పని చేస్తాయి? ఒకరి నుంచి ఒకరికి చేతులు ఎలా మారతాయి?.. అన్నింట్లో నైపుణ్యం సాధించాడు.

● బీటెక్ పూర్తయ్యేసరికి ప్రాంగణ నియామకాల్లో ఏడాదికి రూ.7.5లక్షల ప్యాకేజీతో ఉద్యోగం దక్కింది. ఇరుకింట్లో ఐదుగురు సభ్యులుండే కుటుంబానికి అది మంచి ఆఫర్. కానీ దాన్ని తిరస్కరించాడు. అతడి మనసంతా ప్రపంచ మార్కెట్ల చుట్టే తిరుగుతోంది మరి.

● ఎలాగైనా ఫైనాన్షియల్ రంగంలోనే కెరియర్ ప్రారంభించాలని అతడి ఆశ. ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కోసం పట్టు వదలకుండా.. దరఖాస్తులు పంపుతూనే ఉన్నాడు. వరుసబెట్టి తిరస్కరణలే ఎదురవుతున్నాయి. అవ్వవా మరి? చదివిందేమో ఇంజినీరింగ్. ఇలా కాదనుకొని ఫైనాన్షియల్ మోడలింగ్, కంపెనీ వాల్యుయేషన్.. లాంటి కోర్సులు చేశాడు. ఆఖరికి అతడి కల నెరవేరే రోజు వచ్చింది. 'క్వాంట్ రిసెర్చ్' అనే కంపెనీలో ఇంటర్న్‌షిప్ దొరికింది. ఏడాదిలోనే షేర్ మార్కెట్ సారాంశం పట్టేశాడు. ఇలాంటి అంశాలపై పట్టున్న వ్యక్తి కోసం ఎదురుచూస్తున్న లండన్‌కి చెందిన ఒక ట్రేడింగ్ ఫర్మ్ రూ.1.03 కోట్ల వేతనంతో అతడిని ఉద్యోగంలోకి తీసుకుంది.

● దీంతో మనం తెలుసుకోవాల్సింది ఏంటంటే.. తను ప్రతిభనే నమ్ముకున్నాడు. ఇష్టమైన రంగంలోనే కెరియర్ ఎంచుకున్నాడు. ఉద్యోగానికి అవసరమైన అన్ని అర్హతలూ సాధించాడు. అన్నింటికీ మించి.. వందలకొద్దీ వైఫల్యాలు ఎదురైనా వెరవలేదు. తన పేరు వెల్లడించకుండా ఈ విజయగాథను 'రెడ్డిట్'లో పంచుకున్నాడు ఆ బెంగళూరు కుర్రాడు. అదిప్పుడు వైరల్‌గా మారింది.

ఇదే ఫీలింగ్ కావాలి మామా..

బిజినెస్ క్లాస్ విమానాల్లో ప్రయాణం.. విలాసం ఉట్టిపడే ఐదు నక్షత్రాల హోటళ్లలో బస.. తెలుపు రంగు గ్లౌజులు వేసుకొని వడ్డించే రెస్టరంట్లలో విందు.. ప్రతి యాత్రికుడి కల. కానీ ఇవన్నీ ఒకప్పటి మాట. ఈతరం ట్రావెలర్ల తీరు మారుతోంది. వాళ్లకిప్పుడు విలాసాల కన్నా.. 'భలే ఫీల్ ఉంది మామా' అనిపించుకోవడమే ముఖ్యం.

● మంచి ప్రదేశం ఎంచుకోవడం.. టూర్‌కి చలో అనడం ఒకప్పటి పద్ధతి. జెన్ జీ, యంగర్ మిలీనియల్స్ ఇప్పుడు తమ ఆసక్తులకు అనుగుణంగా టూర్లు సిద్ధం చేసుకుంటున్నారు. అది మన పక్కనే ఉండే బొగత జలపాతం కావొచ్చు.. దూరంలో కులూ మనాలి బంగీ జంప్ లాంటి సాహసయాత్రే అయ్యుండొచ్చు.. అందమైన ప్రకృతి, చారిత్రక ప్రదేశం, వినోదం.. ఎవరికి నచ్చిన డెస్టినేషన్ వాళ్లు ఎంచుకుంటున్నారు.



● విలాసం అంటే నేటి తరం దృష్టిలో సౌకర్యంగా ఉండటం మాత్రమే. గోవా వెళ్లారనుకోండి.. అక్కడ స్టార్ హోటళ్లలో బస చేయడం కంటే.. స్థానికులు ఏర్పాటు చేసిన ఆతిథ్యం స్వీకరిస్తున్నారు. అక్కడి సంస్కృతి, ఆచారాల లాంటివి మరింతగా తెలుసుకోవచ్చు అన్నది వాళ్ల భావన. స్థానిక స్ట్రీట్‌ఫుడ్ రుచులు ఆరగించడం, చిన్నచిన్న దుకాణాల్లో షాపింగ్.. రోమ్‌కి వెళ్తే రోమన్‌లా మారిపోతున్నారు.

● ఎక్కడికైనా వెళ్లాలంటే ఒకప్పుడు టూర్ ప్లానర్లు అన్నీ చెప్పేవాళ్లు. ఇప్పుడు టెక్నాలజీనే దారి చూపుతోంది. సోషల్‌మీడియా ఫోరమ్‌లు, టెలిగ్రామ్ గ్రూపులు, చాట్‌జీపీటీలు, గ్రోక్‌లు.. ఉన్నాయి.

● టూర్‌కి వెళ్తే భారీగా షాపింగ్ చేయడం కుర్రకారుకి అలవాటే. కానీ ఈసారి ఆచితూచి ఖర్చు పెడుతున్నారు. స్థానిక కళాకారులకు ఉపయోపడేలా కొనుగోళ్లు,

ఈవీ బ్యాటరీలు మనమే తయారు చేసుకోవాలి

● ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి

● సోలార్ ప్యానెళ్ల తయారీలోనూ మెరుగుపడాలి : మోదీ

దిల్లీ: విద్యుత్ వాహనాల(ఈవీ) బ్యాటరీలను మనమే తయారు చేసుకునే దిశగా అడుగులు వేయాలని పారిశ్రామిక రంగానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆయన ఇంకా ఏమన్నారంటే..

బడ్జెట్‌లో ఎక్కువ భాగం పెట్రోల్, డీజిల్, గ్యాస్ తేవడానికే ఖర్చవుతోంది. లక్షలాది కోట్ల రూపాయలు దీనికే పోతున్నాయి. మనం ఇందుకోసం ఇతరులపై ఆధారపడకపోతే దానిని పెట్టే ఖర్చు మన దేశ ప్రజల కోసం ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. అందుకే ఈ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై దృష్టిసారించాం. అందుకోసం నేషనల్ డీప్‌వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్ ప్రారంభించబోతున్నాం. అత్యంత కీలకమైన ఖనిజాల్లోనూ ఆత్మనిర్భరత సాధించే దిశలో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్' ప్రారంభించాం.



సాంకేతిక మార్గాలను అన్వేషించాలి: ఇంధనరంగం తరహాలోనే ఎరువులకు సమూ ఇతరులపై ఆధారపడకూడదు. ఈ రంగంలో ఆత్మనిర్భరత సాధించడానికి పారిశ్రామికరంగం, ఔత్సాహికులు ముందుకురావాలని పిలుపునిస్తున్నా. సాంకేతిక మార్గాలను అన్వేషించి భారతీయ అవసరాలకు తగ్గట్టు మన ఎరువులను మనమే తయారుచేసుకునేలా సమాయత్తం కావాలని కోరుతున్నా. ఈవీ బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్లు, విద్యుత్తు వాహనాలకు అవసరమయ్యే వస్తువులనూ మనమే తయారుచేసుకోవాలి.

సెమీకండక్టర్ ఆలోచన భ్రూణహత్యకు గురైంది..: 21వ శతాబ్దం సాంకేతికతపై ఆధారపడి నడిచే శతాబ్దం. ఏ దేశాలు సాంకేతిక అభివృద్ధిపై దృష్టిసారించాయో అవి సాంకేతిక శిఖరాలను అధిరోహించగలిగాయి. నేను ఈ ఎర్రకోటపై ఇతర ప్రభుత్వాల గురించి మాట్లాడటానికి నిలబడలేదు. అయితే ఈ దేశ యువతకు నిజాలు తెలియడమూ ముఖ్యం. మన దేశంలో 50-60 ఏళ్ల క్రితమే సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటు గురించి ఆలోచన మొదలైంది. కానీ ఆ దస్త్రాలు అక్కడే స్తంభించిపోయాయి. సెమీకండక్టర్ ఆలోచనే భ్రూణహత్యకు గురైంది. ఫలితంగా 50-60 ఏళ్లు వృథాగా పోయింది. ఇప్పుడు మనం దాన్ని నుంచి విముక్తులై సెమీకండక్టర్ తయారీని యుద్ధప్రాతిపదికన చేపట్టాం. ఈ ఏడాది చివరికల్లా మేడిన్ ఇండియా చిప్‌లు మార్కెట్‌లోకి రాబోతున్నాయి.


యాక్సెంచర్ చేతికి ఆస్ట్రేలియా సైబర్ భద్రత కంపెనీ!



దిల్లీ: ఆస్ట్రేలియాకు చెందిన సైబర్ భద్రత సంస్థ 'సైబర్‌సీఎక్స్'ను కొనుగోలు చేయనున్నట్లు యాక్సెంచర్ తెలిపింది. కంపెనీ విలువను 650 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.5600 కోట్లు)గా పరిగణించి ఈ కొనుగోలును చేపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదే జరిగితే సైబర్ భద్రతా రంగంలో యాక్సెంచర్‌కు ఇది భారీ కొనుగోలు లావాదేవీ అవుతుంది. అయితే సైబర్ సీఎక్స్‌ను విక్రయిస్తోన్న ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బీజీహెచ్ కేపిటల్ ఈ కొనుగోలుకు సంబంధించి ఎటువంటి ఆర్థిక వివరాలను వెల్లడించలేదని ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం తెలిపింది. ఆస్ట్రేలియాలో ఇటీవలి కొన్నేళ్లుగా సైబర్ దాడులు పెరిగాయి. సైబర్‌దాడుల వల్ల సంస్థల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా వ్యక్తుల/ సంస్థల వివరాలు నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తున్నాయనే ఆందోళన నెలకొంది. దీంతో అధునాతన డిజిటల్ భద్రతా సేవలకు గిరాకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే యాక్సెంచర్- సైబర్‌సీఎక్స్ కొనుగోలు లావాదేవీ చోటుచేసుకుంటుండటం గమనార్హం.

చైనాకు టారిఫ్ కష్టాలు

జులైలో పారిశ్రామిక ఉత్పత్తి మందగమనం



బ్యాంకాక్: అమెరికాకు పంపే ఎగుమతులపై విధించే టారిఫ్‌లపై అనిశ్చితి కాస్తా చైనా ఆర్థిక వ్యవస్థను వెన్నాడుతోంది. జులైలో పారిశ్రామిక ఉత్పత్తి, రిటెయిల్ విక్రయాల్లో మందమనం కనిపించింది. శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. జులైలో పారిశ్రామికాభివృద్ధి 5.7 శాతంగా నమోదైంది. జూన్‌లో 6.8 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. పారిశ్రామిక సామగ్రి, ఇతర స్థిరాస్తుల్లో పెట్టుబడులు జనవరి-జులైలో 1.6 శాతం మాత్రమే పెరిగాయి. జనవరి-జూన్‌లో 2.8% వృద్ధి కనిపించింది. ప్రధాన నగరాల్లో కొత్తగా కట్టిన ఇళ్ల ధరలు 1.1 శాతం పడ్డాయి.

రక్షణ రంగంలోకి బ్రైట్‌కామ్ గ్రూప్

హైదరాబాద్: రక్షణ రంగంలోకి అడుగుపెడుతున్నట్లు బ్రైట్‌కామ్ గ్రూప్ శుక్రవారం ప్రకటించింది. కొత్త తరం ఏరోస్పేస్ ఇంటెలిజెన్స్, అటానమస్ ఏరియల్ డిఫెన్స్ సాఫ్ట్‌వేర్‌పై దృష్టి పెట్టేందుకు కొత్త విభాగం 'బ్రైట్‌కామ్ డిఫెన్స్'ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. కొత్త విభాగం కింద ఏఐ ఆధారిత యూఏవీ ఫ్లైట్ వ్యవస్థ, హై ఫిడెలిటీ మిషన్ సిమ్యులేషన్ ఇంజిన్లు, ఏరియల్ ప్లాట్‌ఫామ్ సైబర్‌సెక్యూరిటీ కార్యక్రమం, రియల్ టైమ్ థ్రెట్ డిటెక్షన్ కోసం రక్షణ సొల్యూషన్లు, కోఆర్డినేటెడ్ డ్రోన్ స్వార్మ్ కార్యకలాపాలను సంస్థ అభివృద్ధి చేయనుంది. కొత్త విభాగంతో ప్రభుత్వ సంస్థలు, గ్లోబల్ డిఫెన్స్ ఇన్నోవేటర్స్, టెక్నాలజీ భాగస్వాములతో కలిసి జట్టు కట్టనున్నట్లు బ్రైట్‌కామ్ గ్రూప్ ఛైర్మన్ సురేశ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

రష్యా చమురుపై వెనకడుగు లేదు!



● భారత్ దిగుమతులు యథాతథం ● ఆగస్టులో రోజుకు 2 మి.బ్యారెల్లు

● జులైలోని 1.6 మి. బ్యారెళ్లతో పోలిస్తే ఇది అధికం

దిల్లీ: రష్యా నుంచి చమురు దిగుమతి ఆపడం లేదంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించినప్పటికీ.. రష్యా చమురు కొనుగోళ్లను భారత రిఫైనరీలు యథాతథంగానే కొనసాగిస్తున్నాయి. ఆగస్టులో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు రోజుకు 2 మిలియన్ బ్యారెళ్లకు పెరగడం గమనార్హం. జులైలో ఇది రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

ఎందుకు పెరిగిందంటే..

ఆగస్టులో ఇరాక్, సౌదీ అరేబియా నుంచి చమురు దిగుమతి తగ్గడం వల్లే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ రిఫైనరీలు పెంచుకున్నట్లుగా తెలుస్తోంది. జులైలో ఇరాక్ నుంచి చమురు కొనుగోలు రోజుకు 9,07,000 బ్యారెళ్లుగా ఉండగా.. ఆగస్టులో 7,30,000 బ్యారెళ్లకు ఇది తగ్గింది. సౌదీ అరేబియా నుంచి చమురు కొనుగోలు కూడా రోజుకు 7,00,000 బ్యారెళ్ల నుంచి తగ్గి 5,26,000 బ్యారెళ్లకు పరిమితమైంది. ఇక ఆగస్టు తొలి అర్ధభాగంలో మొత్తంగా రోజుకు 5.2 మిలియన్ బ్యారెళ్ల చమురును భారత్ దిగుమతి చేసుకుందని అంచనా ఉండగా.. ఇందులో 38 శాతం వరకు రష్యా నుంచే వచ్చినట్లు అంతర్జాతీయ విశ్లేషణ సంస్థ కెప్లర్ వెల్లడించిన వివరాల ఆధారంగా తెలుస్తోంది.

ఒప్పందాలు చేసుకోవడం వల్లే..

'జులై ఆఖర్లో ట్రంప్ అదనపు టారిఫ్‌ల ప్రకటన వచ్చింది. అయితే జూన్, జులై ప్రారంభంలోనే ఆగస్టుకు సంబంధించిన చమురు కొనుగోళ్ల నిర్ణయాలు జరుగుతుంటాయి. అందుకే ఆగస్టులో రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు పెరిగి ఉంటాయని కెప్లర్ పరిశోధన విశ్లేషకుడు సుమిత్ రిటోలియా తెలిపారు. టారిఫ్‌ల కారణంగా చమురు కొనుగోళ్ల విషయంలో రిఫైనరీలు కొత్తగా ఏమైనా నిర్ణయాలు తీసుకుంటే ఆ ప్రభావం సెప్టెంబరు ఆఖరు నుంచి కనిపిస్తుందని తెలిపారు. అంతేకాకుండా రష్యా నుంచి కొనుగోళ్లను తగ్గించుకోవాలని రిఫైనరీలకు భారత ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదనే విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

ఐఓసీ, బీపీసీఎల్ ఏమంటున్నాయంటే

'మాకు రష్యా నుంచి చమురు కొనవద్దని కానీ కొనాలని కానీ ప్రభుత్వం ఎలాంటి సూచనలు ఇవ్వలేదు. అలాగే రష్యా చమురు దిగుమతులను పెంచుకునేందుకు లేదా తగ్గించుకునేందుకు మేం ప్రయత్నాలు కూడా చేయడం లేదు' అని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నే తెలిపారు. ఏప్రిల్- జూన్‌లో ఐఓసీ శుద్ధి చేసిన ముడి చమురులో సుమారు 22 శాతం వరకు రష్యా నుంచి దిగుమతి చేసుకున్నదేనని అన్నారు. ముందుముందు కూడా ఈ పరిమాణం ఇంతే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. మరోవైపు రష్యా నుంచి చమురు దిగుమతులు ఏప్రిల్-జూన్‌లోని 34 శాతంతో పోలిస్తే జులైలో తగ్గిందని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) డైరెక్టర్ రామకృష్ణ గుప్తా తెలిపారు. అమెరికా టారిఫ్‌లు ఎలాంటి ఆంక్షలు విధించకుంటే ఈ ఏడాది మిగతా కాలంలోనూ రష్యా నుంచి చమురు దిగుమతుల వాటా 30-35 శాతంగానే కొనసాగుతుందని అన్నారు.

ఎటూ తేల్చుకోలేని స్థితిలో భారత్: జీటీఆర్ఐ

అమెరికా అదనపు టారిఫ్ విషయంలో ఎలా ముందుకెళ్లాలనే దానిపై నిర్ణయం తీసుకోవడం భారత్‌కు కష్టంగా మారిందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అభిప్రాయపడింది. టారిఫ్‌లు తగ్గించాలంటూ అమెరికాతో చర్చలు జరపాలా? ప్రత్యామ్నాయ విపణులను అన్వేషించాలా? రష్యా చమురు దిగుమతులు ఆపేయాలా?.. ఇలా ఎటూ తేల్చుకోలేని స్థితిలో భారత్ ఉందని తెలిపింది.

మహీంద్రా కొత్త ఎస్‌యూవీ ప్లాట్‌ఫామ్



ముంబయి: వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా కొత్త ప్లాట్‌ఫామ్‌పై స్పోర్ట్స్ వినియోగ వాహనాల(ఎస్‌యూవీలు)ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. దేశీయ, ఎగుమతి విపణుల అవసరాలకు తగ్గట్టుగా ఎస్‌యూవీలను ఉత్పత్తి చేయనున్నట్లు మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా పేర్కొన్నారు. కొత్త ఎస్‌యూవీల శ్రేణి కోసం ప్రత్యేకంగా మాడ్యులర్, మల్టీ-ఎనర్జీ 'ఎన్‌యూ ఐక్యూ' ప్లాట్‌ఫామ్‌ను మహీంద్రా ఆవిష్కరించింది. 2027 క్యాలెండర్ ఏడాదిలో ఈ ప్లాట్‌ఫామ్‌పై మొట్టమొదటి కారును కంపెనీ విడుదల చేయనుంది. దేశీయ, అంతర్జాతీయ విపణులపై దృష్టి పెట్టేందుకు ఈ సరికొత్త ప్లాట్‌ఫామ్‌ను మహీంద్రా అభివృద్ధి చేసింది.

✦ కొత్త ప్లాట్‌ఫామ్‌పై పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఉత్పత్తులను అభివృద్ధి చేయవచ్చని మహీంద్రా అండ్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ (వాహన, వ్యవసాయ) రాజేశ్ జెజురికర్ తెలిపారు. మొదటి దశలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా వంటి ప్రస్తుత విపణులపై దృష్టి పెడతామని, అనంతరం బ్రిటన్‌లో విద్యుత్ వెర్షన్‌ను విడుదల చేస్తామన్నారు. గత కొన్నేళ్లలో మన ఎస్‌యూవీ విపణిలో మహీంద్రా వాటా 11 శాతం నుంచి 27 శాతానికి పెరిగింది.

✦ నాలుగు కొత్త ఎస్‌యూవీ కాన్సెప్ట్‌లు: మహీంద్రా నాలుగు ఎస్‌యూవీ కాన్సెప్ట్ కార్లు- విజన్.ఎస్, విజన్.టీ, విజన్.ఎస్‌ఎక్స్‌టీ, విజన్.ఎక్స్‌లను ప్రదర్శించింది. ఇవి సబ్ 4-మీటర్, మధ్య శ్రేణి విభాగాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ సంస్థలను తోసిరాజని దేశీయ ఎస్‌యూవీల విభాగంలో అగ్రస్థానంలో నిలిచామని అనీశ్ షా వెల్లడించారు.

✦ 'విజన్ 2027 కోసం కొత్త లక్ష్యాలను ఆవిష్కరించాం. ప్రపంచ స్థాయి ఎస్‌యూవీలను తీసుకురావడంతో పాటు ప్రపంచ దేశాలకు వాటిని ఇక్కడే రూపొందించనున్నాం. అనుసరించడం కాకుండా ముందుండి నడిపించాలని అయిదేళ్ల క్రితం కంపెనీ భావించింది. అంతరాయాలు కలిగించాలని కానీ ఆటంకాలు ఎదుర్కోకూడదని అనుకున్నాం. ప్రపంచ వేదికపై భారత్‌ను సగర్వంగా నిలిపాం. థార్ నుంచి అధునాతన ఎక్స్‌యూవీ 700 వరకు, స్కార్పియో నుంచి బీఈవీ విద్యుత్ కారుల వరకు పలు సవాళ్లను అవకాశాలు మలుచుకున్నాం. దీంతో భారత్‌లోనే అగ్రగామి ఎస్‌యూవీ సంస్థగా నిలిచాం. ఎస్‌యూవీ విక్రయాల్లో రికార్డు స్థాయిలో వృద్ధి నమోదు చేశాం' అని అనీశ్ షా వివరించారు. ఇటీవల ఎక్స్‌యూవీ 700, ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ విడుదలతో అంతర్జాతీయ మార్కెట్లలో మంచి పురోగతి సాధించామన్నారు.

✦ చకన్‌లోని కంపెనీ తయారీ ప్లాంట్‌ను అంతర్జాతీయ అవసరాల కోసం విస్తరిస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సేవలు అందించే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోనున్నట్లు వెల్లడించారు.

ఆతిథ్య రంగ విస్తరణపై దృష్టి


ప్రయాణ, పర్యాటక రంగాల్లో విస్తరించేందుకు వివిధ మార్గాలను మహీంద్రా గ్రూప్ అన్వేషిస్తున్నట్లు అనీశ్ షా వెల్లడించారు. కొవిడ్ తర్వాత దేశీయ పర్యాటక రంగం భారీగా దూసుకెళ్లిందని గుర్తుచేశారు. కంపెనీ ఆతిథ్య సేవల విభాగం మహీంద్రా హాలీడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా, 2030 నాటికి 10,000 గదులకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది చాలా చిన్న లక్ష్యమని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకు అనుసరించాల్సిన విధానాలపై దృష్టి పెట్టాలన్నారు. దేశంలో అగ్రగామి ఆతిథ్య సేవల సంస్థగా ఎదగడమే లక్ష్యమని వివరించారు.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1000 కొత్త గదులను చేర్చుకోవాలని మహీంద్రా హాలీడేస్ భావిస్తోంది. జూన్ త్రైమాసికం చివరకు కంపెనీ చేతిలో మొత్తం 5,794 గదులు ఉన్నాయి.

చైనాపై ఆధారపడడం.. అమెరికాకు ఇబ్బందే

జేపీ మోర్గాన్ సీఈఓ

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా-చైనాల మధ్య సెమీకండక్టర్ చిప్‌ల గొడవ తీవ్రమైన వేళ.. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ జేపీ మోర్గాన్‌చేజ్ సీఈఓ జామీ డిమోన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో 100 శాతం పెన్సిలిన్ చైనా నుంచే దిగుమతి అవుతోందని, అది ఇబ్బందికరమే అని పేర్కొన్నారు. దీనికితోడు అరుదైన భూఅయస్కాంతాలు, అత్యాధునిక చిప్‌ల తయారీ ముడిపదార్థాలు వంటివి కూడా బీజింగ్ నుంచే వస్తున్నాయన్నారు. అత్యంతశక్తిమంతమైన ఏఐ సిస్టమ్స్ తయారీకి వాడే చిప్‌ల తయారీ పరికరాలు కూడా అకడినుంచే వస్తున్నాయన్నారు. చైనా సూపర్‌సోనిక్ మిసైల్స్‌ను మరింత శక్తిమంతంగా మార్చే వాటిని ఎగుమతి చేయవద్దని డిమోన్ సూచించారు. అయినా వారి పురోగతి వేగాన్ని మనం తగ్గించగలమే కానీ.. ఆపలేమని పేర్కొన్నారు.



ఎన్విడియాకు చైనాలో ఎదురుగాలి: చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియాకు చైనాలో ఎదురుగాలి వీస్తోంది. ఆ సంస్థ తయారుచేసిన హెచ్20 చిప్‌లకు ఆ దేశం పెద్ద మార్కెట్. తాజాగా చైనా నియంత్రణ సంస్థలు ఆ చిప్‌లతో సెక్యూరిటీ ఇబ్బందులు ఉన్నాయని ఎన్విడియాకు సమన్లు జారీ చేశాయి. దీనికి ఆ సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్పందిస్తూ.. సదరు హెచ్20 చిప్‌లలో ఎటువంటి బ్యాక్‌డోర్లు, కిల్ స్విచ్‌లు, స్పైవేర్‌లు లేవని బహిరంగ ప్రకటన చేయాల్సి వచ్చింది. చైనా టెక్ దిగ్గజాలైన అలీబాబా, బైట్‌డ్యాన్స్ ఈ చిప్‌ల ఆర్డర్లను పునఃపరిశీలిస్తున్నాయి.

ఈనాడు బిజినెస్

ఎస్‌బీఐ రేటింగ్ మెరుగు

మరో 9 అగ్రగామి ఆర్థిక సంస్థలవీ: ఎస్ అండ్ పీ



దిల్లీ: ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా క్యాపిటల్ సహా అగ్రగామి 10 ఆర్థిక సంస్థల రేటింగ్‌ను ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ పెంచింది. 18 ఏళ్ల తర్వాత భారత సార్వభౌమ రేటింగ్‌ను పెంచిన మరుసటి రోజే అమెరికాకు చెందిన ఈ ఏజెన్సీ ఈ ప్రకటన చేసింది. 'దేశ ఆర్థిక వృద్ధికి ఆర్థిక సంస్థలు తమ వంతు సహకారాన్ని కొనసాగించనున్నాయి. ఈ సంస్థలు దేశీయంగా దృష్టి సారించడానికి తోడు వ్యవస్థలో మొండి బకాయిల రికవరీ తదితర నిర్మాణాత్మక మార్పులకూ తోడ్పడుతున్నాయ'ని ఎస్ అండ్ పీ పేర్కొంది.

దీర్ఘకాలిక క్రెడిట్ రేటింగ్ పెరిగిన సంస్థలివే

✦ ఎస్‌బీఐ ✦ ఐసీఐసీఐ బ్యాంక్ ✦ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ✦ యాక్సిస్ బ్యాంక్ ✦ కోటక్ మహీంద్రా బ్యాంక్ ✦ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ✦ ఇండియన్ బ్యాంక్ ✦ బజాజ్ ఫైనాన్స్ ✦ టాటా క్యాపిటల్ ✦ ఎల్ అండ్ టీ ఫైనాన్స్

ఆస్తుల నాణ్యత కొనసాగుతుంది: 'వచ్చే 12-24 నెలల్లో కొంత ఒత్తిడి ఉన్నా.. భారత బ్యాంకుల మెరుగైన ఆస్తుల నాణ్యత, లాభదాయకత, సరిపడా మూలధనం కొనసాగుతాయని మేం అంచనా వస్తున్నామ'ని ఎస్ అండ్ పీ తెలిపింది. వ్యవస్థలో రుణ నష్ట భయం తగ్గిందనీ పేర్కొంది.

వీటి రేటింగ్ సైతం: ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా పవర్ రేటింగ్‌ను బీబీబీ- నుంచి బీబీబీకి ఎస్ అండ్ పీ సవరించిన సంగతి తెలిసిందే. అలాగే ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొలకూ బీబీబీ- నుంచి బీబీబీకి సవరించింది.

రూ.1500 కోట్ల ఐపీఓకు ఆర్‌ఎస్ బ్రదర్స్!

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ భారత్‌లోని రిటెయిల్ చైన్ సంస్థ ఆర్ఎస్‌బీ రిటెయిల్ ఇండియా లిమిటెడ్ (ఆర్ ఎస్ బ్రదర్స్) తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. దీనికి సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) దాఖలు చేసింది. ఐపీఓ విలువ రూ.1,500 కోట్ల వరకూ ఉండనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ.500 కోట్లను సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్ కింద 2.98 కోట్ల ఈక్విటీ షేర్లను పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, తిరువీధుల ప్రసాద రావు తదితర ప్రమోటర్లు విక్రయించనున్నారు. వచ్చిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపునకు, రూ.118 కోట్లను ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ కొత్త విక్రయ కేంద్రాల ఏర్పాటుకు, మిగతా మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనుంది. సంస్థకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలలో 22 నగరాల్లో 73 స్టోర్లు ఉన్నాయి. కాంచీపురం నారాయణి సిల్క్స్, డి రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్‌లనూ సంస్థ నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్ఎస్‌బీ రిటైల్ రూ.2,694 కోట్ల ఆదాయాన్ని, రూ.104.4 కోట్ల నికర లాభాన్నీ ఆర్జించింది. మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్‌లు ఈ ఐపీఓ నిర్వహించనున్నాయి.

కోడి గుడ్లు

16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	520
గోదావరి	510
విశాఖపట్నం	515
చిత్తూరు	548

విరించి ఆదాయం రూ.79.77 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఐటీ ఉత్పత్తులు, సేవల సంస్థ విరించి లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.79.77 కోట్ల ఆదాయాన్ని, రూ.36.94 లక్షల నికర లాభాన్నీ ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.76.30 కోట్లు, నికర లాభం రూ.1.04 కోట్లుగా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్-ఎ-సర్వీస్ వ్యాపారాన్ని 100 శాతం అనుబంధ సంస్థగా మార్చాలని కంపెనీ భావిస్తోంది. ప్రైవేటు పెట్టుబడులు స్వీకరించడం లేదా ఐపీఓకి వెళ్లాలని అనుకుంటోంది. దీనికి సంబంధించి, ఈ నెల 22న బోర్డు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది.

స్విగ్గీ ప్లాట్‌ఫాం ఫీజు పెంపు

ఆహార డెలివరీ యాప్ స్విగ్గీ తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచింది. పండగ సీజనులో ఎక్కువ మంది వినియోగదార్లు లావాదేవీలు జరుపుతారన్న అంచనాల మధ్య ప్రతీ ఆహార డెలివరీపై రూ.14 ఛార్జీ వసూలు చేయనుంది. ఇది వరకు రూ.12గా ఉన్న ఫీజును రూ.2 పెంచినట్లయింది. తద్వారా లాభాలను పెంచుకోవాలని భావిస్తోంది. ఏప్రిల్ 2023లో తొలిసారిగా ప్లాట్‌ఫాం ఫీజును ఈ కంపెనీ ప్రవేశపెట్టింది. అప్పటి నుంచీ పెంచుకుంటూ వస్తోంది. అదనపు ఛార్జీలు విధించినా ఆర్డర్ల సంఖ్యపై ప్రభావం పడకపోవడం గమనార్హం. మరో వైపు, కేవలం డిమాండ్ ఉన్న రోజుల్లోనే ఈ ఫీజును వసూలు చేసి తర్వాత పాత రేటునే యథావిధిగా అమలు చేయవచ్చనీ తెలుస్తోంది.

ఓలా ఎస్1ప్రో+, రోడ్‌స్టర్ ఎక్స్+ ధరల తగ్గింపు



దిల్లీ: విద్యుత్ వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్.. ఎస్1ప్రో+ స్కూటర్, రోడ్‌స్టర్ ఎక్స్+ మోటార్‌సైకిల్ ధరలను తగ్గించింది. దీంతో ఎస్1 ప్రో+ ధర రూ.1,99,999 నుంచి రూ.1,69,999కు, రోడ్‌స్టర్ ఎక్స్+ ధర రూ.2,24,000 నుంచి రూ.1,89,999కు చేరింది. ఇక ఎస్1 ప్రో+, రోడ్‌స్టర్ ఎక్స్+ల్లో దేశీయంగా అభివృద్ధి చేసిన 4680 బ్యాటరీ సెల్‌ను వినియోగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. తద్వారా స్థానిక తయారీకి ఊతమివ్వనున్నట్లు, ఇకపై స్కూటర్‌లో ప్రతి భాగం దేశీయంగా ఉత్పత్తి చేసినవే ఉంటాయని వెల్లడించింది. దసరా తర్వాత అధునాతన వాహన డెలివరీలను ఓలా ఎలక్ట్రిక్ ప్రారంభించనుంది.

✤ ఓలా 100 ఎకరాల్లో గిగాఫ్యాక్టరీని ప్రారంభించిన తర్వాత.. కొత్త వాహనాల్లో దేశీయ సెల్స్ వినియోగాన్ని తీసుకొచ్చింది. 5 గిగావాట్ అవర్ ప్రారంభ సామర్థ్యంతో ప్రారంభించిన ఈ ఫ్యాక్టరీని, భవిష్యత్‌లో 100 గిగావాట్ అవర్‌కు పెంచనున్నారు.

✤ ప్రస్తుతం చైనా, తైవాన్, జపాన్, కొరియాల నుంచి లిథియం అయాన్ సెల్స్ దిగుమతులపై భారత విద్యుత్ వాహన పరిశ్రమ ఎక్కువగా ఆధారపడుతోంది. దక్షిణ కొరియాలో ఎల్ కెమ్, చైనా సరఫరాదార్ల నుంచి సెల్స్‌ను ఓలా తీసుకుంటోంది.

✤ సరికొత్త ఎస్1 ప్రో స్పోర్ట్: సరికొత్త ఎస్1 ప్రో స్పోర్ట్ మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. దీని ధర రూ.1,49,999. శుక్రవారం దీని బుకింగ్స్‌ను కంపెనీ ప్రారంభించింది. 2026 జనవరి నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. ఈ స్కూటర్ గరిష్ఠ వేగం గంటకు 152 కి.మీ.

✤ త్వరలోనే ప్రముఖ మోటార్‌సైకిల్ డైమండ్‌హెడ్‌ను కంపెనీ తీసుకురానుంది. ఇందులో ఓలా అధునాతన బ్యాటరీ సెల్ టెక్నాలజీతో పాటు దేశీయంగా అభివృద్ధి చేసిన ఏఐ చిప్‌ను వినియోగించనుంది. 2027 డెలివరీలను ప్రారంభించనుంది. ఈ ప్రీమియం విద్యుత్ మోటార్‌సైకిల్ ధర దాదాపు రూ.5 లక్షలుగా నిర్ణయించే అవకాశం ఉంది.

బెంగళూరు సర్జాపూర్, తనిసంద్రలో ఇళ్ల ధరలు 80% పెరిగాయ్

అనరాక్ అంచనా



దిల్లీ: గత మూడున్నరేళ్లలో బెంగళూరులోని సర్జాపూర్ రోడ్, తనిసంద్ర మెయిన్‌రోడ్‌లో గృహాల ధరలు సగటున సుమారు 80 శాతం పెరిగాయని స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ అనరాక్ తెలిపింది. 2021 చివరినాటికి సర్జాపూర్ రోడ్‌లో గృహాల ధర చదరపు అడుగుకు రూ.6,050 కాగా.. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌లో సగటున 79 శాతం పెరిగి రూ.10,800కు చేరిందని తెలిపింది. అలాగే ఉత్తర బెంగళూరులో ఉన్న తనిసంద్ర మెయిన్‌రోడ్‌లో ఇళ్ల ధరలు కూడా చదరపు అడుగుకు రూ.5,345 నుంచి 81 శాతం అధికమై రూ.9,700కు పెరిగాయి.

హైదరాబాద్ సహా ఇతర నగరాల్లో: మరోవైపు, ఏడు ప్రధాన నగరాలు- హైదరాబాద్, బెంగళూరు, పుణె, ఎన్‌సీఆర్, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), కోల్‌కతా, చెన్నైల్లో 2021 చివరి నుంచి 2025 ఏప్రిల్-జూన్ మధ్య ఇళ్ల ధరలు 24-139%, ఇంటి అద్దెలు 32- 81 శాతం మేర పెరిగినట్లు తెలిపింది.

వార్షిక ఫాస్టాగ్‌లకు ఆదరణ

తొలిరోజు కొనుగోలు చేసిన 1.4 లక్షల మంది

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చిన వార్షిక ఫాస్టాగ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. తొలిరోజు సాయంత్రం 7 గంటల వరకు 1.4 లక్షల మంది వినియోగదారులు వీటిని కొనుగోలుచేసి, యాక్టివేట్ చేసుకున్నట్లు వెల్లడించింది. 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. వీటిని వినియోగిస్తున్న వారు టోల్‌గేట్లు దాటినప్పుడు జీరో టోల్‌ఫీ వసూలుచేసినట్లు ఎస్ఎంఎస్‌లు వస్తున్నట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా 1,500 టోల్‌గేట్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపింది. ఫిర్యాదుల పరిష్కారం కోసం కొత్తగా 100 మంది ఎగ్జిక్యూటివ్‌లను నియమించి, జాతీయ రహదారి హెల్ప్‌లైన్ నెంబర్ 1033ను బలోపేతం చేసినట్లు పేర్కొంది. జాతీయ రహదారుల వినియోగదారులు రూ.3వేల వార్షిక ఫీజు చెల్లించి 200 గేట్లు దాటవచ్చని తెలిపింది. రాజ్‌మార్గ్‌యాత్ర యాప్, ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్‌ల ద్వారా ఈ మొత్తం చెల్లించినవారి ఫాస్టాగ్‌లు రెండు గంటల్లోపు యాక్టివేట్ అవుతాయని పేర్కొంది.

నిర్ణయాల కోసమూ ఏఐని వాడేస్తున్నాయ్

పెద్ద సంస్థల తీరు ఇదీ



దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)ను ఆటోమేషన్ టూల్‌గానే కాకుండా, నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందించే సాధనంగానే పెద్ద సంస్థలు భావిస్తున్నాయి. ముఖ్యంగా 2023 నుంచి జనరేటివ్ ఏఐని ప్రవేశపెట్టిన సంస్థలు అయిదు రెట్ల వరకూ పెరిగాయి. మార్కెటింగ్ సమాచారం నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకూ సృజనాత్మక ప్రక్రియను ఇది మార్చి వేస్తోంది. 2025 నాటికి 30 శాతం ఐటీ సేవలు ఏఐ ద్వారా పూర్తిగా ఆటోమేటెడ్ అవుతాయని స్టేట్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సర్వే - 2025 వెల్లడించింది. మే-జులై 2025 మధ్య కాలంలో వార్షికాదాయం రూ.5,000 కోట్లకు పైగా ఉన్న సంస్థల్లోని 350కి పైగా చీఫ్ ఐటీ ఆఫీసర్లు/ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం..

✦ 98.4 శాతం సంస్థలు ఖర్చును తగ్గించుకోవడం, కార్యకలాపాల సామర్థ్యం పెంచడం, వేగంగా పనిచేయడం వంటి వాటి కోసం ఏఐని స్వీకరించాయి.


✦ 96 శాతం సంస్థలు ఏఐ ద్వారా వినియోగదారుడికి మెరుగైన అనుభవాన్ని అందించడంతో పాటు, తమ విలువలో పెరుగుదలనూ చూస్తున్నాయి. ముఖ్యంగా సేవా రంగంలో ఇది కనిపిస్తోంది.

✦ 2025లో 93 శాతం సంస్థలు ఏఐ, జనరేటివ్ ఏఐకి సంబంధించి బడ్జెట్ పెంచాలనే అంచనాతో ఉన్నాయి. ఐటీ కార్యకలాపాల్లో 41 శాతం, ఫైనాన్స్‌లో 31 శాతం, వినియోగదారుల సేవలు 28 శాతం వరకూ ఏఐని ఉపయోగిస్తున్నాయి.

✦ 90 శాతంకంటే ఎక్కువ సంస్థలు డేటా భద్రత, గోప్యతను దృష్టిలో పెట్టుకొని, ఏఐ వాడే విషయంలో కొంచెం అడ్డంకిగానే చూస్తున్నాయి. అదే సమయంలో డేటా నాణ్యత విషయంలోనూ సమస్యలు ఉన్నాయని చెబుతున్నాయి.

ఈనాడు సినిమా

సెప్టెంబరులో కొత్తగా!


మహేశ్ బాబు

కథానాయకుడు మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే మూడు షెడ్యూళ్లను పూర్తి చేసుకుంది. ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్‌ను నైరోబీ, టాంజానియాల్లో ప్లాన్ చేస్తోంది చిత్ర బృందం. ఈ విషయాన్ని దుర్గా ఆర్ట్స్ నిర్మాణ భాగస్వాముల్లో ఒకరైన ఎస్.గోపాల్ రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ కొత్త షెడ్యూల్ సెప్టెంబరు మధ్య నుంచి మొదలయ్యే అవకాశముంది. మహేశ్ దీంట్లో ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడిగా కనువిందు చేయనున్నారు. ఈ చిత్ర తొలి లుక్‌ను నవంబరులో విడుదల చేయనున్నారు. అంతర్జాతీయ హంగులతో ముస్తాబవుతున్న ఈ సినిమాకి కీరవాణి సంగీతమందిస్తుండగా.. దేవాకట్టా సంభాషణలు సమకూరుస్తున్నారు.

వెంకటేశ్ చిత్రం ప్రారంభం

అగ్ర కథానాయకుడు వెంకటేశ్ కొత్త చిత్రం శ్రీకారం చుట్టుకుంది. శుక్రవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. త్రివిక్రమ్ తెరకెక్కిస్తోన్న చిత్రమిది. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదివరకు వెంకటేశ్ చిత్రాలకి త్రివిక్రమ్ రచయితగా పనిచేశారు. ఆయన దర్శకత్వంలో, వెంకటేశ్ నటిస్తున్న తొలి సినిమా మాత్రం ఇదే. త్రివిక్రమ్ శైలిలోనే స్వచ్ఛమైన వినోదం, గాఢమైన భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్నీ అలరించేలా ఈ సినిమా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో నిర్మాత నాగవంశీ పాల్గొన్నారు.


ఎస్.రాధాకృష్ణ, త్రివిక్రమ్, వెంకటేశ్, డి.సురేశ్‌బాబు, నాగవంశీ

లుక్కు.. కొత్త కబురు?


నాగార్జున

ఇటీవలే 'కుబేర'తో ప్రేక్షకుల్ని అలరించిన నాగార్జున.. ప్రస్తుతం 'కూలీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత ఆయన చేయనున్న సినిమాపైనా ఇప్పటికే స్పష్టత వచ్చింది. దీన్ని తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కించనున్నారు. 'కింగ్ 100' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని నాగ్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారు నాగ్. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

విశ్వంభర టీజర్ సిద్ధం


చిరంజీవి

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు టీజర్‌ను సిద్ధం చేసింది చిత్ర బృందం. దీన్ని చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇది ఆధ్యాత్మిక అంశాలతో నిండిన సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబవుతోంది. త్వరలోనే విడుదల తేదీపైనా స్పష్టత ఇవ్వనున్నారు. ఇక మరోవైపు చిరు పుట్టినరోజు సందర్భంగానే అనిల్ రావిపూడి సినిమా టైటిల్ కూడా బయటకు రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

అల్లరిగా సాగే 'డియర్ స్టూడెంట్స్'

నయన తార, మలయాళ నటుడు నివిన్ పౌలీ జంటగా నటిస్తున్న చిత్రం 'డియర్ స్టూడెంట్స్'. ఈ సినిమాని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్‌రాయ్ తెరకెక్కిస్తున్నారు. వినిత్ జైన్, నివిన్ పౌలీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది. ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో నివిన్ ఉండే రెస్టరెంట్‌కి నయన రావడం.. వారి మధ్య నవ్వులు పూయించే సంభాషణలతో ప్రారంభమైంది. అలానే 'డియర్ స్టూడెంట్స్' పేరుతో.. కొందరు స్టూడెంట్స్‌ని పరిచయం చేస్తూ చదువుకునేటప్పుడు వారు చేసే అల్లర్లతో సరదాగా సాగుతోంది. నయన శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తూ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో ఉన్న ఈ టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నయన, నివిన్ కలయికలో రానున్న సినిమా ఇది.


నివిన్ పౌలీ, నయన తార

మహోబాలో శ్రీకృష్ణుడి అవతారం



శ్రీకృష్ణుణ్ని యుద్ధ వీరుడిగా చూపిస్తూ 'శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా' పేరుతో ఓ పాన్ వరల్డ్ సినిమా రూపొందుతోంది. ముకుంద్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అభయ్ చరణ్ ఫౌండేషన్, శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ చిత్ర టైటిల్‌ను శుక్రవారం ప్రకటించారు. "ఇది 11-12వ శతాబ్దాల నాటి మహోబా సాంస్కృతిక వైభవాన్ని, అలాగే శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపించనుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

సువర్ణమాయ ప్యాలెస్‌లో ఏం జరిగింది?


సాయి శ్రీనివాస్, అనుపమ

'కిష్కిందపురి' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించారు. సాహు గారపాటి నిర్మించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈ చిత్రం సెప్టెంబరు 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను బయటకొదిలారు. "నమస్కారం. ఈ రోజు శుక్రవారం. 09-08-1989.. ఆకాశవాణి తలుపులు తెరవబడ్డాయి. పునః ప్రసారాలు నేటితో మొదలు" అంటూ ఓ దెయ్యం మాటలతో సాగిన టీజర్ ఆద్యంతం ఆసక్తి రేకెత్తించింది. హీరో తన మిత్రులతో కలిసి ఎక్కడో అడవిలో ఉన్న సువర్ణమాయ అనే పాడుబడ్డ ప్యాలెస్‌లోకి అడుగు పెట్టడం.. అక్కడ వాళ్లకు ఎదురయ్యే భయంకర అనుభవాల్ని ప్రచార చిత్రంలో ఉత్కంఠభరితంగా చూపించారు. టీజర్‌లో దెయ్యం రేడియో ద్వారా మాట్లాడుతుండటం.. మరో సీన్‌లో హీరో గ్యాంగ్ పాత రేడియోలన్నింటినీ ఓ చోట పడేసి నిప్పు పెట్టడం ఆసక్తి రేకెత్తించింది. మరి టీజర్‌లో దెయ్యం చెప్పిన తేదీకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? ఆ రోజు సువర్ణమాయ ప్యాలెస్‌లో ఏం జరిగింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. దీనికి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: చిన్మయ్ సలాస్కర్.

అవమానించడం నా ఉద్దేశం కాదు


మృణాల్ ఠాకూర్

నటి మృణాల్ ఠాకూర్‌కు చెందిన ఓ పాత వీడియో గత కొన్ని వారాలుగా సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఆ వీడియోలో బిపాసా బసును ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారీ తీయడంతో తాజాగా దానిపై మృణాల్ స్పందించారు. టీనేజ్‌లో ఉన్నప్పుడు ఆ కామెంట్స్ చేశానని.. తన ఉద్దేశం ఎవ్వరినీ అవమానించడం కాదని పేర్కొంటూ ఇన్‌స్టా స్టోరీ వేదికగా ఓ పోస్ట్‌ని పెట్టారు.

"19 ఏళ్ల వయసులో తెలివి తక్కువగా మాట్లాడాను. అవి అందంపై సరదాగా చేసిన వ్యాఖ్యలు.. ఇంతమందిని బాధిస్తాయని నాకు అప్పుడు తెలియదు. అలా మాట్లాడినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను. ఎవరినీ అవమానించాలని అలా మాట్లాడలేదు. అది ఎన్నో ఏళ్ల క్రితం సరదాగా సాగిన ఓ ఇంటర్వ్యూ. ఇంత దూరం వస్తుందని అనుకోలేదు. నేను అలా మాట్లాడకుండా ఉండాల్సిందని ఇప్పుడు అనుకుంటున్నాను. ఏళ్లు గడిచేకొద్దీ అందానికి అసలైన నిర్వచనం నాకు అర్థమైంది. అది ఎంతో విలువైనది. మనసుతో చూస్తే ప్రతి దానిలోనూ సౌందర్యం ఉంటుంది" అని రాసుకొచ్చారు. గతంలో ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తాను బిపాసా బసు కంటే చాలా అందంగా ఉంటానని చెప్పారు. ఆమె కండలు తిరిగిన పురుషుడిలా కనిపిస్తారని అన్నారు. ఆమెతో పోలిస్తే తాను ఎన్నో రెట్లు అందగత్తెనని కామెంట్స్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు మృణాల్ మాటలను తప్పుపట్టారు. బిపాసా కూడా పరోక్షంగా 'మహిళలంతా దృఢంగా ఉండాలి. అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. అమ్మాయిలు శారీరకంగా బలంగా కనిపించకూడదు.. అనే పాతకాలపు ఆలోచనల నుంచి బయటకు రావాలంటూ" ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. దాంతో మృణాల్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు.

ఒకేసారి 15 చిత్రాలు మొదలు

ఒకేరోజు ఒకే వేదికపై 15 సినిమాలకు శ్రీకారం చుట్టారు. ఈ చిత్రాల్ని భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో శుక్రవారం ఈ సినిమాల ప్రారంభోత్సవం జరిగింది. 'జస్టిస్ ధర్మ', 'నాగపంచమి', 'నా పేరు పవన్‌కల్యాణ్', 'టాపర్', 'కె.పి.హెచ్.బి.కాలనీ', 'పోలీస్ సింహం', 'అవంతిక 2', 'యండమూరి కథలు', 'బి.సి (బ్లాక్ కమాండో)', 'హనీ కిడ్స్', 'సావాసం', 'డార్క్ స్టోరీస్', 'మనల్ని ఎవడ్రా ఆపేది', 'ది ఫైనల్ కాల్', 'అవతారం' పేర్లతో చిత్రాలు రూపొందుతాయని, యండమూరి వీరేంద్రనాథ్, ఓం సాయిప్రకాశ్, జె.కె.భారవి, ఉదయ్‌భాస్కర్, తల్లాడ సాయికృష్ణ, సంగకుమార్, శ్రీరాజ్ బళ్లా, రవి బసర, మోహన్‌కాంత్, హర్ష, ఏకరి సత్యనారాయణ, కృష్ణకార్తీక్, శ్రీనివాసరావు, ప్రణయ్ రాజ్ వంగరి, డా.సతీశ్ ఈ చిత్రాలకి దర్శకత్వం వహిస్తారని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తెలిపారు. "వచ్చే ఏడాది ఇదే సమయానికి అన్ని సినిమాలను పూర్తి చేయాలనే ప్రణాళికలతో రంగంలోకి దిగుతున్నాం. పలు సంస్థలు ఈ ప్రారంభోత్సవాన్ని వరల్డ్ రికార్డ్ బుక్స్‌లో నమోదు చేశాయ"ని ఆయన చెప్పారు. సినిమాల ప్రారంభోత్సవానికి మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జె.డి.చక్రవర్తి, తనికెళ్ల భరణి, 30 ఇయర్స్ పృథ్వీ, అజయ్ ఘోష్, సి.కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, విజయేంద్రప్రసాద్, టి.ప్రసన్నకుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్, వల్లూరిపల్లి రమేశ్‌బాబు, వీరశంకర్, కొంతం లక్ష్మణ్, గజల్ శ్రీనివాస్, ప్రవీణ్, ఇమ్మడి రమేశ్, వంశీ రామరాజు, కె.ధర్మారావు, గిడుగు కాంతికృష్ణ తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు.


రామసత్యనారాయణ, మురళీమోహన్

ముక్కోణపు ప్రేమకథ


రాశీ సింగ్

సిద్దార్థ్ మేనన్, దిలీప్ కథానాయకులుగా తెరకెక్కుతున్న చిత్రం... 'ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు'. రాశీ సింగ్ కథానాయిక. తోట రామకృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవలే ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. "ముక్కోణపు ప్రేమకథ ఇది. ఒక అమ్మాయి మనసుని సొంతం చేసుకొనేందుకు ఇద్దరు యువకులు ఏం చేశారన్నది ఇందులో కీలకం. యువతరాన్ని ఆకట్టుకునే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంద"ని దర్శకనిర్మాత తెలిపారు.

క్రైమ్ 'మటన్ సూప్'


రమణ్, వర్ష

రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తున్న చిత్రం 'మటన్ సూప్'. విట్‌నెస్ ది రియల్ క్రైమ్.. . అనేది ఉపశీర్షిక. మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "నేర నేపథ్యంలో సాగే చిత్రాల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించే కథ ఇది" అన్నారు. ఇందులో జెమినీ సురేష్, ఎస్.ఆర్.కె తదితరులు నటిస్తున్నారు.

ఆ విషయాన్ని రజనీకాంత్ నుంచే నేర్చుకున్నా! - ఆర్ మాధవన్

నేను పురస్కారాలకు అర్హుడినని అభిమానులు అనుకోవడమే తనకు గొప్ప అవార్డుతో సమానమని అంటున్నారు విలక్షణ నటుడు ఆర్.మాధవన్. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా.. ఇలా పాత్ర ఏదైనా తన నటనతో మెప్పిస్తుంటారు. ఇటీవలే ఈయన నటించిన 'ఆప్ జైసా కోయి' సినిమా విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో 40ఏళ్ల వయసొచ్చినా.. పెళ్లి కానీ ప్రసాద్ లాంటి సరికొత్త పాత్రలో ప్రేక్షకుల్ని అలరించారు మాధవన్. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. కొన్ని ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు.


ఆర్ మాధవన్

"40ఏళ్లుగా చిత్రసీమలో రాణిస్తున్నా.. ఎలాంటి గుర్తింపు, అవార్డులు రాలేదని అందరూ అనుకుంటున్నారేమో. కానీ నాకు అవార్డులతో అవసరం లేదు. నాకంటే గొప్ప కళాకారులు చాలా మందే ఉన్నారు చిత్రపరిశ్రమలో. వారికి కూడా తగిన గుర్తింపు లభించలేదు. ఎన్నో అద్భుతమైన సినిమాలను చిత్రసీమకు అందించిన దిలీప్ కుమార్ లాంటి గొప్ప వ్యక్తికే జాతీయ అవార్డు రాలేదు. ఇక్కడ అవార్డులు కాదు.. ప్రేక్షకుల్ని అలరించడమే ముఖ్యం. ఇన్నేళ్లు గడిచినా చిత్రపరిశ్రమలో ఇప్పటికీ మంచి పాత్రల్ని దక్కించుకుంటున్నాను. నాకు ఇది చాలు".

ఇదే నాకు అభిమానుల్ని దగ్గర చేస్తుంది

"ఈ మధ్యకాలంలో విడుదలైన 'షైతాన్'లో ప్రతినాయకుడిగా నటించా.. 'ఆప్ జైసా కోయి'లో ప్రేమికుడిగా కనిపించా. ఇలా ఒకే సమయంలో విభిన్నమైన పాత్రల్ని ఎంచుకుంటున్నప్పుడు నా అభిమానులు దీన్ని ఇష్టపడతారా? లేదా? అనేది ఆలోచించను. నేను చేస్తున్న పాత్రల పట్ల నిజాయతీగా ఉంటా. అదే నాకు అభిమానుల్ని దగ్గర చేస్తుంది. అందుకే ప్రేక్షకులు నేను నటిస్తున్న కథల్ని ఎలా స్వీకరిస్తారోనని ఎప్పుడూ భయపడను. అప్పట్లో ఒకే సంవత్సరంలో 'అభిమాన్', 'సౌదాగర్' లాంటి మ్యూజికల్ డ్రామాల్లో ప్రేమికుడిగా నటించిన అమితాబ్ బచ్చన్ ఆ తర్వాత 'జంజీర్' అనే చిత్రంలో పోలీసు పాత్రలో అదరగొట్టారు. నేను కూడా అలాంటి నటుడిని కావాలనుకుంటున్నా".

ఆఫ్‌స్క్రీన్ ఇమేజ్ గురించి బాధపడను

"పాత్రకు అవసరమైతే తప్ప నేను ఎప్పుడూ జుట్టుకు రంగు వేయలేదు. ఆఫ్‌స్క్రీన్ ఇమేజ్ గురించి బాధపడను. దీన్ని నేను రజనీకాంత్ నుంచి నేర్చుకున్నా. ఆయన ఆఫ్‌స్క్రీన్‌లో ఎలా కనిపిస్తారనే దాని గురించి పట్టించుకోరు. కానీ తెరపై మాత్రం మ్యాజిక్ సృష్టిస్తారు. నా స్నేహితుడు అజిత్‌కుమార్ కూడా ఇంతే. నా సహనటులు, సీనియర్ల నుంచి నేర్చుకున్నది ఏమిటంటే.. మీ ఆఫ్‌స్క్రీన్ ఇమేజ్ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నాలా నేను చాలా సౌకర్యంగా ఉన్నా. వేరే వాళ్ల కన్నా చిన్నవాడినని చూపించుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా కంటే చిన్నవాడితో పోటీ పడటం లేదు. నాలోని మంచి నటుణ్ని బయటకు తీసుకురావడానికి నా సామర్థ్యంతో పోటీపడుతున్నా".

మా అబ్బాయి స్విమ్మర్

"నా ఇన్నేళ్ల సినీప్రయాణంలో మనం ఏదైనా పనిని మొదలు పెడితే.. దాన్ని మనసు పెట్టి చేయాలి. నేను ఎప్పుడూ అనుసరించేది ఇదే. 'ఆప్ జైసా కోయి' చిత్రం నా మనసుకు దగ్గరగా అనిపించింది. అందుకే ఈ చిత్రాన్ని అంగీకరించా. ఇంతకు ముందు 'తను వెడ్స్ మను'లో ఇలాంటి పాత్రనే పోషించాను. ఈ వయసులో కూడా ఇంత ఫిట్‌గా ఉండడానికి కారణం నేను బాగా తింటాను (నవ్వుతూ). ఎప్పుడూ ఆకలితో ఉండను. త్వరగా నిద్రపోతాను. నా కొడుకు వేదాంత్ నా వృత్తిని ఎంచుకోలేదని నాకు ఎలాంటి బాధ లేదు. నేను నా తండ్రి వృత్తిని అనుసరించానా? మరి నా కొడుకు ఎందుకు అనుసరించాలి? వేదాంత్ స్విమ్మర్‌గా తనదైన మార్గంలో నడుస్తున్నాడు".

మరోసారి దేశం కోసం పోరాటం


'బార్డర్ 2'

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. "మనం భారత దేశం కోసం పోరాడుదాం..మరోసారి" అంటూ బాలీవుడ్ అగ్రనటుడు సన్నీ దేవోల్ నటిస్తున్న 'బార్డర్ 2' చిత్రంలోని పోస్టర్‌ను అధికారికంగా ఆవిష్కరించింది చిత్రబృందం. నిజమైన కథల నుంచి ప్రేరణ పొందిన ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 22న రానుందని ప్రకటించింది. ఈ పోస్టర్‌లో సైనికుడి అవతారంలో ఫైరింగ్ చేస్తూ శక్తిమంతంగా కనిపిస్తున్నారు సన్నీ దేవోల్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మన దేశ సైనికుల త్యాగాలను ప్రధాన కథాంశంగా చూపించనున్న ఈ చిత్రానికి భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

అరబ్బుల ఆక్రమణ ఫలితమివ్వని ఘన విజయం

తొలి మధ్యయుగంలో భారతీయ రాజుల అనైక్యత, రాజకీయ అస్థిరత, ఒకరిపై ఒకరి ఆధిపత్య ధోరణి విదేశీయులకు వరంగా మారాయి. దీంతో మహమ్మద్ - బిన్-ఖాసీం, మహమ్మద్ గజనీ, మహమ్మద్ ఘోరీ లాంటి మహమ్మదీయులు భారతదేశంపై దండెత్తారు. వీరి దండయాత్రలే భారతదేశంలో ముస్లిం పాలనకు పునాది వేశాయి. దేవాలయాల్లోని అపార ధనాన్ని కొల్లగొట్టారు, విగ్రహాలను ధ్వంసం చేశారు. గజనీ ఏకంగా పదిహేడుసార్లు భారత్‌పై దండెత్తి, ఈ ప్రాంత రాజులను ఓడించాడు. ఆయా రాజ్యాల సంపదను తన వశం చేసుకున్నాడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారతదేశంపై తొలి ముస్లిం దండయాత్రలు

మహమ్మద్-బిన్-ఖాసీం

ఇతడు బాగ్దాద్ (ఇరాక్)కు చెందిన అరబ్బు జాతీయుడు. 712లో సింధ్‌పై దండెత్తాడు. భారతదేశాన్ని జయించి, పాలించిన తొలి మహమ్మదీయుడు ఈయనే.

❖ అరబ్బుల దండయాత్ర సమయంలో సింధ్ రాజ్యాన్ని చచ్ వంశానికి చెందిన దాహీర్ అనే బ్రాహ్మణుడు పాలించేవాడు. అరబ్బు చరిత్రకారుడు అబుబాకర్ రచించిన 'చచ్ నామ' గ్రంథం సింధ్ చరిత్ర గురించి తెలియజేస్తుంది. దీని ప్రకారం శ్రీలంక రాజు ఖలీఫా వాలిద్‌కు విలువైన కానుకలు పంపించగా, సింధ్ రాజ్యంలోని దేభాల్ రేవు పట్టణంలో సముద్రపు దొంగలు దోచుకున్నారు.

❖ బాగ్దాద్‌లో ఖలీఫాకు గవర్నర్‌గా పనిచేస్తున్న అల్‌హజ్జజ్ ఆనాటి సింధ్ పాలకుడు దాహీర్‌ను ఈ ఘటనకు బాధ్యుడిగా చేస్తూ నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశించాడు. దీన్ని దాహీర్ తిరస్కరించడంతో మహమ్మద్ - బిన్ - ఖాసిం ఆధ్వర్యంలో అరబ్బులు సింధ్‌పై దండెత్తారు.

❖ వీరు 712లో బ్రాహ్మణాబాద్ యుద్ధంలో దాహీర్‌ను చంపి సింధ్‌ను ఆక్రమించుకున్నారు.

❖ మహమ్మద్-బిన్-ఖాసిం భారతదేశంలో తొలిసారిగా జిజియా పన్ను విధించాడు. ఇది ముస్లిం రాజ్యంలో నివసిస్తున్న ముస్లిమేతరులపై మత వివక్షతో విధించే పన్ను.

❖ భారతదేశ సంప్రదాయాలపై గౌరవంతో బ్రాహ్మణులకు ఈ పన్నులో మినహాయింపు కల్పించాడు.

❖ సింధ్‌పై అరబ్బుల పాలన ఎక్కువకాలం కొనసాగలేదు. వీరు ఇక్కడి నుంచి భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. కానీ అత్యంత బలవంతులైన బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు వీరిని అడ్డుకున్నారు. దీంతో వీరి ఆధిపత్యం కేవలం సింధ్‌కు మాత్రమే పరిమితమైంది. ఆ తర్వాతి కాలంలో వీరు శాశ్వతంగా భారతదేశాన్ని వీడి వెళ్లిపోయారు.

❖ బ్రిటిష్ చరిత్రకారుడు లేన్‌పుల్ 'అరబ్బుల సింధ్ ఆక్రమణ ఫలితాలివ్వని గొప్ప విజయం' అని వ్యాఖ్యానించాడు.

మహమ్మద్ ఘోరీ



ఘజ్నావిడ్ సామ్రాజ్యంలో సామంతులుగా ఉన్న ఘోరీ వంశస్థులు వారిని అంతంచేసి గజనీ రాజధానిగా ఘోరీ సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ వంశంలో అత్యంత సుప్రసిద్ధుడు షియాబుద్దీన్ మహమ్మద్ ఘోరీ.

✦ ఇతడు భారతదేశంపై పలుమార్లు దండెత్తాడు. కానీ మహమ్మద్ గజనీకి భిన్నంగా సంపద కోసం కాకుండా రాజ్యస్థాపన కోసం దాడి చేశాడు.

✦ మహమ్మద్ గజనీ ఓటమి ఎరుగని వీరుడైతే, ఘోరీ మాత్రం పలుమార్లు భారత రాజుల చేతిలో ఓటమి పాలయ్యాడు.

ప్రధాన దండయాత్రలు:

క్రీ.శ.1175లో ఘోరీ చేసిన తొలి దాడిలో ముల్తాన్‌ను ఆక్రమించాడు.
☛ క్రీ.శ.1178లో జరిగిన మౌంట్‌అబు యుద్ధంలో గుజరాత్‌ను పాలించే సోలంకి రాజు భీమ-II చేతిలో ఓడిపోయాడు. ☛ క్రీ.శ.1191లో మొదటి తరైన్/మొదటి స్థానేశ్వర యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్-III చేతిలో ఓటమి పాలయ్యాడు. ☛ క్రీ.శ.1192లో రెండో తరైన్/రెండో స్థానేశ్వర యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్-IIIను ఓడించి రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. అనంతరం చౌహాన్ వంశస్థులు రణతంబోర్‌కు వలస వెళ్లగా, తన సేనాని కుతుబుద్దీన్ ఐబక్‌ను గవర్నర్‌గా నియమించాడు. చరిత్రకారులు దీన్ని ముస్లిం పాలనకు నాంది పలికిన యుద్ధంగా పరిగణిస్తారు.
☛ క్రీ.శ.1194లో జరిగిన చాందవార్ యుద్ధంలో గహద్వాల రాజు జయచంద్రను చంపి ఆ రాజ్యాన్ని జయించాడు. ☛ 1206లో మహమ్మద్ ఘోరీ హత్యానంతరం వారసులు లేకపోవడంతో ఇతడి గవర్నర్‌లు అనేక స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. ☛ భారతదేశంలో 1206లో కుతుబుద్దీన్ ఐబక్ స్వతంత్రుడై ఢిల్లీ సుల్తానేట్‌ను స్థాపించాడు.

మహమ్మద్ గజనీ



ఘజ్నావిడ్ వంశంలో అత్యంత గొప్పవాడు మహమ్మద్ గజనీ. ప్రపంచ గొప్ప నాయకుల్లో ఒకడిగా ఇతడిని చరిత్రకారులు పేర్కొన్నారు. ఇతడు ఆఫ్గనిస్థాన్ రాజధానిగా మధ్య ఆసియాను పాలించాడు. భారతదేశ సంపదను దోచుకోవడానికి 17 సార్లు దండెత్తి, వరుస విజయాలు సాధించాడు. ప్రముఖ నగరాలపై దండెత్తి దేవాలయ సంపదను దోచుకుని, వాటిని ధ్వంసం చేసి 'భూత్‌షికాన్' అనే బిరుదు పొందాడు. ఖలీఫా నుంచి యామిన్-ఉద్-దౌలా (Yamin-ud-Doulah), అమీన్-ఉల్-మిలత్ (Amin-ul-Milat) అనే బిరుదులు పొందాడు. కేవలం దండయాత్రలే కాకుండా కళాపోషణ, సాహిత్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చాడు.

ముఖ్యమైన దండయాత్రలు

1వ దండయాత్ర (1000): ఖైబర్ కనుమల సమీపంలోని హిందూషాహీల లంఘాస్ కోటను ఆక్రమించాడు.

2వ దండయాత్ర (1001–1002): హిందూషాహి రాజైన జయపాలను ఓడించి పెషావర్ వద్ద బంధించాడు. జయపాలుడి రాజధాని వైహింద్‌ను ఆక్రమించుకుని, 2.50 లక్షల దినార్‌లు, 25 ఏనుగులను కప్పంగా తీసుకుని అతడిని విడుదల చేశాడు.

3వ దండయాత్ర (1003): భాటియా రాజ్యంపై దాడి చేసి బిజైరాయ్‌ని ఓడించాడు.

4వ దండయాత్ర (1005): ముల్తాన్‌ను పాలించే షియా మతస్థుడు షా ఇస్మాయిల్‌ను ఓడించాడు. అనంతరం ముల్తాన్ పాలకుడిగా సుఖపాలుడిని నియమించి, అతడి పేరును నవషాపగా మార్చాడు.

5వ దండయాత్ర (1007): ముల్తాన్ పాలకుడు నవషాపపై దాడి చేశాడు.

6వ దండయాత్ర (1008): ఉత్తరాది రాజపుత్ర రాజులందరూ ఆనందపాలుడి నాయకత్వంలో రాజపుత్ర కూటమిగా ఏర్పడ్డారు. మహమ్మద్ గజనీ ఈ కూటమిని వైహింద్ యుద్ధంలో ఓడించాడు.

7వ దండయాత్ర (1009): నాగర్‌కోటను ఆక్రమించి జ్వాలాముఖి దేవాలయాన్ని దోచుకున్నాడు.

8వ దండయాత్ర (1010): మూడోసారి ముల్తాన్‌పై దాడి చేశాడు.

9వ దండయాత్ర (1014): పంజాబ్ పాలకుడు త్రిలోచనపాలుడిని ఓడించి, రాజధాని నందనాహ్‌ను ఆక్రమించాడు.

10వ దండయాత్ర (1014): స్థానేశ్వర్‌ను జయించి చక్రస్వామి దేవాలయాన్ని దోచుకున్నాడు.

11వ దండయాత్ర (1015): కశ్మీర్‌పై దండయాత్ర చేశాడు.

12వ దండయాత్ర (1018): కనోజ్, మధురను జయించాడు. హరిదత్తుడిని ఓడించి బులంద్-షహర్‌ను ఆక్రమించాడు. ఈ దండయాత్రలోనే మహవన్ రాజు కులాచంద్ ఓడిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు.

13వ దండయాత్ర (1018): ప్రతిహార వంశ చివరి పాలకుడు రాజ్యపాలుడిని ఓడించి కనౌజ్‌ను వశపరచుకున్నాడు.

14వ దండయాత్ర (1019): చందేల రాజు గండరాజును ఓడించాడు.

15వ దండయాత్ర (1021): కలింజర్, గ్వాలియర్‌లను ఆక్రమించగా, విద్యాధరుడు కప్పం చెల్లించి పాలించే హక్కును పొందాడు. గజనీ దాడులను ఎదుర్కొన్న ఏకైక రాజు 'విద్యాధరుడు'.

16వ దండయాత్ర (1025): గజనీ మహమ్మద్ గుజరాత్‌లోని సుప్రసిద్ధ జ్యోతిర్లింగమైన సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేసి, అపార సంపదను దోచుకున్నాడు. ఈ దేవాలయం కథియావడ్ తీరంలో ప్రవాస్‌లోని సోలంకి రాజపుత్ర రాజు మొదటి భీముడి అధీనంలో ఉండేది.

17వ దండయాత్ర (1027): ఇది గజనీ చేసిన చివరి దండయాత్ర పంజాబ్‌లోని జాట్‌లను ఓడించాడు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

743 Word of the Day

Defunct

Telugu meaning: వాడుకలో లేని, పనిచేయని

English meaning: The word defunct (డిఫంక్ట్) is an adjective that describes something no longer existing, functioning, or in use.

Synonyms: Obsolete, Dead

Antonyms: Active, Existing

Usage: **1.** The defunct factory now stands as a crumbling relic of the industrial era.

2. That once-popular social media platform is now completely defunct.

కరెంట్ అఫైర్స్



బ్రిటన్ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన కమాండర్ ఆర్డర్ ఆఫ్ బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) అవార్డును తెలుగు మహిళ పూర్ణిమ తణుకు ఇటీవల అందుకున్నారు. కింగ్ చార్లెస్ సోదరి ప్రిన్సెస్ అనీ దీన్ని ఆమెకు అందించారు. ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, నోబెల్ గ్రహీత హెరాల్డ్ పింటర్, రగ్బీ ఆటగాడు జొనాథన్ పీటర్ విల్కిన్సన్‌తో పాటు మనదేశం నుంచి ఈ గౌరవాన్ని పొందిన వారిలో లీనా నాయర్ ఒకరు.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ద్రవ్యోల్బణం 3.5 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా వేసింది. 2024-25లో ఇది 4.6 శాతంగా నమోదయ్యింది. ఈసారి ఆహార ఉత్పత్తుల దిగుబడి మెరుగ్గా ఉండనుండటంతో ద్రవ్యోల్బణం అదుపులోకి రావొచ్చని తన పరిశోధనా నివేదికలో తెలిపింది.



సుమారు 18 ఏళ్ల తర్వాత ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ మన దేశ సార్వభౌమ క్రెడిట్ రేటింగ్‌ను 'బీబీబీ'కి పెంచింది. బలమైన ఆర్థిక వృద్ధి ఉండటంతో భవిష్యత్ అంచనాను స్థిరత్వానికి సవరించింది. ప్రపంచంలో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటని తెలిపింది. గత 5-6 ఏళ్ల నుంచి ప్రభుత్వ వ్యయాల నాణ్యత పెరిగిందని పేర్కొంది.

రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థ "గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్" (జీఆర్ఎస్ఈ) కొత్తగా రూపొందించిన ఇక్షక్ సర్వే నౌకను భారత నౌకాదళానికి 2025, ఆగస్టు 14న అందజేసింది. జీఆర్ఎస్ఈ అందించిన మూడో సర్వే నౌక ఇది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి

ఆగస్టు 16
చరిత్రలో ఈనాడు


21వ శతాబ్దంలో దేశ స్థితిగతుల్లో మార్పు తెచ్చి ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణ పరంగా అభివృద్ధి చెందేలా భారత్ ప్రగతి పథంలో సాగడంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ కీలకపాత్ర పోషించారు. ఆయన కేవలం రాజకీయ నాయకుడే కాదు.. కవి, గొప్ప మానవతావాది కూడా. భారతీయ జనతా పార్టీని (భాజపా) స్థాపించి, అధికారంలోకి తీసుకొచ్చి, అయిదేళ్లు పాలించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్ర సృష్టించారు. మూడుసార్లు ప్రధాని పీఠాన్ని అధిరోహించినా.. ఎన్నడూ అధికార దర్పాన్ని ప్రదర్శించలేదు. తాను నమ్మిన సిద్ధాంతాలకు చివరిదాకా కట్టుబడి ఉన్నారు. పదవుల కోసమో.. పేరు కోసమో.. డబ్బు కోసమో.. విలువలను ఎన్నడూ విడిచిపెట్టలేదు. ఆగస్టు 16న వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య సంఘటనలను పరిశీలిద్దాం..!

▌ మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 1924 డిసెంబరు 25న వాజ్‌పేయీ జన్మించారు. జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడైన శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఆయన రాజకీయ కార్యదర్శిగా పనిచేశారు.

రాజకీయ ప్రస్థానం..

1939లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లో చేరారు. 1944 నాటికి ఆర్య కుమార్ సభకు ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1951లో కొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ కార్యదర్శి బాధ్యతలను వాజ్‌పేయీ చేపట్టారు. 1968 నుంచి 72 వరకూ జనసంఘ్ అధ్యక్షుడిగా సేవలందించారు.

❖ 1957లో తొలిసారిగా వాజ్‌పేయీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధుర, బలరాంపుర్‌ల నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. మధురలో ఓడిపోగా బలరాంపుర్‌లో గెలిచారు.



నాటి నుంచి 10సార్లు గెలిచిన ఆయన 5 దశాబ్దాలపాటు ఎంపీగా కొనసాగారు. రాజ్యసభకు రెండుసార్లు ఎన్నికయ్యారు.

❖ 1977లో జనతా పార్టీలో జనసంఘ్ విలీనమయ్యాక.. విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

❖ 1977లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో వాజ్‌పేయీ హిందీలో ప్రసంగించారు. అక్కడ హిందీలో ప్రసంగించిన తొలి వ్యక్తి ఆయనే.

❖ జనతా పార్టీ చీలిపోయాక 1980లో అద్వాణీతో కలిసి భాజపాను స్థాపించారు. ఆ పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు.

ప్రధానిగా..

1996 ఎన్నికల్లో భాజపా అతి పెద్ద పార్టీగా అవతరించింది. దీంతో వాజ్‌పేయీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కానీ 13 రోజుల్లోనే రాజీనామా చేయాల్సి వచ్చింది.

✦ 1998లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మళ్లీ భాజపా అధికారం చేపట్టగా వాజ్‌పేయీ ప్రధాని అయ్యారు. మద్దతిచ్చిన ఏఐఏడీఎంకే 13 నెలల తర్వాత ఉపసంహరించుకోవడంతో ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయింది.

✦ కార్గిల్ యుద్ధం తర్వాత 1999లో మళ్లీ ఎన్నికలు జరిగాయి. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 303 సీట్లను గెలుచుకుని అధికారం చేపట్టింది. వాజ్‌పేయీ మూడోసారి ప్రధాని అయ్యారు. దీంతో అయిదేళ్ల పాటు ప్రభుత్వం నిరాటంకంగా కొనసాగింది.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

ఏదైనా పరిశ్రమ పేలవమైన ఆర్థిక స్థితిని ప్రదర్శిస్తూ, నష్టాల్లో ఉండటాన్ని ఇండస్ట్రియల్ సిక్‌నెస్‌తో సూచిస్తారు. సమర్థవంతంగా పనిచేయని లేదా నిర్వహణ ఖర్చులకు తగిన ఆదాయాన్ని సమకూర్చుకోలేని పరిశ్రమలు దీని కిందకు వస్తాయి. ఈ స్థితిలో కంపెనీలు స్థిరంగా మిగులును సంపాదించలేక మనుగడ కోసం ఫైనాన్సింగ్, ఇతర మార్గాలపై ఆధారపడాల్సి ఉంటుంది.


ఖాయిలాపడ్డ పరిశ్రమలు

నిర్వచనాలు

కంపెనీ సవరణల చట్టం ప్రకారం రుణదాత (ఫైనాన్షియర్) అడిగిన తొమ్మిది నెలలలోపు రుణం చెల్లించలేని కంపెనీలను ఖాయిలాపడ్డ సంస్థలుగా చెప్పొచ్చు.

✦ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం, ఒక సంస్థ నిరంతరాయంగా మిగులును సృష్టించడంలో విఫలమై, మనుగడ కోసం బయటి నిధులపై ఆధారపడితే అది ఖాయిలాపడ్డ సంస్థ.

ఖాయిలాపడ్డ పరిశ్రమల విత్త సహాయానికి 1971లో ఇండస్ట్రియల్ రీకన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఐఆర్‌సీఐ)ను ఏర్పాటు చేశారు.



ఖాయిలాకు కారణాలు, ప్రభావాలు, బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (బీఐఎఫ్ఆర్) మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఏపీ వైద్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఏపీఎంఎస్ఆర్‌బీ) రెగ్యులర్ ప్రాతిపదికన ఏపీ వైద్య, కుటుంబ సంక్షేమ శాఖలో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డెంటల్ స్పెషాలిటీస్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 15. దరఖాస్తు ఫీజు రూ.1000. అర్హులైన అభ్యర్థులు 2025, ఆగస్టు 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 19. దరఖాస్తు ఫీజు రూ.1000. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 24.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (ఆగస్టు 16) చివరి తేదీ

▌ హిల్ ఇండియా లిమిటెడ్‌లో 13 మేనేజర్ పోస్టులు. డిగ్రీ, సీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▌ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూపార్‌లో ఫ్యాకల్టీ పోస్టులు. బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▌ రైల్‌టెల్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో 40 అప్రెంటిస్ పోస్టులు. బీటెక్/బీఈ, డిప్లొమాలో ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mensuration - 2D

1. The area of a rectangle is 5915 sqm. The ratio of its length to breadth is 7 : 5. What will be the perimeter of the rectangle?
A) 312 m B) 316 m
C) 320 m D) 324 m

2. The sides of a rectangular garden are 175 m and 1792 m. What is the perimeter of a square garden with the same area?
A) 2120 m B) 2240 m
C) 2300 m D) 2180 m

3. The area of an equilateral triangle is $196\sqrt{3}$ sq cm. Find twice the height of the triangle.
A) $28\sqrt{3}$ cm B) $32\sqrt{3}$ cm
C) $24\sqrt{3}$ cm D) $36\sqrt{3}$ cm

4. The area of a trapezoid is 390 sq cm. If the lengths of its parallel sides are 20 cm and 32 cm, find the perpendicular distance between them.
A) 12 cm B) 18 cm
C) 20 cm D) 15 cm

5. The length of a rectangular park is increased by 20% and the breadth is decreased by 30%. What is the percentage change in its area?
A) 16% decrease B) 14% decrease
C) 15% decrease D) 12% decrease

6. The perimeter of a rectangular playground is 360 m, and the ratio of its length to breadth is 7 : 5. What is its area?
A) 7,870 m^2 B) 7,650 m^2
C) 7,880 m^2 D) 7,875 m^2

7. The area of a trapezium-shaped park is 2460 m^2. The distance between the two parallel sides is 60 m, and one of the parallel sides is 40 m long. What is the length of the other parallel side?
A) 42 m B) 44 m
C) 46 m D) 48 m

8. The area of a regular hexagonal field is $1350\sqrt{3}$ m^2. What will be the cost (in Rs.) of fencing it at Rs.30 per metre?
A) Rs.4,200 B) Rs.4,800
C) Rs.5,400 D) Rs.6,000

9. If the width of the path around a square field is 3 m and the area of the path is 264 m^2, then the length of one side of the field (inner square) is:
A) 18 m B) 19 m
C) 24 m D) 25 m

10. A rectangular lawn is 96 metres long and 72 metres wide. The time taken by a man to walk along its diagonal at the speed of 12 km/h is:
A) 30.2 seconds B) 36.0 seconds
C) 40.5 seconds D) 43.2 seconds

Railway Exams

Mathematics

11. The dimensions of the floor of a rectangular hall are 72 m × 48 m. The floor of this hall is to be tiled fully with 30 cm × 20 cm rectangular tiles without breaking them to smaller size. The number of tiles required is:
A) 57,600 B) 56,400
C) 58,200 D) 59,800

12. The cost of carpeting a rectangular hall is Rs.2,400. If the breadth had been 3 meters less, the cost of carpeting would have been Rs.600 less. The breadth of the hall is:
A) 6 m B) 8 m C) 10 m D) 12 m

13. The outer and inner diameters of a circular path are 842 cm and 814 cm respectively. The width of the path is:
A) 14 cm B) 15 cm
C) 16 cm D) 18 cm

14. The cost of leveling a circular field at 55 paise per square metre is Rs.4150.3. The cost (in Rs.) of putting up a fence all around it at Rs.2 per metre is $\left(\text{Use } \pi = \frac{22}{7}\right)$
A) 1250 B) 1008 C) 616 D) 1232

15. Three sides of a triangular park are of length 18 m, 24 m, and 30 m respectively. Find the cost of planting grass in the park at the rate of Rs.7 per sq. m.
A) Rs.1260 B) Rs.1512
C) Rs.1722 D) Rs.1848

16. The lengths of two parallel sides of a trapezium are 18 cm and 26 cm. If its area is 220 sq. cm, then its height is:
A) 8 cm B) 9 cm
C) 10 cm D) 11 cm

17. The radii of two concentric circles are 70 cm and 28 cm. The area of the closed figure bounded by the two circles is:
A) 3600π sq.cm B) 4116π sq.cm
C) 3360π sq.cm D) 4200π sq.cm

18. The area of a rhombus is 192 cm^2. If one of its diagonals is 16 cm, then the length of one of its sides is:
A) $\sqrt{416}$
B) $\sqrt{325}$ C) $\sqrt{254}$
D) $\sqrt{208}$

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



■ ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ - పీఎం) నూతన ఛైర్మన్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ఈఏసీ- పీఎం అనేది ప్రధానికి సలహా ఇవ్వడానికి ఏర్పాటు చేసిన రాజ్యాంగేతర, తాత్కాలిక సంస్థ. ఇది నీతి ఆయోగ్ ఫ్రేమ్ వర్క్ కింద పని చేస్తుంది.)
జ: ఎస్. మహేంద్ర దేవ్

■ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్మూ-కశ్మీర్‌లో ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చ్ వంతెన చీనాబ్ రైలు వంతెనను ఏ రోజున ప్రారంభించారు? (దీంతో కశ్మీర్ లోయను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే లక్ష్యంతో 42 ఏళ్ల కిందట ప్రారంభించిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ (యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్ట్ పూర్తయినట్లయింది. దీని మొత్తం పొడవు 272 కి.మీ. చీనాబ్ రైలు వంతెన ఎత్తు 359 మీటర్లు.)
జ: 2025, జూన్ 6

■ ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని (వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే) ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('ఫుడ్ సేఫ్టీ: సైన్స్ ఇన్ యాక్షన్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)
జ: జూన్ 7

మరింత సమాచారం

■ భారత్-ఇంగ్లాండ్‌ల మధ్య జరిగే చారిత్రాత్మక టెస్ట్ సిరీస్‌ను ఇక నుంచి ఏ పేరుతో పిలవాలని బీసీసీఐ, ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డులు ప్రకటించాయి?
జ: ఆండర్సన్ - తెండూల్కర్ ట్రోఫీ



దరఖాస్తు చేశారా?

☛ హాల్‌లో ప్రొఫెషనల్స్ పోస్టులు
చివరి తేదీ: 16.08.2025

☛ హిల్ ఇండియా లిమిటెడ్‌లో మేనేజర్ ఉద్యోగాలు
చివరి తేదీ: 16.08.2025

ఇంధన భద్రతకు సమర్థ వ్యూహాలు!



భారత్ దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇంధన భద్రత. ఇంధన అవసరాల కోసం దేశం ప్రధానంగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. స్వల్పకాలంలో ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనే వ్యూహమే జీవఇంధన విధానాల రూపకల్పన. ఆర్థికాభివృద్ధిలో, ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఇటీవలి కాలంలో వీటి అవసరం పెరుగుతోంది. జీవద్రవ్యాల నుంచి ఉత్పత్తి చేసే ఇంధనాలను ఉపయోగించడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విధానాలను, కార్యక్రమాలను ప్రభుత్వం సిద్ధం చేసి అమలు చేస్తోంది. ఈ పరిణామాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, రైతుల ఆదాయం పెంపు లాంటి బహుళ లక్ష్యాలను సాధించడానికి అవి దోహదపడే తీరును అర్థం చేసుకోవాలి.

జీవ ఇంధన విధానాలు

జీవ ఇంధనాలను ప్రధానంగా నాలుగు తరాలుగా వర్గీకరించారు.





1) మొదటి తరం జీవ ఇంధనాలు: చక్కెర, పిండిపదార్థాలు, కూరగాయల నూనె లేదా జంతువుల కొవ్వులతో సహా ఆహార వనరుల నుంచి సంప్రదాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ఇంధనాలను ఉత్పత్తి చేస్తారు. బయో ఆల్కహాల్, బయోడీజిల్, బయో-ఈథర్‌లు, బయోగ్యాస్ లాంటివి సాధారణ మొదటితరం జీవ ఇంధనాలకు ఉదాహరణలు. అయితే వీటి ఉత్పత్తికి ఆహార వనరులను ఉపయోగించడం కలవరపెడుతోంది. ఆహార ఖర్చులు పెరగడానికి, ఆకలి సమస్యకు కారణమవుతోంది.

2) రెండో తరం జీవ ఇంధనాలు: ఇవి ఆహారేతర పంటలు లేదా ఆహార పంటల ఉప-ఉత్పత్తుల నుంచి తయారవుతాయి. తినడానికి వీలుపడని వీటిని వ్యర్థాలుగా పరిగణిస్తారు. పండ్లతొక్కలు, పొట్టు లేదా కాండం, చెక్క ముక్కలు లాంటివి. ఇలాంటి ఇంధనాలను థర్మోకెమికల్ ప్రతి చర్యలు లేదా జీవరసాయన మార్పిడి ప్రక్రియల ద్వారా సృష్టిస్తారు. **ఉదా:** బయోడీజిల్, సెల్యులోజ్ ఇథనాల్. ఈ ఇంధనాలు ఆహార ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపనప్పటికీ, వాటిని ఉత్పత్తి చేయడం కష్టం. మొదటి తరం జీవ ఇంధనాలతో పోల్చినప్పుడు, ఇవి తక్కువ గ్రీన్‌హౌస్ ఉద్గారాలను విడుదల చేస్తాయి.



3) మూడో తరం జీవ ఇంధనాలు: ఇవి శైవలాల (ఆల్గే) లాంటి సూక్ష్మజీవుల నుంచి ఉత్పత్తవుతాయి. **ఉదా:** బ్యుటనాల్. ఆల్గేను భూమిపై, నీటిలో సాగు చేయవచ్చు. ఇది ఇప్పటికే క్షీణించిన నీటి సరఫరాపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అయితే అలాంటి పంటల ఉత్పత్తిలో ఉపయోగించే ఎరువులు పర్యావరణ కాలుష్యానికి దారితీయడమే ఇందులో ఉన్న ప్రతికూలత.

4) నాలుగో తరం జీవ ఇంధనాలు: ఈ ఇంధనాలను రూపొందించడానికి జన్యుపరంగా మార్పు చేసిన పంటలను బయోమాస్‌గా పండిస్తారు. రెండో తరం పద్ధతులను ఉపయోగించి పంటలను ఇంధనంగా మారుస్తారు. ఆ ఇంధనం ముందస్తు దహనంతో కార్బన్ సంగ్రహణకు గురవుతుంది. అప్పుడు కార్బన్ భౌగోళికంగా బంధితం (జియో సీక్వెస్టర్) అవుతుంది. తద్వారా తవ్వడానికి వీలులేని బొగ్గు గనుల్లో లేదా ఖాళీ చమురు/గ్యాస్ క్షేత్రాల్లో కార్బన్ నిల్వగా మారుతుంది. ఈ ఇంధనాల్లో కొన్నింటిని కార్బన్ - నెగెటివ్‌గా పరిగణిస్తారు. వీటి ఉత్పత్తి అంటే పర్యావరణం నుంచి కార్బన్‌ను బయటకు తీయడమే.

జాతీయ జీవ ఇంధన విధానం - 2008

భారత ప్రభుత్వం 2008, సెప్టెంబరు 11న జీవ ఇంధనాలపై జాతీయ విధానాన్ని ప్రకటించింది. దీనిని 2009 నుంచి అమలు చేసింది.

ముఖ్యాంశాలు: * 2017 నాటికి బయో ఇథనాల్, బయోడీజిల్‌లలో జీవ ఇంధన సమ్మిళితాన్ని 20 శాతానికి పెంచాలి. బయోడీజిల్ ఉత్పత్తికి వ్యర్థ, పనికిరాని, వదిలేసిన భూముల్లో పంటకు వినియోగించని చమురు గింజలు వేయాలి. * దేశీయంగా బయోడీజిల్ ముడి పదార్థాల ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. సామాజిక ప్రభుత్వ, అటవీ వ్యర్థ భూముల్లో బయోడీజిల్ ప్లాంటేషన్‌ను ప్రోత్సహిస్తూనే సారవంతమైన పంట భూముల్లో ప్లాంటేషన్‌ను నిరుత్సాహపరచాలి. * బయోడీజిల్ పంటను పండించేవారికి బయో డీజిల్ నూనెగింజలకు సంబంధించి కనీస మద్దతు ధర ప్రకటించాలి, వాటిని తరచూ సవరించాలి. వాస్తవ ఉత్పత్తి వ్యయం, బయో-ఇథనాల్ దిగుమతి ధరల ఆధారంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు బయో ఇథనాల్ కొనడానికి కనీస కొనుగోలు ధరను కల్పించాలి. * జీవ ఇంధనాలను ప్రభుత్వం 'ప్రకటిత వస్తువులు' పరిధిలోకి తేవడం ద్వారా బయో ఇంధనాలు స్వేచ్ఛగా రాష్ట్రం లోపల, వెలుపల రవాణా అయ్యే విధంగా చూడాలి. బయోడీజిల్‌పై ఎలాంటి పన్నులు విధించకూడదు. * జీవ ఇంధనాలతో సహా ప్లాంటేషన్, ప్రాసెసింగ్, ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానాలపై దృష్టి పెడుతూ పరిశోధన, అభివృద్ధి కొనసాగించాలి.



2018 విధానం ఆవిష్కరణ

జాతీయ జీవ ఇంధన విధానం - 2018

దేశంలో జీవ ఇంధనాలను ప్రోత్సహించడానికి, 2009లో నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఈ విధానాన్ని రూపొందించింది. మేకిన్ ఇండియా, స్వచ్ఛ భారత్ అభియాన్, స్కిల్ డెవలప్‌మెంట్ లాంటి ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, దిగుమతి తగ్గింపు, ఉపాధి కల్పన, వ్యర్థాల నుంచి సంపద సృష్టి లాంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలతో అనుసంధానానికి గొప్ప అవకాశం కల్పించడంతో భారతదేశంలో జీవఇంధనాలకు వ్యూహాత్మక ప్రాముఖ్యత వచ్చింది. జీవ ఇంధన ఉత్పత్తి కోసం దేశీయంగా ముడి సరకు స్థిరంగా, తగిన పరిమాణంలో అందుబాటులో లేకపోవడం ఒక సమస్యగా మారింది. దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జీవఇంధన విధానం-2018ని ఆమోదించింది.

ముఖ్యాంశాలు: ఈ విధానం జీవ ఇంధనాలను 'ప్రాథమిక జీవ ఇంధనాలు'గా, అనేక తరాలుగా వర్గీకరించింది.

మొదటి తరం (1జీ): బయో ఇథనాల్, బయో డీజిల్, అడ్వాన్స్‌డ్ బయోఫ్యుయెల్స్. **రెండో తరం (2జీ):** ఇథనాల్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ డ్రాప్-ఇన్ ఇంధనాలు. **మూడో తరం (3జీ):** జీవ ఇంధనాలు, బయో-సీఎన్‌జీ మొదలైనవి.

వీటిలో ప్రతి విభాగానికి తగిన ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పిస్తారు. చెరకు రసం, చక్కెర కలిగిన పదార్థాలు, దుంపలు, తీపిజొన్నలు, మొక్కజొన్న, కాసావా లాంటి పిండిపదార్థాలతోపాటు మానవ వినియోగానికి పనికిరాని గోధుమలు, పాడైన బియ్యం, కుళ్లిన బంగాళాదుంపలను ఇథనాల్ ఉత్పత్తికి అనుమతించడం ద్వారా ముడిపదార్థాల పరిధిని ఈ విధానం విస్తరిస్తుంది.

* మిగులు ఉత్పత్తి దశలో రైతుల ఉత్పత్తులకు తగిన ధర లభించకపోయే ప్రమాదం ఉంది. ఈ మిగులు ఆహార ధాన్యాలను జాతీయ జీవఇంధన సమన్వయ కమిటీ ఆమోదంతో ఇథనాల్ ఉత్పత్తికి సేకరించేందుకు ఈ విధానం అనుమతిస్తుంది. * అధునాతన జీవ ఇంధనాలకు పెద్దపీట వేస్తూ 1జీ ఇంధనాలతో పోలిస్తే అదనపు పన్ను ప్రోత్సాహకాలు, అధిక కొనుగోలు ధరతో పాటు 2జీ ఇథనాల్ బయో రిఫైనరీలకు ఆరేళ్లలో రూ.5000 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకాన్ని ఈ విధానం సూచిస్తుంది. * వంటనూనె గింజలు, ఉపయోగించిన వంటనూనె, స్వల్పకాలిక పంటల నుంచి బయోడీజిల్ ఉత్పత్తికి సరఫరా గొలుసు ఏర్పాటును ప్రోత్సహిస్తుంది. * జీవఇంధనాల విషయంలో సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలు బాధ్యత తీసుకోవాలని విధానపత్రంలో పొందుపరిచారు.

2018 పాలసీ - ఆశించిన ప్రయోజనాలు

1) ఇంధన దిగుమతుల భారం తగ్గింపు: ఒక కోటి లీటర్ల ఈ-10 (ఇథనాల్) వల్ల ప్రస్తుత రేట్ల ప్రకారం రూ.28 కోట్ల విదేశీ మారకద్రవ్యం (ఫారెక్స్) ఆదా అవుతుంది.

2) పర్యావరణ రక్షణ: కోటి లీటర్ల ఈ-10 సుమారు 20,000 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుంది. పంట దహనాన్ని తగ్గించడం, వ్యవసాయ అవశేషాలు/వ్యర్థాలను జీవ ఇంధనాలుగా మార్చడం ద్వారా హరిత ఉద్గారాలు మరింత తగ్గుతాయి.

3) ఆరోగ్య ప్రయోజనాలు: ఆహారం తయారీకి, ముఖ్యంగా డీప్‌ఫ్రైయింగ్‌కి నూనెను దీర్ఘకాలం ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం. అలాంటి వంట నూనెలను బయోడీజిల్ ఉత్పత్తిలో వాడుకోవచ్చు.

4) వ్యర్థాల నిర్వహణ: దేశంలో ఏటా 62 ఎంఎంటీ మున్సిపల్ ఘనవ్యర్థాల ఉత్పత్తి జరుగుతోందని అంచనా. ఒక టన్ను వ్యర్థాల నుంచి 20% జీవ ఇంధనాన్ని తయారుచేయవచ్చు.

5) గ్రామాల్లో మౌలిక సదుపాయాల పెట్టుబడులు: ప్రభుత్వ అంచనా ప్రకారం రోజుకు 100 లీటర్ల బయోడీజిల్ ఉత్పత్తికి సుమారు రూ.800 కోట్ల మూలధన పెట్టుబడులు అవసరం. ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడితో 12 (2జీ) బయో రిఫైనరీలను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పెట్టుబడులు పెరుగుతాయి.

6) ఉపాధి కల్పన: జీవఇంధనాల ప్లాంట్ ఆపరేషన్స్, విలేజ్ లెవల్ ఆంత్రప్రెన్యూర్స్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌లో 2జీ బయోరిఫైనరీ ద్వారా ఒక్కో ప్లాంటుకు 1200 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి.


7) రైతులకు అదనపు ఆదాయం: పొలాల్లో దహనం చేసే వ్యవసాయ అవశేషాలు/వ్యర్థాలను 2జీ సాంకేతిక పరిజ్ఞానంతో ఇథనాల్‌గా మార్చవచ్చు. దీంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుంది. అలాగే మిగులు ధాన్యాలు, వ్యవసాయ బయోమాస్ మార్పిడి ధరల స్థిరీకరణకు సహాయపడుతుంది.

జీవఇంధన విధానం - 2018కు చేసిన సవరణలు: * పెట్రోల్‌లో 20% ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని 2030కి బదులుగా 2025-26 నాటికే సాధించాలన్న లక్ష్యాన్ని కేంద్రం విధించింది. * 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం కింద దేశంలో సెజ్‌ల్లో ఉన్న యూనిట్ల ద్వారా జీవ ఇంధనాల ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

విజయాల వీరుడు.. సంగీత నిపుణుడు!




భారతదేశ చరిత్ర, సంస్కృతిపై చెరగని ముద్ర వేసిన పాలకులు గుప్తులు. ప్రాచీన కాలంలో మగధ సామ్రాజ్యం తర్వాత ఉపఖండంలో అంతటి పాలనా వైభవాన్ని తిరిగి నెలకొల్పారు. గుప్త సామ్రాజ్యం రాజకీయ, ఆర్థిక స్థిరత్వంతోపాటు కళలు, సాహిత్యం, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రాల్లో అద్వితీయ విజయాలు సాధించింది. సృజనాత్మకత, మేధోపరమైన కార్యకలాపాలు పురోగమించిన స్వర్ణయుగం ఆవిష్కృతమైంది. దేశాన్ని ప్రపంచానికే జ్ఞాన గురువుగా నిలిపిన గుప్త సామ్రాజ్య విశేషాలు, పాలకుల క్రమం, వారి విజయాలు, గొప్ప పనులు, నాటి సామాజిక, మత పరిస్థితులను పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. గుప్తుల గురించి తెలిపే చారిత్రక ఆధారాలు, వారు నెలకొల్పిన ఆదర్శాలు, రాజకీయ, పాలనా వ్యవస్థలతోపాటు ఆనాటి ప్రసిద్ధ రచయితలు, కళాకారులు, శాస్త్రవేత్తలు, వారి ఆవిష్కరణలను గుర్తుంచుకోవాలి.


గుప్త సామ్రాజ్యం

జనరల్ స్టడీస్-ఇండియన్ హిస్టరీ


1. కింది వాటిని జతపరచండి.
   1) మృచ్ఛకటికం — ఎ) విశాఖదత్తుడు
   2) ముద్రారాక్షసం — బి) శూద్రకుడు
   3) అమరకోశం — సి) వరాహమిహిరుడు
   4) బృహత్ సంహిత — డి) అమరసింహుడు
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   3) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
   4) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
2. కింది వాటిలో ఏది సరైన జత కాదు? (రాజులు - వారి పట్ట మహిషులు)
   1) సముద్రగుప్తుడు - దత్తదేవి
   2) రెండో చంద్రగుప్తుడు - ధ్రువాదేవి
   3) కుమారగుప్తుడు - ప్రభావతిదేవి
   4) మొదటి చంద్రగుప్తుడు - కుమారదేవి
3. నవరత్నాల్లో ప్రముఖుడు ఎవరు?



   1) కాళిదాసు
   2) వరాహమిహిరుడు
   3) శంకు 4) ధన్వంతరి
4. ప్రతిపాదన-(ఎ): సముద్రగుప్తుడు వీణ వాయిస్తున్నట్లు ఉండే బంగారు నాణేలు ముద్రించాడు.
   కారణం-(ఆర్): ఆయన సంగీతంలో నిపుణుడు.
   1) ఎ, ఆర్ లు సత్యం; ఎ కు ఆర్ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ లు సత్యం; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
   3) ఎ సత్యం, ఆర్ అసత్యం.
   4) ఎ అసత్యం, ఆర్ సత్యం.
5. కింది వాటిని జతపరచండి.
   1) పాలకాప్య — ఎ) పంచ సిద్ధాంతం
   2) పతంజలి — బి) హస్త్యాయుర్వేదం
   3) వాగ్భట్టు — సి) యోగసూత్రం
   4) వరాహమిహిర — డి) అష్టాంగ సంగ్రహం
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
   3) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
6. కింది వాటిలో గుప్తుల కాలంనాటి ఆలయాలు లభించని ప్రాంతం?
   1) బీటర్‌గాం/బిటార్గాన్ 2) ఎరాన్
   3) దియోఘర్ 4) రాజోగిర్
7. కింది వాటిలో గుప్తుల గురించి తెలుసుకోవడానికి ఆధారమైన శాసనాలు?
   ఎ) అలహాబాద్ శాసనం
   బి) ఉదయగిరి గుహ శాసనం
   సి) సాంచీ శాసనం డి) ఎరాన్ శాసనం
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, డి
8. కింది గుప్తవంశ రాజులను వరుసలో అమర్చండి.
   ఎ) శ్రీగుప్తుడు
   బి) మొదటి కుమారగుప్తుడు
   సి) రెండో చంద్రగుప్తుడు
   డి) విష్ణుగుప్తుడు
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి, బి
   3) ఎ, సి, బి, డి 4) డి, సి, బి, ఎ
9. ప్రకటన-ఎ: కౌముది మహోత్సవం - మొదటి చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చిన విధానం గురించి వివరిస్తుంది.
   ప్రకటన-బి: దేవిచంద్రగుప్తం - రామగుప్తుడు. రెండో చంద్రగుప్తుడి చరిత్ర గురించి వివరిస్తుంది.
   1) ఎ, బి లు సరైనవి. 2) ఎ, బి సరికావు.
   3) ఎ సరైంది, బి సరికాదు.
   4) ఎ సరికాదు, బి సరైంది.
10. అలహాబాద్ శాసనం గురించి సరైనవి గుర్తించండి.



   ఎ) శాసనం వేయించింది హరిసేనుడు.
   బి) ఈ శాసనం సముద్రగుప్తుడి దండనాయకుడైన తిలభట్టు వేయించాడు.
   సి) ఈ శాసనంలో సముద్రగుప్తుడి విజయాలున్నాయి.
   డి) సముద్రగుప్తుడి చేతిలో ఓడిపోయినట్లు పేర్కొన్న అతడి సోదరుడు కచుడు.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి
11. సముద్రగుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్'గా కీర్తించినవారు?
   1) వి.ఎ.స్మిత్ - 1862 2) మార్షల్ - 1890
   3) వి.ఎ.స్మిత్ - 1890 4) మార్షల్ - 1862
12. దేవిచంద్రగుప్తం అనే నాటకాన్ని 'ముజామ్-ఉల్-తవారిక్'గా పర్షియన్ భాషలోకి అనువదించిన వారు?
   1) అల్ బెరూనీ 2) అబుల్ ఫజల్
   3) హబుల్ హసన్ అలీ 4) అమీర్ ఖుస్రూ
13. రెండో చంద్రగుప్తుడి గురించి సరైనవి గుర్తించండి.



   ఎ) ఇతడి బిరుదులు విక్రమాదిత్య, శకరి, పరమ భాగవత.
   బి) రాజధానిని ఉజ్జయిని నుంచి పాటలీపుత్రానికి మార్చాడు.
   సి) ఉజ్జయినిలో ఖగోళశాస్త్రం అభివృద్ధికి కృషి చేశాడు.
   డి) నాగ వంశానికి చెందిన కుబేరనాగను వివాహం చేసుకున్నాడు.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) బి, సి, డి
14. ప్రకటన-ఎ: చైనా యాత్రికుడైన ఫాహియాన్ రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించాడు.
   కారణం-ఆర్: ఫాహియాన్ పర్యటనలో ప్రధాన ఉద్దేశం బౌద్ధమత గ్రంథాల సేకరణ, బౌద్ధమత పుణ్య క్షేత్రాల సందర్శన.
   1) ఎ కు ఆర్ సరికాదు.
   2) ఎ సరికాదు, ఆర్ సరైంది.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ కు ఆర్ సరైంది
15. మొదటి కుమారగుప్తుడి గురించి సరికానిది గుర్తించండి.



   ఎ) రెండో చంద్రగుప్తుడి తర్వాత సింహాసనం అధిష్ఠించాడు.



   బి) నలంద విశ్వవిద్యాలయం నిర్మించాడు.
   సి) కార్తికేయుడు, గుర్రం చిత్రంతో నాణేలు ముద్రించాడు.
   డి) ఇతడి కాలాన్ని సాహిత్యంలో స్వర్ణయుగం అంటారు.
   1) బి, డి 2) డి 3) బి 4) ఎ
16. స్కంధగుప్తుడి గురించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఇతడి పరిపాలనా కాలం క్రీ.శ.455 నుంచి క్రీ.శ.467.
   బి) ఇతడి బిరుదు విక్రమాదిత్య.
   సి) హూణుల్ని రెండుసార్లు ఓడించాడు.
   డి) రాజధానిని ఉజ్జయిని నుంచి పాటలీపుత్రానికి మార్చాడు.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
17. బిలాస్‌పుర్, రాయ్‌చూర్, సబల్‌పుర్‌ల మధ్య విస్తరించిన గుప్తులకాలం నాటి రాజ్యం?
   1) మహాకాంతార 2) కంచి
   3) కోసల 4) ఏదీకాదు
18. సముద్రగుప్తుడు ఉత్తర భారతదేశంలో దండయాత్రలు చేశాడు. ఆ రాజ్యాలు, రాజులకు సంబంధించిన జతలో సరికానిది?
   1) మధుర పాలకుడు - నాగసేనుడు
   2) శ్రావస్తి పాలకుడు - కోట వంశరాజులు
   3) అహిచ్ఛత్రం పాలకుడు - ధర్మరాజు
   4) పద్మావతి రాజ్యపాలకుడు - గణపతి నాగు
19. కౌముది మహోత్సవం అనే గ్రంథం ఎవరు రచించారు?
   1) వజ్జికుడు 2) రామచంద్ర
   3) రాజశేఖరుడు 4) అభినవగుప్త
20. 'శకారి' అనే బిరుదు ఏ గుప్తరాజుది?
   1) మొదటి చంద్రగుప్తుడు 2) రెండో చంద్రగుప్తుడు
   3) సముద్రగుప్తుడు 4) రామగుప్తుడు
21. రెండో చంద్రగుప్తుడికి, పర్షియా రాజు అర్థాషీర్‌కు మధ్య స్నేహ సంబంధాల గురించి తెలిపే గ్రంథం?
   1) షానామా 2) శృంగార ప్రకాశ్
   3) నాట్యదర్పణి 4) ఆర్యమంజిరి
22. శృంగార ప్రకాశ్ అనే గ్రంథ రచయిత?
   1) వజ్జికుడు 2) భోజరాజు
   3) రాజశేఖరుడు 4) రామచంద్ర
23. హూణులు అనే దిమ్మరి తెగ ఉండే ప్రాంతం?
   1) చైనా 2) రష్యా
   3) పర్షియా 4) జపాన్
24. కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
   1) రణభాండారిక - సైనిక భాండాగారాధిపతి
   2) భటాశ్వపతి - అశ్వదళాధిపతి
   3) మహాబలాధీకృత - శాంతిభద్రతల అధికారి
   4) మహాపీటపతి - గజదళాధిపతి
25. గుప్తుల కాలంనాటి వర్తక సంఘాల రక్షణ నాయకుడిని ఏమంటారు?
   1) నగర శ్రేష్ఠి 2) సార్థవాహ
   3) ప్రథమ కుంక 4) పైవారంతా
26. గుప్తుల కాలం నాటి ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు ఎంత శాతం?
   1) 1/3వ 2) 1/4వ 3) 1/6వ 4) 1/2వ
27. గుప్తుల కాలం నాటి భూముల రకాల్లో సరైనవి గుర్తించండి.
   1) నివిధర్మ - రాజు.. రైతుకు అన్ని హక్కులతో ఇచ్చిన భూమి.
   2) అప్రద ధర్మ - వేరొకరికి ఇచ్చే హక్కుతోపాటు పరిపాలనా అధికారాలు కూడా లేని భూమి.
   3) నివిధర్మ అక్షయట - వేరొకరికి ఇచ్చే హక్కు లేకుండా అనుభవించే భూమి.
   4) పైవన్నీ
28. మొదట సతీసహగమనం గురించి వివరించిన శాసనం?
   1) నలంద శాసనం 2) ఎరాన్ శాసనం
   3) మాండిసోర్ శాసనం 4) మధుర శాసనం
29. గుప్తుల కాలం నాటి బౌద్ధ పండితులు..
   ఎ) ఆర్యదేవుడు బి) వసుబంధుడు
   సి) దిజ్ఞాగుడు డి) అసంగుడు
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, సి, డి



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు


1-2; 2-3; 3-1; 4-1; 5-2; 6-4; 7-3; 8-3; 9-1; 10-3; 11-1; 12-3; 13-3; 14-4; 15-2; 16-4; 17-3; 18-3; 19-1; 20-2; 21-1; 22-2; 23-1; 24-3; 25-2; 26-3; 27-4; 28-2; 29-2.

ఉక్రెయిన్‌పై చెరోదారి

- భిన్న ఎజెండాలతో ట్రంప్-పుతిన్ భేటీ
- ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం కల్పించని చర్చల తీరుపై సందేహాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధినేత పుతిన్ ప్రారంభించిన చర్చలు ఉక్రెయిన్ యుద్ధానికి ఎంతవరకు పరిష్కారం చూపుతాయన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. దాదాపు మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విరమణకు తాజా ప్రయత్నం బాటలు వేస్తుందా? వాషింగ్టన్-మాస్కో మధ్య నిలిచిపోయిన ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడడానికి దోహదపడుతుందా? ముసురుకున్న ఆర్థిక సంక్షోభం నుంచి ప్రపంచదేశాలను గట్టెక్కించే మార్గం ఏదైనా ఆవిష్కృతం అవుతుందా?... తదితర అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇద్దరు అగ్రనేతలు తీసుకునే నిర్ణయాలు ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. శాంతి చర్చలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని దూరంగా ఉంచడంతో పాటు ఐరోపా దేశాలకూ భాగస్వామ్యం కల్పించని ఈ శిఖరాగ్ర భేటీ సానుకూల ఫలితాలపై ఎక్కువగా ఆశలుపెట్టుకోవద్దనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ట్రంప్, పుతిన్‌లకు ఎవరి వ్యక్తిగత ఎజెండాలు వారికి ఉండటమే దీనికి ప్రధాన కారణం.

ట్రంప్ ఆశిస్తున్నదేమిటి?



◆ రెండోసారి అధికారంలోకి వచ్చే 24 గంటల్లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలిపివేస్తానంటూ అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ అమెరికా ప్రజలకు హామీ ఇచ్చారు. పలు హెచ్చరికలు చేసినా, పుతిన్ వద్దకు పలుమార్లు దూతలను పంపించినా 8 నెలలుగా కాల్పుల విరమణకు ఒప్పించడం ఓ సవాల్‌గానే నిలిచింది.

◆ ప్రపంచ శాంతి దూతగా గుర్తింపు పొందాలని, నోబెల్ బహుమతిని అందుకోవాలని ఉవ్విళ్లూరుతున్న ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నేరుగా ఒప్పందం కుదుర్చుకునేందుకు ఈ భేటీ అవకాశం కల్పిస్తుంది.


◆ నిలకడలేని ట్రంప్ ప్రకటనలు ఒక్కోసారి ఒక్కో విధంగా ఉంటున్నాయి. ఉక్రెయిన్‌లో శాంతికి అంగీకరించకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ రష్యాను హెచ్చరిస్తారు. అంతలోనే ఉక్రెయిన్ తరఫున తానేమీ సంప్రదింపులు జరపడంలేదంటూ ప్రకటిస్తారు.

◆ రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య భూభాగాల మార్పిడిపై అవగాహనకు వచ్చే అవకాశం ఉందని ట్రంప్ తొలుత తెలిపినప్పటికీ ఐరోపా దేశాల నేతలతో మాట్లాడిన తర్వాత ఆ మాట మార్చారు. పుతిన్‌తో చర్చలు విఫలమయ్యేందుకు 25 శాతం అవకాశం ఉన్నట్లు మళ్లీ తానే చెబుతారు.

◆ రష్యాతో ప్రస్తుత చర్చలు సానుకూలంగా సాగితే తర్వాత దశలో ఉక్రెయిన్‌నూ భాగస్వామిని చేస్తామని మరో సందర్భంలో పేర్కొన్నారు.

◆ ఇతరత్రా అంశాలు ఎలా ఉన్నప్పటికీ రష్యా నుంచి సాధ్యమైనన్ని వ్యాపార ప్రయోజనాలు పొందేందుకు ట్రంప్ ప్రయత్నించే అవకాశం ఉంది.

పుతిన్ పట్టుదల వీటి కోసమే..



◆ 2014లో క్రిమియా ఆక్రమణ, 2022లో ఉక్రెయిన్‌పై దాడి తర్వాత అమెరికా ఆంక్షలతో రష్యా దాదాపు ఒంటరి అయ్యింది. ఈ పరిస్థితి నుంచి బయటపడి అంతర్జాతీయ గుర్తింపు పునరుద్ధరించుకోవడం రష్యా తక్షణావసరం.

◆ ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను శాశ్వతంగా కలుపుకోవడానికి అమెరికాను ఒప్పించడం. తద్వారా యుద్ధంలో విజయం సాధించామనే సంకేతాన్ని పంపడం. ఉక్రెయిన్ నాటో సభ్యత్వాన్ని అడ్డుకోవడం.

◆ అంతర్జాతీయ ఆంక్షలతో దెబ్బతింటోన్న రష్యా ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం. శాంతి చర్చల నుంచి ఉక్రెయిన్, ఐరోపా దేశాలను తప్పించడం.

◆ పశ్చిమ దేశాల నుంచి ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాలను నిలిపివేయడం.

◆ ఉక్రెయిన్‌లో రష్యా భాష మాట్లాడే ప్రజల హక్కులు పరిరక్షించుకోవడం.



అలస్కాలో ఉక్రెయిన్ మద్దతుదారుల ప్రదర్శన

ఆహ్వానమే లేని ఐరోపా దేశాలు

◆ ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడంతో పాటు ఆ దేశం నుంచి వచ్చే లక్షల మంది శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న ఐరోపా దేశాలకు ప్రస్తుత శాంతి చర్చల్లో ఎటువంటి పాత్ర లేకుండా పోయింది.

◆ రష్యా-ఉక్రెయిన్ అధికారుల మధ్య ఇస్తాంబుల్‌లో సంప్రదింపులు, రష్యా-అమెరికా ప్రతినిధులు రియాద్‌లో జరిపిన చర్చలకు ఐరోపా దేశ నేతలకు ఆహ్వానం లేదు.

◆ ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం చేయకుండా జరిపే శాంతి చర్చలు అర్థరహితమని బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలండ్ తదితర దేశాల నేతలు హెచ్చరిస్తున్నారు.

ఉక్రెయిన్ పరిస్థితి ఏమిటి?

◆ రష్యాతో పోరులో బాధిత దేశమైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని భాగస్వామిని చేయకుండా ట్రంప్, పుతిన్ జరిపే చర్చల సఫలతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందువల్లే ఈ భేటీని పుతిన్ వ్యక్తిగత విజయంగా జెలెన్స్కీ అభివర్ణిస్తున్నారు.

◆ శాంతి చర్చలు జరపాలంటే రష్యా బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తోంది. రష్యాకు తమ భూభాగాల అప్పగింత ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది.

◆ యుద్ధ ఖైదీలను విడుదల చేయాలని, రష్యా అపహరించుకుపోయిన పిల్లలను తిరిగి అప్పగించాలని కోరుతోంది.

◆ భవిష్యత్తులో తమ దేశంపై రష్యా దాడి చేయకుండా రక్షణలు కల్పించాలని పట్టుబడుతోంది.

◆ రష్యాపై విధించిన అంతర్జాతీయ ఆంక్షలను ఒక్కసారిగా కాకుండా క్రమంగా ఎత్తివేయాలి. అవసరమైతే వాటిని మళ్లీ విధించేందుకు అవకాశం ఉండాలి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

కోర్టులో ట్రంప్‌నకు మరోసారి భంగపాటు

వాషింగ్టన్: అమెరికా విద్యా సంస్థల్లో వైవిధ్యం, సమానత్వం, సమ్మిళిత బోధన (డీఈఐ) విధానాన్ని తొలగించడానికి ట్రంప్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను ట్రంప్ స్వయంగా నియమించిన న్యాయమూర్తి స్టెఫనీ గాలఘర్ గురువారం కొట్టివేశారు. ఆమె మేరీల్యాండ్ రాష్ట్రంలో జిల్లా ఫెడరల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలు, కార్యాలయాల్లో జాతి, లింగం, మతం, వయసు, అంగవైకల్యాల పేరిట దుర్విచక్షణ చూపరాదని డీఈఐ విధానం నిర్దేశిస్తోంది. ఈ విధానం ప్రతిభకు పట్టం కట్టకుండా ఇతర అంశాలకు ప్రాధాన్యమివ్వడం వల్ల విద్యాలయాలలో తెల్లజాతి, ఆసియన్ అమెరికన్ విద్యార్థులకు నష్టం జరుగుతోందని దుమారం రేగుతోంది. అందుకే ట్రంప్ సర్కారు విద్యాసంస్థలలో డీఈఐ విధానానికి మంగళం పాడేయాలని నిశ్చయించింది. ఈ విధానాన్ని పాటించే విద్యాలయాలకు ఫెడరల్ ప్రభుత్వ గ్రాంట్లను తెగ్గోస్తామని విద్యా శాఖ హెచ్చరించింది. ఫిబ్రవరి 14న విద్యా శాఖ జారీచేసిన ఉత్తర్వు విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ఆర్థిక సహాయం, రిక్రూట్ మెంట్లకు జాతిని ప్రాతిపదికగా తీసుకుంటే, దాన్ని ఫెడరల్ పౌర హక్కుల చట్టానికి భంగకరంగా పరిగణిస్తామని హెచ్చరించింది. కానీ, ప్రభుత్వ వైఖరి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని జడ్జి గాలఘర్ పేర్కొన్నారు. అసలు ఫిబ్రవరి 14 ఉత్తర్వులో కొన్ని భాగాలు అమలు కాకుండా ఇప్పటికే ముగ్గురు జడ్జిలు రూలింగ్ ఇచ్చారు. అందువల్ల ఏప్రిల్ నుంచే పై ఉత్తర్వు అమలులోకి రాకుండా నిలిచిపోయింది. ఫిబ్రవరి 14 ఉత్తర్వుకు వ్యతిరేకంగా తరవాత మరికొన్ని సంఘాలు పిటిషన్ వేసిన దరిమిలా గురువారం జడ్జి గాలఘర్ డీఈఐ విధానానికి వ్యతిరేకంగా రూలింగ్ ఇచ్చారు.

గాజాలో జల సంక్షోభం

డెయిర్ అల్ బలా: ఎడతెగని ఇజ్రాయెల్ దాడులతో వేసారుతున్న గాజా వాసులకు ఎటు చూసినా మరణమే దర్శనమిస్తోంది. ఇజ్రాయెల్ దాడులు ఒకవైపు, తీరని ఆకలి మరోవైపు గాజాలో పాలస్తీనీయుల బతుకుల్ని గాలిలో దీపాలుగా మార్చాయి. తాజాగా కలుషిత తాగునీరు తప్పించుకోడానికి వీల్లేని యమపాశంగా పరిణమిస్తోంది. ఒక జగ్గు తాగు నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దయనీయ పరిస్థితి. రాణా ఓదే చెంబెడు మంచి నీళ్ల కోసం గంటకు పైగా వరుసలో నిలుచుంది. అంతిమంగా ఆమెకు నీరైతే చిక్కింది కానీ దాని రంగు మాత్రం భీతి గొలిపేదిగా ఉంది. అది కలుషిత జలం. భరించలేని దప్పిక అనారోగ్య భయాన్ని జయించిన దయనీయ పరిస్థితి గాజాలో రాజ్యం చేస్తోంది. "ఈ నీళ్లతో రోగాలు వస్తాయని తెలుసు. తెలిసీ పిల్లలకు ఇవే నీళ్లు ఇస్తున్నాం" అని ఖాన్ యూనిస్ నగరంలోని సొంతింటి నుంచి పారిపోయి వచ్చిన ఓదే పేర్కొన్నారు. వేలాది మందికి ఆశ్రయం కల్పిస్తున్న మువాసి శిబిరంలో పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. అక్కడికి మూడు రోజులకు ఒకసారి నీళ్ల ట్రక్కులు వస్తున్నాయి. ట్రక్కు వచ్చిందంటే చాలు శిబిర వాసులకు పండగే. ఇంట్లో ఉన్న జగ్గులు, బాటిళ్లు, బిందెలు, టిన్నులు పట్టుకొని వాటి వెనక పరుగోపరుగు. ప్రతి చుక్క నీటినీ జాగ్రత్తగా వాడుకోక తప్పని పరిస్థితి. నీటి ట్రక్కులు రాని రోజుల్లో నిర్వాసితులు సముద్రపు నీటిని వాడుకుంటున్నారు. గాజాలో ప్రస్తుతం భూగర్భ జలాలే 50 శాతం నీటి అవసరాలు తీరుస్తున్నాయి. బావి నీళ్లు తాగడానికి పనికి రాకున్నా ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. భూగర్భ జలాలు మురుగునీటితో కలుషితమవుతున్నాయి.

ఇజ్రాయెల్ చేతిలో హమాస్ నేత హతం

ఇంటర్నెట్ డెస్క్: గాజాపై తాము ఇటీవల చేసిన దాడుల్లో హమాస్ సీనియర్ నేత, మిలిటరీ కంట్రోల్ విభాగం అధిపతి నస్సర్ మూసా మరణించినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. దాడికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. సదరన్ కమాండ్ నాయకత్వంలో ఖాన్ యూనిస్ ప్రాంతంలో జరిపిన దాడుల్లో హమాస్ సీనియర్ నేతను హతమార్చినట్లు ఇజ్రాయెల్ బలగాలు ధ్రువీకరించాయి. మూసా హమాస్ సైనిక నియంత్రణ విభాగానికి అధిపతిగా పనిచేశాడు. హమాస్ బలగాలకు శిక్షణ ఇచ్చేవాడు. హమాస్ బ్రిగేడ్ కమాండర్ మహమ్మద్‌కు సన్నిహిత అనుచరుడిగానూ కొనసాగాడని ఐడీఎఫ్ పేర్కొంది. మరోవైపు యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి 61,700లపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. తమ పౌరులకు ఆహార సరఫరా, ఇతర సహాయం అందకుండా ఇజ్రాయెల్ పలు సంస్థలను అడ్డుకుంటున్నట్లు ఆరోపించింది. ప్రజలకు తగిన సహాయం అందించాల్సిందిగా అంతర్జాతీయ సంస్థలను కోరింది. ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది.

స్వాతంత్ర్య సంబరాన రహదారులు రక్తసిక్తం

- బెంగాల్‌లో 10 మంది మృతి
- ఛత్తీస్‌గఢ్‌లో ఆరుగురు

బుర్ద్వాన్, రాజ్‌నంద్‌గావ్: దేశవ్యాప్తంగా శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని సంబరంగా జరుపుకొంటున్న వేళ రహదారులు రక్తసిక్తమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ఓ బస్సు ఆగి ఉన్న ట్రక్కును ఢీకొనడంతో బిహార్‌కు చెందిన 10 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. 35 మంది గాయపడ్డారు. వారు దక్షిణ 24 పరగణాల జిల్లాలోని గంగసాగర్‌ను దర్శించుకొని వస్తుండగా బుర్ద్వాన్ జిల్లాలో ఈ విషాదం చోటుచేసుకుంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో ఏడుగురు స్నేహితుల ఆధ్యాత్మిక యాత్ర విషాదాంతమైంది. వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్ మీదుగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ఆరుగురు మృతిచెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందౌర్‌కు చెందిన వీరు ఉజ్జయిని దర్శనం అనంతరం ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశాలోని పూరీకి వెళ్తుండగా, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో ప్రమాదం చోటుచేసుకుంది.

బైక్‌పై స్టంట్లు చేస్తూ ఇద్దరి మృతి

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో నిర్మాణంలో ఉన్న దిల్లీ-దేహ్రాదూన్ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదకరమైన స్టంట్లు చేస్తూ ఇద్దరు బైకర్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యింది. ఎక్స్‌ప్రెస్‌వేపై ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనాలను వేగంగా నడుపుతూ స్టంట్లు చేస్తుండగా ఎదురెదురుగా అవి ఢీకొన్నాయి. దీంతో బైకర్లు ఒక్కసారిగా ఎగిరిపడ్డారు. అతి వేగం కారణంగా వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. మృతులను రోహిత్ (31), సుబోధ్ (42)గా గుర్తించారు. సరదాలు, రీల్స్ కోసం ప్రమాదకరమైన స్టంట్లు చేసి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పోలీసులు సూచించారు.

పశ్చిమబెంగాల్‌లో నర్సు అనుమానాస్పద మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో ఓ నర్సింగ్ హోంలో 24 ఏళ్ల మహిళా నర్సు మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. సింగూర్‌లోని నర్సింగ్ హోం భవనం మూడో అంతస్తులోని గదిలో ఫ్యాన్‌కు వేలాడుతున్న మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పూర్బా మెదినిపుర్‌లోని నందిగ్రాంకు చెందిన నర్సు నాలుగు రోజుల క్రితమే నర్సింగ్ హోంలో చేరినట్లు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. నర్సింగ్ హోంలో జరిగిన అవకతవకలను బయటపెట్టడంతో ఆమెపై లైంగిక దాడిచేసి హత్య చేశారని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. వీటిని తోసిపుచ్చిన నర్సింగ్ హోం యాజమాన్యం ఆమె ఆత్మహత్య చేసుకొని మరణించిందని వెల్లడించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళది హత్యే అని ప్రతిపక్షాలైన భాజపా, సీపీఐ(ఎం) నేతలు ఆరోపించారు.

ఆయుధాలను త్యజించం

- బలవంతం చేస్తే అంతర్యుద్ధం తప్పదు
- లెబనాన్‌కు హెజ్‌బొల్లా హెచ్చరిక

బీరుట్: ఆయుధాలను త్యజించబోమని లెబనాన్ ప్రభుత్వానికి హెచ్‌బొల్లా స్పష్టంచేసింది. ఈ ఏడాది ఆఖరికల్లా హెజ్‌బొల్లా ఆయుధాలను స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వం గత వారంలో తీసుకున్న నిర్ణయం ఇజ్రాయెల్ ప్రయోజనాలకే ఉపయోగపడుతుందని పేర్కొంది. తమ దగ్గర ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి ఉపయోగించే అధికారాన్ని లెబనాన్ భూభాగంలో ఉన్న ఇజ్రాయెల్‌ను తరిమికొట్టడానికి ఉపయోగించాలని ప్రభుత్వానికి హెజ్‌బొల్లా నేత నయిమ్ కాశీం సూచించారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ సంక్షోభం అంతర్యుద్ధానికి దారితీస్తే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కాశీం హెచ్చరించారు.

సింధూ జలాలపై హక్కు మన రైతులదే

పాక్‌తో కుదిరిన ఒప్పందాన్ని అంగీకరించం • పంద్రాగస్టు ప్రసంగంలో స్పష్టంచేసిన ప్రధాని

ఈనాడు, దిల్లీ: సింధూ జలాలపై భారత్ రైతులకే హక్కు ఉందని, దశాబ్దాల క్రితం పాక్‌తో కుదిరిన ఒప్పందాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రుధిరం, జలం ఒకేచోట ప్రవహించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు.."సింధూ జల ఒప్పందం ఎంత అన్యాయమైందో, ఎంత ఏకపక్షమైందో ప్రజలకు తెలిసింది. భారత్ నుంచి ప్రవహించే నీళ్లు శత్రు నేలలను సస్యశ్యామలం చేస్తుంటే, మన దేశ రైతులు నీళ్లకోసం అల్లాడే పరిస్థితి ఉంది. ఏడు దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన ఈ ఒప్పందం మన దేశ రైతులకు ఊహించని నష్టాన్ని కలిగించింది. ఇకమీదట ఆ నీళ్లపై భారతీయ రైతులకు మాత్రమే హక్కు ఉంటుంది. అవి మన అన్నదాతలకే దక్కుతాయి. ఆ ఒప్పందాన్ని మేం అంగీకరించబోం" అని మోదీ పేర్కొన్నారు. ఇంకా ప్రధాని తన ప్రసంగంలో ఏమన్నారంటే



ఎర్రకోట వద్ద ఎన్‌సీసీ క్యాడెట్లతో సరదాగా ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

మేడిన్ ఇండియాపై దృష్టి పెట్టండి

మేడిన్ ఇండియా ఫైటర్ జెట్ల కోసం మన జెట్ ఇంజిన్ ఉండాలన్నదే లక్ష్యమని, దేశీయంగా వీటి తయారీకోసం యువత, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు దృష్టిసారించాలి. దేశంలో ప్రతి ఒక్కరూ దేశీయ వస్తు వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక్కడ స్వదేశీవస్తువులు లభించునని బోర్డులపై రాసి విక్రయించే పరిస్థితులు రావాలి.

అంతరిక్షంలో అద్భుత విజయాలు

మనం అంతరిక్షరంగంలో సాధిస్తున్న విజయాలు అందరికీ గర్వకారణంగా ఉన్నాయి. మన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా స్పేస్‌స్టేషన్ నుంచి తిరిగి వచ్చారు. త్వరలో భారత్‌కు రానున్నారు. ఇప్పుడు మనం సొంత శక్తిసామర్థ్యాలతో గగన్‌యాన్‌కు తయారవుతున్నాం. సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు కార్యాచరణ మొదలుపెట్టాం. ఈ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా 300 స్టార్టప్‌లు అంతరిక్ష పరిశోధనలపై పని మొదలుపెట్టాయి.

ఆర్థిక స్వార్థం పెరిగిపోతోంది

ఇతరుల అదృష్టరేఖలను చెరిపేయడంపై దృష్టిసారించి మన శక్తిసామర్థ్యాలను మనమే దుర్వినియోగం చేసుకోవద్దు. ఆ శక్తిసామర్థ్యాలను మన అదృష్టరేఖలను మరింత సుదీర్ఘం చేసుకోవడానికి ఉపయోగించాలి. మన అదృష్టరేఖలను మనం సుదీర్ఘంగా మార్చుకుంటే ప్రపంచంకూడా మన శక్తిసామర్థ్యాలను తెలుసుకుంటుంది. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక స్వార్థం రోజురోజుకూ పెరుగుతూపోతోంది. అందువల్ల మనం ఆ కష్టాలను చూసి ఏడుస్తూ కూర్చోకుండా ధైర్యంతో మన అదృష్టరేఖలను మరింత పెంచుకోవాలి.

మన భాషలను చూసి గర్వించాలి

భారతీయ భాషలు ఎంత సమృద్ధమవుతాయో మన జ్ఞానవ్యవస్థ కూడా అంతే బలోపేతమవుతుంది. మన భాషలను చూసి మనం గర్వించాలి. జ్ఞానభారతం యోజన కింద దేశవ్యాప్తంగా ఉన్న దస్తావేజులు, గ్రంథాలను వెలికితీసి సాంకేతికత ఆధారంగా భవిష్యత్తు తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నాం.

నక్సల్స్‌ను ఏరివేశాం

నక్సలిజం కారణంగా దశాబ్దాలుగా ఆదివాసీ ప్రాంతాలు తీవ్రంగా ఇబ్బందులుపడ్డాయి. మావోయిస్టులు గిరిజన యువతను తప్పుడుదారిలోకి లాగి వారి జీవితాలను నాశనం చేశారు. ఒకప్పుడు 125కిపైగా జిల్లాలు నక్సలిజం గుప్పిట్లో ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 20కి తీసుకొచ్చి గిరిజనులకు ఎంతో మేలుచేశాం. బస్తర్‌ను నక్సలిజం నుంచి విముక్తి చేసిన తర్వాత అక్కడి యువత ఇప్పుడు ఒలింపిక్స్ క్రీడలకు వెళ్లే స్థాయికి చేరుకున్నారు. రెడ్ కారిడార్లను అభివృద్ధి గ్రీన్ కారిడార్లుగా మార్చాం.

ఇతరులపై ఆధారపడొద్దు

ఆత్మనిర్భరత దేశానికి ఆత్మాభిమానంతో సమానం. వికసిత్ భారత్‌కు పునాది ఆత్మనిర్భర్‌భారతే. ఇతరులపై ఆధారపడటం అత్యంత ప్రమాదకరం. ఆత్మనిర్భరత అన్నది ఎగుమతులు, దిగుమతులు, రూపాయి, పౌండ్, డాలర్ల కొలమానానికే పరిమితంకాదు. అది మన సామర్థ్యాలకు నిదర్శనం. ఎప్పుడు ఆత్మనిర్భరత తగ్గిపోతుందో అప్పుడు మన సామర్థ్యాలూ పడిపోతాయి. కాబట్టి మన సామర్థ్యాలను పెంచుకోవడానికి ఆత్మనిర్భరత అనివార్యం.

కష్టపడితేనే చరిత్ర సృష్టిస్తాం

ఆత్మనిర్భరత సాధించడానికి ఇదే సమయం అంటూ ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ఓ హిందీ కవితతో ముగించారు. "ఎవరైతే కష్టపడతారో.. వారే చరిత్ర సృష్టిస్తారు. ఎవరైతే బండరాళ్లను పగలగొడతారో.. వారే సమయాన్ని తమకు అనుకూలంగా మలచుకుంటారు. ఆ సమయం ఇప్పుడే వచ్చింది. ఇదే సరైన సమయం" అని అర్థం వచ్చే కవితను చదివారు.

యుద్ధాలతో 25 శాతం పెరిగిన లైంగిక హింస

- నివేదికలో ఐరాస వెల్లడి

ఐరాస: యుద్ధాలు, సంఘర్షణల కారణంగా లైంగిక హింస గతేడాది ప్రపంచవ్యాప్తంగా 25 శాతం పెరిగిందని ఐరాస ఓ నివేదికలో పేర్కొంది. సెంట్రల్ ఆఫ్రికా రిపబ్లిక్, కాంగో, హైతీ, సోమాలియా, దక్షిణ సూడాన్‌లో అత్యధిక కేసులు నమోదయ్యాయని తెలిపింది. ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శుక్రవారం విడుదలచేసిన వార్షిక నివేదిక ప్రకారం.. 2024లో 4,600 కంటే ఎక్కువ మంది లైంగిక హింస నుంచి బయటపడ్డారు. వీరిలో ఎక్కువశాతం సాయుధమూకల దుర్వినియోగంతో, మరికొన్ని ప్రభుత్వ బలగాల కారణంగా బాధితులు లైంగిక హింసకు గురయ్యారు. 2023 అక్టోబరు 7న గాజాలో దాడులకు పాల్పడిన హమాస్ మిలిటెంట్‌లతో సహా సంఘర్షణలు తలెత్తినపుడు పలు దేశాల్లో అత్యాచారాలు, ఇతర లైంగిక దాడులకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న 63 ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను నిషేధిత జాబితాలో చేర్చారు.

ఇజ్రాయెల్, రష్యాలపై ఆరోపణలు..

ఐరాస హెచ్చరిక

ఈ నిషేధిత జాబితాలో మొదటిసారిగా రష్యా, ఇజ్రాయెల్‌ల పేర్లను చేర్చారు. ఐరాస వద్ద ఉన్న విశ్వసనీయ సమాచారం ప్రకారం హింసను అరికట్టడానికి ఈ రెండు దేశాలు తగు చర్యలు తీసుకోకపోతే వీటిని వచ్చే ఏడాది నిషేధిత జాబితాలో చేర్చుతామని అధికారులు హెచ్చరించారు. జైళ్లలో బందీలుగా ఉన్న పాలస్తీనియుల్లపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లుగా ఇజ్రాయెల్ సైన్యంపై, యుద్ధఖైదీలపై హింసకు తెగబడుతున్నట్లు రష్యా బలగాలపై ఆరోపణలు ఉన్నాయి.

ప్లాస్టిక్ నిషేధంపై ఐరాసలో కుదరని అంగీకారం

జెనీవా: భూమితోపాటు సముద్రాలను కూడా ముంచెత్తుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి ఇక్కడి ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో 11 రోజుల నుంచి చర్చలు జరుపుతున్న 184 దేశాలు శుక్రవారం కూడా అంగీకారం కుదుర్చుకోలేకపోయాయి. ఇకపై కొత్తగా ప్లాస్టిక్‌ను తయారుచేయకుండా నిషేధం విధించాలా లేక పాత ప్లాస్టిక్‌ను మరింత మెరుగ్గా పునర్వినియోగార్హంగా మార్చాలా అనే అంశంపై చర్చలు జరిగాయి. ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితి విధించడానికి చమురు ఉత్పత్తి దేశాలూ, ప్లాస్టిక్ పరిశ్రమ ససేమిరా అన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను మెరుగ్గా శుద్ధి చేసి పునర్వినియోగార్హంగా మార్చాలన్నాయి. చివరకు శుక్రవారం ఉదయానికి సిద్ధమైన ముసాయిదాలో ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితి ఊసే లేదు. ప్రస్తుతం జరుగుతున్న స్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగాలను కొనసాగించరాదనీ, దీనిపై అంతర్జాతీయ కార్యాచరణ అవసరమనీ ముసాయిదా ప్రతిపాదించింది. మానవుల ఆరోగ్యానికీ, పర్యావరణానికీ హానికరమైన రసాయనాలు మిళితమైన ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించాలని సూచించింది. ప్లాస్టిక్‌పై ఏ ఒప్పందమైనా ఏకాభిప్రాయంతో కుదరాలనీ భారత్, సౌదీ అరేబియా, వియత్నాం, ఇరాన్, కువైట్ దేశాలు కోరాయి. ప్రపంచం మన నుంచి నివేదికలను ఆశించడం లేదు, కార్యాచరణను ఆశిస్తోందని మడగాస్కర్ ప్రతినిధి అన్నారు. 100 దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితి విధించాలని ఆశిస్తుంటే, మిగిలిన 84 దేశాలు ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే విషతుల్య రసాయనాలపై చట్టపరంగా కంట్రోళ్లు విధించాలంటున్నాయి. చివరకు నిరుడు దక్షిణ కొరియాలో జరిగినట్లే ఈసారి కూడా ఒప్పందమేదీ కుదరకుండానే సమావేశం ముగిసిపోయేట్లుంది.

పురాతన తిమింగల శిలాజం లభ్యం!



వెల్లింగ్టన్: తిమింగలం అనగానే భారీ ఆకృతి మనకు గుర్తుకొస్తుంది. అయితే లక్షల సంవత్సరాల కిందట జాతి పూర్వీకుల్లో కొన్ని ఉపజాతులు చాలా చిన్నగా ఉండేవని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆస్ట్రేలియా తీరంలో వెలుగుచూసిన 2.5 కోట్ల ఏళ్ల నాటి శిలాజం ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది. ఇది కొత్త జాతి అని పరిశోధకులు తెలిపారు. తిమింగలాల ఆవిర్భావానికి సంబంధించిన రహస్యాల ఛేదించడానికి ఇది సాయపడుతుందని చెప్పారు. తాజాగా కనుగొన్న జాతికి జాంజుసెటస్ డులార్డి అని పేరు పెట్టారు. ఇది కార్టూన్ క్యారెక్టర్‌లా విచిత్రంగా కనిపిస్తుందని వివరించారు. దీని కళ్లు.. టెన్నిస్ బంతుల పరిమాణంలోని ఉబ్బెత్తుగా ఉన్నాయని పేర్కొన్నారు. నేటి తిమింగలాలకు భిన్నంగా దీని పొడవు సుమారు 9 అడుగులు మాత్రమేనని తెలిపారు. దీని మూతి భాగం సొరచేపను పోలి ఉంటుంది. కర్కశంగా వేటాడటానికి వీలుగా దీని దంతాల అమరిక ఉంది.

త్రిపురలో దాడిని అడ్డుకున్న పోలీసులు

- ఇద్దరి అరెస్టు, పేలుడు పదార్థాలు స్వాధీనం

అగర్తల: త్రిపురలోని వాంగ్మూన్ వద్ద పేలుడు పదార్థాలతో ఉన్న వాహనాన్ని అడ్డుకుని.. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. వారి నుంచి 14 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, నియోజెల్ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిద్దరూ కొత్తగా ఏర్పాటైన త్రిపుర యునైటెడ్ నేషనల్ ఫోర్స్ (టీయూఎన్ఎఫ్) సభ్యులని పేర్కొన్నారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ప్రజల దృష్టిని ఆకర్షించడానికి పోలీసు సిబ్బందిని చంపడం, పోలీసు వాహనాలను ధ్వంసం చేయడం, ఆయుధాలు.. మందుగుండు సామగ్రిని లాక్కోవడానికి కుట్ర పన్నారు" అని ఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు.

రూ.లక్ష కోట్ల పథకం మరో వంచనే

- పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్‌పై రాహుల్ ధ్వజం



దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించిన 'పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' మరో మోసపూరిత పథకమేనని విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. 'రూ.లక్ష కోట్ల జుమ్లా-సీజన్-2'గా దీనిని అభివర్ణించారు. యువతకు కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ పదకొండేళ్ల తర్వాత కూడా ప్రధాని మోదీ మళ్లీ అదే తరహా వంచనకు పాల్పడుతున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. గత ఏడాది రూ.లక్ష కోట్లతో ప్రకటించిన కోటి ఇంటర్న్‌షిప్ పథకం ఏమైందని ప్రశ్నించారు. దీని ద్వారా పది వేల ఇంటర్న్‌షిప్‌లే మంజూరయ్యాయని, స్టైపెండ్ 90శాతం తక్కువగా ఉండడంతో ఎవరూ ఆసక్తి చూపడంలేదని ప్రభుత్వమే పార్లమెంటులో తన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో అంగీకరించిందని రాహుల్ వెల్లడించారు.

ఆ కోర్సుల్లో అడ్మిషన్స్ ఆపేయండి

- విద్యాసంస్థలకు యూజీసీ ఆదేశం

దిల్లీ: ఉన్నత విద్యా సంస్థలకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) కీలక ఆదేశాలు జారీచేసింది. ఆరోగ్య సంరక్షణ, నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ యాక్ట్, 2021 కిందికి వచ్చే కోర్సులను దూర, సార్వత్రిక విద్యా విధానంలో బోధించడం నిలిపివేయాలని ఆదేశించింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈ పద్ధతుల ద్వారా కోర్సుల్లో ప్రవేశాలు ఇవ్వొద్దని స్పష్టంచేసింది. జులై-ఆగస్టు 2025 విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సులపై నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. సైకాలజీ, మైక్రోబయాలజీ, ఆహార, పోషణ విభాగం, జీవశాస్త్రం, క్లినికల్ న్యూట్రిషన్, సహా ఆరోగ్య సంరక్షణ కోర్సులన్నింటిపై నిషేధం విధించినట్లు యూజీసీ తెలిపింది. 24వ దూర విద్యా సంస్థల సిఫార్సుల మేరకు జులై 23న జరిగిన యూజీసీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

మౌలిక హక్కుల్ని హరిస్తున్న భాజపా: మమత

కోల్‌కతా: దేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తమై ఎనిమిది దశాబ్దాలు గడిచినా దేశం భాజపా పాలనలో నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవించలేకపోతోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. భాజపా దేశ ప్రజల ఓటుహక్కును, వాక్ స్వాతంత్ర్యాన్ని, మౌలిక హక్కులను హరిస్తోందని స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె పేర్కొన్నారు. మత సామరస్యం కోసం, జాతీయ సమగ్రత కోసం, నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందాలన్న స్వప్నాన్ని సాధించడం కోసం పోరాటం కొనసాగిస్తామని మమత అన్నారు. ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని, మౌలిక హక్కుల్ని హరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై తుది శ్వాస వరకూ పోరాడుతానని ఆమె స్పష్టం చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ పేరుతో భాజపా ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌లో ఎన్ఆర్‌సీ నిర్వహించేందుకు ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుంటోందని ఆమె ఆరోపించారు.



దిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వర్షంలోనే విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తున్న సీఎం రేఖాగుప్తా

పరిపాలనలో తేడా కనిపిస్తోందా?



● స్త్రీ శక్తి పథకం ప్రారంభం సందర్భంగా మహిళలతో సీఎం మాటామంతి

ఈనాడు, అమరావతి: ఉచిత బస్సు 'స్త్రీశక్తి పథకం' ప్రారంభించిన సందర్భంగా బస్సులో మహిళా ప్రయాణికులతో సీఎం చంద్రబాబు ముచ్చటించారు. వారి కుటుంబ పరిస్థితులు, ఉచిత బస్సు సదుపాయం వల్ల వాళ్లకు కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఏ పని చేసినా మహిళల్ని దృష్టిలో పెట్టుకుని చేస్తున్నామని తెలిపారు. ఇంకొన్ని రోజులు పోతే పిల్లలందరికీ ఉద్యోగాలు కూడా వస్తాయని, అందరికీ మంచి అవకాశాలు ఇస్తామని సీఎం వెల్లడించారు. పరిపాలనతో గత ప్రభుత్వానికి, ఇప్పటికి ఏమైనా తేడా కనిపిస్తోందా? అని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకం ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని, చిరు వ్యాపారులకు రవాణా ఛార్జీలు మిగులుతాయని మహిళా ప్రయాణికులు తెలిపారు. మహిళలతో సీఎం మాటామంతి..

సీఎం: మీ ఇంట్లో ఎంతమంది ఉంటారు? ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో ఏం ప్రయోజనాలు అందుతున్నాయి? బడికి వెళ్లే పిల్లలు ఎంతమంది ఉన్నారు?

మహిళ: మాది ఉమ్మడి కుటుంబం. ఏడుగురం ఉంటాం. నాకు ఒక పాప, మా సోదరికి ఇద్దరు బాబులు. ముగ్గురికీ తల్లికి వందనం పథకం వచ్చింది. నాకు, మా తోటికోడలికి ఉచిత గ్యాస్ అందుతోంది. మా అత్తకు పింఛను వస్తోంది. ఎలాంటి సమస్య లేదు.

సీఎం: పరిపాలనలో గతానికి, ఇప్పటికీ తేడా కనిపిస్తోందా?

మహిళ: కనిపిస్తోంది. గతంలో అమ్మఒడి రాలేదు. ఇప్పుడు తల్లికి వందనం వచ్చింది. పథకం రానివాళ్లకు లోటుపాట్లు ఏమైనా ఉంటే తనిఖీ చేసి, మళ్లీ ఇస్తున్నారు.

సీఎం: ఈ మధ్య వాట్సప్ గవర్నెన్స్ పెట్టాం విన్నావా అమ్మా?

మహిళ: తల్లివందనం అందులోనే చెక్ చేసుకున్నాం. వాట్సప్‌లో ఆధార్‌కార్డు నంబరు కొట్టి చెక్ చేసుకున్నాను. సచివాలయానికి వెళ్లి తనిఖీ చేసుకునే పని లేకుండా ఫోన్‌లోనే చూసుకునే సదుపాయం ఉందని అందరికీ చెబుతున్నాం సర్.

సీఎం: మీ ఇంట్లో ఎంతమంది ఉంటారు?

ప్రయాణికురాలు: మాకు ఒక పాప, బాబు. నా భర్త చనిపోయారు. బాబు బీటెక్ పూర్తి చేశాడు.

సీఎం: ఎక్కడైనా ఉద్యోగం చేస్తున్నాడా?

ప్రయాణికురాలు: ప్రైవేటుగా చేస్తున్నాడు. మీరు ఏదైనా దయతలిస్తే మంచి అవకాశం వస్తుందేమో అనుకుంటున్నాను.

సీఎం: ఇప్పుడు జీతం ఎంత వస్తుంది?

ప్రయాణికురాలు: నెలకు రూ.15 వేలు వస్తుంది. నాకు వితంతు పింఛన్ వస్తోంది. మీ దయ వల్ల పెన్షన్ రూ.4 వేలు అయింది. మీతో ప్రయాణం చేయడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీమళ్లీ మీరే అధికారంలోకి రావాలి.

సీఎం: సూపర్ సిక్స్ ఇచ్చాం.. ప్రజలు ఆనందంగా ఉన్నారా?

ప్రయాణికురాలు: చాలా ఆనందంగా ఉన్నాం. విజయవాడ వెళ్లడానికి బస్సు సదుపాయం ఉంది. రూపాయి ఖర్చు లేదు. జిల్లా మారితే ఉచితం ఉండదంటున్నారు నిజమేనండి?

సీఎం: జిల్లా సరిహద్దు ఏమి లేదు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు.

సీఎం: ఇప్పుడు ఏం చేస్తున్నావ్ అమ్మా?

ప్రయాణికురాలు: గతంలో ఆరేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా గూగుల్‌లో పని చేశాను.

సీఎం: ఎందుకమ్మా సమయం వృథా చేయకూడదు కదా? మీ నాలెడ్జ్ వృథా కాకూడదు. ఇప్పుడు మన రాష్ట్రంలో 5 లక్షలమంది వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు.

ప్రయాణికురాలు: వర్క్‌ఫ్రం హోం కోసం వెతుకుతున్నాను. పిల్లలు చిన్నగా ఉన్నారు.

సీఎం: మీరు ఉండేది ఎక్కడ? మీ ఆయన ఏం చేస్తారు?

ప్రయాణికురాలు: ఉండవల్లి సర్. కన్‌స్ట్రక్షన్ బిజినెస్ చేస్తున్నారు. ఉచిత బస్సు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు సర్.

సీఎం: మీకు ఇప్పుడు ఏమేమి వస్తున్నాయి అమ్మా?

మహిళ: ఉచిత గ్యాస్ వస్తోంది. ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం వచ్చింది. మా ఆయన, నేను చేపల వ్యాపారం చేస్తాం.

సీఎం: మీ కుటుంబానికి ఎంత ఆదాయం వస్తుంది?

మహిళ: రోజుకు రూ.500 వస్తాయి. ఇంతకు ముందు బస్సు ఛార్జీలు భారం అయ్యేవి. ఇప్పుడు ఉచిత బస్సు రావడంతో కొంత మిగులుతాయి.

సీఎం: చేపల వ్యాపారానికి వెళ్లేటప్పుడు బస్సు ఛార్జీలు ఎంత అవుతుంది?

మహిళ: రోజుకు రూ.వంద అవుతోంది.

ప్రజలకు మంచి జరగాలన్నదే పార్టీల లక్ష్యం కావాలి

● స్వాతంత్ర్య వేడుకల్లో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: శాసనసభ్యులు అసెంబ్లీకి రాకపోవడం బాధ్యతా రాహిత్యమేనని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. 'పార్టీల సిద్ధాంతాలు వేరు కావచ్చు.. కానీ, మిమ్మల్ని గెలిపించిన ప్రాంతాల ప్రజల సమస్యలను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత మీకు లేదా? సభ్యులందరూ సభకు రండి. అసెంబ్లీ ఉన్నదెందుకు? స్వేచ్ఛగా మాట్లాడేందుకు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే కదా.. దేశం, రాష్ట్రం బాగుండాలి, ప్రజలకు మంచి జరగాలన్నదే పార్టీల లక్ష్యం కావాలి' అని వెల్లడించారు. అసెంబ్లీలో శాసనసభ వద్ద శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

విద్యతోనే అసమానతలు దూరం

– శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు

అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. 'మనకు స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లవుతున్నా ఇంకా సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోలేదు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. విద్యతోనే అందరూ చైతన్యవంతులు కాగలరు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జెండా ఎగరవేసి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల కారణంగానే మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామని గుర్తుచేశారు. బ్రిటిష్ వాళ్లు అప్పట్లో దేశాన్ని కొల్లగొడితే.. ఇప్పుడు జగన్ రూ.రెండు లక్షల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాల్‌జాన్ బాషా సేవలు ఎనలేనివి

● తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: ప్రజలకు, పార్టీకి తెదేపా మాజీ ఎంపీ, దివంగత లాల్‌జాన్ బాషా ఎనలేని సేవలు చేశారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. శుక్రవారం లాల్‌జాన్ బాషా వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మైనారిటీ నాయకుల్లో ఆయన కూడా ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు నాదెండ్ల బ్రహ్మం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగన్ తన తల్లి కాళ్లను పబ్లిక్‌గా తాకిన ఫొటో చూపగలరా?

● వైకాపా ఎంపీ గురుమూర్తికి మాణికం ఠాగూర్ సవాల్

ఈనాడు, అమరావతి: పెద్దలను గౌరవించాలని తల్లిదండ్రులు నేర్పిన విలువలతోనే ప్రధాని మోదీ కాళ్లు జగన్ తాకారని చెబుతున్న వైకాపా ఎంపీ గురుమూర్తి... జగన్ ఆయన తల్లి కాళ్లు పబ్లిక్‌గా తాకిన ఫొటో ఒకటైనా చూపగలరా? అని కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ సవాల్ విసిరారు. లేదంటే జగన్ విలువలు దిల్లీ దర్బార్‌కే పరిమితమా అని ఆయన 'ఎక్స్' వేదికగా శుక్రవారం ప్రశ్నించారు. 'మోదీ కాళ్లు తాకిన ఏకైక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎవరు?' అని మాణికం ఠాగూర్ ఎక్స్‌లో ప్రశ్నిస్తూ మోదీకి జగన్ పాదాభివందనం చేస్తున్న ఫొటోను దానికి ట్యాగ్ చేశారు. దీనిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి స్పందించారు. 'మాణికం ఠాగూర్ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి. పెద్దలపట్ల గౌరవంతోనే జగన్ ఆ విధంగా చేశారు. గతంలో ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కాళ్లు కూడా ఆయన తాకారు' అని గురుమూర్తి గుర్తు చేశారు. దీనికి మాణికం ఠాగూర్ తిరుగుప్రశ్న వేశారు.

ప్రజాస్వామ్యాన్ని ప్రధాని ఖూనీ చేస్తే జగన్ మాట్లాడరా?

● కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నిలదీత

ఈనాడు, అమరావతి: ఓటు చోరీతో ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోదీ ఖూనీ చేస్తే వైకాపా అధినేత జగన్ ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నిలదీశారు. మోదీ చెర నుంచి దేశాన్ని విడిపించేందుకు మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాక షర్మిల మాట్లాడారు. 'స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్‌ది కీలక పాత్ర. దేశ అభివృద్ధికి పునాదులు పడింది కూడా కాంగ్రెస్ హయాంలోనే. మరో స్వాతంత్ర్య పోరాటం కోసం రాహుల్‌గాంధీ నడుం బిగించారు. దేశాన్ని కాంగ్రెస్ కాపాడుతుంది. కుప్పంలో అప్పుడు జగన్, పులివెందులలో ఇప్పుడు చంద్రబాబు.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఇద్దరికీ పెద్ద తేడా లేదు. ఇద్దరూ కలిసి మోదీ కోసం పని చేస్తున్న వాళ్లే. ఒకరిది బహిరంగ పొత్తు. మరొకరిది అక్రమ పొత్తు' అని షర్మిల విమర్శించారు. సమావేశంలో పార్టీ నేతలు కొప్పుల రాజు, జేడీ శీలం, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పైలట్‌కు శౌర్య ప్రశంసా పత్రం

శిమ్లా: భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేస్తున్న స్క్వాడ్రన్ లీడర్ సుమంగళా శర్మకు శౌర్య ప్రశంసా పత్రం లభించింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సుమంగళ- శౌర్య ప్రశంసా పత్రం పొందిన తొలి భారతీయ మహిళా పైలట్‌గా ఖ్యాతి గడించారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించినందుకు ఆమెకు ఈ గౌరవం దక్కింది. పైలట్‌గా శిక్షణ పొందిన ఆమె ఆయుధ నియంత్రణ వ్యవస్థల నిర్వహణలో ప్రత్యేక నైపుణ్యం పొందారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా గత మే 8 రాత్రి భారత్ నిర్వహించిన దాడుల్లో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆమె నిశ్శబ్ద నేతృత్వం సర్వత్రా ప్రశంశలు అందుకుంది. ఆమె కృషి ప్రాణనష్టాన్ని నివారించింది. "ఇది కేవలం వ్యక్తిగత ప్రశంస మాత్రమే కాదు. యూనిఫాంలో విధులు నిర్వహిస్తున్న మహిళలందరికీ అందిన గౌరవం" అని వైమానిక దళ అధికారి ఒకరు పేర్కొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని భంగపరిచేలా మోదీ వ్యాఖ్యలు: సీపీఐ

ఈనాడు, అమరావతి: దేశ ప్రజల త్యాగం, వీరమరణం, పోరాట గాథలకు ప్రతీక అయిన స్వాతంత్ర్య దినోత్సవం స్ఫూర్తిని భంగపరిచేలా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఎంతో అవమానకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. దిల్లీలోని ఎర్రకోట వేదికగా మోదీ చేసిన ప్రసంగం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని గుర్తు చేయకుండా మతతత్వ విభజనవాద స్వభావం కలిగిన ఆరెస్సెస్‌ను ప్రసంగంలో అతిపెద్ద ఎన్జీఓగా వ్యాఖ్యానించడం చరిత్రను వక్రీకరించే ప్రయత్నమన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను ప్రధాని వ్యక్తపరచడం దేశాన్ని విభజించడమేనని ఆరోపించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేలా వైకాపా, తెదేపా అధినేతలు వ్యవహరిస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల తీరే ఇందుకు నిదర్శనమన్నారు. విజయవాడలోని దాసరి భవన్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'వైకాపా హయాంలో 75% స్థానిక సంస్థలను నామినేషన్లు వేయనీయకుండా ఏకగ్రీవం చేయించారు. పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని అపహాశన చేసేలా జడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రక్రియ కొనసాగింది. అధికారంలో ఎవరున్నా వారు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఎన్నికలు నిర్వహించడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్య పరిరక్షణపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ గొప్పగా మాట్లాడి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు సైతం అదే విధంగా వ్యవహరిస్తున్నారు" అని ఆరోపించారు.

కవాతులో పాల్గొన్న 39 మంది విద్యార్థులకు అస్వస్థత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో స్వాతంత్ర్య వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా శుక్రవారం రెడ్ రోడ్ వద్ద జరిగిన కవాతులో పాల్గొన్న పలు పాఠశాలలకు చెందిన 39 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిందరినీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వంలోని పలు విభాగాల సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గౌరవ వందనం స్వీకరించారు. పిల్లలను కలవడానికి మమత ఆసుపత్రిని సందర్శించారు. వర్షాలతో పాటు వేడి, తేమతో కూడిన వాతావరణం పరిస్థితుల కారణంగా పిల్లలు అస్వస్థతకు గురయ్యారని, వారంతా క్షేమంగా ఉన్నారని ఆమె తెలిపారు.



మెదడు కుంచించుకుపోవడాన్ని నిలువరించాలంటే..

వయోభారం పెరిగాకే మెదడు కుంచించుకుపోతుందని అనుకుంటే పొరపాటే. మెదడులోని కార్టెక్స్, హిప్పోకాంపస్ అనే కీలక భాగాల పరిమాణం తగ్గిపోవడం మూడు పదుల వయసులోనే మొదలవుతుంది. ఒక్కో దశాబ్దం గడిచేకొద్దీ ఆ ప్రక్రియ వేగవంతమవుతుంది. దానివల్ల జ్ఞాపకశక్తిని వేగంగా కోల్పోతాం. రోజూ రాత్రి తగినంత సమయం నిద్రించడం, ఒత్తిడికి దూరంగా ఉండటం, శరీరం క్రియాశీలకంగా ఉండేలా చూసుకోవడం, పరిశ్రమల్లో అతిగా శుద్ధిచేసిన ఆహారాన్ని తీసుకోకపోవడం వంటి చర్యలతో ఆ ప్రక్రియను చాన్నాళ్లు నిలువరించవచ్చు.

– బ్రయాన్ జాన్సన్, హెల్త్ కోచ్

స్పీడ్‌బ్రేకర్లపై ఐఆర్‌సీ మార్గదర్శకాలు పాటించండి

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర హైవేలు, జిల్లా, గ్రామీణ రహదారుల్లో స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) జారీ చేసిన నూతన మార్గదర్శకాలను సరైన స్ఫూర్తితో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఉన్న స్పీడ్‌బ్రేకర్లనూ ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా సరిదిద్దాలని తేల్చిచెప్పింది. ఈ విషయంలో ఐఆర్‌సీ నూతన మార్గదర్శకాలు తీసుకొచ్చిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చెబుతున్న నేపథ్యంలో వాటి అమలుకు చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సర్క్యులర్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఈ నెల 6న ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిని తొలగించేలా (లేదా) ఐఆర్‌సీ ప్రమాణాలకు అనుగుణంగా సరిదిద్దేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. 'ఐఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. ప్రతి స్పీడ్‌బ్రేకర్ 3.7 మీటర్ల వెడల్పు, 0.10 మీటర్ల (10 సెంటీమీటర్లు) ఎత్తు ఉండాలి. వాహనం పైకెక్కి, దిగేటప్పుడు (బంప్) 17 మీటర్ల వ్యాసార్థం ఉండాలి. స్పష్టంగా కనిపించేలా తెలుపు, పసుపు రంగులేయాలి. ముందు వేగనిరోధకం ఉందని అప్రమత్తం చేసేలా 40 మీటర్ల దూరంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి' అని పేర్కొన్నారు. ఎస్‌జీపీ ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఐఆర్‌సీ కొత్త మార్గదర్శకాలు ఇచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ఏర్పాటు చేసిన వేగనిరోధకాలను గుర్తించాలని, లోపభూయిష్టంగా ఉన్న వాటిని తొలగించాలని లేదా ఐఆర్‌సీ ప్రమాణాలకు అనుగుణంగా సరిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ఫిబ్రవరిలో మెమో ఇచ్చారని గుర్తుచేసింది.

యువ ఐఎఫ్ఎస్ అధికారులకు పోస్టింగులు


ఈనాడు, అమరావతి: ఏపీ కేడర్-2023 బ్యాచ్‌కు చెందిన యువ ఐఎఫ్ఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. వివరాలివి.

అధికారి పేరు	పోస్టింగ్
కొల్లూరు వెంకట శ్రీకాంత్	సబ్ డీఎఫ్‌వో, వెంకటగిరి
కొప్పుల బాలరాజు	సబ్ డీఎఫ్‌వో, లక్కవరం
నీరజ్ హన్స్	సబ్ డీఎఫ్‌వో, డోర్నాల
గరుడ్ సంకేత్ సునీల్	సబ్ డీఎఫ్‌వో, ప్రొద్దుటూరు
బబిత కుమారి	సబ్ డీఎఫ్‌వో, గిద్దలూరు

దివ్యాంగుల పింఛను అనర్హుల్లో వితంతువులు

ఈనాడు, అమరావతి: ఆరోగ్య పింఛన్లు, దివ్యాంగుల కేటగిరీ పింఛన్లలో ప్రభుత్వం ఇటీవల చేపట్టిన తనిఖీలో అనర్హులుగా తేలిన వారిలో కొందరికి వితంతు పింఛనుకు అర్హత ఉన్నట్లు బయటపడింది. అనర్హుల పింఛన్ల రద్దుకు రెండు రోజులుగా ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోంది. దివ్యాంగుల పింఛన్‌ను రద్దు చేసినా.. తమకు వితంతు పింఛను కింద అర్హత ఉందని, ఆ కేటగిరీ పింఛను మంజూరు చేయాలని వారు క్షేత్రస్థాయిలో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారులు దృష్టి సారించారు. ఇలాంటి వారు ఎంతమంది ఉన్నారనే వివరాలను పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇప్పటికే గుర్తించిన అనర్హుల్లో వృద్ధాప్య పింఛను కేటగిరీ కిందకు వచ్చే వారిని అందులోకి మార్చారు.

జెండా ఎగురవేసిన ఎల్.కె.ఆద్వాణీ



దిల్లీ: 79 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భాజపా అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కె. ఆద్వాణీ(97) లోధి ఎస్టేట్‌లోని ఆయన నివాసంలో జెండాను శుక్రవారం ఎగురవేశారు. కుటుంబసభ్యులు, భద్రతా సిబ్బంది సమక్షంలో వర్షం కురుస్తుండగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. కొన్ని ఏళ్లుగా ఆద్వాణీ పంద్రాగస్టున తన నివాసంపై జెండాను ఎగురవేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన ఇటీవలే ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు 5 వేల మంది ప్రత్యేక అతిథులు

దిల్లీ: ఈసారి స్వాతంత్ర్య వేడుకలకు 5 వేల మంది ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసిన అంగన్‌వాడీలు, లఖ్‌పతీ దీదీలు, సర్పంచులు ఎర్రకోట వద్ద శుక్రవారం జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం జరగనున్న ప్రత్యేక ఒలంపిక్స్‌లో పాల్గొననున్న భారతీయ ప్రతినిధులు కూడా ఈ సంబరంలో పాలు పంచుకున్నారు. జాతీయ బీ కీపింగ్ అండ్ హనీ మిషన్ నుంచి గుర్తింపు పొందిన రైతులు, ఔషధ మొక్కల పెంపకంలో ఆరితేరిన వారు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పీఎం యువా మెంటార్‌షిప్ పథకం కింద ఎంపికైన యువ రచయితలు తదితరులు, పీఎం వికాస్ పథకం కింద శిక్షణ పొందినవారు, పీఎం దక్ష్, శ్రేయస్ పథకాల లబ్ధిదారులైన విద్యార్థులు తదితరులు ఇందులో ఉన్నారు. పీఎం వన్‌ధన్ యోజన, జాతీయ ఎస్సీ-ఎస్టీ హబ్ అభివృద్ధి కార్పొరేషన్ పథకాల లబ్ధిదారులు ప్రత్యేక అతిథులుగా విచ్చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించిన దిల్లీ పాఠశాలల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

భాజపా ఎంతకైనా దిగజారుతుంది

● కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ

దిల్లీ: అధికారంలో కొనసాగేందుకు భాజపా ఎంతకైనా దిగజారడానికి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశం నలుమూలలా భాజపా చేసిన అనేక ఎన్నికల అవకతవకలు బయటపడుతున్నాయన్నారు. దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఎగరేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... 'బిహార్ ఓటర్ల జాబితా నుంచి ప్రత్యేక ముమ్మర సవరణ పేరుతో ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను బాహాటంగా తొలగిస్తున్నారు' అని ఆరోపించారు. బిహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించినా భాజపా ఏమాత్రం అభ్యంతరం తెలపలేదని, ఓట్ల తొలగింపు వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుందో దీనివల్ల అర్థమవుతోందని ఆయన అన్నారు. భాజపా పాలనలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ముప్పు తలెత్తిందన్నారు. దేశం కోసం స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలలు మట్టిలో కలుస్తున్నాయన్నారు.

అమరవీరులకు అవమానం: సీపీఐ(ఎం)

ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో ఆరెస్సెస్‌ను ప్రశంసించడం ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల్ని అవమానించారని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్నారు. మహాత్మ గాంధీ హత్య తర్వాత నిషేధానికి గురైన ఆరెస్సెస్ మతపరమైన అల్లర్లు సృష్టించే సంస్థగా చరిత్రలో నిలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



దిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, అజయ్ మాకెన్

ఆంగ్లేయుల పుణ్యమే ఆరెస్సెస్

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఆంగ్లేయుల చలవేనని, దేశంలో మతపరమైన విభేదాలు సృష్టించడానికి బ్రిటిష్ పాలకులు కొన్ని సంస్థల్ని సృష్టించారని అఖిలేశ్ అన్నారు.

తీవ్రవాదంతో ముడిపెట్టవద్దు: ఒమర్

జమ్మూకశ్మీర్ రాజకీయ భవితవ్యాన్ని తీవ్రవాదంతో ముడిపెట్టడాన్ని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా తప్పు పట్టారు. తీవ్రవాద కార్యకలాపాల ద్వారా పాకిస్థాన్ జమ్మూకశ్మీర్ భవితవ్యంపై ప్రభావం చూపకుండా అడ్డుకోవాలని ఆయన తన స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిగా స్వాతంత్ర్యదిన సందేశాన్ని ఇవ్వడం ఇదే ప్రథమం. రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ కోసం సంతకాల సేకరణోద్యమం చేపడతామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

అలసిపోయారు... త్వరలో విశ్రమిస్తారు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)ను ప్రశంసించడం ఆందోళనకరమని శుక్రవారం కాంగ్రెస్ పేర్కొంది. ఇది దేశ రాజ్యాంగ, లౌకిక గణతంత్ర స్ఫూర్తికి విరుద్ధమని ధ్వజమెత్తింది. భాజపా నిర్దేశించుకున్న పదవీ విరమణ వయోపరిమితి 75 ఏళ్లకు చేరుకోబోతున్న మోదీ ఆరెస్సెస్‌ను సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ప్రధాని ఈ రోజు బాగా అలసిపోయారు. త్వరలోనే ఆయన విశ్రమిస్తారు" అని అన్నారు. మరోవైపు ఎన్నికల అక్రమాలపై తాము చేపట్టిన ప్రచారానికి మద్దతివ్వాలని రమేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం తమ సోషల్ మీడియా ఖాతా డీపీగా 'ఓటు చోరీ నుంచి విముక్తి' ఫొటోను పెట్టుకోవాలని పౌరులను కోరారు.

ఎందుకీ క్లౌడ్ బరస్ట్?

● మెట్రో నగరాలు, కొండ ప్రాంతాల్లో కుంభవృష్టి ● పలు వర్సిటీల్లో వర్షపాతంపై అధ్యయనాలు

ఈనాడు, హైదరాబాద్: అకస్మాత్తుగా కుండపోత వర్షం ఎందుకు కురుస్తోంది..? తక్కువ సమయంలో అత్యధిక వర్షపాతం ఎందుకు నమోదవుతోంది? ఒక ప్రాంతంలో ఆకాశం చిల్లులు పడినట్లుగా 'క్లౌడ్ బరస్ట్' ఎందుకవుతోంది..? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకునేందుకు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు అధ్యయనాలు చేస్తున్నారు. 2020 నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర మెట్రో నగరాలు, ఉత్తరభారతంలోని కొండ ప్రాంతాల్లో నమోదవుతున్న అధిక వర్షపాతాన్ని భారత వాతావరణ శాఖ నుంచి సేకరించి వేర్వేరు కోణాల్లో విశ్లేషిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తున్న కాలుష్యమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. వచ్చే 25, 50 ఏళ్లలో వాతావరణంలో ఏర్పడనున్న మార్పులు, కురవనున్న వర్షాలు, నమోదయ్యే వర్షపాతాలపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

అతి భారీ వర్షాలు.. అత్యధిక ఉష్ణోగ్రతలు

వాతావరణంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు, పెరుగుతున్న కాలుష్యం కారణంగా 21వ శతాబ్దం చివర్లో విపరీతమైన ఉక్కపోత, భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని భూ, సముద్ర వాతావరణ శాస్త్ర కేంద్రం ఆచార్యులు అశోక్ కారుమూరి, స్టెల్లా జెస్ గతేడాది తమ అధ్యయనంలో తేల్చారు. జపాన్‌లోని వాతావరణ పరిశోధన కేంద్రం నుంచి భవిష్యత్ వాతావరణాన్ని అంచనా వేసే ఒక నమూనా(మోడల్)ను తీసుకొని వచ్చే 80 ఏళ్లలో ఎలాంటి మార్పులు వస్తాయనేదానిపై వీరు అధ్యయనం చేశారు. ఉస్మానియా వర్సిటీ, ఐఐటీ హైదరాబాద్‌లోని శాస్త్రవేత్తలు, ఆచార్యులు సైతం దీనిపై పరిశోధనలు నిర్వహిస్తున్నారు.



రాజ్‌భవన్ రహదారిపై వరద



మిథిలా నగర్‌లో వరద

పరిష్కార మార్గాలు...

అసాధారణ వర్షపాతం, విపరీతమైన ఎండలను తగ్గించేందుకు ఇప్పటి నుంచే పరిష్కార మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజలు అన్వేషించాలని ఆచార్యులు సూచిస్తున్నారు. వ్యక్తిగత వాహనాలను తగ్గించడం, ప్రజా రవాణాను ఎక్కువగా ఉపయోగించుకోవడం, సౌర, పవన విద్యుత్తులను వాడటం, పరిశ్రమలు, బహుళ అంతస్తుల భవనాలను గేటెడ్ కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఇలాంటి వర్షాలను తగ్గించవచ్చని సూచిస్తున్నారు.

మేఘాల విస్ఫోటం అంటే...

భారత వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం అతి స్వల్ప సమయంలో భారీ వర్షాలు కురవడమే క్లౌడ్ బరస్ట్(మేఘాల విస్ఫోటం). ఒక ప్రాంతంలో(20 చ.కి.మీ. నుంచి 30 చ.కి.మీ.) గంటలోపు 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడం. ఉదాహరణకు కొద్దిరోజుల క్రితం కుత్బుల్లాపూర్‌లో గంట వ్యవధిలో 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అలాగే రెండు గంటల పాటు ఒకే ప్రాంతంలో ఐదు సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదు కావడాన్ని 'మైక్రో బరస్ట్'గా వ్యవహరిస్తారు.

కొన్ని ఘటనలు...

రెండు దశాబ్దాల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక బోర్డు చెబుతోంది. 20 ఏళ్లలో నాలుగు సందర్భాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని వెల్లడించింది. హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో నమోదైన క్లౌడ్ బరస్ట్ ఘటనలు...

- **2000 ఆగస్టు:** బేగంపేటలో 24 గంటల వ్యవధిలో 24.15 సెంటీమీటర్ల వర్షం కురిసింది.
- **2020 అక్టోబరు:** ఒకేరోజు 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.
- **2012 జులై:** సరూర్‌నగర్‌లో ఒకేరోజు 22.68 సెంటీమీటర్ల వర్షం పడింది.
- **2016 సెప్టెంబరు:** కుత్బుల్లాపూర్‌లో 24 గంటల వ్యవధిలో 23.02 సెంటీమీటర్ల వర్షం కురిసింది.